తా త్ప ర్య ము

మేఘనాదుఁడు సేనకంతకు ముందుగాఁ బోయెను. సేనల నడుమ దశకంఠుఁ డుండెను. సేనల వెనుకప్రక్కఁ గుంభకర్ణుండు రక్షించుచుండెను. విభీషణుఁడు లంకను గాచుచు ధర్మకార్యములు దోఁచినవి చేయుచుఁ బురమందే యుండెను. తక్కినవారందఱు యుద్ధమునకై పోయిరి.

క. ఖరశింశుమారపన్నగ, తురగమయువితతుల నెక్కి • తూర్ణంబ నిరం
తర మొనరించుచు గగనం, బరిగిరి బుధపురముఁ బట్టి•యసురవరేణ్యుల్. ౫౪౯

అర్థములు. ఖర=కంచరగాడిదలను, శింశుమార=మొసళ్ళను, పన్నగ=సర్పములను, తురగ=గుఱ్ఱములను, మయు=ఒంటెలు, వితతులను = సమూహము లను, తూర్ణంబ=త్వరగా, నిరంతరము=సందులేనిది.

తా త్ప ర్య ము

కంచర గాడిదలను, మొసళ్ళను, సర్పములను, గుఱ్ఱములను, ఒంటెలు నెక్కి యాకసము పట్టకుండ రాక్షసులు త్వరగా మధుని పట్టనమునకుఁబోయిరి.)

క. దేవతలమీఁది వైరము, భావించుచు దైత్యవరులు•వందలకొలఁదుల్
రావణు వెన్నడి నడిచిరి, యా వీరుం డింద్రు గెల్వ•నరుగు చునుగుటన్. ౫౫౦

తా త్ప ర్య ము

ఇంద్రుని గెలుచుటకై రావణుఁడు పోవుటను నెఱుఁగుటచే లంకయందలి వారేకాక యితర దైత్యులు దేవతలకుఁ దమకుఁగల విరోధ మాలోచించి వారిని గెలుచుటకై నూర్ల కొలదులుగా రావణసేన వెంటఁబోయిరి.

## —* కుంభీనసి మధుని రక్షింప రావణు వేఁడుకొనుట *—

సీ. పంక్తికంఠుం డిట్లు • బలువడిఁజని మధు,పట్టణంబుల కందు • వాని గనఁగ
రామిఁ జెల్లెలిఁ గాంచె•రావణుఁ గనుఁగొని, కుంభీనసియుం దన•గుండె లదరఁ
దల్ల్రవాల్చి యతనిక•డంబులపైఁ దూలె, నతఁడును భీతిల్ల•కమ్మ! లెమ్ము!
నీ కేమి యొనరింతు • నేను చెప్పుమటన్న, యన్న! నాపై దయ•యున్న దేని

తే. చంపవలదు నావిభు•నారకౌర్య!, భయములం దెల్ల దుస్సహ•భయమటందు
రన్న!వైధవ్యభయము కు•లాంగనలకు, సాధ్వులకు దాని మించిన•జడుపు లేదు.

అర్థములు. బలువడిన్=మిగుల వేగముగ, తూలెన్=పడెను.

తా త్ప ర్య ము

దశకంఠుఁ డీప్రకారము మిగుల వేగముగఁబోయి మధుపట్టనముఁజేరి మధుని వెదకెను గాని వాఁడు గానరాలేదు. చెల్లెలిని జూచెను. రావణుని జూడఁగానే

కుంభీనసి గుండె లదుర తలవంచి యతని పాదంబులపైఁబడెను. అతఁడును అమ్మా! భయపడకుము. లెమ్ము. నీకు నేనేమి మేలు చేయవలయునో చెప్పుము అని చెప్పగా నన్నా! నా మీఁద నీకు దయగలదేని నా మగనిఁ జంపవలదు. కుల స్త్రీలకు వైధవ్యభయమును మించిన భయము మఱియొకటిలేదు అదియే పతివ్రతలకు సహింపరాని భయము.

కులాంగనలకు వైధవ్యభయము గలదనుటచే అంకటాండ్రకు వైధవ్య భయము లేదని భావము, ఈమగఁడు పోయిన దొంగమగఁడో బహిరంగముగ మగఁడో లభించునను ధైర్యము కలవా రగుదురు. కావున వారు వ్యసనపడరు భయపడరు. విధవా వివాహ మనిన బహిరంగ వ్యభిచారముకదా కామదాసికలు దాని నామోదింతురు.

తే. సత్యవచనుండ వగుము రా•క్షసకులేంద్ర!, నాదు ప్రార్థన మన్నించి•యాదరింపు
నీవు భయపడ వల దని • నెమ్మి నంటి, వల్ల వాక్యంబె పాలింపు•మసురనాథ!

అర్థములు. సత్యవచనుండవు=నీవు చెప్పినమాట సత్యము చేసినవాఁడవు.

తాత్పర్యము

నీవు నన్ను భయపడ వల దంటివి. నాకు వైధవ్యభయమునకు మించిన భయములేదు. ఆభయము నాకు లేకుండఁజేసి నీవు చెప్పినమాట యథార్థపడ నిమ్ము. నా ప్రార్థన నంగీకరించి నన్ను మన్నింపుము. నీ వాక్యము పాలింపుము.

చ. అనవుడుఁ జెల్లెలిం గని ద•శాననుఁ డిట్లను నేఁడి నీ విభుం ?
డనిమిషసంచయంబుల ర•ణావని గెల్వఁగఁ బోదు దీనినిన్
వినిచి త్వదీయభర్తకును • వేగమ జానట గాఁగ రమ్మటం
చను మింక నీదు నెయ్యమున • నాతనిఁ జంపఁగ నొల్ల సోదరీ! ౫౫౩

తాత్పర్యము

చెల్లెలా! నీ మీఁదఁగల ప్రేమచే నీ మగనిఁ జంప నొల్లను. నీమగఁడెక్కడ నున్నాఁడు. నేను దేవతలను యుద్ధమందు జయింపఁ బోవుచున్నాను. దీనిని నీ మగనికి వినిపించి త్వరగా సహాయముగా రమ్మనుము.

కుంభీనసీ వాక్యము వలన రాక్షసస్త్రీలు గూడ విధవావివాహము గోరరని యేర్పడుచున్నది.

ఉ. నావుడు వల్లెయంచు సద•నంబునఁ గూర్కెడు నాథు లేపుచున్
రావణుఁ డన్మదగ్రజుఁడు • రాక్షసనాథుఁడు శత్రు గెల్వఁగాఁ
బోవుచు నీదు సాహ్యమును • బొందెడు కోరిక వచ్చినాఁడు ర
క్షోవర! నీవు నీయనుఁగుఁ•జుట్టములుం గని స్నేహయుక్తునిన్. ౫౫౪

అర్థములు. సదనంబునన్ = ఇంటియందు, కూర్కెడు=నిద్రించుచున్న, అస్మదగ్రజుఁడు=మాయన్న, శక్రున్=ఇంద్రుని, సాహ్యమును = తోడ్పాటును, స్నేహయుక్తునిన్=నీయందు స్నేహము గలవానిని.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా నట్టులే చేసెదనని యింట నిద్రపోవుచున్న మగనిని లేపి మా యన్న రావణుఁడు రాక్షసరాజు ఇంద్రుని గెల్వఁ బోవుచు నీ సహాయ్యము గోరి వచ్చియున్నాఁడు. రాక్షసశ్రేష్ఠుఁడా! నీవు నీకూరిమి బంధువులు నీ యందు స్నేహము గల మాయన్నను జూచి.

తే. తగినపద్ధతి నర్ఘ్యపా•ద్యముల నిడుచు, బాసటలు గండటన్నను•వల్లె యనుచు
న్యాయ్యరీతిని రాక్షస•నాథుఁ గనుచు, నాదరించి సమర్చించె•నర్హభంగి. ౫౫౫

అర్థములు. బాసటలు=తోడుపాటు.

తా త్ప ర్య ము

(తగిన విధముగా నర్ఘ్యపాద్యము లొసఁగి, తోడుపడవలెనని యడుగఁగా "వల్లె"యని రావణునిఁ జూచి న్యాయ్యరీతి నాదరించి రాజు యుచితమగు నట్టుల పూజించెను.)

క. ఈవిధమున మధుపురమున, రావణుఁ డర్ఘ్యల గ్రహించి•రాతిరి యొకఁ డం
దే వాసముఁ గొని వేకువఁ దావిడిసెన్ వెండికొండ•దాపున బలియై. ౫౫౬

తా త్ప ర్య ము

ఈ విధముగా రావణుఁడు మధుపురమునఁ బూజలను బొంది యందే యొక రాత్రి యుండి వేకువను సేనతో వెండికొండ దాపున విడిసెను.

౨౬వ సర్గము

—• రావణుఁడు మధునితోఁ గైలాసప్రాంతంబున విడియుట •—

క. ఇటు లా దశకంఠుఁడు గిరి, కటకంబున విడిసియుండఁ • గంజహితుండున్
పటుతచెడి పశ్చిమాచల, తటమునకుం బోయి యందుఁ•దనువుం దాఁచెన్. ౫౫౭

అర్థములు. గిరికటకంబునన్=కొండనడుమ, కంజహితుండున్=సూర్యుఁడు, పటుత=వేఁడిమి, తనువుందాచెన్=అస్తమించెను.

తా త్ప ర్య ము

(ఇట్లా రావణాసురుఁడు కొండనడుమ విడిసియుండఁగా సూర్యుడస్తమించెను.)

చ. తన డిగియున్న కొండరుచిఁ • దాల్చి మృగాంకుఁడు నిర్మలద్యుతిన్
గొనబుగ నుద్భవించుటయుఁ • గూర్కుచు సైన్యము లెల్ల నుంటయున్
గని నగమూర్ధమందు దశ•కంఠుఁడు రాగరసావశాత్ముఁడై
వనజవిరోధిపాదచయ•భాసితశైల వినోదసంపదల్. ౫౫౮

అర్థములు. తన డిగియున్న=తానువిడిచిన. కొండరుచిన్=కైలాసకాంతిని తెలుపును. మృగాంకుఁడు=చంద్రుఁడు, నిర్మలద్యుతిన్ = స్వచ్ఛకాంతిచే, గొనబుగన్=అందముగ, కూర్కు-చు=నిద్రపోవుచు, నగమూర్థమందు=కొండశిఖరమందు, రాగరస+అవశాత్ముఁడై=కామరసముచే బరవశుఁడై, వనజవిరోధి = చంద్రుని, పాదచయ=కిరణసమూహముచే, 'పాదోబుధ్నే తురీయాంశే శైలప్రత్యంతపర్వతే చరణే కిరణే॥ నానా. ౭। భాసిత=ప్రకాశించు, శైల పర్వతమునందలి, వినోదసంపదల్=అతిశయమైన వేడుకలు.

తాత్పర్యము

తాను విడిచియున్న కొండయొక్క తెల్లని కాంతివంటి కాంతిగలవాఁడై స్వచ్ఛమైన కాంతితోఁ జంద్రుఁ డుదయించుటయు సేనలవారు నిద్రపోవుచుండుటయు జూచి కొండశిఖరము మీఁదికిఁబోయి దశకంఠుఁడు కామముచే బరవశుఁడై చంద్రకిరణములచేఁ బ్రకాశించు పర్వతము నందలి వినోదములను.

క. కనుఁగొన నాసీనుండై, ఘనతరఫుల్లాబ్జినీ వి॰కాసిత మందా
కిని జలముల సొంపును ద,ద్వనముల జగజంపు పెంపు॰ప్రమదం బొసంగన్. ౫౯

అర్థములు. ఆసీనుండై=కూర్చుండినవాఁడై, ఘనతర=మిగుల గొప్పవగు, ఫుల్లాబ్జినీ=వికసించిన తామర తీఁగలచే, వికాసిత=వికాసము నొందునట్లు చేయఁబడిన, మందాకిని=ఆకాశగంగయొక్క, జలముల=నీళ్ళ, సొంపును = అందమును, తద్వనముల=ఆపర్వతమునందలి వనముల, జగజంపుపెంపు=పూలయు చిగుళ్ళయు కుచ్చుల అతిశయము, ప్రమదంబు=సంతోషము.

తాత్పర్యము

చూచుటకుఁ గూర్చున్నవాఁడై మిగుల గొప్పదై వికసించిన తామర తీఁగలచేఁ బ్రకాశించు గంగజలముల యందమును, వనములందలి పూలు చిగుళ్ళు మొగ్గలు గుత్తులు గుత్తులుగా జాలరుల వలె నుండు పెంపును జూచి యవి సంతోషము కలిగింపఁగా.

క. మందారచూతపాటల, బృందార్జునలోధ్రతగర॰ వేణీగణికా
తిందుక కేతక కదళీ, కుందాశోకాదితరులఁ॰ గొమరగు వనులన్. ౬౦

అర్థములు, మందార=బాడిసములు, చూత=మామిళ్ళు, పాటలబృంద=కలిగొట్టు చెట్ల సమూహములు, అర్జున = మద్దిచెట్లు, లోధ్ర = లొద్దుగచెట్లు, తగర=నందివర్ధనములు, వేణీ=దావరదంగిచెట్లు, గణికా=నెల్లిచెట్లు తిందుక=తుమ్మికచెట్లు, కేతక=మొగలిచెట్లు, కదళీ = అరఁటిచెట్లు, కుంద = మొల్లలు,

అశోక=అశోకములు, ఆది=మొదలుగాఁగల, తరులన్=చెట్లచే, కొమరగు వను
లన్=అందమైన యడవులను

కేతకశబ్ద మకారాంతమును గలదు, కేతకైః సూచిభిన్నైః-మేఘ. ౨౩. రఘు. 6-17; 13-16; ప్రతిభాం త్యజ్య వనాని కేతకానాం, ఘటకర్పర. ౧౫. 'అర్జున కేతకై' యనియే మూలమున నున్నది.

తాత్పర్యము

(బాడిసములు, మామిళ్ళు, కలిగొట్టుచెట్ల సమూహములు, మద్దిచెట్లు, లొద్దుగచెట్లు, నందివర్ధనములు, దావరదంగి చెట్లు, నెల్లి చెట్లు, తుమ్మిక చెట్లు మొగలి చెట్లు, అరఁటిచెట్లు, మొల్లలు, అశోకములు మొదలగు చెట్లచే నందమైన యడవులను)

— రావణుఁడు వెన్నెలకాఁకకు వేఁగుట —

క. క్రొన్ననవిలుతుని ములుకుల, కన్నఱ రాగమున మధుర కంఠులు మోహా
భ్యున్నతిఁ దమవలచిన యా, కిన్నరులం గూడిపాడి క్రీడలఁ దేలన్. ౨౬-౮

అర్థములు. క్రొన్నన విలుతుని=మన్మథుని, పుష్పధన్వుని, ములుకుల=బాణముల, కన్నఱ=దుఃఖమున, మధురకంఠులు=స్త్రీలు, కమ్మని కంఠస్వరము గలవారు, మోహాభ్యున్నతిన్=మోహాతిశయముచే, తమవలచిన = తాము ప్రేమించిన.

తాత్పర్యము

మన్మథుని బాణములవలనఁ గలిగిన దుఃఖముచేఁ గొంకఱు కిన్నర స్త్రీలు మోహాతిశయమునఁ దాము ప్రేమించిన కిన్నరులతోఁ గూడి పాడి రతికేళులఁ దేలుచుండఁ జూచెను.

క. డెందంబునకుం జూడ్కి కి నందానందం బొసంగ మదనుఁడు మదిలో
దండడి సందడి పెట్టఁగ, మందునివలెఁ జూచుచుండె మనుజాశనుఁడున్. ౨౬-౯

అర్థములు. దండడి=దట్టముగ, విశేషముగ.

తాత్పర్యము

(మనసునకుఁ గంటికి మిగుల సంతస మిడుచుండ, మన్మథుఁడు మిగులఁ దొందరపెట్టఁగా రావణుఁడును మందునివలెఁ జూచుచుండెను.)

సీ. కావి పాతిన పాలుఁ గన్నుంగవలతోడ, మత్తున జొక్కిన చిత్తములను
దారుణ్య సౌందర్య ధన్యలౌ సతులతో, విద్యాధరులు కేళి వెలయుచుండ
లిబ్బులదొరయింటి గుబ్బలాఁడుల గీతు, లబ్బురం బగులీపి గుబ్బతిల్లఁ
మంటవిల్తునితెయ్య మింటికోపున మ్రోఁగు, గంటలరవళి నాఁగలయఁ బర్వ

తే. మందమారుతకంపిత • మహీరుహములు తేనె లొలికెడిపూవుల • వానఁ గురిసి
భూధరంబును బుక్కాము • పౌళ్ళముంచు ఖ్యాతిఁదనరారఁ దిలకించెఁ • బఙ్క్తిముఖుఁడు.

అర్థములు. కావి పాతీన=ఎఱ్ఱనైన, వాలు=నిడుదలగు, తారుణ్యా=ప్రాయము చేతను, సౌందర్య=చక్కఁదనము చేతను, ధన్యలు=కృతార్థలు, టిబ్బులదొర=ధనపతి=కుబేరుఁడు, గుబ్బలాఁడుల=స్త్రీల, గుబ్బతిల్లన్ = అతిశయింపఁగా, తుంట విల్తుని=మన్మథుని యొక్క, తియ్యవింటి=చెఱకువింటి యొక్క, కోపున=కొనయందు, మందమారుత=మెల్లని గాలిచే, కంపిత=వణకుచున్న, మహీరుహములు=చెట్లు, భూధరంబును=పర్వతమును, బుక్కాముపౌళ్ళ=గంధపౌళ్ళ.

తాత్పర్యము

ఎఱ్ఱపాతిన నిడుద కన్నులతోడను, మఱ్ఱున మేనులు చెలియని మనస్సులను ప్రాయము చక్కఁదనము ధనముగాఁగల స్త్రీలతో విద్యాధరులు క్రీడలాడు చుండఁగా, కుబేరుని యింటి స్త్రీలు మనోహరత్వ మతిశయిల్లఁ బాటలు పాడఁగా, నది మన్మథుని వింటికొనను గల గంటలధ్వనివలె నుండఁగా మెల్లనిగాలిచేఁ గదలిన చెట్లు తేనెలతో నిండిన పూవులను వర్షముగాఁ గురియఁగా, కొండ గంధపొడిచేత మునుచు నట్లుండఁగా రావణుఁడు చూచెను.

క. మకరందబిందుజలములఁ, బ్రకటం బగు పరిమళంబు • వహియించి మనో
వికలతఁగొన నసురుఁడు మరు, సికలీనుమ వీచెఁ గమ్మఁ • జలువల మేతల్. ౫౬-౪

అర్థములు. మకరందబిందు రజములన్=తేనెబొట్ల చేతను పుష్పరజముల చేతను, మనోవికలతఁగొనన్=మనస్సు చెదరఁగ, మరుసికలు=మన్మథు వేఁడిములు, కమ్మఁజలువల మేఁతల్=కమ్మని వాయువులు, చిలువల మేతల్=సర్పముల కాహార మగునవి వాయువులు.

తాత్పర్యము

తేనెబొట్ల చేతను పుప్పొడిచేతను బ్రకటమైన సువాసన గలవై రావణుని మనస్సు చెదరునట్లు మన్మథాగ్ని జ్వాలలు గలిగించుచు కమ్మని వాయువులు వీచెను.

సీ. మానవతీమణి • మంజులగానంబు, పొలుపార విరిసిన • పూలదండ
మొల్లంపువలపుల • చల్లగాడ్పుల సొంపు, కొండల జేఁ డెదఁ • గూర్చు నింపు
అఖిలమనోహర • మయి సాగు కేలీకు, సిందూరుచందురే • మొండసౌరు
మదనతాపంబున • మఱుఁగు జక్కవకుంచు, జీవజీవకములఁ • జెల్లువింపు

తే. నేకమై సాగ రక్షోజ • నేశ్వరుండు
కామునసుఁ జిక్కి ఘన దక్కి • కళవళించి
వగచి తపియించి చందురు • వంకఁ జూచి
యూర్చి యూరిచి తల యూఁచి • యూఁచి నలఁగె. ౫౬-౫

అర్థములు. మానవతీమణి = స్త్రీరత్నముల, డంబు=కాంతి, మొల్లంపు వలపుల=మనోజ్ఞములైన వాసనలుగల, కొండలఱేడు=కైలాసపర్వతము, రేతీరు=రాత్రి విధము, నిండారుచంద్రుఁడు=పూర్ణచంద్రుని, రేయెండ సౌరు=వెన్నెలసొగసు, రేయెండ యనఁగా రాత్రియందలి ప్రకాశము, రేయెండకు సంధ్యాకాల మ॥యు నర్థము గలదు. జక్కవకుందు=చక్రవాకముల శోకము, జీవజీవకములు=వెన్నెల పులుఁగుల, ఇందుద్దీపన విభావములు వర్ణింపఁబడినవి.

తాత్పర్యము

స్త్రీరత్నముల పాటలు, చక్కఁగా వికసించిన పూవుల కాంతులు మంచి వాసనలు చల్లు చల్లనివాయువులు పర్వతకాంతి సౌందర్యము సర్వభూతమనోహరమైన రాత్రివిధము నిండుచంద్రుని వెన్నెల చందము విరహతాపంబునఁ గుందు జక్కవలశోకము వెన్నెలపులుఁగుల సంతోషము అన్నియుఁ గలయఁగా రావణాసురుఁడు మన్మథునకుఁ జిక్కి పరితపించెను.

—♦ రంభ కై సేసికొని రావణ సేనామధ్యంబునఁ జనుట ♦—

సీ. వెడవిల్తుకాఁకల ♦ వేఁగుచు నతఁ డుండ, దివ్యాభరణదీప్త♦దేహ యగుచు
నందనసుమమాల్య♦బృందముల్ మెయి వ్రేల, ననువారఁ జందనం♦బలఁది మేన
మందారకుసుమముల్ ♦పొందించికురులందుఁబూర్ణ చంద్రుని మోము♦పోలుపునవ్వ
గన్నుదోయికివిందు♦గావించు నెఱి ముంచి, రత్యుపాయనమయి ♦ ప్రాలుబలుపు

తే. పిఱుఁదులను జాఱు మొలనూలు ♦ మెఱయుచుండఁ
జెక్కులను మోముఁదమ్మిన ♦ జొక్కబొట్టు
దనర ఋతుషట్కభవసుమ♦దామపంక్తి
సౌరభంబుల మొగి వెదఁ ♦ జల్లుచుండ. ౫౮౮

అర్థములు. వెడవిల్తు=మన్మథుని, వేఁగుచున్=తపించుచు, దివ్యాభరణదీప్త దేహ=దివ్యములైన భూషణములచేఁ బ్రకాశించు దేహము గలదగుచు, నందనసుమ=నందనవనమందలి పువ్వులచేఁ గూర్పఁబడిన, మాల్యబృందముల్=పూలదండల సమూహములు, మెయిన్=దేహమునందు, మందారకుసుమముల్=కల్పవృక్షములందలి పువ్వులు, కురులందున్=వెంట్రుకలందు, నెఱి=చక్కఁదనము, రత్యుపాయనము=రతికానుక, ఋతుషట్కభవ = ఆఱుఋతువులందుఁ బుట్టిన, సుమ=పూవుల, దామపంక్తి=హారముల వరుస, సౌరభంబులన్=సువాసనలను.

తాత్పర్యము

మన్మథతాపమున వాఁ డిట్లు తపించుచుండఁగా దివ్యభూషణములచేఁ బ్రకాశించు దేహము గలదై నందనవనమునఁ బుట్టిన పూవులదండలు దేహమున వ్రేలాడ

దేహమునఁ జందన మలఁది కల్పవృక్షముల పూవులు వెండ్రుకలందుఁ దుఱిమి మొగము నిండుచంద్రునివలెఁ బ్రకాశింపఁగా కన్నులకు సంతోషము గలిగించు సౌందర్యము గలదై రతికానుకయైన బలిసిన పిఱుదులందు జాఱుచున్న మొలనూలు మెఱయఁగా చెక్కిటియందు ముఖమునందుఁ జొక్కుబొట్టు పెట్టి యాఱు ఋతువుల పూవులదండలు పరిమళములను వెదజల్లుచుండఁగా.

క. హ్రీకాంతిద్యుతికీర్తుల శ్రీకిన్ మా అగుచు సజల•జీమూత మనన్
జోక వెలుంగు ముసుం గిడి, టీకునఁ జనుచుండె సొగసు•లీవి రహింపన్. ౫౬౭

అర్థములు. హ్రీ=సిగ్గు, కాంతి=ప్రత్యవయవశోభ, ద్యుతి=లావణ్యము, కీర్తి=యశస్సునకు, శ్రీకిన్=లక్ష్మీదేవికి, మా అగుచు=సమానమై, ద్వంద్వము కావున నేకవచనము, సజలజీమూతము=నీటితోఁ గూడిన మేఘము.

తాత్పర్యము

సిగ్గునకు, నవయౌవనకాంతికి, లావణ్యమునకు, కీర్తికి ('నారీషురంభా నగరీషు కాంచీ' యని ప్రసిద్ధి), ఆభరణ సంపత్తికి నెలవై నీటితోఁగూడిన మేఘమువంటి నల్లని ముసుఁగు పెట్టి, నిక్కుతో నడచుచు సొగసుగాఁ బోవుచుండెను.

ఇది వెన్నెల రాత్రి కావున రంభ జ్యోత్స్నాభిసారిక యనియే చెప్పవలసి యున్నది. జ్యోత్స్నాభిసారిక యన్నియుఁ దెల్లనివి ధరింపవలయును గాని నల్లని ముసుఁగు పెట్టరాదు. ఇక్కడఁ బెట్టినట్లు వర్ణింపఁబడినది. ఇది యెట్లు?

జ్యోత్స్నాభిసారిక యన్ని తెల్లని పదార్థములే ధరింపవలయు ననుట వెలుఁగులోఁ దెలుపు కలసి యది కానరాకుండుటకే. ఇది పరకీయల విషయము. ఇక్కడి నాయిక రంభ సామాన్య వేశ్య, ఇది విటునియొద్దకుఁ బోవునప్పు డెవరైనఁ జూతు రేమో యని భయపడునది కాదు, లజ్జపడునదికాదు. పట్టపగలనైనను నిర్భయముగా లజ్జ విడిచి పోవునది. నల్లని ముసుఁగు వేసికొనుట దోషముకాదు. దీనిని గ్రొమ్మించుబోణి యనుటచే మెఱుపుసామ్యము చెప్పఁబడెను. మెఱుపు మబ్బు విడిచి యుండదు కావున ముసుఁగు మబ్బుగాఁ జెప్పఁబడెను. నల్లమబ్బులోని మెఱుపునకుఁగల కాంతి తెల్లమబ్బులోని మెఱుపున కుండదు. తెల్లని వెన్నెలలో నల్లని ముసుఁగు, దానిలో మెఱుపువంటి కాంతియుండుటచే రావణుఁడు సులభముగా దాని పోక గ్రహింపఁ గలిగెను.

క. బొమ్మలు వెడవిల్తునిచా, పమ్ములు నెమ్మోముఁదమ్మి•పర్వేందుని బిం
బమ్మూర్తులు గుండాకా, రమ్ములు కిసలమ్ములే క•రమ్ములు గాఁగన్. ౫౬౮

అర్థములు. బొమ్మలు=కనుబొమలు, వెడవిల్తుని=మన్మథుని, చాపమ్ములు= విండ్లు, ఒకని కేకకాలంబున రెండు విండ్లేల? 'జగము లొక్కడిమ్మ

సాధింపనెత్తిన రతిమన్మథుల విండ్లకరణి బొమలు' నైషధము. అనుటచేఁ బరిహా రము చెప్పుకొనవచ్చును. నెమ్మోముదమ్మి=ముఖకమలము, పర్వేందుని=పున్నమ నాటి చంద్రుని, బింబమ్ము, ఊరులు=తొడలు, శుండాకారమ్ములు = ఏనుఁగు తొండములవంటివి, కిసలమ్ములే=చిగుళ్ళే, కరమ్ములు=అఱచేతులు.

తాత్పర్యము

మన్మథుని విండ్లవంటి కనుబొమలు, పూర్ణచంద్రునివంటి ముఖము, ఏనుగు తొండములవంటి తొడలు, చిగుళ్ళవంటి యఱచేతులు కలదై.

క. తన సేనలమధ్యంబునఁ, జనియెడి క్రొమ్మించుఁబోఁణి • స్మరశరవశుఁడై
కని దిగ్గనఁ జని కేల్గొని, చెనటియయినుఁడనియెఁ దమిని • సిగ్గరిక తైన్. ౨౮

అర్థములు. క్రొమ్మించుబోఁణి=క్రొక్కారు మెఱుఁగువంటి దేహకాంతి గలది, స్మరశరవశుఁడై=మన్మథ బాణములకు లోపడినవాఁడై, దిగ్గన=తటాలున, తమిని=మోహముచే, సిగ్గరిక తైన్=లజ్జపడుచున్న దానిని.

తాత్పర్యము

(తన సేన నడుమనుండి పోవుచున్న రంభనుజూచి మన్మథబాణ హతుఁడై సిగ్గుపడుచున్నదానిని దటాలునఁ జేయిపట్టుకొని యిట్లనెను.)

## —• రంభా రావణ సంవాదము —

సీ. ఎందుల కేఁగెదే • యిందీవరేక్షణ, యే సిద్ధికై నీవ • యేఁగ దబల
యెవ్వనిపుణ్యంబు • లిపుడు ఫలించెనే, ప్రమదాబ్ధిఁ దేల్చ నె•వ్వాఁడెలువ
యెవ్వఁడే భోగించు • నింతి నీతో నిప్పు, డసమచాపునితాప • మూఁచిపోవఁ
బద్మోత్పలసుగంధి•వదనామృతంబును, సుధవోలెఁ ద్రావుచు • సొక్కునెవఁడు
ఆ. పిఱుఁదు దాన! వెలసి • యిఱిసియు నిఱుకుగ, నురము నతిమించు దాడ్కి•నుల్లసనముగ
మిట్టిమిన్ను మూచు•మేలిబంగరుగిండ్ల, సెనయకుచము లెవని యెదను • గ్రమ్ము.

అర్థములు. ఎందులకున్=ఏప్రదేశమునకు, ఏసిద్ధికై = ఏలాభము పొందఁ గోరి, నీవ=నీవే. నీకొఱకై నిన్ను వెదకుచు నితరులు రావలసియుండ నీవేపోవు టకు నేమియుద్దేశము, ప్రమదాబ్ధిన్ = సంతోష సముద్రమున, అసమభాణుని తాపము=మన్మథతాపము, పద్మోత్పల సుగంధి = పద్మములయు కలువలయు మంచివాసనగల, వదనామృతంబును=వదనమందలి యమృతంబును, సుధవోలెన్= అమృతమువలె, సొక్కును=పరవశుఁడగును, ఇఱిసియు = ఒకదానితో నొకటి కలిసికొని, ఇఱుకుగ=సందులేక, అతిమి = అతిక్రమించి, మిన్ను = ఆకాశము.

తాత్పర్యము

(నల్లకలువలవంటి కన్నులు గలదానా! ఎక్కడఁ బోయెదవే! యే పనికై పోయెదవే? ఇప్పు డెవ్వనిపుణ్యము పండినదే? ఎవ్వని సంతోషింపఁజేయుట కేగుచున్నావే? ఎవ్వఁడు నీతో భోగించునే? మన్మథతాపము శాంతించుట కెవఁడు పద్మములయుఁ గలువలయు మంచివాసనగల నీ ముఖమందలి యమృతము నమృతమువలెఁ ద్రావుచుఁ బరవశుఁడగును? ఎవని నీవు కౌఁగిలించుకొనఁ బోవుచున్నావే)

క. హాటకచక్రంబునకున్, దీటగుచున్ స్వర్ణధామ • దీపితమై స్వ
ర్వాటీసుఖదం బగుకటిఁ, గూటమికై యెవ్వఁ డొక్కొ • కోమలి యెక్కున్.

అర్థములు. హాటకచక్రంబునకున్=బంగారు చక్రమునకు, దీటు=సమానము స్వర్ణధామదీపితమై=బంగారు సరముచేఁ బ్రకాశించునదియై, స్వర్వాటీ సుఖదంబు=స్వర్గలోకసుఖము నిచ్చునట్టిది, కటి=నడుము, కూటమికై=కలియుటకై.

తాత్పర్యము

(బంగారు చక్రమునకు సాటియయి బంగారు సరముతోఁ బ్రకాశించు స్వర్గసుఖమిచ్చు నీకటి నెవ్వఁ డధిరోహించును.)

చ. వనితరో నన్ను మించు మగ • వాఁ డెవఁడే జగతీత్రయంబునన్
వనరుహనాభుఁ డైన సుర • వల్లభుఁ డైనను వేల్పువెజ్జులేన్
నను సరిపోలువారె? తగు • నా లలనా యిటు నేను రక్తి వే
డ్కొన నను వీడి వేఱొకనిఁ • గూడఁగఁ బోవ నరాళకుంతలా! ౨౫

అర్థములు. జగతీత్రయంబునన్=మూఁడులోకములందు, వనరుహనాభుఁడు=ఉపేంద్రుఁడు, సురవల్లభుఁడు=ఇంద్రుఁడు, వేల్పువెజ్జులేన్=అశ్వినీదేవతలయినను వేడ్కొనన్=ప్రార్థింపఁగా, వేడుకొనన్-సంశ్లేషమందర్థానుస్వారలోపము, అరాళకుంతలా=వంకర తలవెండ్రుకలు గలదానా, నలకూబర మణిగ్రీవు లన్నదమ్ములోకజితవారు అట్టులే యింద్రోపేంద్రులు, అశ్వినీదేవతలు, కావున వారు చెప్పఁబడిరి, ఇంద్రోపేంద్రులు మహిమచేతను, అశ్వినీదేవతలు సౌందర్యముచేతను గొప్పవారుకావున వారు పోల్పఁబడిరి. ఈ రెండు గుణములు తనయందున్నదని భావము.

తాత్పర్యము

(మూఁడులోకములందు నన్నుఁబోలినమగవాఁ డెవ్వఁడున్నాఁడు? ఉపేంద్రుఁడైన, నింద్రుఁడైన, నశ్వినీదేవతలైన చక్కఁదనమున నాకు సాటియగుదురా? నీయందలి ప్రేమచే నేను వేఁడుకొనుచుండ నన్ను విడిచి వేఱొకనికొఱకుఁ బోవఁదగునా?)

తే. మూఁడుజగములయందు నా • ముద్దుగుమ్మ నే విధాతను బతులకు • నేనధిపతిని
నన్నుఁగాదని వేఱొక • నాయకుండు, గలుగఁ డింతయు నిక్కంబు • కంజనేత్రి!

తాత్పర్యము

(ముజ్జగములందు పతులకు నేను నియంతను. నేనే పతిని - నేనుగాక యింకొక నాయకుఁడు లేఁడు.)

ఉ. అట్టి మహానుభావుఁడ దశాననుఁడన్ మృగరాజమధ్య లోఁ
బుట్టిన మారుఁ కాకలను • బొంగరి కేల్ముకుళించి వేఁడెదన్
నిట్టల మైనకూర్మిఁ దరుణీమణి • యేలవె నన్ను సౌఖ్యపున్
నిట్టలఁ దేల్పవే శుభము • నీ కగు నీ శిల విశ్రమింపవే. ౫౭౪

అర్థములు. మహానుభావుఁడన్=గొప్పమహిమగలవాఁడను,దశాననుఁడన్=పదిముఖములు గలవాఁడను, మృగరాజమధ్య=సింహమువంటి నడుముగలదానా లోన్=మనస్సులో, మారు కాఁకలను=మన్మథతాపములచే. బొంగరి = గర్వము విడి, కేల్ ముకుళించి=చేతులుజోడించి, నిట్టలము=అధికము, రూ, ఇట్టలము, సౌఖ్యపున్ నిట్టలన్=సౌఖ్యము లను ప్రవాహములందు, శిలన్=బండమీఁద, విశ్రమింపవే=పండుకొని గాసి తీర్చుకొనుము.

తాత్పర్యము

ఇటువంటి మహిమ గలవాఁడను, పదిముఖములు గలవాఁడను, సింహమధ్యా! మనస్సునఁ బుట్టిన మదనతాపముచేఁ జేతులు జోడించి ప్రార్థించుచున్నాను. నాయెందు విశేషము దయగలదానవై న న్నేలుము. సౌఖ్యప్రవాహమందు నన్నుఁ దేల్పుము. నీకు శోభనము సమకూరును. ఈ బండమీఁద గాసిదీఱఁ బండు కొనుము.

క. అను రావణువచనంబుల, విని గడగడవడఁకు గదుర • వెఱ హస్తయుగం
బును మోడ్చి రంభ రావణు, నని యెన్ నీ కిట్లు పలుక • నర్హమటయ్యా ౫౭౫

అర్థములు. వెఱన్=భయముచే.

తాత్పర్యము

(ఇట్లనుచున్న రావణుని మాటలను విని భయముచే గడగడ వడఁకుచు రెండుచేతులు జోడించి 'నీకిట్లు పలుకుట తగునటయ్యా' యనెను.

చ. గురుఁడవు నీవు, నీయనుఁగుఁ • గోడల నేను గదయ్య, నాపయిన్
గరుణ దలంపవయ్య సరి • గాదిటు పల్కఁగ మానవయ్య, నన్
బరులు బరాభవించినను • బ్రాపయి ప్రోవఁగఁ గర్తనీవ నై
వరునివిధాన నన్ను నగుఁ • బాటులపా లొనరింపఁ జెల్లునా? ౫౭౬

అర్థములు. గురుఁడవు=తండ్రివంటివాఁడవు, మామవు, పరాభవించినను= అవమానించినయెడల, ప్రాపయి=సహాయుఁడవై, ప్రోవఁగ=రక్షింపఁగ.

తాత్పర్యము

(నీవు తండ్రివంటివాఁడవు. నేను నీకుఁ గోడలనుగదా! నామీఁద దయ యుంచుము-ఇట్లనుట సరిగాదు. ఊరకుండుఁడు. ఇతరులు నన్నవమానింపనాయుపై రక్షింపఁ దగినవాఁడవు. పరుని విధాన నన్ను నగుఁ బాట్లుపాలు చేయదగునా!)

క. మామా! పలుకకు మీఁగతి, మామా మన్నింపు నన్ను ♦ మానుము నాపై
గామము, మానము దీయకు, మామయె కోడలిని బట్ట♦మఱియాఁదగునే? ౫౭౭

అర్థములు. మా మా=వలదు, వలదు.

తాత్పర్యము

(మామా! ఈవిధముగా మాటలాడకుము. వలదు వలదు- నన్ను క్షమింపుము, నామీఁదఁ గామము మానుము, నా పరువు దీయకు. మామయే కోడలిని బట్టఁ మరియాదా?)

క. నావుడు నా రమణీమణి కేవలపుంజూడ్కి-మాత్రఁ ♦ గెలవున భృశహ
ర్షావేశవశుండు దశ గ్రీవుఁడు చరణానతాస్యఁ ♦ గేరుచుఁ బలికెన్. ౫౭౮

అర్థములు. కెలవునన్=సంభోగేచ్ఛచే, భృశహర్షావేశవశుండు=ఆవేశించిన యధికసంతోషమునకు వశుఁడైన వాఁడు, చరణానతాస్యన్ = పాదములందు వ్రాల్పఁబడిన ముఖముగలదానిని, కేరుచున్=పరిహసించుచు.

తాత్పర్యము

అని చెప్పఁగా నా స్త్రీరత్నముయొక్క చూపుమాత్రముచేతను సంభోగేచ్ఛయందలి యధికసంతోషమునకు వశపడినవాఁడై పాదములందు ముఖముంచి వ్రాలినదానిని పరిహసించుచు నిట్లనియె.

క. భామామణీ! ననుఁ బిలిచెదు మామా యని నీకు నెట్లు ♦ మామను జెపుమా?
యేమీ నాసుతునసతివై, నీమాటి! కాఁపురంబుఁ ♦ జేసితి వటవే? ౫౭౯

అర్థములు. నాసుతసతివై=నాకొడుకునకుఁ బెండ్లామవై, నీమాటీ=ఓసి యుత్తమురాలా.

తాత్పర్యము

(భామామణీ! నన్ను మామా యని పిలిచెదవు. నేను నీ కెట్లు మామనైతినే-ఏమీ! నీవు నాకొడుకునకుఁ బెండ్లమవై కాపురము చేసితివా?)

చ. అనవుడు రంభ యిట్లు లను ♦ నో నసురేశ్వర! న్యాయ్యరీతి నీ
తనయున కేను బెండ్లమను ♦ దథ్యము, నీవును విత్తనాయకుం
డనుజుఁడు నన్నయుం గద! ధ♦నాధిపుకూఁమిపుత్త్రిఁడే కదా
వినునలకూబరుండు భువి ♦ విశ్రుతచర్యుఁడు శౌర్యధుర్యుఁడున్. ౫౮౦

15)

అర్థములు. ఔను నీ కొడుకునొద్దఁ గాఁపురము చేసినదాననే, న్యాయ్యరీతిన్=ధర్మపద్ధతిని, విత్తనాయకుండు=కుబేరుఁడు.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా రంభ యిట్లనియె. ఔను, నీ కొడుకునకు భార్యనే. ధర్మపద్ధతిని నీ కొడుకునకు నేను పెండ్లమును. ఎట్లందువా? నీవు తమ్ముఁడు, కుబేరుడు అన్నకదా! ఆ కుబేరుని కొడుకుగదా, శౌర్యవంతుఁడు ప్రసిద్ధమైన నడవడికగలవాఁడునగు నలకూబరుఁడు!

తే. పరమధర్మగుణంబున • బ్రాహ్మణుండు శత్రుభీకరభుజశక్తి • క్షత్రియుండు
నాగ్రహించిన లయవహ్ని • యట్టివాఁడు క్షాంతిగుణమున ధారణీ • సముఁడు సుమ్ము.

అర్థములు. శత్రుభీకరభుజశక్తి=విరోధులకు భయంకరమైన భుజబలమునందు. ఆగ్రహించినన్=కోపించెనేని, లయవహ్ని=ప్రలయకాలాగ్ని యట్టివాఁడు క్షాంతిగుణమున=క్షమ ఓర్పునందు, ధారిణీసముఁడు=భూమితో సమానుఁడు.

ఉల్లేఖాలంకారము.

తా త్ప ర్య ము

గొప్ప ధర్మగుణములనుబట్టి చూచిన బ్రాహ్మణుఁడు, శత్రువులకు భయంకరమైన భుజబలమును బట్టి చూచిన క్షత్రియుఁడు, కోపించెనా ప్రలయకాలమందలి యగ్నిహోత్రుఁడు ఓర్పునందు భూదేవి.

ఉ. అట్టిఁడు నీ సుతుండు, మహి • తాత్మునితో నొడఁబాటుకల్మి నే
నిట్టి హొయల్ రహింపనట • కేగుచు దానను మెప్పు వానికిన్
బుట్టఁగఁ జేయ, నా కితర • పూరుషులందు వలపేమి లేదు, నీ
పట్టిపయిన్ మదీయదృఢ • భావము పాయ దొకప్పుడేనియున్. ౫౧౨

అర్థములు. అట్టిఁడు=అట్టివాఁడు, ఒడఁబాటు=అంగీకారము, హొయల్=సొగసులు, నీపట్టిపయిన్=నీకుమారుని మీఁద.

తా త్ప ర్య ము

అట్టివాఁడు నీకొడుకు. మేము భార్యాభర్తలుగా నుండవలయునని చేసికొనిన యొడంబడిక ప్రకారము నే నీ సొగసులు చేసికొని వానికి మెప్పు కలిగించుటకుఁగాను బోవుచున్నాను. ఇతరపురుషులపై నాకు కామము లేదు. ఆయనయందు నా మనస్సు దృఢముగ నాటి మఱియొకనిపైఁ బోదు.

చ. వినఁగదవయ్య నా మనవి • వీడఁగదయ్య ననుం దశాస్య! నీ
తనయుఁడు నాదు రాక కయి • తత్తఱపాటున వేచి త్రోవలన్
గనుఁగొనుచుండువాఁ డచటఁ • గంతుశరావళి క్రుస్సుచుండఁగా
నను నిటు నాఁగ నీకుఁ దగు • నా? సుతసౌఖ్యముఁ బాప న్యాయ్యమా? ౫౧౩

అర్థములు. కంతు శరావళి = మన్మథబాణపరంపరచే, అఁగన్=అర్దింపఁగా, సుతసౌఖ్యము=కొడుకు సుఖమును.

తాత్పర్యము

(నా మనవి వినుము. రావణా! నన్ను వదలుము. నీ కొడుకు నాకొఱకు ప్రోవచూచుచు దత్తఱ పడుచుండును-అతఁడట్లు మన్మథశరముల కోరువఁ జాలక స్రుక్కుచుండు నన్ను నీ విచ్చట నిర్బంధించుట తగునా? కుమారుని సుఖమును నాశముచేయుట న్యాయ్యమా?)

తే. సజ్జనులు పోవుపథముఁ జనఁగదయ్య, మహిని సత్కీర్తియుక్తిని మనఁగదయ్య
మాన్యుఁడవు నీవు నాకు నో మామగార, రక్షణీయను నీకు నే రాక్షసేంద్ర!

అర్థములు. మామగార-తెలుఁగున స్త్రీసమంబులగు దేశ్యశబ్దంబులఁ గడపటఁ గొన్నింటి కేకవచనంబునఁ బూజ్యతయందు గారు శబ్దంబగు, ప్రౌ.వ్యా. శబ్ద. ౩౯. దీనిని సంబోధనంబునఁ గారూ అనుట తప్పు. మాన్యుఁడవు=పూజ్యుఁడవు, రక్షణీయను=రక్షింపఁ దగినదానను.

తాత్పర్యము

(సజ్జనులు పోవుదారినిఁ బొమ్ము-లోకములోఁ పరువు ప్రతిష్ఠగలిగి బ్రదుకుము-నాకు నీవు పూజ్యుఁడవు-నీకు నేను రక్షింపఁ దగిన దానను.)

క. సతి యిట్లు పలుక వినయాన్విత యై తా నాలకించి నిశిచరుఁ డనియెన్
శతపత్రేక్షణ యేలా, పతి నొక్కనిఁ గూడు సాధ్వీవాదులు పలుకన్. ౫౮౫

అర్థములు. వినయాన్వితయై=అణఁకువతోఁ గూడినదై, శతపత్రేక్షణ=కమలములవంటి కన్నులు గలదానా, సాధ్వీవాదులు=పతివ్రతల బంధుత్వంబులు.

తాత్పర్యము

(ఈ విధముగా రంభ వినయముతో నిట్లు పలుకఁగా, రావణుఁడు విని కమలాక్షీ! ఒక్క మగనితోఁ గాపురము చేయు పతివ్రతల నీతులాడెదవేల?)

చ. అమరపురిం గలట్టి మరియాదలు వాదులు నే నెఱుంగనా?
కమలదళాక్షి యొక్కఁడె మగం డమరాంగన కన్న న్యాయ మం
దమరునె? యాదితేయులకు నాలు నొకర్తుక యంచు నున్నదే?
యమరుల కెల్ల లంజ వయి యాడెదవా మగనాలిపోఁడుముల్. ౫౮౬

అర్థములు. అమరపురిన్=స్వర్గమందు, అదితేయులకు=దేవతలకు, మగనాలిపోఁడుముల్=పతివ్రతల మర్యాదలు.

తాత్పర్యము

స్వర్గపురమునందుఁగల స్త్రీపురుషుల మరియాదలు బంధుత్వములు నాకుఁ దెలియవా? దేవతా స్త్రీకి మగఁ డొక్కఁడన్న న్యాయమందున్నదా? అందలి మగవానికి భార్య యొక్కతె యను న్యాయమున్నదా? దేవతల కందఱకు నీవు లంజవయి పతివ్రతలవిధములు నీవు పలికెద వేల?

—• రావణుఁడు రంభను జెరిచి విడుచుట •—

క. అని పట్టి బండమీఁదన్, ననబోఁడిం బండఁబెట్టి • ననవిల్తుని కే
ళిని గాసి పెట్టి యసురుఁడు, చనుమని విడువంగఁ ద్రిదశ • జలజేక్షణయున్. ౫౦౭

అర్థములు. ననవిల్తునికేళిని=రతియందు, త్రిదశజలజేక్షణ=దేవతాస్త్రీ

ఈ శ్లోకమునకు మూలము :

ఏవ ముక్త్వా స తాం రక్షో నివేశ్య చ శిలాతలే
కామభోగాభిసంసక్తో మైథునా యోపచక్రమే
సా విముక్తా తతో రంభా.

అనునది.

వాస్తవ మిట్లుండఁ గొందఱు అనభిజ్ఞులీ పద్యమును సంభోగశృంగార సముచిత విధమున వర్ణింపలేదని తలఁచి యధిక్షేపింతురు.

ఇందు వాల్మీకి రసాభాసము వర్ణించెను.

తనయం దిష్టములేని స్త్రీతో బలత్కారముగ సంభోగించుట రసాభాసమనఁ బడును. అట్టి రసాభాసవర్ణనమును అనుకూలనాయికానాయకుల సంభోగవర్ణనమువలె నెట్లుండఁగలదో యారసజ్ఞులకే తెలియవలయును. బలత్కారముగఁ బట్టి కాలు చేతులు బిగఁబట్టి కుక్కుటవృత్తిఁ జరించునట్టి సంభోగ మన్యవిధముగ మూలమునకు విరోధముగ వర్ణించుట యౌచితీజ్ఞానము లేకయే.

క. రాలిన మాల్యంబులతోఁ, దూలినభూషాచయంబు • తోడను లీలా
ఖేలామథితాపగనా, హేలాచ్యుతిఁ గలఁకఁబాఱి • యేగెన్ మెల్లన్. ౫౦౮

అర్థములు. మాల్యంబులతోన్=పూలదండలతో, తూలిన=చెదిరిన, భూషాచయంబుతోను=ఆభరణ సమూహములతో, లీలాఖేలా=ఏనుగుయొక్క విలాసక్రీడచే, మథిత=మథింపఁబడిన, కలఁపఁబడిన, ఆపగ నాన్ = నదియో యన్నట్లు, హేలాచ్యుతి=విలాసము చెడి.

తాత్పర్యము

(రాలిన పూలదండలతోఁ, జెదరిన నగలతో, నేనుఁగు కలఁచిన నదివలె సొంపు చెడి కలఁతచెంది మెల్లగాఁ బోయెను.)

చ. చెదరిన కొప్పువెంట్రుకలు ♦ చెన్నుదొఱంగిన కేల్చిగుళ్ళునై
సుదతి ప్రభంజనాహతము ♦ సూనభరాంచిత మైన తీవె నాఁ
గొదరు వణంకు సిబ్బితియుఁ ♦ గూడఁగ భీతి ధనేశనందనున్
మదవతి చేరఁబోయి యల ♦ మానధనుం గని కేలు మోడ్చుచున్. ౫౮౯

అర్థములు. ప్రభంజనాహతము=పెద్ద గాలిచేఁ గొట్టఁబడినది, పరికరాంకురాలంకారము, సూనభరాంచితము=విశేషముగఁ బూలచేఁ బ్రకాశించునది, తీవె=తీఁగ. కొదరువణంకు=అతిశయించిన కంపము, సిబ్బితి సిగ్గు, భీతి=భయము, ధనేశనందనున్=కుబేరుని పుత్రుని.

తాత్పర్యము.

కొప్పు వెంట్రుకలు చెదరఁగా చిగుళ్ళవంటి చేతుల కాంతి చెడఁగా రంభ పూల నిండి పెనుగాలికిఁ గొట్టబడిన తీఁగవంటి దేహముతో మిగుల దేహమువణఁకఁగా సిగ్గు భయము కలుగగా నది నలకూబరునిఁ జేరఁబోయి యతనిఁ జూచి నమస్కరించి.

తే. పాదములఁ ద్రెళ్ళి నాసతి♦పాటుఁ గాంచి, శ్రీదనందనుఁడిది యేమి♦చిగురుబోణి!
యేల నాచరణంబుల♦వ్రాలితి వనిన, వెచ్చనూర్చుచు వణఁకుచు♦వెలఁదిపలికె.

అర్థములు. శ్రీదనందనుఁడు = కుబేరుని కొడుకు, నలకూబరుఁడు, వెచ్చనూర్చుచు=వేఁడినిట్టూర్పులు పుచ్చుచు.

తాత్పర్యము

(పాదములమీఁదఁ బడఁగా, నా రంభపాటు చూచి, నలకూబరుఁ 'డిదేమి' చిగురుబోణీ 'నాకాళ్ళమీఁదఁబడితి' వని యనఁగా వేఁడి నిట్టూర్పులు పుచ్చుచు వణఁకుచు, రంభ యిట్లని చెప్పెను.)

—♦ రంభ రావణు నకృత్యంబు నలకూబరుతోఁ దెలుపుట ♦—

సీ. వల్లభా! వాసవ♦భవనంబుపైఁ జన, దుర్వారసైన్యంబు♦తోడ నేఁడు
పంక్తికంఠుం డిందు ♦ పాళెంబు దిగినాఁడు, త్వత్సన్నిధికి నేను♦ వచ్చుచుండఁ
గని త్రోవ నడ్డమై♦గ్రక్కున నదలించి, నా కేలొడిసిపట్టి♦నాతి యెందుఁ
జనెద వెవ్వరిదాన ♦ వనవుడు సర్వంబు, వినిచితి ♦ మ్రొక్కితి♦వేఁడుకొంటి
తే. నయ్య యంటిని నీ సుతు♦రాల నంటిఁ, గోడల నటంటి మామవు♦కూడ దంటి
నాపు లోకనీతి ధరంబు♦ట్రోవ లంటి, నేమి చెప్పిన విడువఁడా♦హీనగుణుఁడు.

అర్థములు. వాసవభవనంబు=ఇంద్రలోకము, పాళెంబు=దండు, త్వత్ + సన్నిధికిన్=నీ సమీపమునకు, అయ్య=తండ్రి.

తాత్పర్యము

(ప్రియుఁడా! విను. రావణుఁ డింద్రలోకము మీఁదికి దండెత్తి పోవుచు నేఁడింద దండుతో దిగినాఁడు-నేను నీ సన్నిధికి వచ్చుచుండఁగాఁ, జూచి, దారి కడ్డమువచ్చి, నాచేయిపిసి పట్టుకొని 'నీ వెవరిదానవు? ఎందుఁ బోవుచున్నావు' అని యడిగెను, నే నంతయు వినిపించితిని-మ్రొక్కితిని, వేఁడుకొంటిని, అయ్యా యంటిని, నీకొడుకు భార్యను నీకుఁ గోడల నని యంటిని, మామవు నన్నుఁగూడుట తగున గాదంటిని ధర్మ మార్గము లుగ్గడితిని-ఏమి చెప్పినను నీచపు గుణము గల వాఁడు నన్ను విడువఁ డయ్యెను.)

క. వింటివె యే మందును సుర,కంటకుపై చేఁత బలిమిఁ ♦ గాంతుఁడ యయ్యో
యొంటిగ జవ్వని చిక్కినఁ, దుంటరి యేది సేయు నట్టి♦దోసమె చేసెన్. ౪౯

అర్థములు. సురకంటకుపై చేఁత=రాక్షసుఁ డా మీఁదఁ జేసిన కార్యము, ఏమందును=ఏమని చెప్పుదును, ఎట్లు చెప్పుదును, బలిమిన్ = బలవంతముగా, జవ్వని=వయస్సు స్త్రీ, తుంటరి=దుష్టుఁడు.

తాత్పర్యము

రాక్షసుఁ డాతరువాతఁజేసిన పని నే నేమని చెప్పుదును. నాథా!యయ్యో, వయస్సు స్త్రీ యొంటిగఁ జిక్కిన దుష్టుఁ డగు పురుషుఁడు బలాత్కారముగ నేమి చేయునో యా పనియే చేసెను.

దీనివలన మానమునందు శీలమునందు దృష్టిగల స్త్రీ లొంటరిగాఁ దిరుగఁ బోరాదు. అట్లు పోవునది అంకటా లనియో, వేశ్య యనియో, చెడిన దనియో తలంచుట తప్పుగాదు.

క. సుగుణాభరణా! సదయం, బగు దృష్టిని నన్నుఁ జూచి ♦ యపరాధంబున్
దగు క్షమియింపఁగ నబలను, మగవానిబలంబు గలదె♦మగువల కెందున్? ౫౦

అర్థములు. సుగుణాభరణా=సుగుణములే యలంకారముగాఁ గలవాఁడా, సదయంబు=దయతోఁ గూడినది, అపరాధంబున్=నేరమును, అబలను=బలహీనురాలను.

తాత్పర్యము

(సుగుణాభరణా! నన్ను దయతోఁజూచి నా యపరాధమును క్షమింపుము నే నబలను. మగవానికున్న బలము మగువలకుఁ గలదా?)

క. అన విని యజ్ఞాధీశ్వరు, తనయుం డొక్కింతసేపు ♦ ధ్యానస్థితుఁడై
కని వృత్తాంతము సర్వముఁ, గనుఁగవ గెంపొదవ జలముఁ♦గైకొని కేలన్.

అర్థములు. ధ్యానస్థితుఁడై=ధ్యానమునం దున్నవాఁడై, ఇది తొలుత నాఁడుది. అందు వేశ్య, ఇది చెప్పిన దెంతవరకు నిజమో, ఎంతవఱ కసత్యమో.

ఇదియే యెవని యొద్దనైనఁ బందుకొని యీ వేషము వేసికొని వచ్చెనేమోయని సత్యాసత్యములు తెలియుటకై ధ్యానించెనని భావము. దీనివలన స్త్రీలమాట లాలోచింపక తటాలున నమ్మరాదని సూచన. కెంపాదవన్=ఎఱ్ఱనకాఁగా.

తాత్పర్యము

(అని చెప్పఁగా విని నలకూబరుఁడు కొంతసే పాలోచించి, జరిగినవృత్తాంత మంతయుఁ దెలిసికొని, కోపించి, చేతియందు జలము తీసికొని.)

—* నలకూబరుఁడు రావణు శపించుట *—

ఆ. ఆచమించి నీట • నాసనాదికముల, నంటి శాస్త్రవిహిత • మైనరీతి
పాపశీలి యైన పంక్తికంధరుఁ గూర్చి, శాపమిచ్చె ఘోర•రూపముగను. ౫౫

అర్థములు. ఆచమించి=ఆచమనముచేసి, ఆచమనము చేయకయే దైవ పితృకార్యములు చేయరాదు. ఆసనాదికముల నంటి=కేశవాది నామములు చెప్పు నప్పుడే యే నామము చెప్పి యే యే ప్రదేశములు తాఁకవలయునో దానిని దానిని దాఁకి, పాపశీలి=పాపపు స్వభావము గలవాఁడు.

తాత్పర్యము

(ఆచమనముచేసి,ముఖము మొదలగు నంగములఁ దాఁకి శాస్త్రవిహితమైన విధముగాఁ, బాపపు స్వభావముగల రావణుని గుఱించి ఘోరమైనశాపమిచ్చెను.)

క. తన్నొల్లని నిను బలిమిని, నన్నీచుఁడు పరిభవించె • నటుగానఁ జెలీ!
తన్నొల్లని జలజాక్షి నిఁక, నెన్నఁ డతఁడు తాఁకకుండ • నేనొనరింతున్. ౫౬

అర్థములు. పరిభవించెన్=అవమానించెను.

తాత్పర్యము

(ఈనీచుఁడు తన నొల్లని నిన్ను బలవంతముగాఁ జెఱిచెను గావున నిఁక నెన్నఁడు వీఁడు తన నొల్లని యాఁడుదానిని దాఁకకుండఁ జేసెదను.)

క. ఎప్పుడిసీఁకేఁ దన్నొల్లని యప్పడఁతిం జెఱుచు రావ•ణాసురుఁ డపుడే
యప్పలలాశి శిరంబులు, తప్పక యిలఁ గూలు సప్త•ధాభిన్నములై. ౫౭

అర్థములు. అప్పలలాశి=ఆ రాక్షసుని, సప్తధాభిన్నములై = ఏడు తునుకలుగాఁ బగిలినవై, సప్తధాతువులు సప్తభేదములుగా నొకదానితో నొకటి సంబంధము లేక విడివడి పోవునని భావము. చూ. యుద్ధ-౨౯స.

ఇట్టి శాపమే బ్రహ్మయుఁ బెట్టెను. నలకూబర శాపము ప్రథమము సామాన్య దేవతలలోఁ జేరిన నలకూబరుని శాపము అంతకంటెఁ దపోధికుఁడైన

రావణాసురుని బాధింపదు. కావున పుంజికస్థలను రావణుఁడు చెఱిచెను. కావున మరల బ్రహ్మయే శపించెను. పరస్త్రీని చెఱిచిననే చచ్చునట్లు నలకూబర శాపము. దుర్వ్యాపారమునకై ప్రయత్నించినను జచ్చునని బ్రహ్మ శాపము. కావుననే సీతా విషయమై యత్నింపఁ డగుట.

క. అని జ్వలితాగ్నిసమప్రభుఁ, డనినంతనె కురియఁ దొడఁగె • నలరులవానల్
ఘన మయ్యె దేవదుందుభి,నినదంబులు మింట సురలు•నీరజభవుఁడున్. ౯౮

అర్థములు. జ్వలితాగ్ని సమప్రభుఁడు=మండుచున్న యగ్నితో సమానుఁడు, అలరుల వానల్=పుష్పవర్షములు, దేవదుందుభి నినదంబులు = దేవతల నగారాల ధ్వనులు.

తా త్ప ర్య ము

(అని మండుచున్న యగ్నితో సమానుఁ డయిన యా నలకూబరుఁ డన్న వెంటనే పూలవానలు కురియ నారంభించెను. దేవదుందుభులు ఘనముగా నాకసమున మ్రోగెను-దేవతలు-బ్రహ్మయు)

చ. మునులును బంక్తికంఠునకు • మూఁడిన కీడు దలంచి సంతసం
బును గొని రా దశాస్యుఁడును • బోలఁగ శాపవిధం బెఱింగి యా
దినము మొదల్ పరాంగనలఁ • దియ్యనివిల్తునికేళిఁ గూడఁగా
మనమున నెంచఁ డయ్యెఁ, దగు•మందు గదా భయ మెట్టివానికిన్. ౯౯

అర్థములు. మూఁడిన=సంభవించిన, అర్థాంతరన్యాసాలంకారము.

తా త్ప ర్య ము

(మునులును రావణునకు మూఁడిన కీడును తలపోసి సంతసపడిరి, రావణుఁడును శాపము విధమును దెలిసికొని, యా దినము మొదలు పరస్త్రీ సంగమమున మనస్సు పోనిచ్చిన వాఁడు కాఁడు-ఎట్టివానికైన భయము మందుగదా.)

క. రావణుఁడు బల్మిఁ దెచ్చిన,యావనితలు సాధ్వులెల్ల • యక్షేశసుతుం
డా విధి నొసఁగిన శాపము, వావిరిహర్షమున వినిరి•భయ మెడఁబాయన్. ౧౦౦

తా త్ప ర్య ము

(రావణుఁడు బలవంతముగా నెత్తికొనివచ్చిన యా పతివ్రతలందఱు నలకూబరుఁ డిచ్చిన శాపము విని మిక్కిలి సంతోషపడి రావణువలన భయము విడిచిరి. ఈ విషయము-సీత నిర్దోషురాలని-రామునకుఁ దెలుపఁబడెను.

### తా త్ప ర్య ము

హరిని జూచి మహానుభావా! యేమి చేయుదును? చెడు మనస్సుగల రావణుఁడు యుద్ధముఁ గోరి దేవతల గెల్వవచ్చినాఁడు. వీఁడు మిక్కిలి బలవంతుఁడు, ఊరకపోవువాఁడుగాఁడు. బ్రహ్మవరము వలన వచ్చిన గొప్పతనముచే, గన్నులు తెలియకున్నాఁడు. వీని చంపుదునా యనిన దేవతలచేఁ జావనట్లు బ్రహ్మచే వరమును బొందినాఁడు. ఆయనమాట గౌరవింపవలసి యున్నది.

క. కానన్న వీఁడు లెక్కఁడొ, నీ కరుణను గెలిచినాఁడ • నే నముచి బలిన్
వీకుల వృత్రున్ శంబరుఁ బ్రాకటబలశాలి నరకు • ఖండనమందున్. ౧౦౪

### తా త్ప ర్య ము

ఆ వర మడ్డము లేకున్న వీనిని జంపుటయొక్క గొప్పకార్యమా? నీ దయచేత నేను నముచిని బలిని వృత్రుని శంబరుని మహాబలవంతుఁడైన నరకుని యుద్ధమందుఁ జంపితిని. వారికంటె వీఁడు బలవంతుఁడా?

సీ. సచరాచరములైన • జగముల కెల్లను, గతియు నాశ్రయమును • గంజనేత్ర
నీవ కావే మఱి • నీకన్న దేవ దే, వేశ! యెవ్వరు నాథు • లింతటికిని
మధుసూదనుండవు • మాధవుండవు పద్మ, నాభుండ వీవె స • నాతనుఁడవు
జగముల నన్నిటి • స్థాపించితివి నీవ, నీవలనన కదా • నేను నగుట
ఆ. సర్వలోకములను • జనియింపఁ జేసెద, వన్ని ప్రళయవేళ • నిన్నె చొచ్చుఁ
బలుకవయ్య! యెట్టి యు • పాయ మాతని గెల్వఁ, జక్రమూని నాకు • సాయపడుదె.

### తా త్ప ర్య ము

స్థావరములు జంగమములు గల సమస్త ప్రపంచమునకు గమ్యస్థానము నీవే. ఆశ్రయము నీవే నీవుతప్ప నింతటికి నాథులు వే ఱెవ్వరు గలరు? మధువును జంపినవాఁడవు నీవ, లక్ష్మీపతివి నీవ, పద్మనాభుఁడవు నీవ, నీవే యాద్యంతములు లేక నిత్యముగ శాశ్వతముగ నుండువాఁడవు. ఈ జగముల నీవే కదా స్థాపించితివి. నీవలనవె కదా నేను గలిగితిని. నీవే సృష్టివేళ నీయందున్న లోకములను వెలుపల గోచరింపఁ జేసెదవు. దానినే సృష్టియందురు. ప్రళయవేళ నన్నియు నీయందే ప్రవేశించును. అది సంహార మందురు. ఈ రెండు నీవేకదా వాస్తవముగఁ జేయువాఁడవు. కావున నిప్పుడీ రాక్షసుని గెలుచు నుపాయమేదో చెప్పుము. నీవు చక్రము ధరించి సాహ్యపడుదువా?

### — • విష్ణు వింద్రునితోఁ దాను యుద్ధమునకు రానని చెప్పుట • —

ఉ. భీయుత చిత్తుఁడై యిటులు • నేఁడు సురేంద్రునిఁ జూచి పల్కె నా
రాయణుఁ డో మహేంద్ర! భయ • మందకు కార్యము తీరు విన్మ నీ
వీ యసురుం డజయ్యుఁడు సు • మీ విబుధాసురకోటి కింక నే
డాయ వధింప శక్యమగు • సారసగర్భ వరంబు పెంపునన్. ౧౦౫

అర్థములు. భీయుతచిత్తుఁడై=భయముతోఁ గూడిన మనస్సు గలవాఁడై, అజయ్యుఁడు=జయింపరానివాఁడు.

తాత్పర్యము

భయపడి యిట్లు వేఁడుచున్న యింద్రునిఁ జూచి విష్ణుమూర్తి యిట్లనియె. మహేంద్రా! భయపడకుము. జరుగవలసినది చెప్పెద వినుము. వీఁడు బ్రహ్మవరము వలన దేవాసుర సమూహములకు జయింపరానివాఁడు. కావున నిప్పుడు వాని నెట్లు జయింపనగును.

చ. తెలిసితి నే నిసర్గ మగు ♦ ధీమహిమంబునఁ బుత్రయుక్తుఁడై
నలిపెడిఁ బంక్తికంధరుఁడు ♦ చాలభయంకర మైన కృత్యమున్
బిలిచితి నన్నుఁ దోడ్పడఁగ ♦ భీమరణంబున కేను వానితోఁ
గలహ మొనర్ప నిప్పు డరు♦గన్ మదిగోల్ప ద దేల యంటివేన్. ౬౦౩

అర్థములు. నిసర్గమగు ధీమహిమంబునన్=స్వభావబుద్ధిబలముచే, భయంకరమైన కృత్యమున్=భయము గలిగించు కార్యము, ఇది ఇంద్రుఁడు చెలఁబడుట, గౌతమశాపము వ్యర్థపడరాదుగదా.

తాత్పర్యము

(రావణుఁడు కొడుకుతో గూడి చాల భయంకర కృత్యములు చేయుచున్నాఁడని నేను స్వభావసిద్ధమైన బుద్ధిబలముచేఁ దెలిసికొంటిని. నీవు నన్ను భయంకరమగు యుద్ధమునకు సాయపడఁ బిలిచితివి. కాని వానితో నిప్పుడు యుద్ధము చేయవచ్చుటకు మనసొప్పకున్నది. ఏలయందువా?

క. వెన్నుండు శత్రువరులన్, మన్ని గొనక సంగరమున♦మరలఁడు సుమీ బ్రహ్మ
యన్నియును నిపుడు చెల్లద, యన్నిశిచరవరుఁడు విధివ♦రావితుఁడగుటన్. ౬౦౪

అర్థములు. వెన్నుండు=విష్ణుఁడు, మన్నిగొనక = చంపక, విధివర+అవితుఁడు=బ్రహ్మవరముచే రక్షితుఁడు కావున.

తాత్పర్యము

ఇంద్రా! విష్ణు వెన్నడేని యుద్ధమున శత్రువుల జంపక మరలఁడు. బ్రహ్మవరము వానిని రక్షించుచున్నది కావున నా నియమ మిప్పుడు కొనసాగదు.

గౌతముని శాపము నెఱవేఱవలసియున్నది. రావణుని జంప వలను పడదు. ఈ రెండింటికి నడ్డపడరాదు. కావునఁ దాను రాక నిరాకరించెను.

చ. ప్రతిన వచింతు విన్ము సుర ♦వల్లభ! రావణు సేన చంపెదన్
హితమతితో ముకంబు ఘటి♦యింతు బుధాళికి నిక్క మూ శచీ
పతి! సమయంబు వేచి ధృతిఁ♦బాయకు, భంకన మిమ్ము వానికిన్
పితతబలంబుతో నరిగి ♦ నేగ మ టన్నను బాకనైరియున్. ౬౦౫

తా త్ప ర్య ము

నీవు వచ్చి వేఁడితివి కావున నీ ప్రార్థన వ్యర్థము కాఁబోదు నే నొక ప్రతిజ్ఞ చేసెద వినుము. సమయము చూచి రావణుని నేను చంపెదను. దేవతలకు సంతోషము కలిగింతును. ఇది నిజమే. ధైర్యము వదలకుము. ఇప్పటికి నీవు సేనతోఁ బోయి యుద్ధము చేయుము అని చెప్పఁగా నింద్రుఁడు.

## —• దేవ రాక్షస యుద్ధము •—

సీ. ఆదిత్యవసురుద్రు • లశ్వినుల్ మరుతులుఁ, వెంటరా ననికయి • వెడలి చనఁడు
రజనీక్షయంబున • రావణుసేనతోఁ, బలమున సురసేన • తలపడంగ
నక్షయంబైన యా • యసురసైన్యముఁ గాంచి, సంక్షోభమందిరి • సకలసురలు
పోరు ఘోరం బయ్యెఁ • గ్రూరనానాయుధ, కోటుల నిరువాఁగు • కొట్టుకొనఁగ

ఆ. నంతలోన రావ • ణాసురమంత్రు లకంపనప్రహస్త • ఖరనికుంభ
యజ్ఞకోపశుకన • రాంతకసంహ్లాద, జంబుమాలిసూర్య • శత్రువులును. ౩౦

అర్థములు. అనికయి=యుద్ధముకొఱకై; రజనీక్షయంబున=ఉదయమున; ఇరువాఁగు=రెండు పక్షములవారు.

తా త్ప ర్య ము

(ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, అశ్వినీ దేవతలు, మరుత్తులు తన వెంటరాఁగా యుద్ధమునకై బయలుదేఱి పోయి యుదయమున రావణుని, సేనతో దేవతలసేన బలముగాఁ దలపడిరి. అందు అక్షయమైన రాక్షస సేనను జూచి దేవతలందఱు సంక్షోభమును జెందిరి. రెండు పక్షముల వారును క్రూరములయిన యనేక విధములయిన యాయుధములతోఁ గొట్టుకొనఁగా యుద్ధము భయంకర మయ్యెను. అంతలోన రావణాసురుని మంత్రులు అకంపన, ప్రహస్త, ఖర, నికుంభ, యజ్ఞ, శుక, నరాంతక, సంహ్లాద, జంబుమాలి, సూర్య శత్రువులును—)

సీ. మారీచసుప్తఘ్న • సారణదుర్ముఖ, ధూమకేతువులును • ధూమ్రుఁ డుఁ
గరవీరనేత్రత్రి • శిరులు మహాపార్శ్వుఁ, డును మహాదంష్ట్రుండు • ఘనబలుండు
అతికాయుఁడును విరూ • పాక్షఘటోదరు, లలమహోదర మహా • ప్రహారులొగి మ
హాకాయ దుర్ముఖు • లతిబలుఁడైన దే, వాంతకుండును గూడి • యరుగుదేర

తే. రావణుని తాత శౌర్యను • రంధరుండు, వెన సుమాలి సురావళి • విచ్చలింప
ఘోరశస్త్రాస్త్రసమితిని • గూల నడిచి, తోలె వాయువు మబ్బులఁ • దోలుసట్లు.

తా త్ప ర్య ము

(మారీచుఁడు, సుప్తఘ్నుఁడు, సారణుఁడు, దుర్ముఖుఁడు, ధూమకేతువు, ధూమ్రుఁడు, కరవీరనేత్రుఁడు, త్రిశిరుఁడు, మహాపార్శ్వుఁడు, మహాదంష్ట్రుఁడు,

అతికాయుఁడు విరూపాక్షుఁడు, ఘటోదరుఁడు, మహోదరుఁడు, మహాప్రహోదుఁడు, మహాకాయుఁడు, దుర్ముఖుఁడు, మిగుల బలశాలియైన దేవాంతకుఁడు కలిసిరాఁగా రావణుని తాత సుమాలి వాయువు మబ్బులను చెదరఁ గొట్టునట్లు దేవతలు భయపడి పాఱిపోవునట్లు ఘోరములగు నస్త్రశస్త్రములు ప్రయోగించి తఱిమెను.

ఉ. పైపడి తాఁచుచున్న సుర • వైరుల వేఁడిమి కోహటించి తా
రేపఱి సింహముల్ దఱుమ • హీనమృగంబులు పాఱునట్టులై
యోపిక లేకఁ బాఱఁ గని • యోధవరాగ్ర్యులు త్వష్టృపూషులా
క్షేపపురస్సరం బరుల • సేనల మార్కొని విక్రమించిరన్. ౬౧.౨

అర్థములు. తాఁచుచున్న=కొట్టుచున్న, ఏపఱి=బలముచెడి, యోధవరాగ్ర్యులు=యోధశ్రేష్ఠులందు ఉత్తములు, త్వష్టృపూషులు=త్వష్ట పూషుఁడు అనువారు, ఆక్షేపపురస్సరంబు=ఆక్షేపవాక్యంబులు చెప్పుచు.

తాత్పర్యము

పైపడి కొట్టుచున్న రాక్షసుల ప్రతాపమునకు వెనుదీసి దేవతలు బలము చెడి సింహములు తఱుమఁగాఁ బఱువెత్తు క్షుద్రమృగములవలె నిలువలేక పఱువెత్తఁగా జూచి త్వష్ట పూషుఁడు నను వారు రాక్షసుల నాక్షేపించుచు వారిని నెదిరించి పరాక్రమము చూపఁగా.

తే. అధికబలశాలి వసువుల • నష్టముండు, వీరసత్తముఁ డైన సా • విత్రుఁ డప్పు
డరులు గగ్గోలువడఁ దాఁకె • నాహవంబు భూతజాతమహాభీతి • హేతువయ్యె.

అర్థములు. గగ్గోలుపడ=కలఁతపడ, ఆహవంబు=యుద్ధము, భూతజాత=ప్రాణిసమూహముయొక్క, మహాభీతి = గొప్పభయమునకు, హేతువయ్యెన్=కారణ మయ్యెను,మూచు ప్రాణికోటి యంతయు మిగుల భయపడియెననియర్థము.

తాత్పర్యము

(మిగుల బలశాలియు వసువులలో నెనిమిదవవాఁడు, వీరులలో శ్రేష్ఠుఁడు నైన సావిత్రుఁ డప్పుడు శత్రువులు కలఁతపడునట్లు తాఁకఁగా, యుద్ధము చూచి ప్రాణి సమూహము చాల భయపడెను.)

క. నిశితాయుధధారాహతి, దశముఖసైన్యంబు దేవ • తల వధియింపన్
విశసన మొనరించి రమరులు, వశ మఱి యూలంగ శత్రు • బలసంఘంబున్. ౬౧౪

అర్థములు. నిశిత=వాఁడియైన, ఆయుధ=సాధనముల యొక్క, ధారా హతిన్=వాదరల దెబ్బలచే, విశసన మొనరించిరి=చంపిరి, వశము+అఱి=స్వాధీనముతప్పి, శత్రుబల సంఘంబున్=విరోధుల సేనాసమూహమును.

తా త్ప ర్య ము

వాఁడియైన యాయుధముల దెబ్బలచే రాక్షసులు దేవతల వధింపఁగా దేవతలు శత్రుసేనలు స్వాధీనము తప్పి పడునట్లు చంపిరి.

ఉ. అప్పుడు నాకలోకనిల♦యాంబుదమార్గణవృష్టి జోపుచున్
దెప్పున భీమమారుతము♦తీరున వచ్చి సుమాలి శూలముల్
గుప్పలుగాఁ బయిం బఱపి ♦ కొండలపాటొదవించి శీర్షముల్
వొప్పలు చేయ దేవతలు ♦ దూలిరి పాఱిరి భీతి ముంపగన్. ౬౧౫

అర్థములు. నాకలోకనిలయు=దేవతలనెడి, అంబుద=మేఘముల యొక్క, మార్గణవృష్టి=బాణవర్షము, జోపుచున్=ఎగురఁజిమ్ముచు, తెప్పునన్=త్వరగా, భీమమారుతము=భయంకర వాయువు, కొండలపాటు=కలఁత.

తా త్ప ర్య ము

అప్పుడు దేవతలు మేఘములవలె బాణములను వర్షము గురియింపఁగా భయంకర వాయువువలె సుమాలివచ్చి దాని నెగురఁగొట్టి శూలములను గుప్పలు గుప్పలుగాఁ గురియించి కలఁతపడచేసి దేవతల తలలు దొప్పలవలె నగునట్లు పగులఁగొట్టఁగా దేవతలు భయపడి పరువెత్తిరి.

ఆ. ఆ సుమాలి తెంపు♦నీసుమాలుచు సురల్,దిక్కు మొగములైన♦తెరువుఁగాంచి
యాసుమాలిఁబోలి♦యల్ల సావిత్రుండు, నీయనై న్యవితతి♦చేరి రాఁగ. ౬౧౬

అర్థములు. ఈసుమాలుచు=ఈర్ష్యనకలి, దిక్కు మొగములు = దిక్కుల ప్రక్కముఖములు గలవారు, అనగా దిక్కుల వెంటఁ బరువెత్తినవారు, తెరువు= మార్గము, సుమాలిన్=సూర్యుని

తా త్ప ర్య ము

ఆ సుమాలి సాహసము రోషమువకలి దేవతలు దిక్కుల వెంటఁ బరువెత్తుట చూచి వసువులలో సావిత్రుఁడను నెనిమిదవ వసువు తనసేనకలిసిరాఁగా

క. ఆ మరుదరి కెదురుగఁ జని, జీమూతముమాడ్కి నిలిచి♦చెచ్చెర శరధా
రామండలిఁ గప్పెను బల,భీమునిఁ గుదియింప నభయ♦వీరుల కచటన్. ౬౧౭

అర్థములు. మరుదరికి=రాక్షసునకు, జీమూతము=కొండ, 'జీమూతౌ మేఘపర్వతౌ' నానా ౪. శరధారామండలిన్=బాణధారలచేఁ గప్పెను.

తా త్ప ర్య ము

(ఆ భయంకరమగు బలముగల రాక్షసులకెదురుగాఁ బోయి, కొండవలె నిలిచి వేగముగా బాణపరంపరలచే మరలింప నావీరు లిరువుర కచ్చట.)

శా. భీమం బయ్యెను సంగరంబు వసుస • ద్వీరుండు శాతాంబక
 స్తోమంబుల్ గురియించి శత్రురథమున్ • ముత్తునుకల్ జేసి ని
 ర్ధూమజ్వాలపరీతవహ్నికెనయై • రూక్షంబు నా పెన్గదన్
 దా మూర్ధంబునఁ గాలదండ మనఁ గ్రో • ధస్ఫూర్తిమై వైచినన్. ౬౧౮

అర్థములు వసుసద్వీరుఁడు = మంచివీరుఁడైన వసువు, సావిత్రుండు, శాతాంబకస్తోమంబుల్ = వాఁడిబాణముల సమూహములు. ముత్తునుకలన్ = మూఁడు ముక్కలుగాఁ, జేసి, నిర్ధూమజ్వాలాపరీత వహ్నికిన్ = పొగలేని శిఖలచేఁ గూడిన యగ్నికి సమానమై రూక్షంబు = కఠినమైన, మూర్ధంబున్ = శిరమునందు, కాలదండము = యమదండము, క్రోధస్ఫూర్తిమై = విశేషరోషముచే.

తాత్పర్యము

వారి యిరువురకు భయంకరయుద్ధము జరగెను. అంత వీరుఁడగు వసువు సావిత్రుఁడు పదునైన బాణములు గురియించి సుమాలి తేరిని మూఁడుతునకలు చేసి పొగలేనిజ్వాలలచేఁ గూడిన యగ్నివలెనై కఠినమైన గదను కాలదండమో యనునటు వాని తలమీఁద రోషమున వైచెను.

ఉ. రక్కసుఁ డా గదాహతి శి • రం బిది మాంసము నెమ్ములివ్వి యం
 చెక్కడ గుర్తుచిక్కక మ • హిన్ వెసఁ గూలెను భస్మితుండుగాఁ
 దక్కినవారు లద్ది గని • తత్తఱఁ బాఱిరి రోదనాదముల్
 పిక్కిలిగాఁగ నట్టియెడ • మేటిబలిష్ఠుఁడు మేఘనాదుఁడున్. ౬౧౯

తాత్పర్యము

రాక్షసుఁ డా సుమాలి యా దెబ్బచే నిది తల, యిది మాంసము, ఇవి యెముకలు అని గుర్తింపరాక యుండునట్లు భస్మమై నేలఁ గూలెను. తక్కిన రాక్షసు లది చూచి గట్టిగా నేడ్చుచుఁ బరువెత్తిరి. అప్పుడు మిగుల బలవంతుఁడైన మేఘనాదుఁడు.

౨౮వ సర్గము

ఉ. వారలనెల్లఁ గ్రమ్మఱఁగఁ • బల్కి మహార్హము కామగంబు నౌ
 తేరిపయిం గృశానుఁ డన • దీప్తిరహించుచు శత్రుసేవలన్
 ధీరతఁ దాఁక వానిఁ గని • భీతిని బాఱెను దేవకోటి, పా
 కారియు సేనపాటుఁ గని • యందఱ నెల్లెడఁ బిల్చి యిట్లనున్. ౬౨౦

అర్థములు. క్రమ్మఱఁగన్ = పరుగెత్తక వెనుకకు రండని, మహార్హము = గొప్పయోగ్యతగలది, కామగంబు = కోరినట్లు పోఁగలది, కృశానుఁడు = అగ్ని. భీతిన్ = భయముతో, పాకారి = ఇంద్రుఁడు.

తాత్పర్యము

పరువెత్తుచున్న వారిని వెనుకకు రండని పిల్చి మిక్కిలి సౌభాగ్యమై కామ సంచారము గలిగిన తేరిమీఁద నగ్నిహోత్రుని వలె వెలుఁగుచు శత్రుసేనలను ధైర్యముచే నెదిరింపఁగా వానిఁ జూచి భయపడి దేవతలు పరువెత్తిరి. వారిగతి చూచి యింద్రుఁడు వారల బిగ్గరగాఁ బిల్చి యిట్లనియె.

క. తగునా దేవతలారా!, మగతనముల విడిచి పాఱ ♦ మరలుఁడు పోరన్
దెగ వ్రేయఁగ నా సుతుఁ డిదె, పగవానిన్ మాఱుకొనియెఁ ♦ బరికింపుఁడనన్.

తాత్పర్యము

(దేవతలారా! మగతనము వదలి యుద్ధమునుండి మరలి పాఱిపోవుట తగునా? యుద్ధమునకు మరలుఁడు; ఇదిగో నా కుమారుఁడు పగవానిని తెగవేయఁబూని యెదుర్కొనెను. పరికింపుఁడు అని చెప్పఁగా.)

—♦ జయంత మేఘనాధుల యుద్ధము ♦—

చ. సురలు పులోమజా తనయు ♦ శూరు జయంతసమాఖ్యు రావణా
సురసుతుఁ దాఁకఁ గాంచి ధృతి ♦ చొప్పడఁ దారును బాసటైన సం
గర మతిరోమహర్షమయి ♦ క్రాలెను రావణశక్రనందనుల్
సరిసరి గాఁగఁ బోరిరి చ♦లంబు బలంబును బాయ కిద్దఱున్. ౬౨

అర్థములు. ధృతి=ధైర్యము, చొప్పడన్=కలుగఁగా, బాసటైనన్=సహాయపడఁగా, రోమహర్షము=గగ్గురుపాటు.

తాత్పర్యము

దేవతలు శచీదేవి కుమారుఁడును శూరుఁడును జయంతుఁడను పేరుగలవాఁడు మేఘనాదుని నెదిరింపఁగాఁ జూచి ధైర్యము దెచ్చుకొని దేవతల లాయనకుఁ దోడుపడఁగా జయంత మేఘనాదులకు భయంకరమైన గగ్గురుపాటు గలిగించు యుద్ధము జరగెను. వా రిరువురు చలము బలము వదలక సరిసమానముగఁ బోరిరి.

సీ. మందోదరిసుతుండు ♦ మాతలినందనుఁ, గోముఖుఁ డనివాని ♦ ఘోరబాణ
ములను నొప్పించిన ♦ బలిజయంతుం డట్లు, మొనరించి రావణు ♦ నుగ్రబాణ
వితతి నొప్పించిన ♦ వీఁడు శోకుఁడు, నట్లు జయంతుని ♦ నడిచె నంత
విడక మాయను గొని ♦ బెడిదంపుఁజీకట్లు, గవియంగఁ జేసి సం♦గ్రామధరణిఁ

ఆ. బ్రాసశూలఖడ్గ ♦ పరిఘశతఘ్నికా. ముసలభూరిగదల ♦ ముసురు వోలెఁ
గురిసి ధారణీంద్ర♦కూటకోటులు శత్రు, సేనమీఁద నైచెఁ ♦ జేడ్పడంగ. ౬౩

## తాత్పర్యము

మేఘనాదుఁడు, మాతలి కుమారుడైై జయంతుని సారథి యగు గోముఖుఁడను వానిని క్రూరబాణములచే నొప్పింపఁగా జయంతుఁ డట్లులే మేఘనాదుని సారథిని నొప్పించి యతనిని గొట్టెను. మేఘనాదుఁడును జయంతుని గొట్టెను. ఇట్లు గొట్టి న్యాయ్యయుద్ధమున గెలుపు లేదని యోచిఁగి తాను నేర్చిన తామసీవిద్యచే గాఢాంధకారము వ్యాపింపఁజేసి యీఁటెలను శూలములను కత్తులను గుదియలను శతఘ్నులను రోఁకండ్లను పెద్దగదలను జడివానవలె గురియించి పర్వతశిఖరముల సమూహములు శత్రుసేనలమీఁద వైచెను.

క. మాయాతిమిరముచేతను, వ్యామోహిత మగుదు నుభయ♦బలములు రక్ష
స్తోమము రాక్షసుల దివౌకోమండలి దేవతలను♦గూల్పఁగఁ జొచ్చెన్. ౧౫

అర్థములు. మాయాతిమిరముచేతను=తనశక్తిచేఁ గల్పించిన చీఁకటిచే, వ్యామోహితము=మోహము చెందినది, రక్షస్తోమము=రాక్షససమూహము.

ఇంద్రజిత్తు తనశక్తిచేఁ గల్పించిన చీఁకటివలన రెండుసేనలవారు దిక్కుఁ తెలియక రాక్షసులను రాక్షసులే చంపిరి. దేవతలను దేవతలే చంపిరి.

క. ధ్వాంతము పెల్లున నచట జ,యంతునిఁ గానంగలేక ♦ యలమటను మరు
త్సంతతి విశాకుఁ గొనె నిట్లంతట వ్యాపించి యున్న ♦ యాతిమిరమునన్. ౧౬

అర్థములు. ధ్వాంతము పెల్లునన్=అతిశయమైన చీఁకటిచే, అలమటను=విచారముచే, మరుత్+సంతతి=దేవతాసమూహము, విశాకుఁగొనెన్ = నిశ్చేష్టమయ్యెను.

## తాత్పర్యము.

గాఢాంధకారమున జయంతుఁ డెచ్చట నుండినది యేమైనది తెలిసికొన లేక విచారపడుచు దేవతల సమూహము నిశ్చేష్టమయ్యెను. ఇట్లు సర్వత్ర వ్యాపించిన యా చీఁకటియందు.

తే. శచికి జనకుండు దితికుల ♦ సత్తముండు
పేరుఁడు పులోముఁ డనువాఁడు ♦ వేగ వచ్చి
తనదుదౌహిత్రు గ్రహియించి ♦ కొని మతంగి
యరిగి సాగరమును జొచ్చె ♦ సమున లిచట ౧౭

అర్థములు. దితికులసత్తముండు=దైత్యులందు శ్రేష్ఠుఁడు, దౌహిత్రుఁడ్=కూఁతు కొడుకును, జయంతుని, మతంగి=కానరాకపోయి.

### తాత్పర్యము

(దైత్యులందు శ్రేష్ఠుఁడైన పులోముఁడను వీరుఁడు శచీదేవి తండ్రి, తన మనుమఁడైన జయంతుని తీసికొని కనపడకుండఁ బోయి సముద్రములోఁ బ్రవేశించెను. దేవత లిచ్చట.)

చ. హరిహయపుత్త్రుఁ గానక మ♦హావ్యసనంబున వీతహర్షులై
దరమున నిల్వఁజాలక య♦థాయథులై చన మేఘనాదుఁడున్
గురుతరసైన్యయుక్తుఁ డయి ♦ కో యని యార్చుచు నంటఁ దాఁకె త
త్సురులను దోలె, నింద్రుఁడు సు♦తుం డటఁ గానఁగరామి వేల్పులున్. ౬౨౭

అర్థములు. హరిహయపుత్త్రున్=ఇంద్రునికొడుకును - జయంతుని, వీతహర్షులై=సంతోషము లేనివారై, దరమునన్ =భయముచే, యథాయథులై= చెదరి పోయినవారై, గురుతర సైన్యయుక్తుఁడై=గొప్ప సేనతోఁ గూడినవాఁడై, తత్సురులను=ఆ దేవతలను, సంస్కృతసమాసము గావున పుంలింగ రూపము.

### తాత్పర్యము

(ఇంద్రుని కొడుకగు జయంతునిఁ గానక, సంతోషము లేనివారై మహాదుఃఖమును జెంది భయముచే నిలువఁజాలక చెదరి పోవఁగా, మేఘనాదుఁడుగొప్ప సేనతో 'కో' యని యఱచుచు వెంటఁబడి యా దేవతలను దఱిమెను. ఇంద్రుఁ డక్కడఁ దన కొడుకుఁ గానరాకుండుటచే, దేవతలను.)

### —♦ ఇంద్రుఁడు యుద్ధమునకు వెడలుట ♦—

చ. కలవరపాటు చెందుటయుఁ ♦ గాంచి రథంబును దేరఁ బంప మా
తలి యటు సేయఁగా ననికిఁ ♦ దర్లె మహేంద్రుఁడు ప్రోదిసీలతా
కలితపయోధరోత్కరము♦గర్జల నించుచు మున్ను వాయుసం
చలితములై చనెన్, నటన♦సంభ్రమతత్పరలైరి యచ్చరల్. ౬౨౮

అర్థములు. అనికిన్=యుద్ధమునకు, తర్లెన్ = ప్రయాణ మయ్యెను, ప్రోదిసీలతా=మెఱుపుఁదీఁగతో, కలిత=కూడిన, పయోధరోత్కరము = మేఘముల సమూహము, గర్జల=ఉఱుములను, వాయు సంచలితములై=గాలిచేఁ గదలినవై, నటన సంభ్రమ తత్పరలు=ఆడుటయందు వేగిరపాటు గలవారు.

### తాత్పర్యము

కలత చెందఁగా గాంచి తేరిని దీసికొని రమ్మని పంపఁగా మాతలి యట్లే తీసికొనిరాఁగా నింద్రుఁడు మెఱుపుఁదీఁగలతోడ మేఘము లుఱుముచు ముందు పోఁగా యుద్ధమునకుఁ బ్రయాణ మయ్యెను. అప్పు డచ్చర లాడిరి.

తే. నవ్యగతి వాద్యములను గం♦ధర్వసమితి, పరగఁజేసెను నిర్జర♦వసు మరుద్గ
ణములు రుద్రులు సాధ్యులు♦గుములుగాఁగ,సకలసాధనములతోడఁ♦జనిరికూడ.

అర్థములు. నవ్యగతిన్=మనోహరముగ.

తాత్పర్యము

(గంధర్వసమూహము మనోహరముగ వాద్యములు చేసిరి, దేవతలు వసువులు మరుత్తులు, రుద్రులు, సాధ్యులు, గుంపులుగా సకల సాధనములతో నాతని వెంటఁ జనిరి.)

క. పరుషగతి వీచెఁ బవనుఁడు,దొరలె మహోల్కా-చయంబు♦తోయజహితుఁడున్
బరిధుతతేజుం డయ్యెను, హరిహయుఁ డాలంబు సేయ♦నరిగెడివేళన్. ౬౩౦

అర్థములు. పరుషగతిన్=కఠినముగా బాధ కలుగునట్లు, మహోల్కాచయంబు=పెద్ద కొఱవుల సమూహము, తోయజహితుఁడు=సూర్యుఁడు, పరిధుత తేజుఁడు=తేజస్సు పోయినవాఁడు, హరిహయుఁడు=ఇంద్రుఁడు, ఇవి యన్నియు నపశకునములే.

తాత్పర్యము

ఇంద్రుఁడు యుద్ధమునకుఁ బోవు సమయంబున నిష్ఠురముగా గాలివీచెను. కొఱవులు రాలెను. సూర్యుని కాంతి మాసెను.

క. ఈలోన మహాభోగా, భీలాశీవిషవితాన♦వృత మగుచును
వ్యాళవినిశ్వాసానిల జాలంబులచేత మండు♦చందం బగుచున్. ౬౩౧

అర్థములు. ఈలోనన్=ఇంద్రుఁడు యుద్ధమునకు సిద్ధపడి వచ్చులోపల, మహాభోగ=పెద్ద దేహముగల, అభీల=భయంకరమైన, ఆశీవిష వితాన=సర్ప సమూహములచే, వృతము=చుట్టఁబడినది, తత్=ఆ, వ్యాళ=సర్పముల. వినిశ్వాసానిలజాలంబుచేత=ఊర్పు గాలుల సమూహముచే.

తాత్పర్యము

ఇంద్రుఁడు యుద్ధమునకు వచ్చు లోపల పెద్దదేహములు గలిగి భయంకరములైన సర్పములచేఁ జుట్టఁబడి యా పాముల యూర్పుగాలులచే మండుచున్న దానివలనైె.

తే. విశ్వకర్మకృతం బయి♦వెలయు చున్న, స్యందనం బెక్కి దైత్యని♦శాచరాళి
బలసి రాఁ బంక్తికంఠుండు♦భండనమున, కేగుదెంచెను శక్రున♦కెదురుగాఁగ.

అర్థములు. స్యందనము=తేరు, బలసి = చుట్టుకొని, భండనంబునకు= యుద్ధమునకు.

(రావణుఁడు, దైత్యుల రాక్షసుల మూఁకలు చుట్టు గొలిచి వచ్చుచుండ, విశ్వకర్మ రచించిన రథమెక్కి యుద్ధమునకై యింద్రుని కెదురుగాఁ బోయెను.)

క. అరుదెంచుచు సుతుతో సం,గరమును జాలింపు మీవు ♦ గాసి దొలంగన్
హరిహయు నే గెలిచెద నన, దురమును జాలించి యతఁడు♦నూరం బుండెన్.

తాత్పర్యము

వచ్చుచు కొడుకును జూచి నీవు యుద్ధమును జాలింపుము. గాసి తీర్చుకొనుము. ఇంద్రుని నేను గెలిచెదను. అని చెప్పగా మేఘనాదుఁడు యుద్ధమును జాలించి యూరకుం డుండెను.

## —♦ కుంభకర్ణుఁడు దేవతలతోఁ బోరుట ♦—

ఉ. అప్పుడు దేవతావళికి ♦ నాశరకోటికిఁ బోరు ఘోరమై
యొప్పెను గుంభకర్ణుఁడును ♦ యుద్ధము చేయుట యేరితోడ నా
చొప్పు నెఱుంగ కే యెదుటఁ ♦ జూడ్కికిఁ దోఁచినవారి నెల్ల దా
నుప్పెన మాఱుకోఁ గడఁగె ♦ నుద్యతభీషణశస్త్రజాలుఁ డై. ౩౪

అర్థములు. ఆశరకోటికిన్=రాక్షస సమూహమునకు, ఉప్పెన=విజృంభణముచే, ఉద్యత=ఎత్తఁబడిన, భీషణ = భయంకరమైన, శస్త్రజాలుఁడై=ఆయుధ సమూహము గలవాఁడై.

తాత్పర్యము

అప్పుడు దేవతలకు రాక్షసులకు ఘోరమైన యుద్ధము జరగెను. అందుఁ గుంభకర్ణుఁడు తా నెవరితో యుద్ధము చేయునది తెలియక తన యెదుట నెవరు కనఁబడిన వారితో నెల్ల విజృంభించి ఆయుధములతో యుద్ధము చేయ నారంభించెను.

ఇచ్చట గుంభకర్ణుఁడు పెక్కుదినములు, నాలుగైదు దినములు, మేలుకొని యున్నట్లు చెప్పఁబడెను. కావున వాఁడొకనాఁటికంటె నెక్కువఁగ గూడ మేలుకొని యుండుటయుఁ గలదని యేర్పడుచున్నది

క. కరములఁ బదములఁ గోఱల, గురుతరశక్తులను బాణ♦కోటుల నసి తో
మరముల నిర్జరులను సం,గరమున వధియింపఁ దొడఁగె♦గసిబిసి గాఁగన్. ౩౫

అర్థములు. అసి=కత్తులను, తోమరముఁలన్=చిల్లకోలలతోను, గసిబిసి గాఁగన్=కలఁతపడునట్లు.

తాత్పర్యము

చేతులతో గోళ్ళతో కోఱలతో గొప్ప శక్తులతో బాణసమూహములతో కత్తులతో చిల్లకోలలతో దేవతలు కలఁతచెందునట్లు యుద్ధమందుఁ జంపుచుండెను

క. అతనివడిఁ గని రుద్రులు, జాతమహాక్రోధమున ని • శాచుని నానా
హేతిముఖ సాధనంబుల, నాతతగతి మోఁదఁ గాఁఱె • నస్రపుధారల్. ౬౩౬

అర్థములు. నానాహేతిముఖ సాధనములన్=అనేకములైన కత్తులు మొదలగు నాయుధములతో, అస్రపుధారల్=నెత్తురు ధారలు.

తాత్పర్యము

అతని వేగము చూచి మిగులఁ గోపించి రుద్రు లా రాక్షసుని ననేకవిధము లయిన కత్తులు మొదలగు నాయుధములతో విస్తారముగ మోఁదఁగా నెత్తురు ధారలు గాఱెను.

ఉ. రుద్రులు విక్రమించి యద • రుం బెదరుం గొన కుత్సహించి ని
ర్నిద్రపరాక్రమంబునను • క్రీడయుపోలె నరాతిసేనలన్
రౌద్రము గాఁగఁ ద్రుంచిరి శ • రంబుల భీకరసాధనంబులన్
క్షుద్రమృగాళి సింహములు • గూల్చువిధంబుగ నేవు చూపుచున్. ౬౩౭

అర్థములు. నిర్నిద్ర=హెచ్చరిక గల, అరాతిసేనలన్=శత్రుసేనలను.

తాత్పర్యము

(రుద్రు లదరు బెదరు లేక యుత్సాహముతో హెచ్చరిక గలిగిన పరాక్రమించి క్షుద్రమృగములను సింహములు చంపునట్లు బాణములు మిగుల భయంకరములగు మున్నగు సాధనములచే భయంకరముగా విజృంభించి, శత్రుసేనలను ద్రుంచివేసిరి.)

**—• సురసహాయుండై యింద్రుఁడు రాక్షసుల వధించుట •—**

క. మరుతులు నానాప్రహరణ, కరులై యరు లైనవారిఁ • గదనంబున ని
ర్భరబలజవగరిమంబులఁ, బరుషగతిన్ నఱికి రైన • బసచెడి సోఁకుల్. ౬౩౮

అర్థములు. మరుతులు=వాయువులు. నానాప్రహరణకరులై=అనేకాయుధములు చేతుల ధరించిన వారై, అరులు=శత్రువులు, కదనంబునన్=యుద్ధమందు, నిర్భర=అతిశయించిన, జలజవ గరిమంబులన్=గొప్ప బలవేగములతో, పరుష గతిన్=నిష్ఠురముగ, సోఁకుల్=రాక్షసులు.

తాత్పర్యము

మరుత్తులు నానావిధసాధనములఁ గేల ధరించి యుద్ధమందు శత్రువులగు వారిని నధికబలముచేతను వేగముచేతను దయ లేక నఱికి వేయఁగా రాక్షసులు బెంకువడి పోయిరి.

సీ. కాలుసేతులు దెగి • ధాత్రిస్థలిఁ బడువారు, వాహనంబులతోడ • వ్రాలువారు
రథనాగతురగఖ • రంబులఁ బన్నగో • ష్ట్రింబుల-శింశుమా • రములఁ గిరుల
నాలింగనము చేసి • యట్టె యుండెడివారు, నిలఁబడినట్టుల • నీల్గువారు
చేష్టావిహీనులై • చేడ్పడువారుగా, రణ మొప్పెఁ జిత్రక • ర్మంబురీతి
తే. శక్రసంభిన్ననిహతని • శాచరాళి, తనువులను గాఱు శోణితో • దకము గృధ్ర
కంకసంఘాకులితమయి • కాండనక్ర, మగుచు నేఱయి ప్రవహించె • నద్భుతముగ.

అర్థములు. రథ=తేరులను, నాగ=ఏనుఁగులను, తురగ=గుఱ్ఱములను, ఖరంబులన్=కంచర గాడిదలను, పన్నగ+ఉష్ట్రింబులను=పాములను ఒంటెలను, శింశుమారములను=మొసళ్ళను, కిరులన్=అడవిపందులను, ఏదుపందులను, నీల్గువారు=చచ్చువారు, శక్ర=ఇంద్రునిచే, సంభిన్న=నలిఁకఁబడిన, నిహత=కొట్టఁబడిన, నిశాచరాళి=రాక్షస పంక్తులు, శోణితోదకము=రక్తజలము, గృధ్ర=గ్రద్దలు, కంక=రాంబందులు, వీని సంఘ=గుంపులచే, ఆకులితమయి = కలతచెందినదై, కాండనక్రము=బాణము లనెడి మొసళ్ళుగలది.

## తాత్పర్యము

కాళ్ళుచేతులు తెగుటచే భూమిపైఁ బడువారును, కొందఱు వాహనములతోఁ బడువారును, కొందఱు తమకు వాహనములైన రథములను ఏనుగులను గుఱ్ఱములను కంచరగాడిదలను పాములను ఒంటెలను మొసళ్ళను ఏదుపందులను కౌఁగిలించుకొని యట్టులే యుండువారును, నిలువఁబడిన వారు నిలువఁ బడినట్లే చచ్చువారును, కొందఱు కాలుసేతులు కదలింపక బాధపడువారునై యుద్ధము చిత్రకర్మమువలెఁ గాన వచ్చెను. ఇంద్రునిచే నలిఁకఁబడి కొట్టబడిన రాక్షసులు దేహముల నుండి కాఱు రక్తమను జలము గలదై గ్రద్దలు రాంబందులు గుంపులు గలిగి బాణములను మొసళ్ళు గలదై యేఱయి పాఱెను.

చ. తనబలగంబు సర్వము న • దైవతకోటులు ద్రుంపఁగా దశా
ననుఁడు భయంకరాకృతి ఘ • నస్వన మీనెడి భూరిమార్గికిన్
సునిశితబాణజాలముల • నార్లకొలందులఁ గూర్చి దేవవా
హిని పౌవ రెల్ల మాన్పి విబు • ధేంద్రునిఁ దాఁకెనఁ బాకవైరియున్. ౬౦

అర్థములు. బలగము=సేన, భయంకరాకృతిన్=దిగులు పుట్టించు ఆకారము గలవాఁడై, ఘనస్వనము=గొప్పధ్వని, భూరిమార్గికిన్ = గొప్పయల్లెత్రాటికి, సునిశిత = మిగులఁబదునైన, బాణజాలములన్ = బాణసమూహములను, దేవవాహిని=దేవతల సేనయొక్క, పౌవరు=గర్వము, విబుధేంద్రుని=దేవేంద్రుని.

తాత్పర్యము

తన సేన నంతను దేవతలు చంపఁగాఁ జూచి రావణుఁడు భయంకరాకారుఁడై మేఘధ్వని వంటి గొప్పధ్వని గలిగించు నల్లెత్రాటికి పదునైన బాణములను నూర్లునూర్లుగాఁ గూర్చి దేవసేన గర్వమునంతయుఁ హరించి యింద్రుని నెదిరించిన నింద్రుఁడును.

క. పది దిక్కుల గుణరావము, గుదిగొన ననలాభ బాణ•కోటులు పఱపన్
మదమున దశముఖుఁడు శిత, ప్రదరంబుల నేసెఁ బుష్క•రము భువి నిండన్.

అర్థములు. గుణరావము=అల్లెత్రాటిధ్వని, గుదిగొనన్=కుదించినట్లు దట్టముగా, అనలాభ=అగ్నితో, సమానమైన, పఱపన్ = ప్రయోగింపఁగా, శిత ప్రదరంబులన్=పదునుగల బాణములను, పుష్కరము=ఆకాశము, భువి=భూమి.

తాత్పర్యము

అల్లెత్రాటి మ్రోఁత పది దిక్కులందు వ్యాపింపఁగా నగ్నివంటి బాణములను బ్రయోగింపఁగా రావణుఁడు గర్వించి భూమి యాకాశము నిండునట్లు వాఁడి బాణములు ప్రయోగించెను.

౨౯వ సర్గము

—• రావణుఁడు సురసేనామధ్యమునఁ జొచ్చి యుద్ధము సేయుట •—

చ. ఇరు లలమెం దలంబుగ మ•హిష్ఠశరోన్నతి, నట్టి చీఁకటిన్
సురలును రాక్షసుల్ పరని•షూదనదక్షతఁ గ్రాల మత్తులై
పరమబలాఢ్యులై పదవ•భాగము దక్కఁగఁ దక్కు రాక్షసో
త్కరముల నాకమందిరులు • కాలుని ప్రోలికిఁ బంచి రుద్ధతిన్. ౮౫

అర్థములు. ఇరులు=చీఁకట్లు, అలమెన్=ఆక్రమించెను, దలంబుగన్=దట్టముగ, మహిష్ఠ=గొప్పదగు, శరోన్నతి=బాణాతిశయముచే, పరనిషూదన దక్షతన్=శత్రువులను జంపు సామర్థ్యముచే, రాక్షసోత్కరములన్=రాక్షస సమూహములను, నాకమందిరులు=దేవతలు.

తాత్పర్యము

గొప్ప బాణము లతిశయముగ వ్యాపించుటచే దట్టముగఁ జీఁకట్లాక్రమించెను. అట్టి చీఁకటియందు దేవతలు రాక్షసులు మదించి తమ శత్రువులఁజంపఁ జాలిరి. అందు దేవతలు రాక్షసుల సేనలయందుఁ బదియవ భాగము తప్పఁ దక్కిన తొమ్మిది భాగముల సేన నాశము చేసిరి.

సీ. స్వీయ సైన్యంబుల • క్షీణస్థితిని గాంచి, యాశరేశ్వరుఁడు రో•షారుణితము
లైన లోచనముల • స్యందనచోదకుఁ, గని యిట్టు లను దివౌ•కసుల నెల్ల
శత్రునితోడుత • సంహరించెద నేఁడు, శస్త్రసంతానంబుఁ•జనగ నిమ్ము
మన నేరు, వరుణుని•ధనదుని వాసవుఁ, జేరు యూపెదఁజూడు•పేర్మి నెలయ

తే. విడువుము విషాద మిరువురా లింక•నడిమినాఁడ, నాల మేటికి నందన•ప్రాంతసీమ
నున్నవారము పూర్వాద్రి•యొద్దకిపుడు, పఱుపుమీ తేరు సారథీ! భయమువలదు.

అర్థములు. ఆశరేశ్వరుఁడు=రాక్షసరాజు, రోషారుణితములు = కోపముచే నెఱ్ఱనైనవి, లోచనములన్=కన్నులచే, స్యందన చోదకున్=సారథిని, దివౌకసుల నెల్లన్=దేవతల నందఱు, శత్రుసేనాంతంబు=విరోధుల సేనలోనికి, విషాదము=దుఃఖము, ఆలము=ఆలస్యము, పూర్వాద్రి యొద్దకు=తూర్పుకొండ సమీపమునకు

తాత్పర్యము

తనసేన లిట్లు క్షీణించుట చూచి రావణుఁడు కోపముచేఁ గన్నుఁ లెఱ్ఱచేసి సారథిని జూచి యిట్లనియె. సారథీ! యింద్రునితోఁ డ దేవతల నందఱిఁ జంపెదను. వరుణుని ధనదుని యింద్రుని పేరులేకుండఁ జేసెదను. మన తేరు శత్రుసేనలోనికిఁ బోనిమ్ము శత్రువుల మధ్యమునకుఁ బోవుట యపాయకరమని విషాద పడవలదు. ఒకటికి రెండుమార్లు చెప్పుచున్నాను. ఏల యాలస్యము చేసెదవు? ఇప్పుడు మనము నందనవన సమీపమున నున్నవారము. తూర్పు కొండయొద్దకుఁ బోనిమ్ము భయపడవలదు.

చ. అనుడు మనోజవంబుల హ•యంబుల సారథి దోలె శత్రువా
హిని నడుమంతరంబున సు•రేశ్వరుఁడున్ దశకంఠునిశ్చయం
బును దలపోసి దేవతల•పూగముఁ గాంచి వినుండు నిర్జరుల్!
వననిధిఁ బర్వవేళఁ జొఱ•బాఱెడు నట్టులు పంక్తికంఠుఁడున్. ౬౪౪

అర్థములు. మనోజవంబులన్=మనోవేగమువంటి వేగము గలవానిని, శత్రువాహిని=విరోధిసేనకు, పూగము=సమూహము, నిర్జరుల్ = దేవతలారా, పర్వవేళన్=పున్నమనాఁడు వననిధిన్=సముద్రమును.

తాత్పర్యము

అని చెప్పఁగా మనోవేగము గల యా గుఱ్ఱములను సారథి శత్రుసేనల మధ్య భాగమునకుఁ దోలెను. ఇంద్రుఁడు రావణు నుద్దేశించి దేవతలతో, దేవతలారా! పున్నమనాఁడు పొంగుచున్న సముద్రమును జొచ్చినట్లు రావణుఁడు.

—• ఇంద్రుడుఁ రావణుని బంధింపఁ బ్రయత్నించుట •—

చ. సురపృతనాంతరంబునను • జొచ్చెడి నిర్భయుఁడౌచు వీనినిన్
బోరిగొనరాదు బ్రహ్మవర•ముం దలపోసి యకాట బల్మి సం
గరమున బద్ధుఁ జేయఁ దగు • గం పడఁగం బలి బద్ధుఁ జేసి పా
ఖ్యరమజగత్త్రియుఁబు నెతఁ • గానక యుండఁగ బ్రోవఁగాఁ దగున్. ౬౪౫

అర్థములు. సురపృతనాంతరంబునను=దేవతలసేన నడుమ.

తాత్పర్యము

దేవసేన నడుమ భయములేక ప్రవేశించుచున్నాఁడు. బ్రహ్మవరమునుబట్టి వీనిని జంపరాదు. కావున వీని గర్వ మడఁగునట్లు యుద్ధమున బలవంతముగఁ బైపడి పట్టి కట్టివేసి మూఁడులోకములకు సౌఖ్యము కలిగింపఁవచ్చును.

చ. అని దశకంఠునిన్ విడిచి ♦ యన్యతలంబున కేగి పాకశా
సనుఁ డసురౌఘముం దునుమఁ ♦ జాఁగె తశాననుఁ డుత్తరంపుది
క్కున సురసేనఁ జొచ్చుడును ♦ గొబ్బున వజ్రియు దక్షిణంపువై
పున బలఁగంబుఁ జొచ్చె, మద♦పూర్ణమనస్కుఁడు రాక్షసేంద్రుఁడున్. ౨౮౬

తాత్పర్యము

ఈ ప్రకారము దేవతలకుఁజెప్పి రావణుతో యుద్ధము చాలించి మఱియొక చోటికిఁ బోయి యింద్రుఁడు రాక్షససేనఁ జంపుచుండెను. రావణుఁడు దేవసేన యందు తరపు వైపునఁ దూఱెను. ఇంద్రుఁడు దక్షిణపు వైపుఁగాఁ బ్రవేశించెను. గర్వముచే నిండిన మనస్సుగల రావణుఁడు.

క. యోజనశతంబు శాత్రవ, రాజిని దాఁ జక్కఁ జని శ♦రంబుల సురలన్
వాజులఁ దేరుల వీరులఁ, దేజ చెడన్ నఱికె వై చె♦న్మతి బాసటగన్. ౨౮౭

తాత్పర్యము

ధైర్య మొక్కఁడే సహాయముగ శత్రుసేనలోనికి నూఱామడదూరము పోయి, దేవతలను వారి గుఱ్ఱములను తేరులను వీరులను వారి తేజము మాయునట్లు బాణంబులచే నఱికెను.

క. రావణుబీరముఁ గాంచి శచీవిభుఁ డవ్వానిఁ బట్టఁ ♦ జింతించి దివౌ
కోవారము తోడ్పడ రక్షోవిభునిం దాఁకె నతఁడు♦సుడివడ భ్రమచేన్. ౨౮౮

అర్థములు. దివౌకోవారము=దేవతల సమూహము.

తాత్పర్యము

(ఇంద్రుఁడు రావణుని పరాక్రమము చూచి, వానిని బట్టుకొనవలెనని యాలోచించి, దేవతాసమూహము సాయపడఁగా, రావణుఁడు భ్రమచే సుడి బడునట్లు రావణుని నెదిరించెను.)

క. అయ్యెడ నిటు దశవదనుఁడు, కయ్యంబున గ్రస్తుఁడైన♦గతి నుండుకు హా!
యయ్యయ్యో! చచ్చితి మేమయ్యో!యని యఱవఁ బొడఁగి♦రసురులు గుములై.

అర్థములు. గ్రస్తుఁడు=పట్టుకొనినవాఁడు, మ్రింగఁబడినవాఁడు.

### తాత్పర్యము

రావణుఁడు తన సేననడుమఁ బ్రవేశించి నలుప్రక్కల సేన ధ్వంసముసేయ నాలోచించి దూఱుటకు యత్నింపఁగా నదియు మేలేయని యాలోచించి యింద్రుఁడు వాని కడ్డుపడక దూరముగఁ దొలఁగెను. రావణుఁ డడ్డములేక దేవ సేన నడుమఁ బ్రవేశించెను. ఇట్లు వాఁడు ప్రవేశించిన పిమ్మట నింద్రుఁడు మఱి యొక ప్రక్కన వచ్చి తాఁకెను. చుట్టు దేవతలసేన నడుమ రావణుఁడు చిక్కు కొనెను. సహాయుఁ డొక్కఁడైన లేఁడయ్యెను. ఆ కారణముచే వానిని శత్రు సేనలు మ్రింగినట్లయ్యెను. అప్పుడు రాక్షసు లందఱు తమ రాజు గానరాకుండు టచే నయ్యో అయ్యో అయ్యయ్యో యని గుంపులుగట్టి యఱవసాగిరి.

### —* మేఘనాదుఁడు మాయచే నింద్రుని బంధించుట *—

చ. అది విని మేఘనాదుఁడు శ • తాంగము నెక్కి రుషోగ్రమూర్తియై
ప్రిదులనివీఁకఁ దూర్ణగతి • వేల్పులమూఁకలలోనఁ జొచ్చి యీ
శ దయను లబ్ధమైన భృశ • శాంబరిఁ గైకొని దేవతాళులన్
వదలి మహేంద్రు నొక్కరు స • వక్రపరాక్రము ముల్లసిల్లఁగన్. ౬౫౦

అర్థములు. శతాంగము = రథము. రుషా+ఉగ్రమూర్తియై = కోపముచే భయంకరాకారుఁడై, ప్రిదులని వీఁకన్=సడలు పాఱని పరాక్రమముచే, తూర్ణ గతిన్=వేగముగ, ఈశదయను=మహేశ్వర యాగమున నీశ్వరుఁడు మెచ్చుటచే, భృశశాంబరి=గొప్పమాయను.

### తాత్పర్యము

ఈ యఱుపులు విని మేఘనాదుఁడు రథమెక్కి కోపముచే భయంకర మూర్తియై పరాక్రమించి వేగముగ దేవతలసేనలోఁ బ్రవేశించి యీశ్వర కటా క్షముచే లభించిన గొప్ప మాయ నాశ్రయించి దేవతల నందఱ వదలి యొక్క యింద్రునిపై పడి మిగులఁ బరాక్రమవంతుఁడై.

ఉ. నొంపఁ గడంగ రావణత • నూజునిఁ గాన వృత్రవైరి యో
జింప విముక్తవర్ముఁ డయి • చేపడి వధ్యుఁడు నయ్యె మాయ ర
క్షింపఁగ మేఘనాదుఁ, బర • సేనల నెవ్వఁడు నేమి సేయఁగాఁ
దెంపరిగాఁడు, రావణియుఁ • దీవ్రశరంబుల నొంచె మాతలిన్. ౬౫౧

అర్థములు. నొంప=నొప్పించుటకు, కడంగన్=ప్రారంభింపఁగా, విముక్త వర్ముఁడు=కవచము విడిచియుండువాఁడు, తన్ను రావణుఁడు యుద్ధము చేయ వలదు, గాని తీర్చుకొను మనుటచే యుద్ధప్రయత్నము చాలించి దూరముండు కవచాదుల వదలి తేరు దిగి యొకచో విశ్రమించి యుండినవాఁడు రాక్షసులకేకలు

వివఁగానే యున్నవాఁ డున్నట్లు లేచివచ్చెను. కావుననే రథ మెక్కనని ముందు పద్యమునఁ జెప్పఁబడెను. ఇందుఁ గవచము లేనివాఁడని చెప్పబడెను. చేపడి= లభించి, వధ్యుఁడు=చంపఁ బడఁదగినవాఁడు, కవచము లేని కారణముచే సుల భముగాఁ జంప సాధ్యపడువాఁడు, అయినను వాని తామసీశక్తి వానిని గాన రాకుండ జేసి రక్షించెను.

తా త్ప ర్య ము

నొప్పించుటకుఁ బ్రారంభింపఁగా నింద్రుఁడు తనకు దెబ్బలు తగులుచు కాని కొట్టుచున్న మేఘనాదుని గానలేక యోజింపసాగెను. అప్పుడు వాఁడు కవచము లేనివాఁడై సమీపమందే తన సేనవద్దనే యుండుటచే సులభముగ వానినిజంపి యుండవచ్చును గాని వాఁడు చీకటిలో నుండుటచే గానరాకుండెను. కావునవాని నెవ్వఁ డేమియుఁ జేయ సాహసించినవాఁడు కాఁడు. మేఘనాదుఁడును మాతలిని గూడ బాణములచే నొప్పించెను.

చ. తికమక లాడ డీలుపడఁ ♦ దేహమఁ గూరంగ శాతమార్గణ
ప్రకరము లన్నివంకల ఝు♦రంబు లనం దను నాట శక్రుఁడున్
వికలుఁడు గాక మాతలిని ♦ వీడి రథంబును బాసి వెల్లయే
నికపయి నెక్కి వైరిసుతు♦నిన్ వెదకెన్ దివి నాల్గువంకలన్. ౬౯౨

తా త్ప ర్య ము

• అవయవములు సడలు పాటి దిగ్భ్రమ గొన భయము పడునట్లు పదునగు బాణములు వాఁ డాకాశమునఁ దిరుగుచుఁ గొట్టుచుండుటచే నన్ని ప్రక్కల నుండి తన్ను నాటఁగా నింద్రుఁడు మనస్సు చెదరనీక మాతలిని వదలి రథమున నుండిన నన్ని ప్రక్కల చూడ సాధ్యపడకుండుటచే రథము దిగి యైరావతము నెక్కి విరోధి కుమారుని నాకాశమున నాలుగు ప్రక్కల వెదకెను.

శా. మాయారక్షితుఁ డౌట రావణియు జం♦భద్వేషికిం దోఁప కే
చాయం దానుగ నుండి శాతశరపుం♦జంబుల్ మహావేగముల్
కాయం బంతయుఁ గ్రుచ్చి గాసిగొనఁగాఁ ♦ గావించి శ్రాంతాత్ముఁడౌ
నా యాదిత్యవిభున్ మహేషువుల మా♦యాబద్ధుఁ గావించుచున్. ౬౯౩

అర్థములు. జంభద్వేషికిన్=ఇంద్రునికి, శాతశరపుంజంబుల్=వాడిబాణ ముల సమూహములు, శ్రాంతాత్ముఁడౌ=బడలిన దేహము గలవాఁడగు, ఆదిత్య విభున్=దేవతల రాజును, మాయాబద్ధున్=తనశక్తిచే బంధింపఁబడినవానిని.

తా త్ప ర్య ము

తన యద్భుతశక్తిచేఁ గాపాడఁబడినవాఁడై మేఘనాదుఁ డింద్రునకుఁ గాన రాక యేప్రక్కను దానైనై మిగుల వేగముగల వాఁడి బాణములచే నతని దేహం బంతయు గ్రుచ్చి గాసిపడఁ జేసి బడలిన యతని తన శక్తిచేఁ గట్టివైచి.

క. కొనిపోవ నిర్జరాళులు, గని యే మిది యెవ్వఁ డొకో ♦ కనరాక సురేం
ద్రుని మాయావిద్యావిదుఁ, దనమాయం గట్టె బలిమి ♦ దారుణకీర్తిన్. ౬౫౮

తా త్ప ర్య ము

ఈడ్చుకొని పోవుచుండఁగా దేవతలు చూచి యేమిది యెవ్వఁడువీఁడు కంటికి గనఁబడక యింద్రుని కట్టివేసి తీసికొని పోవుచున్నాఁడు, ఎవఁడు రాక్షస మాయలను జెఱుచు సదుపాయములు దెలిసిన యింద్రునిఁ దన మాయచేఁ గట్టివైచెను?

మ. అని రోషంబున రావణాసురుని వ♦స్వాదిత్యులత్యుగ్రులై
ఘననారాచపరంపరానిహతులన్ ♦ గాసిల్లఁగాఁ జేసినన్
దనుజేంద్రుండు ప్రతిక్రియాకలనకున్ ♦ దార్ఢ్యంబు లేకా ద్విష
జ్జనతాతాడన మోర్చి డీల్పడెఁ, దనూ♦జాతుండు దా నంతలోన్. ౬౫౯

అర్థములు. వస్వాదిత్యులు=వసువులు ఆదిత్యులు, ఘననారాచపరంపరానిహతులన్=గొప్ప బాణముల వరుసల దెబ్బలచే, ప్రతిక్రియాకలనకున్=మాఱుచేయుటకు, దార్ఢ్యంబు=శక్తి, ద్విషత్+జనతా+తాడనము=విరోధిజన సమూహముల దెబ్బలను, ఓర్చి=సహించి, తనూజాతుండు=వానికొడుకు.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చెప్పి రోషమున రావణాసురుని వసువులు ఆదిత్యులు మిగుల భయంకరమూర్తులై పెద్దబాణముల వరుసల దెబ్బలచే రావణుఁడు బడలునట్లు చేయఁగా రావణుఁడు దానికి బదు లేమియుఁ జేయఁజాలక యా విరోధులు కొట్టు దెబ్బల సహించి డిల్లపోయెను, ఇంతలో నతని కొడుకు మేఘనాదుఁడు.

**—• రావణుఁడు యుద్ధముఁ జాలించి మేఘనాదునిఁ బ్రశంసించుట •—**

సీ. గాటంపు వేటులఁ ♦ బోటులఁ దూఁటులో, మేనితో గాసిల్లి ♦ మిడుకువాని
జనకునిఁ గనుఁగొని♦చాలింపు నాయనా!, సంగర మిం కేల♦జయము మనది
సత్య మెఱుంగుము ♦ స్వస్థచిత్తుండ వై, మరలింపు సేనల ♦ సురవిభుండు
మూఁడులోకములకు♦ఱేఁడై నవాఁ డిప్డు, బద్ధుఁ డయ్యెను సుర♦పటలి పఱచె
ఆ. బలిమి వరిని గెలిచి ♦ యొలయఁ ముల్లోకంబు, లీవయేలు మేల ♦వృథగ క్రమము
రణము నిష్ఫలంబు♦రమ్ము బృందారకుల్, కదనమున నివృత్త♦కర్ములైరి. ౬౬౦

అర్థములు. గాటంపు-గాటమైన, వేటులన్=దెబ్బలచేతను, పోటులన్=ఆయుధముల పోడుపులచేతను, తూటులో=రంధ్రములు పడిన, మేనితో=దేహముతో, సురపటలి=దేవతాసమూహము, పఱచెన్=పరువెత్తెను, బృందారకుల్=దేవతలు, నివృత్తకర్ములు=యుద్ధకార్యములు చాలించినవారు.

తాత్పర్యము

గాఢమైన దెబ్బలచేతను, బోటులచేతను, జల్లులుపడిన దేహముతో బడలి దుఃఖపడువానిని నంద్రజిని జూచి నాయనా! యుద్ధము చాలింపుము. ఇంక యుద్ధమేల? జయము మనది. ఇది సత్యము. మనసు కుదుటఁబడఁజేసికొని సేవల మరలింపుము. మూఁడులోకములకు రాజైన యింద్రుఁడు నాచే బద్ధుడై మనకు వశపడి యున్నాఁడు. దేవత లందఱు పరువెత్తిరి. శత్రువులను నీ బలముచే గెలిచినవాఁడవై మూఁడు లోకములు నీవే పాలింపుము ఇఁక యుద్ధమువలనఁ బ్రయోజనము లేదు. రమ్ము. దేవతలు యుద్ధము చాలించిరి.

క. నావుఁడు గుదుల, బడన్ మది రావణుఁడు నిశాంతహర్ష♦రసవివశుండై
పోవిడిచి యుద్ధకర్మం, బా పీసునిఁ జూచి యనియె ♦ నన్నా! తనయా! ౬౫౭

తాత్పర్యము

(అని చెప్పఁగా, మనసు కుదుటఁ బడఁగా రావణుఁడు సంతోషాతిశయముచే, బరవశుఁడయి, యుద్ధము మాని, పీసుఁడైన యా మేఘనాదునిఁ జూచి, అన్నా! తనయా!)

ఉ. ఏమి భవద్బలంబు త్రిది♦వేశ్వరు బద్ధు నొనర్చి దేవతా
స్తోమముఁ బాఱఁదోలితివి ♦ తోరపుఁగీర్తి గడించి తీవు పు
త్రా! మనయన్వయంబు ప్రథి♦తం బొనరించితి కాన నీవు, సు
త్రాముఁడు త్వద్రథస్థుఁడుగఁ ♦ దర్లుము లంకకు నెల్ల సేనతోన్. ౬౫౮

అర్థములు. భవత్ + బలంబు=నీబలము, త్రిదివేశ్వరున్ = మూఁడులోకములకుఁ బ్రభువగువానిని, బద్ధునొనర్చితివి=కట్టివేసితివి, గడించితివి=సంపాదించితివి, అన్వయము=వంశము, ప్రథితంబు=కీర్తి గలది, సుత్రాముఁడు=ఇంద్రుఁడు, త్వత్ + రథస్థుఁడుగన్=నీరథమం దున్నవానిగా, తర్లుము=ప్రయాణము కమ్ము.

తాత్పర్యము

కుమారా! ఏమి నీ బలము! ఆశ్చర్యమైనది. ముల్లోకములకుఁ బ్రభువగు నింద్రునిఁ గట్టివైచితివి, దేవతల నందఱఁ దఱుముగొట్టితివి. విస్తారకీర్తి సంపాదించితివి. నాయనా! మన వంశము ప్రసిద్ధికెక్కఁ జేసితివి. కావున నీవు నీ రథమందే యింద్రుని నుంచుకొని సేనకు ముందుగా లంకకుఁ బయనము కమ్ము.

క. నీ వెనుక నేను వచ్చెద, సేవింపఁగ నాదుమంత్రి♦శేఖరు లెల్లన్
నీ వే కద జిష్ణుండవు, నీ విజయముఁ బొగడఁబడెడి ♦ నెఱి నం చనినన్. ౬౫౯

అర్థములు. జిష్ణుండవు=జయించిన వాఁడవు

తాత్పర్యము

నీ వెనక నేను నామంత్రులతోడ వచ్చెదను జయించినవాఁడవు నీవే. కావున నీవు ముందుగాఁబోదువేని లోకమున నీగెలుపును జనులు పొగడుదురని చెప్పఁగా

తే. మేఘనాదుండు బంధించి • మేఘవాహుఁ, దనరథంబునఁగొని నిజ•ధ్వజినిఁ గొల్వ
స్వీయభవనంబునకు నేగి • వీరవరుల, నెల్లఁ దమతమయిండ్లకు• నేగఁబనిచె.

అర్థములు. మేఘవాహున్=ఇంద్రుని, నిజధ్వజిని=తనసేన, స్వీయ భవనంబునకున్=తనయింటికి.

తాత్పర్యము

ఇంద్రుని దన తేరికిఁ గట్టివేసి మేఘనాదుఁడు తనసేన తన్ను సేవించుచుండఁగాఁ దన యింటికిఁ బోయి వీరుల నందఱ వారివారి యిండ్లకుఁ బంపెను.

౩౦వ సర్గము

**—• బ్రహ్మ లంకకుఁ బోయి రావణ మేఘనాదులఁ బ్రశంసించుట •—**

క. రావణతనయుం డిటు లై, రావణవాహనునిఁ దనపు•రంబునకుం బెం
పావహిలం గొని యేగిన, దేవత లజుఁ దోడుకొనుచు • దీనత దోఁపన్ ౬౬౧

అర్థములు. ఐరావణ వాహనుని=ఐరావతము వాహనముగాఁ గల యింద్రుని, పెంపు=గొప్పతనము, దీనత తోఁపన్=ముఖవంటలు వెలవెలఁబోగా.

తాత్పర్యము

(రావణుని కొడుకు మేఘనాదుఁ డింద్రునిఁ దీసికొని పోఁగా, దేవతలుముఖములు వెలవెలఁ బోవ, బ్రహ్మను దోడుకొని.)

ఉ. లంకకుఁ బోవ మింటన ని•లంబడి పద్మభవుండు దేవతా
సంకటహేతు భ్రాతృతను•జాతసమావృతుఁ బంక్తికంఠు ని
శ్శంకమదోద్ధతుం బలుకు • సాహసశీలక! వత్స! రావణా!
యంకమునన్ భవత్సుతుప•రాక్రమ మెంతయు మెచ్చ నార్చెడిన్. ౬౬౨

అర్థములు. మింటన=ఆకాశమందే, దేవతాసంకటహేతు=దేవతలబాధకుఁ గారణమైన, భ్రాతృ=తమ్మునితోను, తనుజాత=కొడుకులతోను, సమావృతున్=చుట్టుకొనఁబడిన వానిని, నిశ్శంకమదోద్ధతున్=భయములేని మదాతిశయము గల వానిని, అంకమునన్=యుద్ధమందు.

తాత్పర్యము

దేవతలు దుఃఖించుచు నిట్లు బ్రహ్మను బిలుచుకొని లంకకుఁ బోఁగానాయన యాకాశమందే యుండి దేవతలకు బాధాకరులగు తమ్మునితోను,కుమారులతోను గూడిన రావణుని భయములేని గర్వగరిష్ఠుని జూచి నాయనా! రావణా! మహాసాహసికా! యుద్ధమందు నీ కొడుకు చేసిన యద్భుత పరాక్రమమును మెచ్చుకొంటిని.

క. నీకొడుకు నీకుఁ దుల్యుఁడొ, నీకును నధికుండొ ప్రతిన•నీసుతుబలిమిన్
ప్రాకటముగ నెఱవేర్చితి, లోకంబులు మూఁడు నీకు • లోఁకువ యయ్యెన్.

తాత్పర్యము

నీ కొడుకు నీకు సమానుఁడో నీకంటె నధికుఁడో యగును, గాని నీకంటెఁ దక్కువవాఁడు కాఁడు. అతని బలమువలన దిక్పాలుర నందఱ జయించెద నన్న ప్రతిన నెఱవేర్పఁ గలిగితివి. మూఁడు లోకములు నీకు లోఁబడెను.

క. అతిబలుఁడు నీవు డగు నీ,సుతుఁ డింద్రజి యనెడికీర్తి • శూరవరా! శా
శ్వతముగఁ గాంచెడు నమర,క్షితి దుర్దముఁడగును విను శ•చీవిభు నింకన్. ౬౬౮

తాత్పర్యము

అధికబలము గలవాఁడును వీరుఁడు నగు నీ కొడు కిఁకమీఁద లోకముల నింద్రజిత్తను పేరు శాశ్వతముగఁ గాంచును. నీకోరిక నెఱవేఱినది. కావున నిఁక నింద్రుని వదలిపెట్టుము.

చ. ప్రతిఫల మెద్దికోరెదవు • వాసవమోక్షముపొంటె నావుడున్
శతధృతిఁ జూచి పంక్తిముఖ•నందనుఁ డిట్లను నో పితామహా!
శతముఖు వీడెదన్ దయ నొ•సంగవె నా కమరత్వ మన్న వా
క్పతి భువిఁ బ్రాణికోటులను • గల్గునొకో సకలామరత్వమున్. ౬౬౯

అర్థములు. ప్రతిఫలము=బదులు లాభము, వాసవమోక్షము పొంటెన్=ఇంద్రునివిడుచుకొఱకు, శతధృతిన్=బ్రహ్మను, అమరత్వము=చావులేమి. వాక్పతి=బ్రహ్మ, సకలామరత్వమున్=ఎవ్వరిచేత నేకాలమందు జావుఁ లేకుండుట.

తాత్పర్యము

ఇంద్రుని విడుచుటకుఁగాను బదులు ఫలమేమి కోరెదవు అనఁగా బ్రహ్మను జూచి యింద్రజిత్తిట్లనియె. ఓ పితామహా! యింద్రుని వదలెదను. నాకుఁ జావు లేకుండ వర మిమ్ము అని యడుఁగగా బ్రహ్మయిట్లనియె. ప్రాణములు గల్గువానిలో నెవ్వరిచే నెప్పటికిని జావు లేకుండుట లోకమునఁ గలదా?

క. పులుఁగులలో నాలుగుపద,ములజంతులలోన నిఖిల•భూతంబులలోఁ
గలకాల మెట్టిదానికి, నలవడునే బ్రదుక మిత్తి•నందక యెపుడేన్.

అర్థములు. పులుఁగులలో=పక్షులలో, మిత్తి=మృత్యువు, మరణము.

తాత్పర్యము

(పక్షులలో,నాలుగుకాళ్ళ జంతువులలో నననేల ప్రాణులన్నిఁటిలో శాశ్వతముగా మరణము లేకుండ బ్రదికి యుండుటకు సాధ్యపడునా?

**బ్రహ్మ మేఘనాదుఁడు కోరిన వర మిచ్చి యింద్రుని విడిపించుకొని పోవుట**

చ. అనవుడు నింద్రజిత్తనియె • నట్టిదయేని రణంబువేళ నేఁ
దునుమఁగ శత్రులన్ నియతి•తో యజియించెద వీతిహోత్రు, దా
నన జనియించు నశ్వయుత • నవ్యశతాంగము నెక్కి సంగరం
బొనరుచుచో నమర్త్యతను • నొందఁగ నిమ్మసమాప్తి యద్దినై. ౬౭

తాత్పర్యము

అని చెప్పఁగా నింద్రజిత్తిట్లనియె వ్యవస్థిలేని యమర్త్యత్వము లేదేని యుద్ధ సమయమందు నేను శత్రువులఁ జంపుటకై యగ్నిని బూజించెదను. అందు జనించిన గుఱ్ఱములతోఁడి రథమునెక్కి యుద్ధము చేయునపుడు చావులేకుండ నాకు వర మిమ్ము. అది పూర్తికాక నడుమ విఘ్నమైన.

క. దురమున కేఁ గడఁగినచో, మరణంబున కీయకొంటి • మఘవుని విడుతున్
సరసిజసంభవ! నీ వీ వరమున్ దయచేసితేని • వాత్సల్యమునన్. ౬౮

తాత్పర్యము

యుద్ధమునకుఁ బూనితినా మరణించుట కంగీకరించితిని నా యందు దయ యుంచి నాకీ వరమిచ్చెదవేని యింద్రుని వదలిపెట్టెదను.

క. అందరుఁ దపమున నిన్నా, నందింపఁగఁ జేసి కడు న•ణంకువ దీనిన్
బొందెద రే భుజబలమున, నందెద దేవా! యమర్త్య•తాతిమహిమమున్. ౬౯

తాత్పర్యము

లోకములో నందఱు నిన్నుఁ దపముచేఁ దృప్తునిచేసి వరములు సంపాదింతురు నేను భుజబలమున చావు లేకుండునట్లు వరము నీ వలనఁ బొందెదను.

క. అన నట్లకాక యన వజ్రిని విడిచెన్ దాశకంఠి • త్రిదివేశులు నా
తనిఁదోడ్కొని నాకమునకుఁ, జనునెడ దుఃఖమునఁ జింత•సంకటపడుచున్. ౭౦

అర్థములు. దాశకంఠి=ఇంద్రజిత్తు, దశకంఠుని కుమారుడు.

తాత్పర్యము

(అని చెప్పఁగా నింద్రజిత్తు యట్లే చేసెదనని యింద్రుని విడిచెను. దేవతలాతనిఁ దోడుకొని స్వర్గమునకుఁ బోవునప్పుడు దుఃఖమున విచారముచేఁ గష్టపడుచు.)

క. దీనుండై యమరద్యుతి, హీనుండై నేలఁ జూచు • చెంతో వగచే
మ్లానుం డగు పాకారికి, జ్ఞానం బుదయింప నబ్జ•సంభవుఁ డనియెన్. ౭౧

అర్థములు. దీనుండై=గర్వ ముడిగినవాఁడై, అమరద్యుతి హీనుండై=దేవతల కాంతి బోయినవాఁడై, వగచే=వ్యసనముతో, మ్లానుండు=వాడినవాఁడు

తాత్పర్యము

గర్వ ముడిగి దేవతాకాంతి తొలఁగి వాడి, యవమానముచే క్రిందఁజూచుచు మిగుల వ్యసనపడుచున్న యింద్రునకు జ్ఞానము కలుగునట్లు బ్రహ్మ యిట్లనెను.

—♦ బ్రహ్మ యింద్రునితో నతఁడు బద్ధుఁ డగుటకుఁ గారణముఁ జెప్పుట ♦—

క. నవ్వుచుఁ జేసినపాపం, బెవ్వరుఁ గుడువంగ వలదె ♦ యేడ్చుచుఁ బిదపన్?
గ్రొవ్వున నీచేసినయఘ, మివ్విధిఁ దలకొనియె నేల ♦ యేడ్చెద విట్టుల్? ౨౨

తాత్పర్యము.

ఎట్టివాఁడైనను నవ్వుచుఁ జేసిన పాపము నేడ్చుచు ననుభవింపవలయును అది తప్పదు. కండగర్వముచే నీవు చేసిన పాపముయొక్క ఫల మివ్విధముగఁ దటస్థించెను. ఇప్పు డిట్లేల యేడ్చెదవు?

సీ. ఇంద్ర! నాబుద్ధిచే ♦ సృజియించితిని బ్రజ నేకవర్ణంబుగ ♦ నేకరూప
ముగ నేకభాషగ ♦ మొదల వారలలోన, దృష్టికి భేదమే ♦ దొరుకపడదు
పదపడి వేఱొక♦పద్ధతి దానికి, మిన్నగఁ గన్పింప ♦ నన్ని నేను
బ్రజల విశిష్ట మా♦ప్రత్యంగమును దీసి, రూపగుణంబుల ♦రూఢిఁ గన్న
తే. మెలఁత నొక్కయహల్య ని♦ర్మించినాఁడ
హల మనంగ వైరూప్యంబు ♦ హల్య మనఁగఁ
దద్భవం బట్టిహల్య మా ♦ తరుణి కెందు
లేమిని నహల్య యనఁగ నే ♦ నామ మిడితి. ౨౩

తాత్పర్యము

ఇంద్రా! తొలుత నేను బుద్ధిచే నాలోచించి యందఱి నేకవిధముగ నుండఁ జేసిన బాగని తలఁచి యందఱును నొక విధమేరైన వన్నెయు నేకవిధమైన రూపము నేకవిధమైన భాషయుఁ గలవారినిగఁ జేసితిని. అప్పు డొకరికి మఱి యొకరికి కాంతి స్వర సౌందర్య నయనాద్యవయవ సౌష్ఠవంబుల భేదము కనఁబడలేదు. తరువాత దానికంటె శ్రేష్ఠమైన పద్ధతి నాలోచించి ప్రజలయందలి శ్రేష్ఠమైన ప్రత్యవయవమును దీసి రూపముచేత గుణముచేతఁ దక్కిన వారికంటె గొప్పదని ప్రసిద్ధిగన్న యొక్క స్త్రీని గల్పించితిని దానికి నహల్య యనిపేరు హలమనఁగా వికారరూపము, అట్టిదానినుండి కలిగినది హల్యము. అట్టి నింద్యమైనది లేనిది యహల్యము, ఆ స్త్రీ యట్టిది కావున నహల్య యనిపేరు పెట్టితిని.

చ. ఇటు సృజియించి యెవ్వనికి • నీకుటిలాలక నిత్తు నంచు సం
కటపడుచుండఁ జిత్తమునఁ • గామినిఁ గోరితి వింద్ర! నీవు న
త్కటపదగౌరవంబున జ•గత్ప్రభుతం దగు నాకుఁ గాక యీ
స్ఫుటజలజాక్షి నిస్తులిత•సుందరి యెవ్వని కర్హ మయం చెదన్. ౨౪

తా త్ప ర్య ము

ఈ ప్రకారము సృజించి యీ సుందరి నెవరికి భార్యగా నిత్తునా, దీనికిఁ దగిన వాఁ డెవఁడు లేఁడే యని నేను బరితాపపడుచుండ నింద్రా! నీవు గొప్ప పదవి వలని గౌరవంబునను ప్రపంచమునకుఁ బ్రభువ నను తలంపు చేతను, నేనే దీనికిఁ దగిన భర్తను, ఇటువంటి వికసించిన కమలములవంటి కన్నులు గల సుందరికిఁ దగిన వాఁడను నేనుగాక మఱియెవ్వఁడు గలఁడని తలఁచి నాకిమ్మని నీ వడిగితివి. నేనిచ్చిన వాఁడఁ గాను.

ఉ. ఇల్లడగాఁగ గౌతముని•యింటను యుంచితిఁ బెక్కు లేఁడు లు
త్ఫుల్లసరోజలోచనను • దోసపుఁగర్జ్యము పొంతఁ బోక తాఁ
గల్లరి గాక తత్సతిని • గ్రమ్మఱఁ బంచె నతండు, దాని కే
నల్లములోనఁ దన్నియతి • కూర్జితమైన తపంబుసిద్ధికిన్. ౨౫

తా త్ప ర్య ము

నేనా స్త్రీని సదున సొమ్మువలె నిల్లడగా గౌతమునొద్ద పెక్కు సంవత్సరము లుంచితిని. ఆమె విషయమై యతఁడు దోష మేమియు నెంచినవాఁడుకాఁడు, ఇల్లడసొమ్ము నే నెట్లనుభవింతును; అనుభవింపరాదని దోషకార్యమును దలఁపక మోహము లేక యుంచుకొని మరల యథాపూర్వకముగ నా యొద్దకుఁ బంపెను. ఆయన మనో నిగ్రహమునకుఁ దపస్సిద్ధికిని నేను సంతోషించితిని.

క. మెచ్చి జలజాక్షి నతనికి, యిచ్చితి నిల్లాలుగాఁక • నీ వెఱిఁగి మదిన్
మచ్చరమున మునివనికిం, జెచ్చెరఁ జని యందు నగ్నిశిఖ కైన యగుచున్. ౨౬

తా త్ప ర్య ము

(సంతోషించి యహల్య నతనికే భార్యగా నిచ్చితిని. నీ వది తెలిసియు మచ్చరము పూని మునియున్న వనమునకుఁ బోయి యం దగ్ని జ్వాలను బోలి.)

క. రాజలు రాజీవాక్షిని, రాజీవశరార్తిఁ జిక్కి • రతిఁ గూడఁగ నా
లో జటి యాశ్రమగతుని బిడౌజా! నిను దుర్దశాప్తు • నుగ్రతఁ దిట్టెన్. ౨౭

అర్థములు. రాజీవశర+అర్తి=మన్మథ తాపమునను, జటి=ముని, ఆశ్రమగతుని=ఆశ్రమమం దున్నవానిని, ఇంద్రా! దుర్దశను వచ్చిన నిన్ను భయంకరముగఁ దిట్టెను, బిడౌజా=ఇంద్రా.

తా త్ప ర్య ము

(ఒప్పియున్న యహల్యను, మన్మథ తాపమునకు వశుడవై రతిక్రీడలఁ దేలు చుండఁగా, నాశ్రమమందున్న వానిని దుర్దశకువచ్చిన నిన్ను ముని భయంకరముగ దిట్టెను.)

క. ఏమిర వాసవ! నీవే, కాముకమతి నాకుపత్నిఁ • గవిసితి వటరా!
దీమసమున నిర్భీతిని, నీమూర్తునిచేతఁ జిక్కి • నెవ్వగఁ గనుమీ. ౬౭౮

అర్థములు వాసవ=ఇంద్రా, దీమసమునన్=గర్వమున, నిర్భీతిని=భయము లేక, మూర్తునిచేత=పగవానిచేత.

తా త్ప ర్య ము

ఏమిరా యింద్రా! నీవే భయములేక గర్వమున గాముకుఁడవై నాభార్యను గామించితివటరా! నీ పగవాని చేతిలో నీవు చిక్కి దుఃఖింపుము. బాలకాండ మునఁ జెప్పఁబడిన (౯౦౫ వ పద్యము) శాపమునకు సహస్రయోనిత్వమున కిది పర్యాయముగాదు. రెండు నొకసారి చెప్పినవే. అయినను వాల్మీకి తన శైలి ననుసరించి యందొకటి యిందొకటి చెప్పెను. రెండును గలిపి చదువవలయును.

మ. కుమతీ! నీ విపు డాచరించిన మహా•ఘోరాఘకర్మంబు లో
కములన్ మానవులందునుం బరఁగెడిం•గా కింక, జారత్వపా
పమునం దర్ధము కర్త నొందెడు, నినుం•బ్రాపించు శేషార్ధ, ము
త్తమనా నీదుపదం బశాశ్వత మగుం•దథ్యంబు నీకీపయిన్. ౬౭౯

అర్థములు. కుమతీ=కుత్సితబుద్ధి గలవాఁడా, మహాఘోరాఘకర్మంబు= వ్యభిచారమను మిగుల భయంకరమైన పాపకార్యము-పరఁగెడిన్=నీవు శ్రేష్ఠుఁ డవు చేసితివి కావున నిన్నుఁ జూచి నీ మార్గ మనుసరించి లోకములోఁ గొందఱు పాపులును జేయుదురు, శేషార్థము=మిగిలిన సగము.

తా త్ప ర్య ము

కుత్సితబుద్ధిగలవాఁడా! నీ విపుడు చేసిన మహాభయంకరమైన జారత్వమను పాపకార్యమునకు నీ వంటి గొప్పవాఁడు మార్గదర్శి యగుటచే నీ వంటి పాపాత్ములు కొందఱు నీ వలెనే 'యథా రాజా తథా ప్రజా' యని జారత్వము చేయు దురు. అట్టి జారుల సగముపాపము వారిని, 'రాజా రాష్ట్రకృతం పాప' మన్నట్లు సగము పాపము మార్గదర్శివైన నిన్నుఁ బొందును. అంతియకాదు. నీ కీయుత్తమ పదవి యిఁకమీఁద శాశ్వతము గాదు. నీవు పదభ్రష్టుఁడవు కాఁగలవు.

క. నీకే కాదుర దుర్మతి నీకై వసి నెవ్వఁ డేనఁ • నిర్జరపతి యౌఁ
బ్రాకటగతి నాతెండును, నీకరణిని భ్రష్టుఁడగును • నిజ మని మఱియున్. ౬౮౦

తాత్పర్యము

ఈపదభ్రష్టత్వము నీ కొక్కనితోఁ బోదు. నీ వెనుక నింద్రులుగా వచ్చు వారి కందఱకు నిట్టి పదభ్రష్టత్వమే ప్రాప్తించును. ఆ కారణమున నుత్తమఫలము గోరువాఁడు నీ యింద్రపదమును గోరకుండును.

క. సతిఁ గని గర్జించుచు ముని, పతి యనియెన్ దుష్టురాల • పడియుండుము నీ
యతిసౌందర్యము పాడుగ, క్షితిపై నీ యాశ్రమంబు • చెంతన యసతీ! ౬౪౧

తాత్పర్యము

(భార్యను జూచి గర్జించుచు గౌతముఁడు 'దుష్టురాలా, అంకులాఁడీ నీయతి సౌందర్యము పాడుగా నీ యాశ్రమ సమీపమున నేలపైఁబడి యుండుము' అని గౌతముఁడు పలికెను.)

క. సౌందర్యము ప్రాయంబును, బొందియు మది చంచలత్వ • ముం బొరయుటచే
సుందరి నీ వొకతెవె గా, కుందువుగా కిలను నీకు • నుదు టణఁగింగన్. ౬౪౨

తాత్పర్యము

చక్కఁదనము వయస్సుగల దానవై మనస్సు చపలమైన కారణముచే నీక లోకములో చక్కని స్త్రీ యనునది నీ వొకతెవేకాక పెక్కు రుదయింతురు. అప్పుడు నేనే చక్కని దాన నను నీ గర్వము సమయును.

క. ఏ సౌందర్యము కలిమిని, నీవరగోని మిడిసిపడితి • వీవు కృతఘ్నీ!
యీ సౌందర్యము జనములతో సాధారణము యగుత • లుప్తవివేకా! ౬౪౩

అర్థములు. కృతఘ్నీ=చేసిన మేలు మఱచినదానా, లుప్తవివేకా=వివేకము లేనిదానా.

తాత్పర్యము

(కృతఘ్నురాలా! యే చక్కఁదనము చూచుకొని నీవిట్లు మిడిసి పడితివో యోసీ! వివేకము లేనిదానా! యీ సౌందర్యము జనములలో సాధారణ మగును గాక!)

క. అని తిట్టె నాఁడు మొదలుగ, వనితలు సౌందర్యవతులు • ప్రభవించిరి భూ
మిని లొల్లిగ నెల్లయెడన్, వనజాక్షి విధేయ యగుచుఁ • బతి కిట్లనియెన్. ౬౪౪

అర్థములు. లొల్లిగన్=తఱచుగ.

తాత్పర్యము

(అని తిట్టెను. నాఁటినుండి భూమిపై సంతతఁ దఱచుగ సౌందర్యవతులు వనితలు పుట్టిరి. అహల్య విధేయురాలయి పెనిమిటితో నిట్లనెను.)

క. నీయాకృతిఁ గొని యింద్రుం, డీ యాగడమున్ ఘటించె • నెటుఁగక చెడితిన్
నా యజ్ఞానము సైఁపుము, చేయను జుమి కామమదము • చేఁ బాపంబున్. ౧౦౫

అర్థములు. ఇందు నహల్య కామమదముచేఁ బాపము చేయ లేదని చెప్పెను. కామమదముచేఁ జేయలేదుగాని యింద్రుఁడు కదాయనః దాక్షిణ్యముచేఁ జేసెను. అంకాడ నేర్చినమ్మ బొంకాడ నేర్వదా? బాలకాండము చూచునది.

తాత్పర్యము

(ఇంద్రుఁడు మీ రూపమును దాల్చి యీ తుంటరిపని చేసెను. ఎఱుఁగక చెడిపోతిని. నా తెలివి తక్కువను సైరింపవలెను. నేనుఁ గామమదముచే బాపము చేయలేదు సుమా!)

సీ. అని వేఁడుకొనిన మ • హర్షి యాసతికి ని,క్ష్వాకువంశంబున • సత్యరతుఁడు
రామనామంబునఁ • బ్రథితుండు జనియించు, మానుషవిగ్రహం • బూనియున్న
యావిష్ణుమూర్తి బ్రా • హ్మణుని నిమిత్తమై,యరుదెంచు నిటకు నీ • వతనిఁ గాంచి
పూత వయ్యెదవు త • త్పుణ్యుండు దక్క నీ, పాపంబు నెవ్వఁడుఁ • బాపలేడు
తే. తథ్య మియ్యది యతని కా • తిథ్య మిచ్చి
వెండి నన్నుఁ జేరఁగలవు వే • దండయాన
యవల నాతోడ వసియింప • నగును నీకు
ననుచు స్వాశ్రమమును జొచ్చె • నమ్మహర్షి. ౧౦౬

అర్థములు. బ్రాహ్మణుని నిమిత్తమై=విశ్వామిత్రుని కొఱకు, దీనివలన జారత్వ దోషము భగవదనుగ్రమున నాయన దర్శనస్పర్శనములచేఁ బోవలయునే కాని మఱియొక ప్రాయశ్చిత్తకర్మచే నిశ్శేషముగ నశింపదు.అంతవఱ కదిపవిత్రురాలు గాదు.

తాత్పర్యము

(అని వేఁడుకొనఁగా గౌతముఁ డహల్యతో 'ఇక్ష్వాకువంశమున రామనామమునఁ బ్రసిద్ధుఁడు సత్యరతుఁడు పుట్టును-అతఁడు మానువ శరీరము దాల్చిన యా విష్ణుమూర్తి. ఒక బ్రాహ్మణుని కొఱ కిచ్చటకు వచ్చును. నీ వతని దర్శించి పవిత్రురాల వయ్యెదవు ఆ పుణ్యాత్ముఁడు దక్క నీ పాపము నితరుఁ డెవఁడు పోఁగొట్టలేఁడు. ఇది నిజము-అతని కాతిథ్య మొసఁగి నన్నుఁ జేరఁగలవు-అటు పిమ్మట నాతోఁ వసింప నగును' అనుచు నా మహర్షి తన యాశ్రమములోనికిఁ బోయెను.)

ఆ. బ్రహ్మవాదిపత్ని • పచరించె నట్టు లే యమ్మహర్షి తిట్టి • నట్టులెల్ల
దాపరించె నీకుఁ • దప్పునే రెండ్రైనఁ, గాకఫలము విప్ర • శాపఫలము. ౧౦౭

అర్థములు. బ్రహ్మవాదిపత్ని=అహల్య, పచరించెను=చేసెను.

తాత్పర్యము

(అహల్య యట్టులే చేసెను. ఆ మహర్షి తిట్టినట్లంతయు దాపరించెను- నీకుఁ బాపఫలము బ్రాహ్మణ శాపఫల మొందయినఁ దప్పునా?)

క. స్మరియింపుము నీచేసిన, దురితంబును శక్ర! యిట్టి♦దోషంబున నీ
కరణి నరిచేతఁ జిక్కితి, వరయఁగ నిద్దాని హేతు ♦ వదియే వింటే. ౬౮౮

తాత్పర్యము

(నీవు చేసిన పాపమును దలఁచుకొనుము. ఇంద్రా! యిట్టి దోషముచేత నీ విధముగా శత్రువుచేతఁ జిక్కితివి-వింటివా! దీనికదియే కారణము.)

క. నీ తనయునకై వగవకు, నీతుం డై యతఁడు జలధి♦నీరంబులలో
మాతామహరక్షితుఁడై, చేతో మోదంబుఁ గనెడి♦జింతాచ్యుతుఁడై. ౬౮౯

అర్థములు. నీతుండై=తీసికొని పోఁబడినవాఁడై, మాతామహరక్షితుఁడై= తల్లియొక్క తండ్రిచేతఁ గాపాడఁ బడువాఁడై చింతాచ్యుతుఁడై=విచారము లేనివాఁడై.

తాత్పర్యము

(నీ కొడుకునకై విచారపడకుము-వానిని మాతామహుఁడు తీసికొనిపోయి సముద్రములోఁ గాపాడుచున్నాఁడు-వాఁడు దిగులు లేక సంతోషముగ నుండ గలఁడు.)

క. కావున వైష్ణవయాగముఁ, గావింపుము దానఁ దొలఁగఁ ♦ గల్మషచయముల్
దేవేంద్ర! నాకమునకుం, బోవచ్చు నటన్న నట్ల పొనరిచె నతఁడున్. ౬౯౦

తాత్పర్యము

పాపఫల మనుభవమునకు వచ్చెను గావున నపవిత్రుఁడవైతివి. ఇట్టులే స్వర్గమునకుఁ బోరాదు. వైష్ణవయాగముఁ జేసి పరిశుద్ధుఁడవై స్వర్గమునకుఁ బొమ్ము.

ఉ. ఇంద్రజితుం డనంగ నతఁ ♦ డెంతటివాఁడొ నృపాల వింటివే
యింద్రునిఁబట్టి కట్టెనన ♦ నేమిటి లెక్క తదన్యులం చనన్
సాంద్రతరాద్భుతంబు గొని ♦ క్ష్మాతలపయోపతి లక్ష్మణుండు కీ
శేంద్రులు మెచ్చి రౌర యని ♦ యిట్లు మునీరిత గాథ యంతయున్. ౬౯౧

తాత్పర్యము

రామచంద్రనృపాలా! యింద్రజిత్తనఁగా నెంతటివాఁడో వింటివా? ఇంద్రుని బట్టి కట్టెననిన తక్కినవారు వానికొక లెక్కా? అని చెప్పఁగా మిగుల దట్టమైన ఆశ్చర్యము పొంది ఔరా యని రామచంద్రమూర్తియు లక్ష్మణుఁడు వానరులు మెచ్చిరి. ఇట్లు ముని చెప్పిన చరిత మంతయు విని.

తే. విని రఘూత్తముఁ డెలని వి॰భీషణుండు, పూర్వ మెప్పుడో కనినది॰పూర్ణముగను
స్మృతికివచ్చెను నేఁడన॰క్షితిధవుండు, మెచ్చెను నగస్త్యమౌనీంద్రు॰మేలినుతుల.

తాత్పర్యము

పూర్వ మెప్పుడో చూచినది సంపూర్ణముగ నేఁడు మరల మనస్సునకు వచ్చెను అనిన రామచంద్రమూర్తి యగస్త్యుని మెచ్చెను.

అనుభవజ్ఞుఁడైన విభీషణుఁడు మెచ్చె ననుటచే నగస్త్యుఁడు చెప్పినది సర్వము సత్యమని యేర్పడెను.

క. ఈవిధమున దశవదనుఁడు, దేవేంద్రజితుండు తనకు ♦ దేనికిఁ దోడై
రా విశ్వకంటకుండై, యేవారిని సరకుగొనక ♦ యెసఁగుచునుండెన్. ౧౯౩

అర్థములు. విశ్వకంటకుండు=లోకమును బాధించువాఁడు.

తాత్పర్యము

(ఈవిధముగ రావణుఁ డింద్రజిత్తు తనకుఁ బ్రతిపనికిఁ దోడై యుండుటచే లోకకంటకుండై యెవరిని లెక్కచేయక విజృంభించు చుండెను.)

౩౧వ సర్గము

## —* రావణుఁడు కార్తవీర్యార్జును గెలువఁబోవుట *—

సీ. అని యిట్లు మునిపల్కు॰నాశ్చర్యమగ్నుఁడై, జననాయకుం డను॰మునివరేణ్య
క్రూరుడై పోఁకుండు ♦ గ్రుమ్మర లోకంబు, శూరత్వశూన్యమై॰ సుక్కెనయ్య?
రాజొండెఁ గాకున్న రాజమాత్రుండైనఁ, గలుగఁడా యొక్కఁడా॰బలియు గెలువ
నక్కటా! క్షత్రియుల్॰హతవీర్యులైరికా, నిర్జితులైరికా॰నిఖలనృపతు
తే. లేమి! పరమాస్త్రవిదులు బ॰హిష్కృతులుగ
నైరె యనుడును మునివర్యుఁ ♦ డమ్మహాత్ముఁ
గాంచి నవ్వుచు నీశ్వరుఁ ♦ గమలభవుఁడు
పలుకునట్టులు ప్రీతిమైఁ ♦ బలికె నిట్లు. ౧౯౪

తాత్పర్యము

ఈప్రకారము ముని చెప్పఁగా రామచంద్రమూర్తి యాశ్చర్యమున మునిఁగినవాఁడై యిట్లనెను. మునీంద్రా! క్రూరుఁడగు రాక్షసుఁడు లోకమునందు స్వేచ్ఛగా విహరింపఁగా లోకమున శూరత్వ మనునది శూన్యమయ్యెనా? రాజగువాఁడో రాజని పేరు పెట్టుకొన్నవాఁడో యా బలవంతుని గెలువఁగలవాఁడొక్కఁడు లేఁడయ్యెనా? అయ్యో! క్షత్రియు లందఱు వీర్యహీనులైరి కదా! రాజు లందఱు నోడిపోయిరి కదా! పరమాస్త్రములు తెలినవారు దేశమున లేకయే పోయిరా యని యడుగఁగా నగస్త్యుఁడు నవ్వుచు నీశ్వరుని బ్రహ్మ సంబోధించినట్లు లిట్లు చెప్పెను

లోకములోని ప్రభువులు తాము జయించిన వాని బలపరాక్రమములు వినఁ గోరుచుందురు. అంతటి బలశాలులను దాము జయించితి మని గర్వింతురు. రామచంద్రమూర్తి యట్లు గాక తాను జయించిన వాని పరిభవములు వినఁగోరుచున్నాఁడు కదా యని నవ్వ.

మ. ధరణీపాలుర నెల్ల నేఁచుచును దోర్దర్పాంధుఁడై ధారిణిం
జరియించెన్ దశకంఠుఁ డట్లు చనుచున్ సత్త్వాఢ్యు మాహిష్మతీ
పురినాథున్ విని శక్రపత్తననిభంబున్ వహ్నిసాన్నిధ్యమున్
శరకుండస్థితపావకంబు నగుచున్ సప్తార్చికిం దుల్యుఁ డౌ. ౬౫

అర్థములు. దోర్దర్పాంధుఁడై=భుజబలగర్వముచే గన్నులు గానని వాఁడై, సత్త్వాఢ్యు=బలసంపన్నుని, శక్రపత్తన నిభంబున్=ఇంద్రుని పట్టనముతో సమానమైనది, వహ్నిసాన్నిధ్యమున్=అగ్ని సన్నిధానము గలది, శరకుండస్థిత పావకంబు=శరము లాస్తరణములుగా నగ్నికుండమందుండు నగ్నిని కలది, వహ్నిసాన్నిధ్యము ఈ విషయము భారతంబున సభాపర్వంబున సహదేవుని దిగ్విజయ యాత్రయం దిట్లు చెప్పఁబడెను.

తొల్లి నీలుని వంశంబున నిషధుం డను రాజు రాజ్యంబున జాతవేదుఁడు విప్రుండయి వేదాధ్యయనంబు సేయుచు మాహిష్మతీపురంబున నుండి యొక్క నాఁడు ప్రమాదవశంబునఁ బరదారగమనుఁ డయిన నెఱింగి వానిం బట్టుకొని తలవరులు రాజసమక్షంబునకుం గొనిపోయి శాస్త్రవిహితదండంబు దండింపఁబోయిన.

క. అనమానదుఃఖితుం డయి, పోవయుచుఁ గోపానలంబు పొడమి వెలుంగం
బవనసఖుఁ డగ్నికణములు, నెనయఁగఁ దన పొడవు సూపె నిషధునిమోలన్.

వ. వాఁడును వఱిభీతుండై యగ్ని దేవునకు నమస్కరించి మహాపురుషా! నాయాజ్ఞానంబు సహింపవలయు నని ముకుళితకరకమలుండయిన వానికి వైశ్వానరుండు ప్రసన్నుండై నీ కోరిన వరం బిచ్చెద వేఁడు మనిన నతం డిట్లనియె.

గీ. ఇప్పురంబు జయింపఁగ నెవ్వరేని, వత్తు రుద్ధతులయి శత్రువరులు వారు
దర్ప మేది నీచేత నిర్దగ్ధు లగుచు, హీనులగు నట్లుగా వర మిమ్ము నాకు.

ఈ వరము కారణమున నగ్నిహోత్రుం డా పురమును రక్షించుచుండు... సప్తార్చికిన్=అగ్నిహోత్రునకు, తుల్యుఁడు=సమానుఁడు.

తాత్పర్యము

రాజుల నందఱ బాధించుచు భుజబలము గర్వముచేఁ గన్నులు గానక భూమి యందుఁ దిరుగుచు దశకంఠుఁ డొకనాడు మాహిష్మతీ ప్రభువు బలవంతుఁడని విని

దేవనగరముతో సమానమై యెప్పుడు నగ్నిసాన్నిధ్యము కలిగి శస్త్రాస్త్రరణము లందు నగ్నికలదై యగ్నికి సమానుఁడైన.

క. అర్జునుఁడేలెడి తత్పురి, కర్జునుతో రణము సలుపు • నభిలాషను న
త్యూర్జితజవమునఁ జనిసం, దర్జితశాత్రవచయుండు • తరుణులతోడన్. ౬౬

అర్థములు. అత్యూర్జిత జవమునన్=మిగుల వృద్ధినొందిన వేగముతో, తర్జిత శాత్రవ చయుండు=శత్రుసమూహముల దండించినవాఁ డగు నర్జునుండు, తరుణుల తోడన్=స్త్రీలతో.

తాత్పర్యము

(అర్జునుఁడు పరిపాలించుచున్న యాపత్తనమున కర్జునునితో యుద్ధము చేయు నభిలాషముతో నతివేగముగాఁ బోఁగా శత్రుసమూహముల దండించిన నాతఁడు స్త్రీలతో.)

—• కార్తవీర్యార్జునుఁడు నర్మదయందు స్త్రీలతోఁ గ్రీడించుట •—

చ. వనజదళాక్ష! రావణుఁడు • వచ్చిననాఁడ యతండు నర్మదా
వనములఁ గేళిఁ దేలఁ జనెఁ • బంక్తిముఖుండును మంత్రికోటి న
ర్జునుఁ డెట నున్నవాఁడు రణ•శూరుఁడు రావణుఁ డేగుదెంచె నిం
దని కని మీర లేగి సర•యంబుగఁ దెల్పుఁడు పొండటం చనెన్. ౬౭

తాత్పర్యము

రామచంద్రా ! వినుము. రావణుఁడు మాహిష్మతికి వచ్చిన దినమందే యర్జునుఁడు నర్మదాజలములందు క్రీడించుటకై పోయెను. తరువాత రావణుఁ డా యూరికిఁబోయి మంత్రులఁ జూచి యర్జునుఁ డెచ్చట నున్నవాఁడు, రణశూరుఁడు రావణుఁడు యుద్ధమునకై యిచ్చుటకి వచ్చినాఁడని త్వరగాఁ బోయి తెలుపుఁడు పొండని చెప్పఁగా.

సీ. వారలు మహీపతి • యూరలేఁ డన విని పురమును బాసి యా•భూరిబలుఁడు
నీహారశైలస•న్నిభ మైనదానిని, నభ్రంబుగతి మింటి • నంటుదానిఁ
బుడమి నుద్భేదించి • పుట్టినాఁ డగుదాని, గగనమార్గం బరి•కట్టుదాని
నేశిఖరంబుల • వెలుగుఁచుండెడిదాని, హరిచయనివిశకం•దరముదానిఁ

తే. దటుల, బడిమొకు వంకల • ధ్వనులచేత, నట్టహాస మొనర్చున•ట్లమరుదాని
స్త్రీలతోఁ గ్రీడనల్పెడి•దేవదనుజ, కిన్నరులు గల్గి దివ మన • నున్నదాని. ౬౮

అర్థములు. నీహారశైల సన్నిభము = మంచుకొండతో సమానము అభ్రంబుగతిన్=మేఘమువలె, ఉద్భేదించి = పగులఁజీల్చుకొని, అరికట్టు=అడ్డ

గించు, వే=వేయి, హరిచయ = సింహసమూహములచే, నిబిడ=దట్టమైన, కంద
రము=గుహలుగలదాని, తటులన్=పార్శ్వములందు.

తాత్పర్యము

ఆ మంత్రులు రాజూరలేఁడని చెప్పఁగా విని యూరువిడిచిపోయి యా మహాబలశాలి మంచుఁగొండతో సమానమైన దానిని, మేఘమువలె నాకాశము దాఁకు దానిని, భూమినిఁ బగులఁదీసికొని పుట్టినదా యనునట్లుండు దానిని, నాకాశమునడ్డగించుదానిని, వేయి శిఖరములచేఁ బ్రకాశించు దానిని, సింహములచే నిండిన గుహలు గలదానిని, పార్శ్వములందఁ బడుచున్న వంకలధ్వనులచేతఁ బెద్దగా నవ్వుచున్నదా యనునట్లుండుదానిని, ఆఁడువారితోఁ గ్రీడించు దేవదనుజకిన్నరులు గలిగి స్వర్గమన నుండుదానిని.

## —• రావణుఁడు నర్మదాతీరమున విడియుట •—

చ. పటికపుఁజాలఁబోలి కడు • స్వచ్ఛములౌ సెలయేటినీరముల్
తటములనుండి జాఱెడివి•ధంబుల నాల్కలు గ్రోయు వాయుభు
క్పటలము పాఱురీతిఁ దల•పన్ ఘటియించెడుదాని వింధ్యముం
గుటిలచరిత్రకుండు గని • గొబ్బునఁ జేరఁగఁబోయె నర్మదన్. ౧౯౯

అర్థములు. పటికపుఁజాలన్=స్ఫటికములను, తటములనుండి=చఱుల నుండి, వాయుభుక్పటలము=సర్పసమూహము, కుటిల చరిత్రకుండు = వక్రపు నడవడి గలవాఁడు.

తాత్పర్యము

స్ఫటికమువలె మిక్కిలి నిర్మలమైన సెలయేటి నీళ్ళు చఱులనుండి జాఱు విధములను నాలుకలాడించు పాముల గుంపు పరుగెత్తుటలు జ్ఞప్తికిఁ దెచ్చు వింధ్యమును నా వంచకుఁడు చేరఁబోయి నర్మదను.

చ. పడమటివారిధిం గలియ•బాఱెడిదాని శిలాచలోదకన్
వడఁబడి యెండకుం దలరి • వారణ ఘోణిమృగేంద్రముల్ తృషన్
వడి జలమందు దూఁకి కలఁ•పన్ మలినం బగుదాని నింపుగా
విడువక కోళ్ళు జక్కవలు • బెగ్గురు లంచలుఁ గూయుదానినిన్. ౨౦౦

అర్థములు. శిలాచలోదకన్=ఱాలమీఁదఁ బాఱు జలము గలదానిని, తలరి=చలించి వారణ=ఏనుఁగులు, ఘోణి=ఏదుపందులు-మృగేంద్రములు=సింహములు, తృషన్=దప్పిచే.

తాత్పర్యము

పడమటి సముద్రమును గలియుటకై పాఱుచున్న దానిని, ఱాలమీఁద బాఱు నీళ్ళు గలదానిని,ఎండకు బడలి చలించి దప్పిగొని యేనుఁగులు ఏదుపందులు సింహ

ములు నీళ్ళలో దూఁకి కలియఁబెట్టఁగా మురికిదైనదానిని, నీటికోళ్ళు జక్కవలు బెగ్గురులు హంసలు గూయుచుండు దానిని.

సీ. ఉత్ఫుల్లభూజకృ•తోత్తంసయును జక్ర, వాకయుగస్తని • వారి ఫేన
నిర్మలాంశుక నీల•నీరజలోచన, హంసావళీమేఖ•లానుబద్ధఁ
బ్రాకటవి స్తీర్ణ•సైకతసుశ్రోణిఁ బుష్పరేణ్వనులి ప్త•పుణ్యసుభగ
సలిలావగాహసు•స్పర్శయా నర్మద, స్రోతస్వినీవరఁ • జూచి యసుర

ఆ. యిష్టురాలితోడ • నెలమిఁ గ్రీడించెడి, భంగి స్నానమాడి • పరమహాని
సేవ్యమానమైన • భవ్యతరంగిణీ, తీరమందు నిసుక•దిన్నెమీఁద. ౨౦౧

అర్థములు. ఉత్ఫుల్లభూజ = వికసించిన చెట్లచే, కృత=చేయఁబడిన, ఉత్తంసయు=శిరోభూషణము గలదియు, చక్రవాకయుగ = చక్రవాకములజంట, స్తని=స్తనములుగాఁ గలదియు వారిఫేన=నీళ్ళనురుఁగను, నిర్మలాంశుకయు= తెల్లచీర గలదియు, నీలనీరజ=నల్లకలువలు, లోచన = కన్నులుగా, గలదియు హంసావళీ=హంసలవరుసలను, మేఖలా=ఒడ్డాణముచే, బద్ధ = కట్టఁబడినదియు, ప్రాకట విస్తీర్ణసైకత=స్పష్టముగాఁ దెలియుచు పెద్దవైన యిసుకదిబ్బలను, సుశ్రోణి=పిఱుఁదులు గలదియు, పుష్పరేణు=పుప్పొడిచే, అనులిప్త=పూయఁబడిన, పుణ్యా=పుణ్యకరమైన, సుభగ=సౌందర్యము గలదియు, సలిలావగాహ= నీటస్నానము చేయుటకు, సుస్పర్శ=సుఖస్పర్శగలదియు, స్రోతస్వినీవరన్=నదుల యందు శ్రేష్ఠమైనదానిని.

తాత్పర్యము

వికసించిన చెట్లు శిరోభూషణములుగాను చక్రవాకములజంట స్తనములు గాను నురుఁగు తెల్లని చీరగను నల్లకలువలు కన్నులుగను హంసలవరుసలొడ్డాణముఁగను వెడలుపాటి పెద్ద ఇసుక దిబ్బలు పిఱుఁదులుగను పుప్పొడి పూఁతగనునై స్నానమునకు సుఖస్పర్శము గలిగి నదులందు శ్రేష్ఠమైన నర్మదయందుఁ బ్రియురాలితోఁ గ్రీడించునట్లు జలకమాడి పరమమునులచే సేవింపఁబడు నాపుణ్యనదీ తీరమందు నిసుక దిన్నె మీఁద.

చ. ఎలమిని గూరుచుండి యిది•యే చుఁడి గంగ యటంచు మెచ్చి మం
త్రుల శుకసారణాఖ్యుల న•నున్ జగమంతయుఁ బైడివోలె నీ
జలజహితుండు తీవ్రకర•సంతతులన్ ఘటియించి మింటిపైఁ
దలఁకుచు సూటిగా నిలిచె • దానవసత్తములార! కంటిరే? ౨౦౨

అర్థములు. ఎలమిని=సంతోషముతో, గంగ = పంచగంగలలో నొకటి, ప్రాత గంగ.

తాత్పర్యము

సంతోషములో గూర్చుండినవాఁడై గంగ యనిన నిదియే సుఁడీ యని మెచ్చి తన మంత్రుల శుకసారణు లను వారితో నిట్లనియె. సూర్యుఁడు లోక మంతయుఁ దన కిరణములచే బంగారు కాంతి గలదిగాఁ జేసి యిప్పుడాకాశమున సరిగా నిలచెను చూచితిరా ?

దీనిచే మధ్యాహ్న మైన దని సూచన.

చ. ఖరకరుఁ డయ్యు నాయిచటఁ • బ్రాలెడికిరి నెఱింగి భీతిచేఁ
బరఁగెఁ దుషారభానుగతి • వాయువు శైవలినీజలార్ద్రుఁడై
సరససుమావళీసురభి • సంపద కానుకగాఁగఁ దెచ్చి నా
కరుసము గూర్చి నిర్భరసు•ఖావహుఁడై చరియించెఁ గంటిరే! ౨౦౩

అర్థములు. ఖరకరుఁడు=తీక్ష్ణకిరణములు గలవాఁడు, తుషారభానుగతి=మంచుకిరణములు గలవానివలె, శైవలినీ జలార్ద్రుఁడై=ఏటినీటిచే తడిసినవాఁడై, సరస=అందములైన, సుమావళీ=పూలగుంపుల, సురభీ సంపద = అతిశయమైన పరిమళము, అరుసము=సంతోషము, నిర్భరసుఖావహుఁడై = అతిశయసుఖము గలిగించు వాఁడై, చరియించెన్=వీచెను.

తాత్పర్యము

సూర్యుఁడు తీక్ష్ణములైన కిరణములు గలవాఁడయ్యు నేనిచట నుండుట నెఱిఁగి మంచు కిరణములుగల చంద్రునివలె నయ్యెను. వాయువు నదీజలములఁ దడిసి పూల వాసనలు దీసికొని కానుకగా నిచ్చి సంతోషము గలిగించి మిగుల సుఖము గలిగించిన వాఁడయ్యెను చూచితిరా?

తే. నర్మవర్ధన యగుచును • నర్మదయును, నక్రమీనవిహంగోర్మి•సవ్యయగుచు
నివ్వెరను దటకాపడి • నిలిచియున్న,జవ్వని యనంగ ఘటియించె•సమ్మదంబు

అర్థములు. నర్మవర్ధన=సంతోషమును వృద్ధిచేయునది, నక్రమీన విహంగోర్మి సవ్య=మొసళ్ళు, చేఁపలు, పక్షులు, అలలు వీనిచే మనోహరమై, నివ్వెఱను=నిండు భయముచే, తటకాపడి=దిగాలుపడి.

తాత్పర్యము

నర్మదయుఁ బ్రీతిని వృద్ధిచేయుచు మొసళ్ళు మీనములు పక్షులు అలలు వీనిచే మనోహరమై భయమున దిగాలుపడి నిలిచిన యువతివలె మనస్సునకు సంతోషము గలిగించెను. నక్రములు పిక్కలు మీనములు కన్నులు, విహంగములు చన్నులు, ఊర్ములు వళులుగా నెఱుంగునది.

ఉ. కావున నింద్రతుల్యమహి • కాంతులతోడఁ బెనంగి వారిచే
స్రావిరి గాయముల్ పడితి • రంగములన్ హరిచందనద్రవం
బై విలసిల్ల నెత్తురులు హాయిగ • శర్మద యైన నర్మదన్
వావిరి సార్వభౌమముఖ • వారణవర్గము జాహ్నవిం బలెన్. ౨౦౫

అర్థములు. ఇంద్రతుల్య=ఇంద్రునితో సమానులైన, మహీకాంతులతోన్= రాజులతో, పెనంగి=యుద్ధముచేసి, హరిచందనద్రవంబు=శ్రీగంధరసము, శర్మద= సౌఖ్యము కలిగించునది, సార్వభౌమముఖ = సార్వభౌమము మొదలుగాఁగల. వారణ=దిగ్గజములు, వర్గము=సమూహము, జాహ్నవింబలెన్ = గంగానదియందు వలె.

తాత్పర్యము

కావున మంత్రులారా! మీరు ఇంద్రునితో సమానులైన రాజులతో యుద్ధముచేసి వారిచే గాయపడితిరి, మీ దేహములకు నెత్తురే గంధపుఁబూఁత యయ్యెను. కావున నీక సుఖముగా సౌఖ్యము కలిగించు నర్మదయందు సార్వభౌమాది దిగ్గజములు గంగ యందువలె.

ఉ. మీ రవగాహనంబునకు • మేకొనుఁడీ, నది సర్వపంకని
స్తారక, మేనునన్ మునిఁగి • శారదసారసశాత్రవోపమం
బై రహియించు సైకతము • నందుఁ గపర్దిని బూజఁ జేసెదన్
మీరరుగుం డనంగ రజ • నీచరవల్లభునాజ్ఞ మంత్రులున్. ౨౦౬

అర్థములు. అవగాహనంబునకున్=స్నానమునకు, మేకొనుఁడీ=ప్రయత్నింపుఁడు, సర్వపంక నిస్తారక=సమస్త పాపములను బోఁగొట్టునది, శారద=శరత్కాల మందలి, సారసశాత్రవ=చంద్రునితో, సమంబై=ఈడై, సైకతము=ఇసుకదిబ్బ, కపర్దిని=శివుని, రజనీచర వల్లభు నాజ్ఞ=రాక్షసరాజు నుత్తరువు ప్రకారము.

తాత్పర్యము

(మీరు స్నానమునకుఁ బ్రయత్నింపుఁడు. ఇది సర్వపాపములను బోఁగొట్టు నది. నే నిందు స్నానముచేసి తెల్లని ఇసుక దిబ్బలమీఁద శివునిఁ బూజించెదను. మీరు పొండు. అని చెప్పఁగా రావణుని యాజ్ఞప్రకారము మంత్రులు.)

సీ. తూర్ణంబ సారణ•ధూమ్రాక్షశుకులు ప్ర, హస్తమహోదరుల్•హర్ష మెసఁగ
నదిఁ జొచ్చి రా సుర•నాగసంక్షుభితమై, వామనాంజన పద్మ•వారణముల
చేత క్షుబ్ధం బైన•శ్రీజాహ్నవినిబోలె, వారును జలకేళి • వఱలి లేచి
రావణునకు బలి•కై వన్యసుమములు, దేరంగ నేగి ర•త్తీరమునను

ఆ. గోరి వన్ని పూలు • కొల్లలుగానుంట, రాశిపోసి రందు • గ్రావ మనఁగఁ
బంక్తిముఖుఁడు దోఁగి • పరమజప్యంబున, జపమొనర్చి దరికిఁ • జయ్యనచ్చె.

అర్థములు. అసురనాగ=రాక్షసశ్రేష్ఠులచే, సంక్షుభితమై=కలఁచఁబడినదై వామనాంజన పద్మ వారణములచేత=వామనము అంజనము పద్మము అను దిగ్గజములచేత, క్షుబ్ధంబు=కలఁచఁబడినది, శ్రీజాహ్నవిని=శ్రీకరమైన గంగనుబోలె, వన్యసుమములన్=అడవియందుఁ బుట్టిన పూలను, గ్రావము=పర్వతము, తోఁగి=స్నానముచేసి, పరమ జప్యంబునన్=ఉత్తమ మంత్రముచే, గాయత్రీమంత్రముచే, 'న గాయత్ర్యాః పరం మంత్ర'మ్మని కలదు కదా, దరికిన్=తీరమునకు.

తాత్పర్యము

శుకసారణ ధూమ్రాక్షులు ప్రహస్త మహోదరులు శీఘ్రముగాఁ బోయి సంతోషముతో నదియందుఁ బ్రవేశించి వామనాంజనపద్మములను నేనుఁగులు గంగను గలియఁ బెట్టినట్లు కలియఁబెట్టి స్నానముచేసి లేచి రావణునకు వైశ్వదేవబలికై పూల నిమిత్తము పోయి యవి యాతీరమందే దండిగా నుండుటచేఁ గోసితెచ్చి కొండవలె రాసిపోసిరి. రావణుఁడును స్నానముచేసి నీళ్ళలో నిలఁబడి గాయత్రి జపించి, వేగముగ నొడ్డునకు వచ్చి.

—• రావణుఁడు శివలింగపూజ సేయుట •—

క. తడిచేల విడిచి వేడ్కఁ, పొడివస్త్రముదాల్చి లింగ • మున కర్హంబౌ
పుడమిన్ వెదకుచుఁ గరములు, ముడిచికొనుచు నరిగె, నసుర • ముఖ్యుల వెంటన్

అర్థములు. తడిచేల=తడిసిన వస్త్రము, పొడివస్త్రము=ఎండినవస్త్రము.

తాత్పర్యము

(తడిసిన వస్త్రము విడిచి పొడివస్త్రము గట్టుకొని లింగము నుంచుటకుఁ దగిన స్థలము వెదకుచుఁ జేతులు ముడుచుకొనుచుఁబోయెను. రాక్షసులతనవెంట.)

క. రూపములు గొనిన కొండల, కోపున నతఁడరుగు నెడకుఁ • గొని చనిరి దినం
బాపంక్తిముఖుఁడు పూజా, వ్యాపారితఁ దన్పుజాభ • వాలింగంబున్. ౭౦౯

అర్థములు. కొండల కోపున=కొండలవలె, జాభవా లింగంబున్=బంగారు లింగమును.

తాత్పర్యము

(కొండలవలె నతఁడు పోవుచోటికిఁ బ్రతిదినము రావణుఁడు పూజించు బంగారు లింగమును దీసికొని పోయిరి.)

క. ఆకనకలింగ మొకచో, సైకతవేదికను నిల్పి • శ్రద్ధాయుతుఁడై
శ్రీకరగంధసుమాదులఁ, బ్రాకటగతిఁ బూజ చేసె • రావణుఁ డంతన్. ౭౧౦

అర్థములు. కనకలింగము=బంగారులింగము, సైకతవేదికను=అరుఁగు వంటి యిసుకదిబ్బను, శ్రీకర=సంపత్కరమైన. గంధసుమాదులన్=గంధము పూలు ధూపదీపాదులచే.

దీనివలనను నికుంభిలవలనను రాక్షసులందును విగ్రహారాధన మనాదిగఁ గలదని తోఁచుచున్నది.

క. వరదుఁడు చంద్రకళాలంకరణసమంచితుఁడు గరళ•కంఠుండు వ్యథా
హరుఁ డగుశివుఁ బాడుచుఁ దాఁ గరములు పైకెత్తి నటన•కార్యముఁ దీర్చెన్.

అర్థములు. వరదుఁడు=కోరిన వరముల నిచ్చువాఁడు, చంద్రకళాలంకరణ=చంద్రరేఖ యను నాభరణముచే, సమంచితుఁడు = ప్రకాశించువాఁడు, గరళకంఠుండు=విషము కంఠమునఁ గలవాఁడు, వ్యథాహరుఁడు = బాధల హరించువాఁడు, నటనకార్యము=నృత్యము.

తాత్పర్యము

(వరము లిచ్చువాఁడు చంద్రరేఖ నాభరణముగా ధరించి ప్రకాశించువాఁడు విష.కంఠుఁడు, బాధలఁ బోఁగొట్టువాఁడు నగు శివుని గుఱించి కీర్తనము చేతులెత్తి నృత్యము చేసెను.)

ప్రతిదినము దేవపూజానంతరము దేవుని యెదుట నృత్యము చేయవలెను. పాటలు పాడవలెను. ఇది సంధ్యావందనమువలె నిత్యకర్మము విడువరాదు. కైలాసము క్రిందఁ జేతులు నలిగినది మొదలు రావణునకు శివభక్తి కుదిరినది. రావణుఁడు పాడినది సామగానము, వాఁడు సామవేదమందు సహస్రశాఖాపారంగతుఁడని ప్రసిద్ధి. శైవతంత్రములందు నైశ్వర్యము కోరువారు బంగారు లింగముల బూజింపవలయునని యుండుటచే రావణుఁ డైశ్వర్య కాముఁడై లింగపూజ చేసెనని యెఱుఁగనగు.

విష్ణోర్గానంచ నృత్యంచ నటనంచ విశేషతః
బ్రహ్మన్ బ్రాహ్మణజాతీనాం కర్తవ్యం నిత్యకర్మవత్।

౩౨వ సర్గము

## —• అర్జునుఁడు తన భుజములచే నర్మద నడ్డగించుట •—

సీ. అతఁ డీవిధి శివు • నర్చించుచోటకు దా, పునని మాహిష్మతీ•పురవిభుండు
సారసలోచనా • సహితుఁడై జలకేళిఁ, దేలుచునుండె వా•స్త్రీలనడుమ
నాఁడేనుగుల నడు • మంతరమందు వే తంకమో యన నర్జు•నుండు పొలిచె
బాహువుల్ వేయింటి•బలమును బరికింప, నర్యేటి నాఁకట్టె•నద్భుతముగ.

ఆ. దాని మీఱ రాక • వాహిని యెదురొడ్డి, నక్రమకరమీన • నవ్యపుష్ప
దర్భసంస్తరసహి • తంబుగాఁ బ్రవహించె, వానకాలమందు • వలెఁ గనంగ. ౨౧౨

అర్థములు. సారసలోచనా సహితుఁడై=స్త్రీలతోఁగూడి. వేతండమో=ఏనుఁగో, అడ్డగించెను=అడ్డగించెను, నక్ర=ఒకజాతి, మొసలి=ఇది యేనుఁగునుబట్టును, మకర=సామాన్యములైన మొసళ్ళు, మీన=చేపలు, నవ్యపుష్పములు=మనోహరములైన పూవులు, దర్భసంస్తర=కుశాస్తరణములు, ఋషులు కర్మములకై పఱచినవి, సహితంబుగా=కూడునట్లుగ.

తాత్పర్యము

రావణుఁ డీ ప్రకారము శివపూజ చేయు ప్రదేశమునకు సమీపమందే యర్జునుఁడు స్త్రీలతోఁగూడి జలక్రీడ లాడుచు నా స్త్రీల నడుమ నాఁడేనుఁగుల నడిమి మగయేనుఁగు వలె నుండెను. అతఁడు తన వేయి చేతుల బలము పరీక్షింప నయ్యేటి నీళ్ళను బాఱకుండ నడ్డగింపఁగా దానిని మీఱ సాధ్యపడక యేటి నీ ళ్ళెదురెక్కి మొసళ్ళతోను జేపలతోను పుష్పములతోను ఋషులు పఱచిన దర్భసంస్తరణములతోను వానకాలమందువలెఁ బ్రవహించెను.

క. రావణు కార్యముఁ జెఱుపఁగ, నీవహి నర్జునుఁడె పంపె • నేమో నదినా
నా వాహిని దశముఖు కుసుమావళీ నంతయును వఱద • యందుం గలిపెన్. ౨౧౩

తాత్పర్యము

రావణు పూజాకార్యము చెఱుపుమని యర్జునుఁడు నదినిబంపె నేమోయన్నట్లు లానది యెదురెక్కి వచ్చి రావణుని పూల నన్నిటిని వఱదపాలు గావించెను.

**—• నర్మద యెదురొడ్డి పాఱి రావణు పూజా ద్రవ్యంబుల ముంచుట •—**

చ. సగము సమాప్తమైన గిరి • జాపతిపూజను మాని నర్మదా
పగ ప్రతికూలకాంత యనఁ • బై నెదురై చనుదేర, బశ్చిమం
బుగఁ బ్రవహించు నీతటిని • పూర్వముఖంబుగఁ బాఱ హేతువే
మిగ ఘటియిల్లె, నింతకును • మీఁద స్వభావపుశాంతిఁ దాల్చుచున్. ౨౧౪

అర్థములు. గిరిజాపతి=శివునియొక్క, నర్మదాపగ=నర్మదానది, ప్రతికూల కాంత=విరోధించిన స్త్రీ, పూర్వ ముఖంబుగన్=తూర్పుముఖముగ.

తాత్పర్యము

(సగము ముగిసిన శివపూజను మాని, నర్మదానది, యెదురుతిరిగిన కాంత వలె, నెదురెక్కి రాఁగా నింతకు ముందు స్వభావము శాంతముగా నుండి పడమటి మొగముగఁ బాఱు నీ నది యిప్పుడు తూర్పు ముఖముగాఁ బ్రవహించుట కేమి కారణము గలిగినది?)

తే. ఉరుతరభ్రాంతి విహగంబు ♦ లొప్పుచుండ
నిర్వికారాంగనయుఁబోలె ♦ నీటు మెఱయు
నాపగను గాంచి కుడి కేలి ♦ యంగుళమున
సైఁగఁ గావించె నా శుక ♦ సారణులకు. ౭౧౫

అర్థములు. ఉరుతరభ్రాంతి=విస్తార భ్రమచే, విహగంబులు = పక్షులు, నిర్వికారాంగన=మనో వికారము లేని స్త్రీ.

తాత్పర్యము

(విస్తారమగు భ్రమచేఁ బక్షులుండ, మనోవికారము లేని స్త్రీవలెనీటుగఁలుకు నదిని జూచి కుడిచేతి వ్రేలితో శుకసారణులకు సైగచేసెను.)

శుకసారణులు నర్మద యెదురెక్కిపాఱు కారణము రావణుతోఁ జెప్పుట

ఉ. అన్నయుఁ దమ్ముఁ డా నృపుని ♦ యానతిఁ గైకొని పశ్చిమంబుగాఁ
గ్రన్నన మింటిత్రోవఁ జనఁ ♦ గా నఱయామడదూరమందుఁ దాఁ
గ్రొన్ననఁబోఁడిపిండులను ♦ గూడి జలంబులఁ గ్రీడఁ దేలు చ
త్యున్నతసాలమో యనఁగ ♦ నుండెడివానిని బూరుషోత్తమున్. ౭౧౬

అర్థములు. అన్నయుఁ దమ్ముఁడు=శుకుఁడు సారణుఁడు, క్రన్నన=శీఘ్రముగా, క్రొన్ననఁబోఁడి పిండులను=స్త్రీల సమూహములను, అత్యున్నతసాలమో=మిక్కిలి పొడవైన వృక్షమో, పూరుషోత్తమున్=పురుషశ్రేష్ఠుని.

తాత్పర్యము

అన్నదమ్ములైన శుకసారణు లిరువురు రాజాజ్ఞ దీసికొని యాకాశమార్గంబునఁ బడమటదిశగా నఱయామడ దూరము పోయి యచ్చట స్త్రీలతో జలక్రీడ లాడుచు నెత్తైన వృక్షమువలె నున్న యొక పూరుషుని జూచిరి.

క. తోయవ్యాకులకుంతలుఁ, డై యెఱ్ఱని కనులతో మ ♦ దాకులతేజుం
డై యుర్విని హాటకగిరి, వేయిపదంబులను నిలుపు♦విధ మొప్పారన్. ౭౧౭

అర్థములు. తోయవ్యాకుల కుంతలుఁడై=నీటియందు చెదరియున్న తల వెండ్రుకలు గలవాఁడై, మదాకుల తేజుండై=మదముచేఁ గలఁత చెందిన తేజస్సు గలవాఁడై, హాటకగిరి=మేరువు, పదము=కొండతటి తిప్ప, ప్రత్యంత పర్వతము.

తాత్పర్యము.

నీటియందుఁ జెదరిన వెండ్రుకలు గలవాఁడై యెఱ్ఱని కనులతో, మదముచేఁ గలఁత చెందిన తేజస్సుతో భూమిని మేరువు ఒక వేయి పాదంబులతో నిలుపునట్లు

సీ. తనవేయికరములఁ దటినీలలామంబు, నాఁకట్టి క్రీడించు•నతులశౌర్య
సమదవశాసహ•స్రములతోఁ గ్రీడించు, మదవారణమునకు•మాద్రియగుచు
బాలావరాంగనా•జాలవృతుం డయి, కేళీవిలోలుఁడై • క్రాలువాని
యరిజనభయదుఁడై • యద్భుత చరితుఁ డౌ, నర్జునుఁ జూచి ద•శాస్యుఁ జేరి
తే. వార లిట్లని రధిప వే•బాహు లొప్ప, వాఁడు జలకేళిఁ దేలుచు•న్నాఁడు నదిని
సంగనలతోడఁ దనవేయి•హస్తములను, నడ్డగట్టఁగ నిది యెదు•రొడ్డి పాఱెఁగని

అర్థములు. తటినీ లలామంబున్ = శ్రేష్ఠమైన నదిని, ఆఁకట్టి=అడ్డగించి, సమద=మదము పట్టిన, వశా=ఆఁడేనుఁగుల, మదవారణమునకున్=మదపుటేనుఁగునకు, మాద్రి=సమానము, బాలా=బాల నాయికల యొక్కయు పదునాఱు సంవత్సరముల స్త్రీకి బాల యని పేరు, వరాంగనా = యువతుల యొక్కయు, జాలావృతుండయి=సమూహములతో చుట్టుకొనఁబడినవాఁడై, కేళీవిలోలుఁడై= క్రీడయందాసక్తి గలవాఁడై, అరిజనభయదుఁడై=విరోధులకు భయము గలిగించువాఁడై.

తాత్పర్యము

తన వేయి చేతులతో నేటిని నడ్డకట్టి యాఁడేనుఁగులతో గ్రీడించు మదపుటేనుఁగువలె బాలా నాయికలతోడను తరుణులతోను చుట్టఁబడినవాఁడై క్రీడయందాసక్తి గలవాఁడై విరోధులకు భయంకరుఁడై యాశ్చర్యకరమైన నడవడికలవాఁడై యున్నయర్జునుఁ జూచి మరలి పోయి రావణునితో వా రిట్లనిరి. రాజా! వేయి చేతుల వాఁడు నదీజలములందు స్త్రీలతో జలక్రీడ లాడుచున్నాఁడు. తన వేయి చేతులతో నదిని నడ్డగించుటచే నిది యెదు రెక్కి పాఱుచున్నది.

—• రావణుఁడు కార్తవీర్యార్జునుతోఁ బోరఁ జనుట •—

చ. అని శుకసారణుల్ పలుక • నాతఁడె యర్జునుఁ డంచు రావణుం
డనిపయిఁ గల్గుకాంక్ష వసు•ధాధిపుఁ డున్నెడ కేగుచుండ నీ
స్స్వనయుతమై రజంబుఁ గొని • వాయువు వీచెను సమ్ముఖంబుగా
వనదము రక్తవర్షమును • వ్రాల్చె సకృత్కృతభీమరావమై. ౭౧౯

అర్థములు. అనిపయిన్=యుద్ధముమీఁద, నిస్స్వనయుతమై=ధ్వనితోఁ గూడినదై, రజంబుఁగొని=దుమ్ముతో, సమ్ముఖంబుగాన్ = ఎదురుగా, వనదము= మేఘము, సకృత్+కృత+భీమరావమై=ఒక్కసారి చేయఁబడిన భయంకర ధ్వని కలదై. ఇవి యపశకునములు.

తే. ఉరుతరభ్రాంతి విహగంబు • లొప్పుచుండ
నిర్వికారాంగనయుఁబోలె • నీటు మెఱయు
నాపగను గాంచి కుడి కేలి • యంగుళమున
సైఁగఁ గావించె నా శుక • సారణులకు. ౭౧౫

అర్థములు. ఉరుతరభ్రాంతి=విస్తార భ్రమచే, విహగంబులు = పక్షులు, నిర్వికారాంగన=మనో వికారము లేని స్త్రీ.

తాత్పర్యము

(విస్తారమగు భ్రమచేఁ బక్షులుండ, మనోవికారము లేని స్త్రీవలెనీటుగలుగు నదిని జూచి కుడిచేతి వ్రేలితో శుకసారణులకు సైగచేసెను.)

శుకసారణులు నర్మద యెదురెక్కిపాఱు కారణము రావణుతోఁ జెప్పుట

ఉ. అన్నయుఁ దమ్ముఁడా నృపుని • యానతిఁ గైకొని పశ్చిమంబుగాఁ
గ్రన్నన మింటిత్రోవఁ జనఁ • గా నలువామడదూరమందుఁ దాఁ
గ్రొన్ననఁబోఁడిపిండులను • గూడి జలంబులఁ గ్రీడఁ దేలు చ
త్యున్నతసాలమో యనఁగ • నుండెడివానిని బూరుషోత్తమున్. ౭౧౬

అర్థములు. అన్నయుఁ దమ్ముఁడు=శుకుఁడు సారణుఁడు, క్రన్నన్=శీఘ్రముగా, క్రొన్ననఁబోఁడి పిండులను=స్త్రీల సమూహములను, అత్యున్నతసాలమో=మిక్కిలి పొడవైన వృక్షమో, పూరుషోత్తమున్=పురుషశ్రేష్ఠుని.

తాత్పర్యము

అన్నదమ్ములైన శుకసారణు లిరువురు రాజాజ్ఞ దీసికొని యాకాశమార్గంబునఁ బడమటదిశగా నలువామడ దూరము పోయి యచ్చట స్త్రీలతో జలక్రీడలాడుచు నెత్తైన వృక్షమువలె నున్న యొక పూరుషుని జూచిరి.

క, తోయవ్యాకులకుంతలుఁ, డై యొఱ్ఱని కనులతో మ • దాకులతేజుం
డై యుర్విని హాటకగిరి, వేయిపదంబులను నిలుపు • విధ మొప్పారన్. ౭౧౭

అర్థములు. తోయవ్యాకుల కుంతలుఁడై=నీటియందు చెదరియున్న తల వెండ్రుకలు గలవాఁడై, మదాకుల తేజుండై=మదముచేఁ గలఁత చెందిన తేజస్సు కలవాఁడై, హాటకగిరి=మేరువు, పదము=కొండక్రింది తిప్ప, ప్రత్యంత పర్వతము.

తాత్పర్యము.

నీటియందుఁ జెదరిన వెండ్రుకలు గలవాఁడై యొఱ్ఱని కనులతో, మదముచేఁ గలఁత చెందిన తేజస్సుతో భూమిని మేరువు వెయి వేయి పాదంబులతో నిలుపునట్లు

సీ. తనవేయికరములఁ దటినీలలామంబు, నాఁకట్టి క్రీడించు•నతులశౌర్య
సమదవశాసహ•స్రములతోఁ గ్రీడించు, మద వారణమునకు•మాద్రియగుచు
బాలావరాంగనా•జాలవృతుం డయి, కేళీవిలోలుఁడై • క్రాలువాని
నరిజనభ్రఁ దుఁడై • యద్భుత చరితుఁ డా, నర్జునుఁ జూచి ద•శాస్యుఁ జేరి
తే. వార లిట్లని రధిప వే•బాహు లొప్పు, వాఁడు జలకేళిఁ దేలుచు•న్నాఁడునదిని
నంగనలతోడఁ దనవేయి•హస్తములను, నడ్డగట్టఁగ నిది యెదు•రొడ్డిపాఱెఁగనిశ

అర్థములు. తటినీ లలామంబున్ = శ్రేష్ఠమైన నదిని, ఆఁకట్టి=అడ్డగించి, సమద=మదము పట్టిన, వశా=ఆఁడేనుఁగుల, మదవారణమునకున్=మదపుటేనుఁగునకు, మాద్రి=సమానము, బాలా=బాల నాయికలయొక్కయు పదునాఱు సంవత్సరముల స్త్రీకి బాల యని పేరు, వరాంగనా = యువతులయొక్కయు, జాలావృతుండయి=సమూహములతో చుట్టుకొనఁ బడినవాఁడై, కేళీవిలోలుఁడై=క్రీడయం దాసక్తి గలవాఁడై, అరిజనభయదుఁడై=విరోధులకు భయము గలిగించువాఁడై.

తాత్పర్యము

తన వేయి చేతులతో నేటిని నడ్డకట్టి యాఁడేనుఁగులతో గ్రీడించు మదపుటేనుఁగువలె బాలా నాయికలతోడను తరుణులతోను చుట్టఁబడినవాఁడై క్రీడయం దాసక్తి గలవాఁడై విరోధులకు భయంకరుఁడై యాశ్చర్యకరమైన నడవడికలవాఁడై యున్నయర్జునుఁ జూచి మరలి పోయి రావణుతో వారిట్లనిరి. రాజా! వేయి చేతులవాఁడు నదీజలములందు స్త్రీలతో జలక్రీడ లాడుచున్నాఁడు. తన వేయి చేతులతో నదిని నడ్డగించుటచే నిది యెదు రెక్కి పాఱుచున్నది.

**—• రావణుఁడు కార్తవీర్యార్జునతోఁ బోరఁ జనుట •—**

చ. అని శుకసారణుల్ పలుక • నాతఁడె యర్జునుఁ డంచు రావణుం
డనిపయిఁ గల్గుకాంక్ష వసు•ధాధిపుఁ డున్నెడ కేగుచుండ నీ
స్స్వనయుతమై రజంబుఁ గొని • వాయువు వీచెను సమ్ముఖంబుగా
వనదము రక్తవర్షమును • గ్రాల్చె సకృత్కృతభీమరావమై. ౭౧౯

అర్థములు. అనిపయి=యుద్ధముమీఁద, నిస్స్వనయుతమై=ధ్వనితోఁ గూడినదై, రజంబుఁగొని=దుమ్ముతో, సమ్ముఖంబుగాన్ = ఎదురుగా, వనదము=మేఘము, సకృత్+కృత+భీమరావమై=ఒక్కసారి చేయఁబడిన భయంకర ధ్వని కలదై. ఇవి యపశకునములు.

తాత్పర్యము

అని యిట్లు శుకసారణులు తెలుపఁగా వాఁడే యర్జునుఁడని యుద్ధకాంక్షచే రావణుఁడు రాజున్న చోటికిఁ బోవుచుండఁగా దుమ్ముతో నెదురుగాలి ఉవ్వాని వీచెను. ఒక్కసారియే యుఱిమి మేఘము రక్తవర్షము గురిసెను.

తే. అపుడు శుకసారణులును ధూ♦మ్రాక్షుఁడును మ
హోదరుండు మహాపార్శ్వుఁ ♦ డుక్కు మెఱసి
తోడ రాఁ జని మేచక♦తోయదాభుఁ
డనతిదూరంబునను గాంచె ♦ నవనినాథు. ౭౨౦

అర్థములు. మేచకతోయదాభున్=నల్లని మేఘముతో సమానుని, అనతిదూరంబునను=సమీపమందు, అవనినాథున్=రాజును.

తాత్పర్యము

(అపుడు శుకసారణులును, ధూమ్రాక్షుఁడును, మహోదరుఁడు మహాపార్శ్వుఁడు వెంటరాఁగా నల్లని మేఘముతో సమానుఁడగు సమీపమందుఁ నర్జునుని జూచెను.)

క. తొయ్యలులతోడ నీటను, నెయ్యంబునఁ గ్రీడ సలుపు ♦ నెఱసరిఁ గని తాఁ
జయ్యనఁ జని కన్నెఱ్ఱగ, నయ్యనిపుసచివతతికి♦ననియెం ముదమునన్. ౭౨౧

అర్థములు. తొయ్యలులతోడన్=స్త్రీలతో, నెయ్యంబునన్=చనువుతో, నెఱసరిన్=శూరుని, సచివతతిక్=మంత్రిసమూహమునకు.

తాత్పర్యము

(నీటిలో స్త్రీలతోఁ జనవుతోఁ గ్రీడించుచున్న శూరుఁడగు కార్తవీర్యార్జునునిఁ జూచి, తాను వెంటనే పోయి కన్నెఱ్ఱచేసి గర్వముతో తన మంత్రులతో ననెను.)

క. చెప్పవఁ జని యీపతికిం, జెప్పుఁడు దశకంఠుఁ డసుర♦శేఖరుఁ డనికై
కప్పురపడి వచ్చె నటం చప్పలుకుల నాలకించి ♦ యమ్మంత్రివరుల్. ౭౨౨

అర్థములు. కప్పురపడి=సంభ్రమము గలవాఁడై.

తాత్పర్యము

(రాక్షసశ్రేష్ఠుఁడయిన రావణుఁడు యుద్ధమునకై తొరపడి వచ్చినాడని యీ రాజునకుఁ జప్పునఁ బోయి చెప్పుఁడనఁగా విని యా మంత్రిశ్రేష్ఠులు.)

క. బలెబలె రాక్షసనాయక, కలనికి, నగు వేశెఁ జక్కఁ♦గా సెలఁగితి వాఁ
తెలువలను గూడి మత్తునఁ, దెలువారెదు వేశ రణము♦సేయఁగఁ బిలుతే? ౭౨౩

అర్థములు. కలనికిన్=యుద్ధమునకు, మత్తునన్=పారవశ్యముచే.

## తాత్పర్యము

బలేబలే రాక్షసరాజా! యుద్ధము చేయఁదగిన సమయము చక్కఁగా నెఱింగినవాఁడవు. ఈఁదువాండ్రతోఁ గ్రీడించుచు మత్తుగా నుండెడి సమయమందా, నీవు యుద్ధమునకుఁ బిలుచుట?

క. కుంజరగమనలకూటమి, రంజిల్లుచు నాఁడుకరులు • గ్రాలఁగఁ జుట్టున్
గుంజర మన నుండెడి నృప,కుంజరుతో నిదియ యదనో • కో పోరంగన్. ౭౨౮

అర్థములు. కుంజరగమనల=స్త్రీలయొక్క, కూటమిన్ = సాంగత్యముచే కుంజరము=ఏనుఁగు, అదనో కో=సమయమా?

## —• అర్జున రావణ మంత్రుల యుద్ధము •—

సీ. సైరింపు దశకంఠ! • యీరేయి చన నిమ్ము; యుద్ధమందాసక్తి • యున్న దేని
వలువాతఁ జనుదెమ్ము • పతితోడఁ బోరఁగఁ, గాదుకూడ దటంచుఁ • గడఁగె దేని
రారమ్ము మము గెల్చి • రాజుడాయఁగ బొమ్మటన్న రావణమంత్రు • లన్నృపాలు
ప్రెగడలఁ దాఁకిన • బీభత్సముగఁ బోరు, భయద,మై హలాహలా • ర్భటులఁ జెలఁగె
తే.నృపతి సచివులు శూలఖ • డ్గేషునికర,పాతముల రావణుని ముంపఁ • బ్రబలులౌ ప్ర
హస్తశుకసారణులు వారి • సతులశక్తి,నేలపాలొనరించిరి • నిమిషమునను. ౭౨౯

అర్థములు. తరువాత=ఉదయమున, ప్రెగడలన్ = మంత్రులను, శూలఖడ్గేషునికరపాతములను=శూలములయు కత్తులయు బాణములయు సమూహముల వైచుటచే.

## తాత్పర్యము

(ఓర్చుకో రావణా! యీ రాత్రి పోనిమ్ము. యుద్ధముచేయఁ గోరికకల దేని నుదయమున రమ్ము. రాజుగారితోఁ బోరవచ్చును. కాదు కూడదని పూనితివా, రా, రమ్ము మమ్ముగెలిచి యావల రాజు దగ్గఱకుఁ బొమ్ము. అని చెప్పఁగా,రావణుని మంత్రులా కార్తవీర్యార్జునుని మంత్రుల నెదిరించిన యుద్ధము భీతిగొలుపునదయి ప్రబల సింహనాదములు మెండయ్యెను, రాజమంత్రులు శూలములయు కత్తులయు బాణములయు సమూహములను వైచి రావణుని ముంచివేయఁగా బలవంతులైన ప్రహస్తుఁడు శుకుఁడు సారణుఁడు అనువారు సాటిలేని శక్తితో నిమిష మాత్రమున వారిని నేలపాలు చేసిరి.)

ఉ. ద్వారము రక్షసేయుభట • వర్గము దెల్పఁగ నీయుదంత మా
భూరమణుండు లేచి పువు • బోణులకున్ ధృతిసూక్తు లాడి యా
నీరము నుండి వెల్వడి చ • నెన్ గదఁ గొంచెదఁ గొంత లేక రో
షారుణనేత్రకంజుఁ డయి • యాశరుమాడ మణంప వేగిరై. ౭౩౦

అర్థములు. ఉదంతము=వార్త, ధృతిసూక్తులు = ధైర్యమువచ్చు మంచి మాటలు. రోషారుణనేత్రకంజుఁడు=కోపముచే నెఱ్ఱనైన నేత్రకమలములు గల వాఁడు, ఎదన్=హృదయము నందు, కొంకు=కొంకుచు, ఆశరు=రాక్షసుని, మాదము=మదము.

తాత్పర్యము

ఈ వార్త వాకిలి కావలిగాచువారు దెలుపఁగా నారాజు లేచి స్త్రీలకు ధైర్యము చెప్పి నీరు విడిచి లేచి బయటవచ్చి గదతీసికొని జంకక కోపముచే నెఱ్ఱనైన కన్నులతో రాక్షసుని గర్వ మణంప శీఘ్రముగా వచ్చెను.

—♦ కార్తవీర్యార్జునుఁడు ప్రహస్తునిఁ బడనడఁచుట ♦—

ఉ. గారుడవేగమైనగద ♦ గ్రాలఁ గరంబున వచ్చు నర్జునున్
వీరవరుం బ్రహస్తుఁడును ♦ వింధ్యము భాస్కరునట్లు నాఁగుచున్
గ్రూరము లోహబద్ధ మగు ♦ రోఁకలి రివ్వున యార్చినన్
మారుతమిత్రునట్టు లయి ♦ మండుచు వచ్చెడుదాని భూపుఁడున్. ౬౨

అర్థములు. గారుడవేగము=గరుడుని వేగము, లోహబద్ధము=ఉక్కుతో జేయఁబడినది, మారుతమిత్రునట్టులు=అగ్నివలె.

తాత్పర్యము

(గరుడునితో సాటియైన వేగముగల గద, చేబూనిఁ వచ్చు నర్జునునిఁ బ్రహస్తుఁడు, వింధ్యపర్వతము సూర్యుని నడ్డగించినట్లు, లాఁగుచు, భయంకరమగు నుక్కు రోఁకలి ఱివ్వునవేసి బొబ్బపెట్టఁగా, నగ్నివలె మండుచువచ్చు దానిని రాజును)

క. లీలగఁ దనగదచేతం, దూలించి ప్రహస్తు మీఁద ♦ దుమికి జవమునన్
గాలాయసగద బాహా, జాలంబులఁ ద్రిప్పి యడువ ♦ శతకోటిహతిన్. ౬౪

అర్థములు. కాలాయసగద=ఉక్కుగద, శతకోటి హతిన్=వజ్రాయుధము దెబ్బచే, అడువన్=కొట్టఁగా.

తాత్పర్యము

(విలాసముగఁ దనగదచేతఁబడఁగొట్టి, ప్రహస్తుని మీఁద దుమికి, వడిగా, నుక్కుగదను, దనచేతులతోఁ ద్రిప్పి, కొట్టగా, వజ్రాయుధపు దెబ్బచే.)

క. పర్వతముపోల్కినాతం, డుర్విపయిఁం గూల మిగిలి♦యున్న యమాత్యుల్
గర్వంబు వీడి తొలఁగిరి పర్వున భక్తికిని మిన్న ♦ ప్రాణభయంబే. ౬౫

తాత్పర్యము

పర్వతమువలె నతఁడు నేలపయిఁబడెను. అది చూచి తక్కిన మంత్రు లందఱు గర్వము విడిచి రాజెట్టులైనఁ బోనీ, మన ప్రాణము కాపాడు కొందమని పరువెత్తిరి. భక్తికంటె భయమే గొప్పది.

క. మారీచమహోదరశుక, సారణధూమ్రాక్షు లడలి • చనుటఁ బ్రహస్తుం
డీ రీతిఁ ద్రెళ్ళుటయుఁ గని, భూరమణునిఁ దాఁకెఁ బంక్తి • ముఖుఁ డుగ్రుండై ౨౩౦

### తాత్పర్యము

(మారీచుఁడు, మహోదరుఁడు శుకుఁడు, సారణుఁడు, ధూమ్రాక్షుఁడు, భయపడి పాఱిపోవుటయుఁ, బ్రహస్తుఁ డీవిధముగాఁ బడుటయుఁజూచి రావణుఁ డుగ్రుఁడై రాజును దాఁకెను.)

### — • రావణ కార్తవీర్యార్జునుల గదా యుద్ధము • —

సీ. పదినూర్ల చేతుల • వసుమతీ నాథుండు, నిరువదిచేతుల • సురవిరోధి
గదలను జేకొని • కదిసి రొండొరుఁ బొంగు, కడలులో మూలముల్ • విడిచి తాఁకు
కొండలో మండు మార్తాండులో దహియించు, నగ్నులో కరిణికై • యాగ్రహించి
దాఁకెడు మదయుక్త • దంతావళంబులో, గర్జిల్లు మబ్బులో • కడిమిమీఱు
తే. బొబ్బ మెకములో క్రుద్ధుఁడౌ • గిబ్బరాతో
గుదియదాలుపో నాఁ బోర • గదలు దాఁకు
నులివు పిడుగులరవళికి • నుద్దియగుచు
దండి ధ్వను లీను చుండె ది • బ్మండలముల. ౨౩౧

• అర్థములు. పొంగుకడలులు=ఉబ్బివచ్చు సముద్రములు, మూలముల్=పాదులు, కరిణికై=ఆఁడేనుఁగునకై, మదయుక్త=మదముతోఁ గూడిన, దంతావళంబులో=ఏనుఁగులో, కడిమిన్=బలముచే, బొబ్బమెకములు = సింహములు, గిబ్బరాతు=శివుఁడు, గుదియతాల్పు=యముఁడు, ఉలివు=ధ్వని, రవళికి=ధ్వనికి.

### తాత్పర్యము

వేయిచేతుల యర్జునుఁడు, ఇరువదిచేతుల దుర్జనుఁడు రావణుఁడు, గదలు తీసికొని యొకరి నొకరు పొంగు సముద్రములో, పాదులు విడిచిన కొండలో, మండు సూర్యులో, కాల్చునగ్నులో, ఆఁడేనుఁగునకై కోపించి, కలహించు మదపుటేనుఁగులో, ఉఱుము మేఘములో, ఱలముగల సింహములో, శివయములో యనునట్లు యుద్ధము చేయఁగా గదలొకదాని నొకటి కొట్టుధ్వని పిడుగుల ధ్వనికి సమానమై విస్తారముగ ధ్వనులు గలిగించుచుండెను.

క. మెఱుఁగుండీగె నభంబు, న్మెఱయించెడిమాడ్కిఁ దనరె • నృపవరుఁడు గదన్
జిఱజిఱ ద్రిప్పి సురాహితు, పఱపగు వక్షమునఁ బడగ • బరఁగింపన్. ౨౩౨

అర్థములు. నభంబున్=ఆకాశమును, సురాహితు=రాక్షసుని, పఱపగు=విశాలమైన.

తాత్పర్యము

రాజు గద గిర గిర ద్రిప్పి రావణుని వెడలుపాటి యురమున వేయఁగానది యాకాశమున మెఱుఁగు దీఁగవలె నుండెను.

క. రక్షోధిపుగద యర్జును, వక్షంబున గిరిని నుల్క • పగిది వెలింగెన్
దక్షులకు మున్ను బలికి ఋ; భుక్షునకుంబోలెఁ జెల్లెఁ • బోరు భయదమై. ౨౩౩

తాత్పర్యము

రావణుఁడు వేసినగద యర్జును వక్షమందు కొండమీఁదఁ గొఱివివలె నుండెను. రావణార్జునులకు బలికి నింద్రునకు జరిగిన యుద్ధమువలె జరిగెను.

క. కొమ్ములతోఁ గోడెలు దం, తమ్ములతోఁ గరులు కెరలి • తాఁకెడిగతి వా
రిమ్ముగ నొండొరుఁ దాఁకి భ, యమ్ము కలంకువయు లేక • యడిచిరి గదలన్. ౨౩౪

తాత్పర్యము

(కొమ్ములతోఁ గోడెలును, దంతములతో, నేనుఁగులును జెలరేఁగిపోరాడిన విధముగా వారొకరినొకరెదిరించి భయము, కలఁతలేనివారై, గదలతోఁ గొట్టుకొనిరి.)

ఉ. ఆయెడఁ గార్తవీర్యుడు ని • జాఖిలశక్తి కొలంది మానవభు
గ్నాయకువక్షముం గదను • గాటముగాఁ బ్రహరింప దేవతా
గ్రేయవరావితుం డగుటఁ • గీడ్పడఁ డాతఁడు బెండువోలె రెం
డై యొఱగెన్ ధరాస్థలిని నా గద, యట్టుల యయ్యు, దద్ధతిన్. ౨౩౫

అర్థములు. నిజాఖిలశక్తి కొలంది=తన సమస్తశక్తి కొలఁది, మానవభుక్ + నాయకు=రాక్షసరాజుయొక్క, ప్రహరింపన్=కొట్టఁగా, దేవతాగ్రేయ = దేవ శ్రేష్ఠులైన, శివబ్రహ్మలు, వర=వరములచే, అవితుఁడు=రక్షింపఁబడినవాఁడు, శివ బ్రహ్మలు దీర్ఘాయు విచ్చిరి గావున నా దెబ్బకుఁ జావఁడయ్యె, మనుష్యులచేఁజావ నట్లు వరములేదు, కీడ్పడఁడు=కీడు పొందినవాఁడు కాఁడు, తద్ధతిన్=ఆ దెబ్బచే.

తాత్పర్యము

ఆసమయమందు నర్జునుఁడు తనశక్తి కొలఁది గదతో రావణుని వక్షముపైఁ గొట్టఁగా బ్రహ్మశివుల వరములచే రక్షింపఁబడువాఁడు కావున వాఁడు కీడు పొందినవాఁడు కాఁడు. ఆగదయే రెండు తునుకలై బెండువలె నేలఁ బడిపోయెను, గాని యా దెబ్బచే.

—* కార్తవీర్యార్జునుఁడు రావణు బంధించి పురికిఁ గొనిపోవుట *—

క. తూలుచుఁ బిఱిఁదికి వెనుఁ జని, నాలుగు మూరలతలంబు • నం బడె బాధా
తూలితుఁడై విహ్వలుఁడై, యాలావరిపాటుఁ గాంచి • యవనీవిభుఁడున్. ౨౩౬

అర్థములు. సోలుచున్=బాధచే వణఁకుచు, పిఱుఁదికి=వెనుకకు, బాధాలోలితుఁడై=బాధచేఁ జలించిన వాఁడై విహ్వలుఁడై = వెలవెలఁబోయినవాఁడై, లావరి=బలశాలి.

తాత్పర్యము

అఱచుచు వెనుకకు నాలుగు మూరల దూరముపోయి యచట నేలఁబడి బాధ పడెను. ఆ బలశాలి పాటుచూచి యర్జునుఁడు-

క. పాముపకై కవిసెడి గరు, టామంతునిఁబోలు చుం దటాన నతనిపై
  భూమీశుఁడు వడి బలినిన్, వామను గతిఁ బట్టి కట్టె • బలవంతముగన్. ౭౩౮

అర్థములు. గరుటామంతుని=గరుత్మంతుని. తటాన=ఉన్నట్టుండి.

తాత్పర్యము.

(పామునకయి కవిసెడి గరుత్మంతునివలెఁ దటాలున పైపడి కార్తవీర్యార్జునుఁడు రావణుని, బలిచక్రవర్తిని వామనమూర్తి పట్టికట్టినట్లు బలవంతముగా కట్టివేసెను.)

ఉ. రాక్షసనాథుఁగట్టిన ధ•రాపతి మెచ్చిరి సిద్ధచారణుల్
  యక్షులు దేవతావళి యి•లాపతిపై సుమవృష్టి రాల్చె హ
  ర్యక్షము దంతినింబలె సు•రారిని బట్టి గళార్భటుల్ జగ
  త్ప్రక్షుభితంబుగా నినిచెఁ • బంక్తిముఖాసురుఁ డున్న దుస్థితిన్. ౭౩౯

అర్థములు. ఇలాపతిపై=రాజుమీఁద, హర్యక్షము=సింహము, దంతినింబలెన్=ఏనుఁగునువలె, గళార్భటుల్=కంఠధ్వనులు, జగత్+ప్రక్షుభితంబుగాన్=లోకము కలఁత చెందునట్లు, నినిచెన్=నింపించెను.

తాత్పర్యము

(రావణునిఁ గట్టివేయఁగా రాజును సిద్ధచారణులు యక్షులు మెచ్చుకొనిరి. దేవతలు పూలవాన గురిసిరి. సింహ మేనుఁగునువలె రావణునిఁ బట్టుకొని సింహనాదమున జగములు కలఁతచెందునట్లు నింపించెను. రావణాసురుని దుస్థితిని.)

తే. తెప్పిఱిల్లి ప్రహస్తుండు• తెలిసిచూచి, కల సురారుల జతఁగూర్చుఁ•గారుమబ్బు
  లోలి మూఁగినకరణి భూ•పాలు ముసరి, వివిధసాధన చయముల•విసరి విసరి. ౭౪౦

అర్థములు. కల=అచ్చటనున్న, కారు మబ్బులు=వానకాలము మబ్బులు.

తాత్పర్యము

(ప్రహస్తుఁడు తెప్పితేల తెలిసిపాఱఁజూచి, తక్కిన రాక్షసులను జతఁగూర్చుకొనఁగా వారు, కారుమబ్బులు క్రమ్మిన విధముగా, రాజును ముసురుకొని, వివిధములయిన యాయుధములను విసరి విసరి.)

చ. నిలు నిలు పోకు పోకు రజనీ • చరనాయకు వీడు వీడు మం
చలఘురవంబునం బలుకు • చర్జును పైఁ బలలాశి సంఘముల్
పిలపిల మూఁగి శూలములఁ • బెద్దకటారుల నైవ వాని న
బ్బలియుఁడు పట్టి వారిపయి • వైచె భయంపడి వారు పాఱఁగన్. ౭౪౦

అర్థములు. పలలాశి సంఘముల్=రాక్షసుల గుంపులు.

తాత్పర్యము

(నిలు-నిలు-పోకు-పోకు-రావణుని విడిచిపెట్టు, విడిచిపెట్టు, అని పెద్దగా నఱచుచు, నర్జునుని మీఁద రాకాసి మూఁకలు, బిల బిల మూఁగి శూలములను బెద్దకత్తులను వేయఁగా వాని నా బలవంతుఁడు పట్టుకొని భయపడి పాఱిపోవునట్లు వారిమీఁదఁ దిరిగి వేసెను.)

క. పెనుగాలికి మబ్బులవలెన్, దనుజావళి దూలి పఱవ • దశవక్త్రునితోఁ
దననగరము పౌరులు జయ, నినదంబుల మెచ్చ ధారి•ణీపతి చొచ్చెన్. ౭౪౧

తాత్పర్యము

(పెద్దగాలికి మబ్బులు చెదరిపోవునట్లు రాక్షసులు చెదరి పాఱిపోవఁగా, దన పట్టనములోని పౌరులు జయ జయ ధ్వనులు చేయుచు మెచ్చుకొనుచుండ రాజు రావణునితోఁ బట్టనములోఁ బ్రవేశించెను.)

—• పులస్త్యుఁడు రావణుని విడిపించుకొని పోవుట •—

ఉ. అలవునగాలి మూటనిడి • పట్టిది రావణు బంది నుంచుటల్
జలదపథంబునన్ సురలు • సమ్మతిఁ జెప్పికొనం బులస్త్యుఁ డా
పలుకులు నాలకించి తన•పట్టిసుతుం డను నెయ్య మూని తాఁ
బెలుచని వేగమార నను•వీథిని వచ్చె మరుజ్జవంబునన్. ౭౪౨

అర్థములు. అలవునన్=బలముచే, బందిన్=చెఱసాలయందు, జలద పథంబునన్=ఆకాశమున. పెలుచని=అధికమైన, మరుజ్జవంబునన్=వాయువేగమున.

తాత్పర్యము

(దేవత లాకసమున నిలిచి, రావణునిఁ బట్టి, కట్టి చెఱసాలయం దుంచుట బలముచే గాలిని మూట కట్టుట వంటిది సుమా యని చెప్పుకొను చుండఁగా, విని, పులస్త్యుఁడు, తన కొడుకు కొడుకుగదా యను ప్రేమతో వాయువేగమున నాకాశ మార్గము నుండి గబ గబ వచ్చెను.)

తే. వచ్చి యమరావతీసన్ని•భంబు పుష్ట, హృష్టలోకాన్వితంబు మా•హిష్మతీపు
రంబు మునిచొచ్చి తనరాక•రాజునకును, జెప్పిపుచ్చిన వారలు•క్షితితలేంద్రు.

అర్థములు. అమరావతీ నిభంబు=ఇంద్రుని నగరముతో సమానమైనది. పుష్ట=బలిసినట్టియు, హృష్ట=సంతోషముతోఁ గూడినట్టియు, లోక=జనులచే, అన్వితంబు=కూడినది, క్షితితలేంద్రున్=రాజును.

తాత్పర్యము

(వచ్చి, యమరావతితో సాటియై, పుష్టి సంతుష్టిగల జనులతోనున్న మాహిష్మతీపత్తనములోఁ బ్రవేశించి, తాను వచ్చిన సంగతి, రాజునకుఁ జెప్పి పంపఁగా, వారు, రాజును-)

క. చేరంజని నృప! పదసం,చారుం డగు రవినిబోలి • చండమహాతే
  జోరాశిదుర్నిరీక్ష్యుం,డై రాజులుముని పులస్త్యుఁ • డరుదెంచెనన్. ౭౮౮

అర్థములు. పదసంచారుఁడు=కాళ్ళతో నడచువాఁడు, రవిని=సూర్యుని, చండమహాతేజోరాశి = తీక్ష్ణమైన గొప్ప తేజస్సు సమూహముచే, దుర్నిరీక్ష్యుండై=తేఱిచూడరానివాఁడై.

తాత్పర్యము

సమీపించి రాజా! కాళ్ళతో నడచు సూర్యుని వలెఁ దీవ్ర తేజస్సుచేఁ జూడరాని వాఁడైన పులస్త్య మహాముని వచ్చినాఁడని చెప్పఁగాఁ

సీ. అర్ఘ్యంబు మధుపర్క•మాత్మపురోహితుల్,గొని వెంటరాఁగ శ•క్రుండుగురుని
  నెదురుకొనం బోవు•చదురున శిరమునఁ, గరములు చేరిచి • కదిలిపోయి
  యర్ఘ్యంబు పాద్యంబు•నావును మధుపర్క,మిచ్చి సంతోషంబు• హెచ్చమదిని
  లోనికిఁ దోడ్తెచ్చి • మానితసూక్తుల, సంస్తుతించుచు హర్ష•సంభ్రమమున
తే. గద్గదోక్తుల నిట్లనుఁ గంజసంభ, వాభ! నీ విందు వచ్చుట•నమరపురికి
  దీటుగా నయ్యె మాహిష్మ•తీపురంబు, నేను జేసిన భాగ్యంబు•నిస్తులంబు. ౭౮౯

అర్థములు. చదురున=విధముగా, గద్గదోక్తులన్=డగ్గుత్తికతోఁ గూడిన మాటలచే, కంజసంభవాభ=బ్రహ్మతో సమానుఁడా, నిస్తులంబు=అసమానము.

తాత్పర్యము

తన పురోహితు లర్ఘ్యము పాద్యము తీసికొని రాఁగా నింద్రుఁడు బృహస్పతిని వలె నెదురుగా శిరస్సునందుఁ జేతులు జోడించుకొనిపోయి యర్ఘ్యము పాద్యము గోవు మధుపర్క మిచ్చి సంతోషముతో నింటిలోనికిఁ దోడితెచ్చి గౌరవోక్తుల స్తుతించుచు సంతోష సంభ్రమంబున డగ్గుత్తికతో నిట్లనియె. బ్రహ్మసమాన! నీవిచ్చటికి వచ్చిన కారణమున మాహిష్మతీపురము దేవేంద్రునగరమునకు సరి యయ్యెను. నేను జేసిన పుణ్య మసమానము.

క. ఎవ్వరికి గోచరింపక, యవ్విబుధులచేతఁ బూజ ♦ లందెడి నిన్నే
నివ్విటఁ గాంచి పూజల, నివ్విధి నర్పించుటను ద్వి♦జేంద్రుఁడ నైతిన్. ౭౮౬

తా త్ప ర్య ము

నీవు మనుష్యుల కెవ్వరికిఁ గానవచ్చువాఁడవు కావు. దేవతలు నిన్నుఁ బూజించుచుందురు. అట్టి నిన్ను నా యింటిలోఁ జూచి యీ విధముగఁ బూజించుటచే నేనే ద్విజులందు శ్రేష్ఠుఁడను

క. ఇప్పుడువో నా కుశలం, బిప్పుడువో నా వ్రతంబు ♦ లీడేఱెను నా
కిప్పుడు జన్మము సార్థక, మిప్పుడువో తపము పండెఁ♦గృతమతి నైతిన్. ౭౮౭

తా త్ప ర్య ము

(ఇప్పుడేకదా నాకు కుశలము. ఇప్పుడేకదా నా వ్రతములు నెఱవేఱినవి. నా జన్మమిప్పుడు కదా సార్థకమైనది? ఇప్పుడుకదా నేను జేసిన తపస్సుపండినది. నేను కృతార్థుఁడనయితి నిప్పుడుకదా.)

క. ఈ రాజ్యం బీపుత్రులు, నీ రమణులు నెల్లవార ♦ లేను మునీ! నీ
వారము కార్యం బెయ్యది, కారుణ్యమతీ! యనుజ్ఞఁ ♦ గావింపగదే? ౭౮౮

తా త్ప ర్య ము

• (ఈ రాజ్యము యీ పుత్రులు, యీభార్యలు నేను, మునీంద్రా!నీవారము ఏమిపని? దయాశాలీ! సెలవిమ్ము)

ఉ. నావుడు హైహయాధిపుని ♦ నందను లెల్లరు లెస్సలా? సుఖం
బా వరవర్ణినీతతికి? ♦ వగ్నులు చక్కఁగ నున్నె? ధర్మ మెం
దేవిధలోపముం గలుగ ♦ కెప్పుడు వర్తిలునే? యటంచు న
ద్భావుఁడు ప్రశ్న చేసి దశ ♦ వక్త్రుని గెల్చిన కీర్తిపూరితా! ౭౮౯

అర్థములు. హైహయాధిపునిన్=హైహయవంశాధిపతిని, వరవర్ణినీతతికిన్= స్త్రీలకు, భార్యలకు.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, హైహయవంశప్రభువగు కార్తవీర్యార్జునునిఁ జూచి, నీ కొడుకులు సుఖముగా నున్నారా? నీ భార్యలకు క్షేమమా? అగ్నులు చక్కఁగ నున్నవా? ధర్మమునందెట్టి లోపములేక చక్కఁగ సాగుచున్నదా? యని మంచి మనసుగల యీ పులస్త్యముని కుశలప్రశ్నముచేసి, రావణునిఁ గెల్చిన కీర్తిదిక్కుల నింపితివి!)

తాత్పర్యము

ఉ. ఎవ్వనిపేరు విన్నఁ జలి•యింపక నిల్చు మరున్మహోదధుల్
నివ్వెఱ; నట్టి వీరు నవ•నీధవ! దుర్జయు నాదు మన్మనిన్
జివ్వను బట్టి బద్ధునిఁగఁ • జేసి కుమారుని కీర్తిపూరమున్
గ్రొవ్వఱఁ గ్రోలితైచితివి • కోటివిధంబుల నిన్ను మెచ్చితిన్. ౭౫౧

అర్థములు. మరుత్+మహోదధుల్=గాలి, సముద్రము, నివ్వెఱన్=నిండు భయముతో, అవనీధవ దుర్జయున్=రాజులకు జయింపరాని వానిని, చివ్వను=యుద్ధమునందు, కుమారుని=చిన్నవాని, కీర్తిపూరమున్ = కీర్తిప్రవాహమును, క్రొవ్వఱన్=వాని గర్వము క్షయించునట్లు, క్రోలి=త్రాగి.

తాత్పర్యము

ఎవనిపేరు వినినంత మాత్రమునసే భయపడి గాలి సముద్రుఁడు కదలకనిలుతురో, యెవఁడు రాజులకు జయింపరానివాఁడో యట్టి నా మనుమని యుద్ధమునందు బట్టి కట్టివైచితివి. వాని యశఃప్రవాహమును వాని గర్వ మణఁగునట్లు త్రాగితివి. నిన్నుఁ గోటివిధంబుల మెచ్చితిని.

క. మా పిల్లవానిపై నీకుఁ, గోపంబును మాను నాదు•కోరిక యిది వే
సౌపుము చెఱనుండి నృపా,లా! పంక్తిగ్రీవు ననఁ ద•లంపక నొయ్యన్. ౭౫౧

తాత్పర్యము

(రాజా! మాపిల్లవాని మీఁదఁ గోపము మానుము. వెంటనే రావణుని చెఱసాల నుండి విడిచి పుచ్చుము. ఇది నాకోరిక; అనియనఁగానే, మఱుమాటాడక.)

క. మునివర్యుని ప్రీతికినై, జనవర్యుఁడు విడిచి పుచ్చె • సమ్మదమున న
ద్దనుజాధిపు వారిరువురు; జనసుత గావించి రగ్ని•సాక్షిగఁ జెలిమిన్. ౭౫౨

తాత్పర్యము

(మునిరాజు సంతోషించుటకయి, రాజు, సంతోషముగా రావణునిఁ జెఱనుండి విడిపించెను. వారిరువు రగ్నిసాక్షిగ స్నేహము చేసిరి.)

క. ఒండొరు లిఁక బాధింపక, యుండఁగ నెయ్యంబు చేసి • యుర్వీంద్రుండున్
నిండారుభక్తి మునిపే, తండమునకు మ్రొక్కి చని రెఁ•దనగృహమునకున్. ౭౫౩

అర్థములు. మునిపేతండమునకు=మునిశ్రేష్ఠునకు

తాత్పర్యము

(ఒకరి నొకరు బాధించుకోనకుండ స్నేహముచేసికొని, రాజేంద్రుఁడు పులస్త్య మునికి నిండారు భక్తితో దండము సమర్పించి తన యింటికిఁ బోయెను.

క. ఆతిథ్యముఁ గొని నృపుచే, నీతులు బోధింపఁ దాత ♦ నెఱి విని లజ్జా
 న్వితుండై లంకకుఁ జనె, దైతేయుఁడు చనియె ముని పి♦తామహుభువికిన్. ౭౫౪

 అర్థములు. లజ్జాన్వితుండై=సిగ్గుగలవాఁడై, పితామహు భువికిన్=సత్య
లోకమునకు.

తా త్ప ర్య ము

 (రాజుచే నాతిథ్యమును బొంది, తాతయైన పులస్త్యుండు నీతులు బోధిం
పఁగా విని సిగ్గుతో రావణుఁడు లంకకుఁ బోయెను. ముని సత్యలోకమునకుఁ
బోయెను.)

ఉ. వింటివె రామచంద్ర! నృప♦వీరునిచే దశకంఠుఁ డెట్లు దా
 గంటువ బద్ధుఁడై విడువఁ ♦ గాంచె విముక్తిఁ బులస్త్యవాక్కుచే
 గొంటుతనాన నన్యులకుఁ ♦ గూడ దవజ్ఞ యొనర్ప నెంత దా
 బంటయినన్, ధరిత్రి బల♦వంతులకున్ బలవంతు లుండరే? ౭౫౫

 అర్థములు. అవజ్ఞ=అవమానము, బంటు=శూరుడు, బలవంతులకున్=
బలవంతుల కంటెను ప్రౌఢు లన్నడి వారిని దల దన్నువారు లేరా?

తా త్ప ర్య ము

 (రామచంద్రా! వింటివి కదా? కార్తవీర్యార్జునునిచే రావణుఁ డే ప్రకారము
పోరిలో నోటువడి పట్టుపడి పులస్త్యుని మాటచేఁ బిదప విడువఁబడినది. తానెంత
మొనగాడయినను నితరుల నవమానింప రాదు. బలవంతులకు పైన బలవంతు
లుండరా. ప్రౌఢులన్నడి వారిని దలదన్నువారు లేరా !)

తే. రక్కసుల ఱేఁడు హైహయ♦రాజుతోడ
 మైత్రి యొనరించి వెండియు♦ధాత్రిఁ దిరుగు
 చుండెఁ బోవరున ధారిణీ♦శోత్కరమున
 కోటమిని గూర్ప లజ్జయన్ ♦ మాట లేక. ౭౫౬

 అర్థములు. ధారిణీశోత్కరమునకున్ = రాజసమూహమునకు, ఓటమి=
పరాజయము.

తా త్ప ర్య ము

 (రావణుఁడు కార్తవీర్యార్జునునితో స్నేహము చేసి, తరువాత మరలరాజుల
నోడింపవలె నని, పొగరుచే బిడియములేక భూమిమీఁదఁ దిరుగుచుండెను.

**—♦ రావణుఁడు వాలితో యుద్ధంబు సేయఁ గిష్కింధకుఁ బోవుట ♦—**

ఉ. గంధగజేంద్రసన్నిభుఁడు ♦ దుర్మజనులందును రాక్షసాళి నే
 బంధురవిక్రమున్ వినినఁ ♦ బంక్తిముఖుం డటకేగి పిల్చు ద
 ర్పాంధత నాజి కిట్లు భువ♦నాళిఁ జరించుచు నొక్కనాఁడు కి
 ష్కింధకు వచ్చి పిల్చె రణ♦కేళికి వాలిని హేమమాలినిన్. ౭౫౭

అర్థములు. గంధగజేంద్రసన్నిభుఁడు=మదపుటేనుఁగుతో సమానుఁడు, బంధుర విక్రమున్=అధిక పరాక్రమము గలవానిని, దర్పాంధత=గర్వము వలనఁ గన్నులు గానక, అజికిన్=యుద్ధమునకు, హేమమాలినిన్ = బంగారు హారము గలవానిని.

తా త్ప ర్య ము

మదపుటేనుగుతో సమానుఁడైన రావణుఁడు భూమియందలి మనుష్యులందు గాని రాక్షసులందుఁగాని పరాక్రమవంతుఁ డను పేరు వినినా యచ్చటికిఁ బోయి వానిని యుద్ధమునకుఁ బిల్చుచు నీ విధముగ లోకములఁ దిరుగుచు నొక్క-నాఁడు కిష్కింధకువచ్చి బంగారుహారము ధరించిన వాలిని యుద్ధమునకుఁబిలిచెను.

క. తారుండును సుగ్రీవుఁడు, తారాజనకుండు వచ్చి • దశకంధరుతో
  నూరను లేఁడు భవత్ప్రతి, వీరుం డగు వాలి యొకరిఁ • బిలిచెద వనికిన్. ౭౫౫

అర్థములు. తారాజనకుండు=సుషేణుఁడు భవత్=నీకు, ప్రతి వీరుఁడు=ఎదురగు వీరుఁడు.

తా త్ప ర్య ము

(తారుఁడు సుగ్రీవుఁడు సుషేణుఁడు వచ్చి రావణునితోఁ నీకుద్దియైనవీరుఁడు వాలి యూరలేఁడు, యుద్ధమున కెవరిఁ బిలిచెదవు?)

సీ. ఎవ్వనచారి ని • న్నెదిరింపఁ జాలెడి, వాలి దక్క-ఁగ దశ • వక్త్ర! యతఁడు
  సంధ్య వార్పఁగ నాల్గు • సంద్రంబులకు నేఁగె, నించుక నిలు మతఁ • డిపుడ వచ్చు
  వాలితో నని సేయ • వచ్చినవారల, శంఖవళిత్తాస్థి • చయముఁ గనుము
  అమృతంబుఁ ద్రావి నీ • వరుదెంచితేన్ వాలిఁ, జెనకిన నంతతోఁ • జెల్లెదీవు
తే. సర్వజనచిత్రశీలి మా • స్వర్ణమాలిఁ, దొడరితివ యేని నీ మనిక్కి- • దుర్లభంబు
  గాన జక్క-ఁగ నూరికిఁ గదలుగాక, చావవలతేని వాలికై • సరగఁ జనుము.

అర్థములు. సంద్రంబులకున్ = సముద్రములకు, శంఖవళిత్తాస్థిచయము= శంఖమువలెఁ దెల్లనైన యెముకల సమూహము, చెల్లెదు=చచ్చెదవు.

తా త్ప ర్య ము

దశకంఠా! నిన్ను వాలిదప్ప నే వానరుఁ డెదిరింపఁజాలును? వాలి సంధ్య వార్చుటకై నాలుగు సముద్రములకుఁ బోయి యున్నాఁడు. కొంచెముసేపు నిలిచిన నతఁడు వచ్చును. వాలితో యుద్ధముచేయ వచ్చినవారి శంఖమునవలె తెల్లనియెముకలరాశి చూడుము. నీ వమృతము ద్రావి వచ్చినను వాలితో నెదిరించితివా చచ్చిన వాఁడవే. సమస్తజనులకు నాశ్చర్యకరమైన శీలము గల మా స్వర్ణమాలిని నెదిరించితివా నీవు బ్రదుకుట కష్టము. కావునఁ జక్కఁగా నూరికిఁ బొమ్ము చావఁ గోరిక యుండెనా వాలిని వెదకుచుఁ బొమ్ము.

శా. ఆతం డిప్పుడు దక్షిణాబ్ధితటి సం•ధ్యాసక్తుం డై పావక
స్ఫీతాతుల్యమహోగ్రతేజుం డయి యు•ర్వీస్థుండు నై యుండునా
నా తారప్లవగేంద్రునిం గదిమిచ • య్యం బుష్పకారూఢుం డై
దైతేయాగ్రణి దక్షిణాంబునిధికై • తాం బోయి యం దొక్కచోన్. ౭౬౦

అర్థములు. దక్షిణాబ్ధితటిన్=దక్షిణసముద్రతీరమునందు, సంధ్యాసక్తుం డై=సంధ్యవార్చుటయందు దాసక్తుం డై, పావక=అగ్నిహోత్రునియొక్క, స్ఫీత=ప్రసిద్ధమైన, అతుల్య=అసమానమైన, మహోగ్ర=మిగుల భయంకరమైన, తేజుండయి=తేజస్సు గలవాండై, ఉర్వీస్థుండు=భూమి యందున్నవాండు,నాన్=ఇట్లు చెప్పంగా కదిమి=అదలించి.

తాత్పర్యము

(ఆతండిప్పుడు దక్షిణ సముద్రము తీరమున నగ్నితో సాటియైన గొప్ప భయంకరమయిన తేజస్సుగలవాండై సంధ్యవార్చుటకై భూమియం దున్నవాండు. అని చెప్పంగా, తారుండను వానరేంద్రుని నదలించి వెంటనే పుష్పకమెక్కి రావణుండు దక్షిణ సముద్రమునకుం బోయి, యందొక్క చోట.)

క. భాసురహాటకగిరినిభు, వాసవసుతు బాలసూర్య•వదనుని సంధ్యో
పాసనతత్పరుం గనుంగొని, యాసోకులతేండు వ్యోమ•యానము డిగియెన్. ౭౬౧

అర్థములు. భాసుర=ప్రకాశించు, హాటకగిరి=మేరు పర్వతముతో, నిభ=సమానమైన వానిని, వాసవసుతున్=ఇంద్రుని కుమారుని, బాలసూర్య వదనుని=లేంత సూర్యుని వంటి ముఖము గలవానిని, సంధ్యోపాసనతత్పరున్=సంధ్య నుపాసించుటయందు ఆసక్తి గలవానిని, సోకులతేండు=రాక్షసరాజు.

తాత్పర్యము

మేరు పర్వతముతో సమానుండై న యింద్రపుత్రుని బాలసూర్యుని కాంతి గలవానిని సంధ్యవార్చు ప్రయత్నమందున్న వానిని చూచి రావణుండు విమానము దిగెను.

స్నానము చేసి సంధ్య వార్చవలయును గావున స్నానము చేయుటకై యత్నించు వాని నని యర్థము.

క. తెప్పున డిగి తనపదములు, చప్పుడు గాకుండ నరిగి • సుత్రామిని దా
దప్పక పట్టం దలంచుచు, నెప్పునం జనుచుండ వాని • నిర్భాగ్యమునన్. ౭౬౨

అర్థములు. సౌత్రామిని=వాలిని, సుత్రాముని కొడుకు సౌత్రామి, సుత్రాముండు=ఇంద్రుండు, నెప్పునన్=నేర్పున, ఉపాయముగ, వాని నిర్భాగ్యమునన్=వాని దురదృష్టముచే.

తాత్పర్యము

(చప్పున దిగి, చప్పుడుగాకుండ నడుగిలో నడుగు పెట్టుచుఁ బోయి వాలినిఁ దప్పక పట్టవలె నని నేర్పునఁ బోవుచుండ వాని దురదృష్టముచే.)

క. ఎట్టులో యదృచ్ఛ నింద్రుని, పట్టియుఁ గడకంటఁ జూచి • పాపాశయుఁ డా
నిట్టట్టు కదల కేమియుఁ, దొట్టగిలంబడక యుండె • నొల్లిటిరీతిన్. ౭౬౩

అర్థములు. యదృచ్ఛన్ = ఆకస్మికముగ, పాపాశయున్=పాపపు టభిప్రాయము గలవానిని, మోసగించి తన్నుఁ బట్టదలంచిన వానిని, తొట్టగిలంబడక= తొట్రుపడక, సంభ్రమపడక.

తాత్పర్యము

ఆకస్మికముగ నుద్దేశము లేకయే యెట్లో వాలి యా దురభిప్రాయము గల రావణుఁ జూచి వాని యభిప్రాయ మెఱింగి యిట్టట్టు కదలక యేమియు సంభ్రమ పడక మునుపటివలెనే కదలకుండెను.

తే. చెవులపిల్లిని జూచిన•సింహ మనఁగఁ బాముఁ గనుఁగొన్న గరుడుని•పగిదిగాఁగ
నరకు సేయక తనుఁ బట్టఁ•జిక్కవచ్చు, పంక్తికంఠునిఁగూర్చి యా•వ్వాలి తలఁచు

తాత్పర్యము

(చెవుల పిల్లినిఁ జూచి సింహమువలెఁ, బామును జూచిన గరుడుని పగిది, వాలి, తనను బట్టవచ్చెడి రావణుని లెక్క చేయక, తనలో నిట్లని తలఁచెను.)

ఉ. పాపపుబుద్ధి వీఁడు నను • బట్టఁదలంచెను బొంచి వీని నే
నేపునఁ జంకలో నిఱికి • యేగెద నబ్ధులమూఁట నాడఁగా
ద్యోపథమందు వ్రేలఁ దన • యూరులు హస్తము లంబరంబునన్
జేపడి వైనతేయునకుఁ • జేడ్పడుపామునుబోలి స్రుక్కఁగన్. ౭౬౪

అర్థములు. ఏపునన్=బలముచే, ఇఱికించుకొని, ద్యోపథమందు = ఆకాశ మార్గమున, వైనతేయునకు=గరుత్మంతునకు.

తాత్పర్యము

పాపపు బుద్ధిగల వీఁడు నన్నుఁ బొంచి పట్టదలఁచి వచ్చుచున్నాఁడు. రానిమ్ము. వీనిని జంకలో నిఱికించుకొని మూఁడు సముద్రములలో స్నానముచేయ బోయెదను, అప్పుడు వీని తొడలు చేతులు నాకాశమున వ్రేలాడుచు గరుత్మంతునకుఁ జిక్కి బాధపడు పామువలె స్రుక్కును.

క. అని తలపోయుచుఁ జెవి యా,తనిమీఁదనె యుంచి మునితెఁ•దగు శ్రుతిమంత్రం
బును జపియించుచు నుండెను, ఘనబలు లొండొరును బట్టఁ•గా జతనమునన్.

తా త్ప ర్య ము

అని మనస్సులో నాలోచించుచు వాని కాలి చప్పుడు తెలియుటకుఁగాను చెవి వానియందే యుంచి మౌనియై వేదమంత్రమును జపించుచు నుండెను. ఈ ప్రకారము మహాబలశాలు లిరువురు నొకరి నొకరు ప్రయత్నించి పట్టఁగా.

ఇందు వాలికి వేదమంత్రము, గాయత్రి కలిగినట్లు చెప్పుటచే నతఁడు మృగజాతిలోఁ జేరినవాఁడు కాఁడనియు మనుష్యులలో, క్షత్రియజాతిలో చేరిన వాఁడనియు వాలము గలవాఁడనియు నేర్పడుచున్నది.

**—♦ వాలి రావణుఁ జంక నిఱికి సముద్రంబుల మునుంగుట ♦—**

చ. తలఁపఁగ నంత రావణుఁడు ♦ దాసినజాడ పరాఙ్ముఖుండు నై
వలిముఖనాయకుం డతని ♦ పాద రవాన నెఱంగె, నింతలో
బల దనుజుండు వానరునిఁ♦బట్టఁగఁ జేతులు సాఁప గ్రక్కునన్
బలియుఁడు వాసవాత్మజుఁడు ♦ పాము సుపర్ణుఁడు పట్టుకైవడిన్. ౭౬౭

అర్థములు. దాసిన జాడ=సమీపించిన విధము పరాఙ్ముఖుండు నై= మొఱు మొగమై యుండియు, వలిముఖనాయకుండు=వానరరాజు, వాలి, పాద రవాన=కాలి చప్పుడుచే.

తా త్ప ర్య ము

ఆలోచింపఁగా నంత రావణుఁడు సమీపించె నని వాలి పరాఙ్ముఖుండయ్యు వాని కాలిచప్పుడుచేఁ దెలిసికొనెను. ఇంతలో రావణుఁడు వాలిని పట్టుకొన చేతులు చాఁపఁగా బలశాలి వాలి తటాలున పామును గరుత్మంతుడు పట్టు కొనునట్లు.

చ. తటుకున నట్టెపట్టి దృఢ♦దర్పసమగ్రుడు చంక నొత్తి ప్ర
స్ఫుటజవయుక్తుఁడై యెగసి ♦ చుక్కలత్రోవను వాని గిచ్చుచు
న్బొటమఁగ నేత్రువాఁక శ్వస♦నుండు మహాభ్రముఁబోలె వెంట న
క్కుటిలచరిత్రు లాగుకొని ♦ గొబ్బునఁ బోవుచు నుండె నింతలోన్. ౭౬౮

అర్థములు. తటుకున = తటాలున, దృఢదర్పసమగ్రుడు=పూర్ణమైన బల గర్వము గలవాఁడు, ప్రస్ఫుట జవయుక్తుఁడై =విశేష వేగముతోఁ గూడినవాఁడై శ్వసనుఁడు=వాయువు, మహాభ్రముఁ బోలెన్=పెద్ద మేఘమునువలె.

తా త్ప ర్య ము

తటాలున గట్టిగాఁ బట్టుకొని పూర్ణబల మదము గల వాలి వానిని జంకలో నిఱికించుకొని మహావేగముతో నెగసి ఆకాశమార్గమునఁ బోవుచు నేత్రురు వంక పాఱునట్లు వానిని గిచ్చుచు పెద్దగాలి మేఘమును దనవెంటఁ దీసికొని పోవునట్లు వాని నీడ్చుకొని పోవుచుండెను.

సీ. రావణుగతిఁ జూచి • రావణుమంత్రులు, విడిపింప వానరు•వెంటఁ బడఁగ
నతఁ డభ్రపదగుఁ డౌ•నర్కునిఁ బోలుచు, విలసిల్ల నెయిద లే•కలసి యతని
బాహూరుజవభవ•వాయువిధూతు లై, సడలిరి యవ్వాలి•చనెడిచోట
వసుధాధరములైనఁ • బాయుచుఁ దెరు విచ్చు, జీవయుక్తులమాటఁ•జెప్ప నేల

ఆ. పక్షివితతికైనఁ • బఱవంగ రాని యు,చ్చోటఁ జనుచు శక్ర•సూనుఁ డోలి
సర్వసాగరముల • సంధ్య నుపాసించె, మెచ్చఁ దన్ను దవియ•చ్చరాలి. ౨౧౯

అర్థములు. అభ్రపదగుఁడు=ఆకాశమార్గమును బొందినవాఁడు = ఆకాశమునఁ బోవువాఁడు. అనఁగా నంత యెత్తున నంతవేగముగఁ బోవువాఁడు, ఎయిద లేక=కలసికొనలేక, బాహూరుజవభవ=బాహువుల యొక్కయు తొడల యొక్కయు వేగమునఁ బుట్టినఁ వాయు=గాలిచే, విధూతులై = ఎగురఁగొట్టఁబడినవారై, వసుధాధరములు=కొండలు, జీవయుక్తులు=ప్రాణముతో నుండువారు, వియత్+చర+ఆళి=ఆకాశమున సంచరించువారి, యనఁగా దేవతల సమూహము.

## తాత్పర్యము

రావణునికి లభించిన దశఁ జూచి రావణునిమంత్రులతని విడిపింపఁగోరి వాలి వెంబడి పోయిరిగాని యతఁ డాకాశమున సూర్యునివలెఁ బోవుటచేఁ గలిసికొనలేక అతని చేతుల తొడలవలనఁ గలిగిన గాలిచేఁ గొట్టుకొనిపోయి వెనుకఁబడిరి. ఆ వాలి పోవుచోటఁ గొండ లడ్డమైనను నవి త్రోవ యిచ్చును. ఇఁక ప్రాణము లున్నవానిమాట చెప్పనేల? పక్షులు పాఱుటకును సాధ్యముగాని యెత్తునఁబోవుచు వాలి యన్ని సముద్రములందు దేవతలు తన్ను మెచ్చునట్లు సంధ్యవార్చెను.

అన్ని సముద్రముల సంధ్యవార్చె ననఁగా దక్షిణమున సంధ్యాంగశౌచము పశ్చిమమున మంత్రపూర్వక సంధ్యాంగ స్నానము, ఉత్తరమున ప్రోక్షణాదికము, తూర్పుసముద్రమున అర్ఘ్యప్రదానాదికము అని గ్రహింపనగు.

క. ఇడుకొని రావణుఁ జంకన, పడమటికడలికిని బఱచి • వారిచి సంధ్యన్
వడి నుత్తరజలధికి వెం,బడి రావణు నీడ్చికొనుచు • మసలక యరిగెన్. ౨౨౦

అర్థములు. కడలి=సముద్రము.

## తాత్పర్యము

(రావణునిఁ దనచంకలో నిఱికించుకొని, పడమటి సముద్రమునకుఁ బోయి యచట సంధ్యవార్చి, వడిగా నుత్తర సముద్రమునకు రావణునిఁ దనవెంబడి నీడ్చుకొనుచు నెచ్చటను జాగుసేయక పోయెను.)

ఉ. ఆమడ లెన్నివేలో యసు • రాధిపుతో వినువీథిఁ బాతి సు
 త్రామసుతుండు వాయువువి•ధంబున మానసవైఖరిన్ జవో
 ద్దామత నుత్తరంబు విడి • దాశరథీ! చని తూర్పువార్ధికిన్
 నేమముతోడ సంధ్యఁ దన•నిష్ఠను దీర్చి సహాసురేశుఁడై. ౨౨౧

అర్థములు. సుత్రామసుతుండు=వాలి, జవోద్దామత=అధిక వేగముచే, మానసవైఖరిన్=మనస్సువలె-అంతవేగమున.

తా త్ప ర్య ము

(ఎన్నివేల యామడలో రావణునితో నాకసమున నెగిరి, వాలి, గాలివలె, మనస్సునట్టు లంతవేగముగా నుత్తర సముద్రమును విడిచి, తూర్పుసముద్రమునకు వచ్చి యచ్చట దన నిష్ఠను నియమముతోఁ దీర్చుకొని, రావణునితో.)

క. క్రమ్మతి కిష్కింధాప్రాంతమ్మునఁ గల వనిని డిగ్గి • దశకంఠుని భా
 రమ్మున గాసిలి బలియుని, నమ్మొఱకుం జంకనుండి•యచ్చట విడిచెన్. ౨౨౨

తా త్ప ర్య ము

(తిరిగివచ్చి కిష్కింధ సమీపమున నున్న యడవియందు దిగి రావణుని నింతదవ్వు మోసిన భారముచే బడలి బలవంతుడైన యా మూర్ఖుని చంకనుండి యచ్చట విడిచెను.

క. ఇక్కరణి విడిచి రావణు, ప్రక్కకుఁ దా మరలి యెపుడు•వచ్చితి వయ్యా!
 యిక్కడకుం బనియేమో, యెక్కడనుండియొకో యనుచు•నెలనవ్వొలయన్.223

తా త్ప ర్య ము

ఈ విధముగ నేల విడిచి వెనుకప్రక్కగాఁ దిరిగి యేమియుఁ దెలియనివాని వలె రావణునిఁ జూచి యెప్పుడు వచ్చినావయ్యా? ఇచ్చటికి నేమిపనియుండివచ్చినావు? ఎక్కడినుండి వచ్చితివి? అని చిఱునవ్వుతో నడిగెను.

—• రావణుఁడు వాలితో స్నేహ మొనర్చుట •—

చ. పలికిన విస్మయంబుపడి • పంక్తిముఖుండు కపీంద్రుచంకలో
 నలఁగుడుపాటు చెంది నయ•నంబులఁ బ్రాణము లుండ గాసిఁ జా
 డ్పులు చలియింప నిట్టు లను • ప్రోతులనాయఁక రాక్షసేంద్రుఁడన్
 గలహముఁ గోరి వచ్చితిని • గావర మాఱగ నీకుఁ జిక్కితిన్. ౨౨౪

అర్థములు. విస్మయంబుపడి=ఆశ్చర్యపడి.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా నాశ్చర్యపడి రావణుఁడు వాలి చంకలో నలిగి ప్రాణములు కన్నులయం దుండఁగా కన్నులు తిరుగుచు నిట్లనెను. వానరరాజా! నేను నీతో యుద్ధము చేయవచ్చితినిఁ రాక్షసరాజను, గర్వముచెడి నీకు జిక్కితిని.

క. రావణుఁడను శక్రాభుఁడ నీ, వనచరనాథ! యహహా ♦ యేమీ బల మా
హా! వేగము గాంభీర్యం, బీవిధి నే నెందు నెఱుఁగ ♦ నీజగమందున్. ౨౨౫

తాత్పర్యము

(వానర రాజా! నేను రావణుఁడను-ఇంద్రునితో సమానుఁడను. అహహా! యేమి నీ బలము! ఆహా! వేగము! ఆ గాంభీర్యమేమీ! నేనిదివఱ కీజగమున నెచ్చటఁ జూచి యెఱుఁగను-)

క. ననువంటివానిఁ బసరము, ననువున నీడ్చికొనిపోఁగి ♦ యబ్ధిచతుష్కం
బున ముంచి లాగి తెచ్చితి, మనమున నేన్ గాసి గొనవు ♦ మర్కటనాథా! ౨౨౬

తాత్పర్యము

(కపిశ్రేష్ఠా! నావంటి బలముగలవానిని, బసరమువలె నీడ్చికొని, పోయి నాలుగు సముద్రములలో ముంచి,యీడ్చి తెచ్చితివి-మనస్సునం దయిన నుస్సురు మనిన-వాఁడవు గావు.)

క. మనమునకున్ వాయువునకు, వినతాతనయునకు నిట్టి ♦ వేగము భువనం
బున విదితం బట్టిద వో, వనచరవర! సందియంబు ♦ పని లే దింమున్. ౨౨౭

తాత్పర్యము

(వనచర రాజా! మనస్సునకు, వాయువునకు, గరుత్మంతునకు నిట్టి వేగము లోకములోఁ జూచి యెఱుఁగుదుము. అంతటి వాడవే-సందేహము లేదు.)

క. నీ వేగము నీ శౌర్యము, వావిరి నా కెఱుక యయ్యె ♦ బాగుగ నీతో
నే వాంఛించెద స్నేహము, పావకసాక్షికము గాఁగ ♦ వనచరనాథా! ౨౨౮

అర్థములు. పావక సాక్షికముగ=అగ్ని సాక్షిగ.

తాత్పర్యము

(నీ వేగము నీ శౌర్యము యొక్క నిజము బాగుగ నా కిప్పుడు తెలిసి వచ్చినది-నీతో నిప్పు డగ్నిసాక్షిగ స్నేహము చేయఁ గోరుచున్నాను-)

క. దారలు పుత్రులు పురమున్, శ్రీరాష్ట్రము భోగములును ♦ కేలలు సకలా
హారంబులు సవిభక్తము, లారగ మన కిరువురకు వ♦నాటేశ! యగున్. ౨౨౯

అర్థములు. అవిభక్తములు=నీది నాది యని వేఱులేనివి, నావన్నియు నీవే, నీవి నావే.

తాత్పర్యము

భార్యలు కొడుకులు నగరము సంపద రాష్ట్రము భోగములు వస్త్రములు అన్ని విధములైన యాహారంబులు మన కిరువురకు నవిభక్తములు. దీనివలన నైకమత్యము గ్రహింపవలయును గాని, నీ పెండ్లామే నా పెండ్లాము, నాపెండ్లామే నీ పెండ్లామని కేవల మైక్యము గ్రహింపరాదు. అవిభక్తకుటుంబము లందు నన్నదమ్ములు భార్యలను బంచుకొనరు గదా

క. రగిలిచి యగ్నుల నీగతి, నగచరనిశిచరవిభుల్ స॰మాలింగితులై
దగఁ జేతఁ జేయి వైచుచు, జగ మెఱుఁగఁగఁ జలిపి రపుడు॰సౌభ్రాత్రంబున్.

అర్థములు. రగిలి=మంటచేసి, అగచర నిశిచరవిభుల్=వాలి రావణులు, సమాలింగితులై = కౌగిలింపఁ బడినవారై, సౌభ్రాత్రంబున్ = అన్నదమ్ముల భావమును.

తాత్పర్యము

(అగ్నిని రగులజేసి వాలి, రావణులు చేతిలో చేయి వైచుచు లోకవిఖ్యాతిగ స్నేహము జేసికొనిరి.)

క. అంత హరిరాక్షసులు మృగ, కాంతులు గుహలోనఁ జొచ్చు॰కైవడి శుద్ధ
స్వాంతములఁ గేలు కేలన్, సంతసమునఁ గొలుచు వెల్లఁ॰జనికిష్కింధన్. ౨౮౧

అర్థములు. మృగకాంతులు=సింహములు, ఇట్లు చెప్పుటచే నిది కిష్కింధకు వెలుపలనే జరిగె నని సూచితము.

తాత్పర్యము

(అట్లు వాలి రావణు లగ్నిసాక్షిగాఁ జెలిమిచేసికొనిన పిమ్మట, వారిరువురు సింహములు గుహలోఁ బ్రవేశించు విధమున నొకరిచేతి నొకరు పట్టుకొని సంతోషముతో వెల్లఁగాఁ గిష్కింధకుఁ బోయిరి.)

క. ఎలమిఁ జరియించి రట నొక, నెల సుగ్రీవునివిధాన ॰ నిశిచరవిభుఁడున్
గలఁ కేమి లేక యుండఁగ, బిలువఁగ వచ్చిరి యమాత్య॰వీరుల్ వానిన్. ౨౮౨

తాత్పర్యము

(అచట సంతసమున నొక నెల చరించిరి. రావణుఁడు సుగ్రీవునివలె నిర్మలచిత్తముతో నుండ నాతని మంత్రులు పిలువవచ్చిరి.)

దీని వలన వాలి సుగ్రీవులు వేఱుపడకముందే యీకార్యము జరిగెనని భావము.

క. లోకంబుల నేఁపఁగఁ జన, నా కర్కశశీలుఁ డరిగె • నసురులఁబడిఁ దా
నీ కరణిఁ బురావృత్తము, కాకుత్థ్సాన్వయ! చెల్లెఁ గంజదళాక్షా! ౭౮౩

అర్థములు. కర్కశశీలుఁడు=కఠినస్వభావుఁడు, పురావృత్తము = ముందు జరిగిన చర్య.

తాత్పర్యము

(లోకులను బాధించుటకా కఠిన స్వభావముగల రావణుఁడు రాక్షసులతో పోయెను-రామచంద్రా! ముందు జరిగిన రావణుని చర్య యీ విధముగాఁ గడచి పోయినది.)

క. వింటివి కద రావణుకథ, వింటివి గద వాలిశక్తి • విధ మంతటి బ
ల్దంటయు నీ శరమునఁ దా, మంటం బడు మిడుతయయ్యె • మహితబలాఢ్యా! ౭౮౪

తాత్పర్యము

(పుండరీకాక్షా! రావణుని కథ విన్నావుకదా- వాలి సామర్థ్యము వింటివికదా! అంతటి బలశాలియు నీ బాణమునకు, మంటలోఁ బడు మిడుతవలె నయ్యెనుగదా.)

—• శ్రీరాముఁ డగస్త్యుని హనుమంతుఁ గూర్చి ప్రశ్నించుట •—

చ. అన విని దక్షిణాశనిల • యంబుగ నున్న మునీంద్రుఁ జూచి భూ
తనయమనోహరుండు ముని • తల్లజ! వాలియుఁ బంక్తికంఠుఁడున్
ఘనబలశాలులై యతుల • గాఢపరాక్రమవంతు లయ్యు మా
హనుమకు నీడు గా రని మ • హాత్మక నామదిఁ దోఁచె నారయన్. ౭౮౫

దక్షిణాశనిలయంబుగ నున్న మునీంద్రు=దక్షిణ దిక్కు కాఁపురముండు మునీశ్వరుని-అగస్త్యుని.

తాత్పర్యము

(దక్షిణపుదిక్కునఁ కాపురముండు మునీశ్వరు నగస్త్యునిఁ జూచి రామ చంద్రమూర్తి మునివర్యా! 'వాలియు రావణుఁడు గొప్పబలశాలు లయ్యు, సాటి లేని గట్టి పరాక్రమము గలవారయ్యు, మా హనుమకు సరిరారని నామనస్సు నం దాలోచింపఁగాఁ దోఁచినది-'

క. శౌర్యము నయసాధనమును, ధైర్యంబు పరాక్రమంబు • దాక్ష్యము బలమున్
స్థైర్యము ప్రాజ్ఞత మహిమయు, నార్యగుణా! నెలవుకొనియె • హనుమంతునెడన్.

అర్థములు. నయసాధనమును=నీతిని సాధనముగఁ గొనుటను, దాక్ష్యము= కార్యము సాధించుశక్తి.

తాత్పర్యము

(శౌర్యము, నీతిని సాధనముగాఁ గొనుటను, ధైర్యము పరాక్రమము, కార్యము సాధించుశక్తి, బలము, స్థైర్యము ప్రాజ్ఞత, ప్రభావము హనుమంతుని యందు స్థిరప్రతిష్ఠితములయి యున్నవి.)

సీ. వననిధిఁ గని క్రుస్సు-వనచరుల్ మోదింప, యోజనశతకముఁ జే-రోజదాఁటె
రావణు నంతః-పురంబు శోధించి సీ-తను జూచి మాట్లాడి-యనునయించె
దళవాయులను మంత్రి-తనయకింకరులను, నక్షుని నొక్కండ-హతులఁ జేసె
బంధ మూడఁగ దన్ని-భాషించి రావణు-తో లంక మసిసేసె-లీలవోలె

ఆ. సంగరమున హనుమ-సలిపినకృత్యముల్, కాలుఁడైన విబుధ-పాలుఁడైన
హవ్యవాహుఁడైన-యక్షేశ్వరుం డైన, నాచరింప వింటి-మా? మహాత్మ! ౬౮౭

అర్థములు. శోధించి=వెదకి, అనునయించెన్=సమాధాన పఱిచెను, దళవాయులను=సేనానాయకులను, బంధము=ఇంద్రజిత్తుని బ్రహ్మాస్త్రబంధము, విబుధపాలుఁడు=ఇంద్రుఁడు, హవ్యవాహుఁడు=అగ్ని, యక్షేశ్వరుఁడు=కుబేరుఁడు.

తాత్పర్యము

(సముద్రమును జూచి దిగులొందియు వానరులు సంతోషించునట్లులు నూఱామడ లోకపెట్టున దాఁటెను. రావణు నంతిపురములోఁ బ్రవేశించి, శోధించి. సీతనూ జూచి మాటలాడి యోదార్చెను. సేనానాయకులను, మంత్రి కొడుకులను, కింకరులను, నక్షకుమారుని, నొక్కఁడే చంపెను-ఇంద్రజిత్తుని బ్రహ్మాస్త్ర బంధమును వదలించుకొని, రావణునితో సంభాషించి, లంకను నవలీలగాఁ గాల్చిబూది గావించెను-యుద్ధరంగమున హనుమంతుఁడు చేసిన సాహస కార్యములు, యముఁడు గాని, యింద్రుఁడు గాని, యగ్ని కాని, కుబేరుఁడు గాని చేసినట్లు వినియుంటిమా?)

క. ఈతని బలవిక్రమముల, చేతనె కద లంక గాల్చి-చినతమ్మునితో
సీతాసతితో బంధు,వ్రాతముతో నలరఁగంటి-రాజ్యమునందున్. ౬౮౮

అర్థములు. చినతమ్మునితో=లక్ష్మణునితో.

తాత్పర్యము

(ఈ హనుమంతుని బల పరాక్రమముల చేతనేకదా నేను లంక గాల్చి లక్ష్మణునితో, సీతతోఁ, జుట్టపక్కాలతో రాజ్యమునందు సంతోషముగా నుండఁ గలిగితిని.)

క. వానరపతిసఖుఁడీ హను,మానుఁడు లే కున్న నెవరు-త్రాణ్మసుతవార్తన్
దే నేర్చువార లంతటి,భూనుతవిక్రములు గలరె-భువనంబులలోన్? ౬౮౯

అర్థములు. వానరపతిసఖుఁడు=సుగ్రీవుని స్నేహితుఁడు.

తా త్ప ర్య ము

(సుగ్రీవుని స్నేహితుఁడగు హనుమానుఁడే లేకున్న నెవరు సీత సమాచారముసు దీసికొని రాఁగల నేర్పు గలవారు, జగత్ప్రసిద్ధ మగు పరాక్రమముగలవారు జగములలో నున్నారు?)

చ. రవిజునిమేలు గోరుచుఁ ది•రంబుగ నాతనియొద్ద నుండియున్
పవనజుఁ డేల యాతనికి • వాలికి వైరము గల్గ నింద్రజున్
దవము పొదన్ దహించుగతి • నాశము చేయక యాత్మమిత్రుఁ డ
ట్లవిరళదుఃఖతప్తుఁడయి • యూరట మందఁగఁ జూచుచుండెనో? ౯౦

అర్థములు. రవిజుని=సుగ్రీవుని. పవనజుఁడు=హనుమంతుఁడు. ఇంద్రజున్=వాలిని, దవము=కారుచిచ్చు, అవిరళ=దట్టమైన, దుఃఖతప్తుఁడు = దుఃఖముచే బాధపడువాఁడు.

తా త్ప ర్య ము

(సుగ్రీవుని మేలుగోరి వదలక యాతని యొద్దనుండియును, నాతనికి వాలికి వైరము గలిగినప్పుడు పొదను గార్చిచ్చు కాల్చునట్లు వాలిని నాశము చేయక, తన స్నేహితుఁ డట్లు దట్టపు దుఃఖముచే నారాట పడుచుండఁగా హనుమంతుఁ డేలయూరక చూచుచుండెనో?)

క. తనబలము తనకుఁ దెలియదు, హనుమని కటం చేను దలఁతు • ననఘా! చెపుమా
వినవలఁతు దీని ననవుడు, హనుమంతు సమక్షమంద • యతఁ డిట్లనియెన్. ౯౧

తా త్ప ర్య ము.

(అనఘా! హనుమంతునకుఁ దన బలము తనకుఁ దెలియదని నేను దలఁచుచున్నాను-దీనిని వినవలయును. చెప్పుఁడు. అని యడుగఁగా, హనుమంతుని సమక్షమందే యగస్త్యుఁ డిట్లని చెప్పెను.)

సీ. నీ యభిప్రాయంబు•నిక్కంబు శ్రీరామ, బలగమనంబులఁ•బ్రజ్ఞయందు
హనుమకుఁ దుల్యుండు•గన రాఁ డొకండేని, మును మునివర్యుల•మోఘశాప
మొసఁగుటఁ జేసి యా•యుత్తమగుణరాశి, తనశక్తి యెఱుఁగండు•ఘనమదయ్య
చిన్నటనాఁడ ని•ర్వీర్యుఁడు చేసిన, యది తెలియండు బా•ల్యమునఁ జేసి

తే. పావమాని చరిత్ర స•ర్వంబు నీవు, విన నభిప్రాయ ముండిన • వినఁగదయ్య
వినుచువాఁడను సకలంబు•విశ్వవినుత, రమ్యగుణసాంద్ర! దశరథ•రామచంద్ర!

అర్థములు. బలగమనంబులన్=బలమునందు గమనమునందు, అమోఘశాపము=వ్యర్థముగాని శాపము, పావమాని=హనుమంతుని.

తాత్పర్యము

(రమ్యగుణసాంద్ర! దశరథరామచంద్రా! వినుము - నీ యభిప్రాయము నిజము బలమున వేగమునఁ బ్రజ్ఞలో హనుమకు సముఁ డొక్కఁడైనను గాన రాఁడు; పూర్వము మునివర్యులు తిరుగని శాప మిచ్చుటచేత నా యుత్తమగుణ రాశి, గొప్పదయినను తన సామర్థ్య నెఱుఁగఁడు. చిన్నతనమున నితఁడు చేసినది పసివాఁడగుటచేఁ దెలియఁడు. హనుమంతుని చరిత్రమంతయు నీవు విన నభిప్రాయ ముండినచో సకలము వినిచెద-వినుము.)

—• ఆంజనేయోపాఖ్యానము •—

సీ. భాస్కరవరమున • బంగారువన్నెల, రాణించు మేరుప•ర్వతము గలదు
అచట రాజయి • యలరారు కేసరి, పేరిటిబలియుఁ డీ•వీరుతండ్రి
యతనికి భార్యయై•యంజనాఖ్యరహించు, నామెవాయువున కీ•యనఘుఁగాంచె
వరిగింజకొనముల్లి•వంటి వన్నెఁగలాని, ఫలములు గోనితేరు•వాంఛఁ జేసి

ఆ. యడవి కామె పోవ • నాఁకటిపెల్లునఁ దల్లి విడిచి చనుట • తాళ లేక
శరవణంబునందు • షణ్ముఖుపోలికఁ రోదనం బొనర్చి • ఖేదయుక్తి. ౭౯౩

అర్థములు. శరవణము=జెల్లువనము. షణ్ముఖుపోలిక=కుమారస్వామివలె.

తాత్పర్యము

(సూర్యుని వరముచే బంగారు రంగుతోఁ బ్రకాశించు మేరు పర్వతము కలదు-ఈ వీరుని తండ్రి కేసరియను బలశాలి యచ్చట రాచయి యలరారు చుండెను. అతని భార్య యంజన. ఆమె వాయుదేవుని వలన నీ యనఘు వరిముల్లు కొనవంటి కాంతిగల హనుమంతునిఁ గనెను- ఆమె ఫలములు దేసికొని వచ్చుట కడవికిఁ బోయెను-ఆఁకలి చిచ్చునఁ దల్లిదగ్గఱ లేకపోవుటచే నోర్వలేక, జెల్లు వనమునందుఁ గుమారస్వామివలె రోదనము చేసె)

క. అప్పుడు దానవపుంబువు, చొప్పున జిగి మీఱఁ బ్రాగ్వ•సుమతీధ్రమునం
దుప్పరమున నుదయించెడి, యప్పంకజమిత్రుఁ గాంచి•యాతనిఁ బట్టన్. ౭౯౪

అర్థములు. దాసనపుంబువు=దాసానిపువ్వు, జిగి=ఎఱ్ఱని కాంతి, ప్రాక్+వసుమతీధ్రమునన్=తూర్పుకొండయందు, ఉప్పరమునన్=ఆకాశమునందు, పంకజమిత్రున్=సూర్యుని.

తాత్పర్యము

అప్పుడు తూర్పుకొండ మీఁద దాసానిపువ్వువన్నెతో నుదయించు సూర్యునిఁ జూచి యాయనను బట్టుకొనఁ దలఁచి.

చ. ఫల మనుబుద్ధి మింటికిఁ జి•వాలునఁ దా నెగిరెన్ నవార్కుతోఁ
తులితుఁడు బాలసూర్యునకుఁ • దూర్ణము సమ్ముఖమౌచుఁ దా జనన్
బలిముఖబాలు మింటఁ జను•వాని మహర్షులు దేవదైత్యయ
క్షులు కడు విస్మయంపడుచు • జూచుచు మానసవాయువేగునిన్. ౭౫

అర్థములు. నవార్కుతోన్=క్రొత్తసూర్యునితో, తులితుఁడు = సమానుఁడు, వలిముఖబాలున్=బాలవానరుని, తూర్ణము=త్వరగా, మానసవాయు వేగునిన్= మనస్సుయొక్కయు వాయువుయొక్కయు వేగము గలవానిని.

తాత్పర్యము

పండని తలఁచి తటాలునఁ దానాకాశమునఁ కెగిరెను. బాలసూర్యునితో సమానుఁడు, బాలసూర్యునకు నెదురుగాఁ బోగాఁ నాకాశమునఁ బోవుపిల్లక్రోఁతిని జూచి మహర్షులు దేవతలు దైత్యులు యక్షులు వాయువేగ మనోవేగములు గల వానిని జూచి మిక్కిలి యాశ్చర్యపడి.

క. పిల్లతనంబునయందే, చెల్లంబో యిట్టిశక్తి • చేకూరిన చో
మొల్లమగు యౌవనంబున, నెల్లిలం గ్రాలునొక్కొ • యితఁ డనుకొనఁగన్.

అర్థములు. చెల్లంబో=ఔరా, ఆశ్చర్యార్థకము, చేకూరినచో=లభించెనేని

తాత్పర్యము

ఇప్పుడే పిల్లతనమందే యింతిశక్తిగలవీఁడు పెద్దవాఁడై యౌవనవంతుఁడై నపు డింక నెంతటి శక్తిమంతుఁ డగునో యనుకొనుచుండఁగా.

చ. తనయుఁడు మింటనేగ రవి•దగ్ధుఁడుగాక సుఖంబు గూరఁగాఁ
దనుపుగ శీతలుం డయి స•దాగతి వెంటనె పోవుచుండె, న
య్యినుఁడును బాలుఁ గాంచి మది • నేమియెఱుంగని బిడ్డఁ డంచునీ,
తనివలనన్ మహాకృతులు • దప్పక కాఁగల వంచు నెంచుచున్ ౭౬

అర్థములు. రవిదగ్ధుఁడు=సూర్యునిచేఁ గాలినవాఁడు, తనుపుగన్=శైత్యోపచారముగ, శీతలుండయి=చల్లనివాఁడై, సదాగతి=వాయువు, మహాకృతులు= గొప్పకార్యములు.

తాత్పర్యము

ఆకాశమునఁ దనకొడుకు పోవునెడ సూర్యకిరణములచేఁ గాలిపోకుండుటకై వాయువు చల్లనై శైత్యోపచారము చేసినట్లు వెంటనే పోవుచుండెను. ఆ యినుఁ డును వీఁడేమియుఁ దాఁకు తప్పు తెలియని పిల్లవాఁడనియు వీఁడు పెద్దవాఁడై గొప్పకార్యములు చేయుననియుఁ దెలిసికొని.

క. తనవేఁడిమి చూపక యుం, డెను సీతఁడు జనకుశక్తి • నిజఘనశక్తిన్
జని మింట వేనవేల్ యో, జనములు రవి డాసె నాఁడ•స్వర్భానుండున్. ౨౯౮
అర్థములు. స్వర్భానుఁడు=రాహువు.

తాత్పర్యము.

(తన వేఁడిమి చూపకుండెను. ఈతఁడు తండ్రి శక్తి, తనగొప్పశక్తి తోడుగా నాకసమున వేన వేలామడ లెగిరిపోయి సూర్యుని సమీపించెను. ఆనాఁడే రాహువును.)

చ. దినకరుఁ బట్టవచ్చి ఖర•దీధితు డాయఁగ వచ్చుచున్న యీ
వనచరబాలుఁ గాంచి భయ•పాటునఁ బాఱి మహేంద్రుఁ జేరి పెం
గసరునఁ బల్కెమున్ను దిన•కాంతమృగాంకుల మేము పట్టఁగా
వినియతిఁ జేసి యేమిటికి • వేఱొకనిన్ నియమించి తీవెడన్. ౨౯౯

అర్థములు. ఖరదీధితున్=సూర్యుని, వనచరబాలున్ = క్రోఁతిపిల్ల వానిని, పెనగసరునన్=మిగులఁ గోపముతో, దినకాంత మృగాంకులన్=సూర్యచంద్రులను

తాత్పర్యము

(సూర్యునిఁ బట్టుకొనవచ్చి, యాసూర్యుని సమీపమునకు వచ్చుచున్న యీక్రోఁతి పిల్లవానిఁజూచి, భయపడి పాఱిపోయి, యింద్రునిఁ జేరి, మిగులఁగోపముతో, సూర్యచంద్రులను మేము పట్టునట్టు నియమమొనరించి, యిప్పుడు వేఱొకని నేల యేర్పాటు చేసితివి?)

క. ఈనాఁడు పర్వకాలం, బే నేగ మఱొండు రాహు•వే లెంచెఁ జూమీ
భానునిఁ బట్టఁగ నావుఁడు దీనుని దా నూఱడించి • తెప్పున లేచెన్. ౩౦౦

అర్థములు. పర్వకాలము=అమావాస్య.

తాత్పర్యము

(ఈ నాఁడమావాస్య. నేను సూర్యునిబట్టుకొనఁలో మఱొక రాహువువచ్చి నాఁడు సుమా, యని చెప్పఁగా నా దీనుని నోదార్చి తాను వెంటనే లేచెను.)

ఉ. వాసవుఁ డిట్లు లేచి యతి•భాసురకాంచనమాలఁ దాల్చి కై
లాసనగాగ్ర సన్నిభము • లాలితభూషణ భూషితంబు ఘం
టాసముదాయ ఘోషితము • నాలుగుకొమ్ములగారు నెక్కి వే
వే సనె రాహుమున్నుగ ర•విప్లవగార్భకు లున్నచోటికిన్. ౩౦౧

అర్థములు. అతిభాసుర=మిగులఁ బ్రకాశించు, కాంచనమాల = బంగారు హారము, దీనినే శాబోలు వాలి కిచ్చినది. కైలాసనగాగ్రసన్నిభము=కైలాస

పర్వత శిఖరముతో సమానము, లాలిత భూషణ భూషితంబు=అందమైన యాభరణములచే నలంకరింపఁ బడినది, ఘంటాసముదాయ ఘోషితము=గంటల సమూహముల ధ్వనిగలది, నాలుగు కొమ్ములగొరు=ఐరావతమును, రవిప్లవగార్భకులు=సూర్యుఁడు వానర బాలకుఁడు.

### తాత్పర్యము

(ఇంద్రుఁడీ విధముగా లేచి, మిగుల ప్రకాశించు, బంగారు హారమును ధరించి కైలాస పర్వతముతో సమానమై యందమైన యాభరణములచే నలంకరింపఁబడి గంటల చప్పుడుగల యైరావతము నెక్కి నడినడిగా రాహువు ముందుగ నడువ, సూర్యుఁడు హనుమంతుఁడు నున్న చోటికిఁ జనెను.)

ఉ. రాహువు మున్ను మున్న దిన♦రాజు గ్రహింపఁగఁ బోతె నో మహా
బాహు! మహీధ్రకూట మన ♦ వాలి రయంబున వచ్చునాతనిన్
సాహసిఁ జిక్కఁగాంచి కపి♦సత్తముఁ డియ్యది మేలటంచుఁ దా
రాహువు వెంట నంటె గ్రహ♦రాజును వీడి యతండు భీతిచేన్. ౪౦౧

అర్థములు. దినరాజున్=సూర్యుని, మహీధ్రకూటము=పర్వత శిఖరము, వాలి=విక్రమించి.

### తాత్పర్యము

(దీర్ఘములైన చేతులుగల రామచంద్రమూర్తీ! రాహువు ముందు ముందుగా సూర్యుని బట్టుకొనఁబోయెను. పర్వతశిఖరమువలెఁ బరాక్రమించి వచ్చు నా తెంపరిని జూచి హనుమంతుఁడు సూర్యుని వదలి యిది మంచిపండని రాహువు వెంటఁ బడెను. అతఁడు భయపడి,

క. గ్రక్కునఁబరాఙ్ముఖుండై, దిక్కువే యింద్ర! యింద్ర! ♦ తెంపరికపిచేఁ
జిక్కక యుండఁగఁ గావవె, మక్కువ న న్ననుచు మాటి♦మాటికి నఱచెన్.

### తాత్పర్యము

(వెంటనే వెనుకకు మరలి, యింద్రా! యింద్రా! నీవే దిక్కు. ఈ సాహసి యగు క్రోఁతి చేతిలో జిక్కకుండ నన్ను దయతోఁ గాపాడు మనుచు మాటి మాటికి నఱచెను.)

ఉ. అమ్ముఖశేషుఁ డిట్టులు భ♦యమ్మునఁ దా నభయంబు వేఁడఁగా
నమ్మఘవుండు భీతిలకు♦మన్చునుఁ ద్రుంచెద నంచుఁ బల్కుచో
నిమ్మరుదాత్మజుండు విబు♦ధేంద్రుకరీంద్రముఁ గాంచి నిండుమో
దమ్మునఁ బెద్దపండనుచు ♦దానిని బట్టఁ జనెన్ రయంబునన్. ౪౦౪

అర్థములు. ముఖశేషుఁడు=దేహముపోయి ముఖము మాత్రము మిగిలినవాఁడు, అమృతప్రాశన సమయంబున రాహు కేతువులు దేవతల రూపములు ధరించి

దేవతల నడుమ కూర్చుండఁగా నిరువురకు మోహిని యమృత మిచ్చెను. వారు ద్రావిరి. సూర్యచంద్రములు వారు రాక్షసులని మోహినికిఁ దెలిపిరి. ఆయన చక్రముచే వారి తలలు ఖండించెను. అమృతస్పర్శమువలన రాహువుతల, కేతువు దేహము మిగిలెను. రాహువునకు దేహము లేదు, కేతువునకుఁ దలలేదు, మఘవుండు=ఇంద్రుఁడు, భీతిలకుము=భయపడకుము, అర్భకున్=బాలుని, విబుధేంద్రకరీంద్రము=ఇంద్రుని యేనుఁగు.

తా త్ప ర్య ము

రాహు విట్లు భయపడి యింద్రుని యొద్దకుఁబోయి యభయము వేఁడఁగా కపిబాలుని జంపెద, భయపడవల దని చెప్పుచుండఁగా, నింద్రుని యేనుఁగుఁజూచి యిది పెద్దపండని తలఁచి హనుమంతుఁడు దానిని బట్ట త్వరగా, బరువెత్తెను.

క. అభ్రమువల్లభుఁ బట్టఁగ, నభ్రంబునఁ బాఱుదెంచు ♦ నంజనసుతుపై
నభ్రపతి చేతికులిశ మ,నభ్రం బగు కినుక నేసెఁ ♦ దద్ధతిఁ గపియున్. ౧౦౫

అర్థములు. అభ్రమువల్లభున్ = ఐరావతమును, ఐరావతము భార్యపేరు అభ్రము, అభ్రపతి=ఇంద్రుఁడు, కులిశము=వజ్రము, అనభ్రము=గొప్పది, తత్ + హతిన్=ఆ దెబ్బచే.

తా త్ప ర్య ము

ఐరావతమును బట్టుటకై యాకాశమునఁ బరువెత్తి వచ్చు క్రోతి మీఁదఁ గోపించి యింద్రుఁడు తనచేత నున్న వజ్రముతోఁ గొట్టెను. ఆ దెబ్బచే వాయుసుతుఁడు

క. అవనీధరశిఖరంబున, వివశుండై పడియె బాధ ♦ విహ్వలుఁడై భూ
ధన! తత్పాతంబునఁ, బవనజునకు వామహనువు ♦ భగ్నం బయ్యెన్. ౧౦౬

అర్థములు. అవనీధరశిఖరంబునన్=కొండ పేటుమీఁదఁ,వివశుఁడై=మూర్ఛపోయి, విహ్వలుఁడై=స్వాధీనత తప్పినవాఁడై, తత్పాతంబునన్ = ఆపడుటచే, వామహనువు=ఎడమ చెంప, భగ్నంబయ్యెన్=గాయపడెను.

ఆ దెబ్బచే స్వాధీనత తప్పినవాఁడై కొండ శిఖరము మీఁద పరవశుఁడై పడెను. ఆ పడుటచే నెడమ చెంప పగిలి గాయపడెను.

**—• వాయు నిరోధంబున లోకంబులు బాధపడుట •—**

చ. హరిహయుఁ డాత్మపుత్రునకు ♦ నాపదగూర్చినఁ గోపగించి యా
హరిణహయుండు లోకముల ♦ కన్నిటి కెగ్గొనరింపఁ బుత్రుతో
గిరిదరిలోని కేగి ప్రజ ♦ కీడ్పడ దేహములందు నాత్మ సం
చలనము మాని యుండె నట ♦ శక్రుఁడు నర్షము నాఁగు కై వడిన్. ౧౦౭

అర్థములు. హరిహయుఁడు=ఇంద్రుఁడు, హరిణహయుండు=జింక వాహనముగాఁ గలవాఁడు, వాయువు, ఎగ్గు=కీడు, గిరిదరిలోనికి = పర్వతగుహలోపలికి, ఆత్మసంచలనము=తన సంచారము.

తా త్ప ర్య ము

ఇంద్రుఁడు తన కొడుకునకు నాపద గలిగించె నని వాయువు కోపించి లోకములకుఁ గీడు చేయఁ దలంచి కొడుకును దీసికొని గుహలోనికిఁబోయి యుండుఁడు వర్షము నిలిపినట్లు ప్రజలు బాధపడునట్లు వారి దేహములందు దాను సంచరించుట మానియుండెను.

క. వెడలవు విణ్మూత్రంబులు, వెడలదు నిశ్వాస మేమి ♦ భేదిలి సంధుల్
జడము లయి కట్టెలట్టులు, ముడుచుట చాఁచుట యసాధ్య♦ముగఁ బ్రజకయ్యెన్.

అర్థములు. విట్+మూత్రములు=మలమూత్రములు.

తా త్ప ర్య ము

దేహములందు వాయువు సంచరించుట మానుటచే ప్రజలకు మలమూత్రములు వెలుపల రాకుండెను. ఊపిరాడ కుండెను. సంధులు (కీళ్ళు) భేదిల్లెను. కాళ్లుచేతులు జడములవలెనై కట్టెలవలెఁ జాఁచుటకు ముడుఁచుటకు నసాధ్యమై యుండెను.

తే. శ్రుతులపఠనంబు హోమంబు♦సున్న యయ్యె,నిత్యకర్మంబు లెల్లను♦నిలిచిపోయె
ధర్మకార్యంబులెల్లను♦దలఁగిపోయె నాగ్రహంబున వాయువు♦నిగ్రహింప. ౨౦౯

తా త్ప ర్య ము.

(వాయుదేవుఁడాగ్రహముతో నిగ్రహింపఁగా, వేదాధ్యయనము, యజ్ఞములు సున్నయయ్యెను. సంధ్యావందనాది నిత్యకర్మము లన్నియు నిలిచిపోయెను. ధర్మకార్యము లాఁగిపోయెను.)

తే. అపుడు గంధర్వు లసురులు ♦ నమరులెల్లఁ, జూడ నేగిరి మిక్కిలి♦గోడుకొనుచు
నుబ్బు పొట్టలతోడ మ♦హోదరములు, గలుగు వారలఁబోలుచుఁ♦గదలలేక. ౨౧౦

తా త్ప ర్య ము

(ఆ సమయమున గంధర్వులు, అసురులు, దేవత లందఱు మహోదరమను రోగము గలవారివలె నుబ్బిపోయిన పొట్టలతోఁ గదలలేక దుఃఖపడుచుఁ జూచుటకుఁ బోయిరి.)

క. కంజభవు డాయఁగాఁ జని, ప్రాంజలులై నలువిధముల♦ప్రజలను నీవే
రంజిల్లఁ జేసి మాకుఁ బ్ర,భంజనునిం బ్రాణములకుఁ ♦ బతిఁ జేసితిగా. ౨౧౧

అర్థములు. కంజభవున్=బ్రహ్మను, నలువిధముల ప్రజలను=దేవతిర్య

క్మనుష్య స్థావరము లను నాలుగువిధముల జీవులను, ప్రభంజనునిన్=వాయువును.

తాత్పర్యము

(బ్రహ్మయొద్దకుఁ బోయి దోసిలొగ్గి దేవ, తిర్యఙ్మనుష్య స్థావరములనెడి నాలుగు విధములయిన జీవులను నావందింపఁజేసి మాకు వాయుదేవుని రక్షకునిఁగాఁ జేసితివికదా.)

క. అట్టి జగత్ప్రాణుఁడు నేఁ డిట్టులు మము నంతిపురపు ♦ టింతులవలె ని
ట్టట్టు జరింపక యుండఁగఁ బెట్టెం బెనుబాధ లెట్లు♦ వేఁగుదు మభవా. ౮౧౨

అర్థములు. అంతిపురపు టింతులవలెన్=అంతఃపుర స్త్రీలవలె.

తాత్పర్యము

(అటువంటి జగత్తులకుఁ బ్రాణమైన వాయువు మమ్మిప్రకార మంతఃపుర స్త్రీలవలె నటునిటు కదలిపోకుండఁ బెనుబాధలు పెట్టెను. ఏవిధముగా వేఁగెదము.)

చ. శరణము నీవె మాకు మముఁ ♦ జంపఁ గడంగెను వాయు వీ వ్యథా
భరముఁ దొలంచు మన్న జన♦వర్గముఁ జూచి యజుండు కారణాం
తరమున మారుతుం డిటు లొ♦నర్చెడి, సింహికసూనుమాటచే
సురపతి వాయుపుత్రకుని ♦సొమ్మలు పోవఁగ వజ్రధారచేన్. ౮౧౩

అర్థములు. శరణము=ప్రాపు, రక్షకుఁడవు, కారణాంతరమునన్ = వేఱొక కారణముచే, మయూరవ్యంసక సమాసము, సింహికసూనుని=రాహువుయొక్క, సురపతి=ఇంద్రుడు, సొమ్మలుపోవ=మూర్ఛపోవ.

తాత్పర్యము

(నీవే మాకు రక్షకుఁడవు. వాయువు మమ్ముఁ జంపఁబూనెను. ఈ గొప్ప దుఃఖమును దొలఁగింపుము. అని మొఱపెట్టుచున్న జనసమూహమును జూచి బ్రహ్మ; కారణాంతరమున వాయుదేవుఁ డిట్టులు చేసెను. రాహువుమాట విని యింద్రుఁడు వాయుపుత్రుఁడగు హనుమంతుని వజ్రాయుధముతో మూర్ఛపోవునట్లు.)

చ. అడిచినఁ గోప మూని కద♦లాడక గంధవహుండు నిల్చెఁ జం
ద్రోడలను వాయువే తనువు ♦ లుంచు సుఖస్థితి దాని లేమిచే
జడత వహించి కట్టెయల♦సాటి యగుం గద, గాడ్పుఁ దేర్చి మీ
యడ లుడుగంగఁ జేయుదు జ♦నావళులార! పదండు వచ్చెదన్. ౮౧౪

అర్థములు. అడిచినన్=కొట్టఁగా, కదలాడక=చలింపక, గంధవహుండు= వాయువు, ఒడలను=దేహమునందు, తనువులు=దేహములు, గాడ్పున్=వాయువును, తేర్చి=సమాధానపఱచి, అడలు=బాధ.

తాత్పర్యము

(కొట్టినందు వలనఁ గోపము వచ్చి వాయువు చలింప నిలిచెను సుఁడీ, శరీరమందు వాయువే శరీరమును సుఖస్థితిలో నుంచును. అది లేకుండుటచే దేహములు మొద్దుపాటి కట్టెలతో సాటియగును కదా. ఓజనులారా! వాయువును సమాధాన పఱిచి మీ బాధలు పోవునట్లు చేసెదను. పదుఁడు)

క. పవమాను శాంతుఁ జేసెద, భువనంబుల బాధఁ దీర్తుఁ • బొందఁడని వాణీ
ధవుఁడు సురగుహ్యకాహులు, దవిలినభక్తిన్ భజించి • తనతో రాఁగన్. ౧౧౫

తాత్పర్యము

(బ్రహ్మ వాయుదేవుని శాంతింపఁ జేసెద, లోకములబాధఁ దీర్చెదపొండు. అని బ్రహ్మదేవతలు, గుహ్యకులు, పన్నగులు, భక్తితోఁ దనవెంట రాఁగా.)

చ. చని దిననాథకాంచనకృ • శాను సమానతనుం దనూజునిన్
దనతొడఁ జేర్చి యుండెడు స • దాగతిఁ జేరఁగఁ బోయి యాదరం
బున శిశువుం గనంగ నలు • మోములవేలుపురాకఁ గాంచి స్ప
ర్శనుఁడు కుమారు నెత్తుకొని • గ్రక్కున లేచి సుతార్తితప్తుఁడై. ౧౧౬

అర్థములు. దిననాథ=సూర్యునితోను, కాంచన=బంగారుతోను, కృశాను=అగ్నితోను, సమాన=ఈడైన, తనున్=దేహము గలవానిని, సదాగతిన్=వాయువును, నలుమోముల వేలుపు=బ్రహ్మ, స్పర్శనుఁడు=వాయువు, సుతార్తి=కొడుకు బాధచే, తప్తుఁడై=తపించినవాఁడై.

తాత్పర్యము

(పోయి, సూర్యుతో, బంగారుతో. నగ్నితో సమానమైన శరీరకాంతి గల కుమారునిఁ దన తొడమీఁద నుంచుకొని యుండిన వాయుదేవుని దగ్గఱకుఁబోయి, యాదరముతో శిశువునుఁ జూడఁగాఁ, వాయువు బ్రహ్మవచ్చుటఁ జూచి, కొడుకు బాధచేఁ దపించినవాఁడై కుమారు నెత్తుకొని వెంటనే లేచి.)

### —• బ్రహ్మాదులు హనుమంతునకు వరంబు లిచ్చుట •—

సీ. చలితకుండలమాలి • స్రక్తపనీయభూ, షణుఁ డయి మున్మ్రొక్కి • సాఁగి మ్రొక్కఁ
బవను లేవఁగ నెత్తి • బాలుని దేహంబు నిజకరాంబుజముల • నిమిరినంత
వాడిన సస్యంబు • వారి సోఁకినభంగి మరల జీవించుడు • మారుతుండు
లలిమ హర్షించి య • థాపూర్వముగను శరీరంబులందుఁ జ • రించుచుండె
ఆ. వాయుబాధ విడిచి • ప్రజ లుల్లసిల్లిరి, శీతశీతవాత • జాతబాధఁ
దోయజములతోడి • తూడు లసంగను, ననిలహితమనస్కుఁ • డబ్జభవుఁడు. ౧౧

అర్థములు. చలిత=కదలుచున్న, కుండలములు-మౌళి = కిరీటము స్రక్=హారములు, తపనీయభూషణుఁడు=బంగారు సొమ్ములు గలవాఁడై పవనున్=వాయువును, నిజకరాంబుజములన్ = తనహస్తకమలములచే, సస్యంబు=పైరు, వారి=నీళ్ళు, మారుతుండు=గాలి, యథాపూర్వముగను=మునుపటివలె, పీత=పోయిన, శీతవాత=చలివాయువువలన, జాత=పుట్టిన, బాధన్=బాధచే, అనిలహిత మనస్కుఁడు = వాయువునకు మేలుచేయు కోరికగలవాఁడు, అబ్జభవుఁడు=బ్రహ్మ, శీతవాతజాతబాధ-వాయువు దేహమున సంచరించుటచే నెత్తురు పాఱును, నెత్తురు పాఱుటచే దేహమున వేఁడిమి యుండును. వాయువు సంచారము లేకున్న వేఁడిమి లేదు. కాళ్ళు చేతులు దేహము చల్లబడును.

### తాత్పర్యము

చెవులకుండలములు తలయందలి కిరీటము, మెడయందలి హారములు, దేహము నందలి సొమ్ములు కదలుచుండ మూఁడు మార్లు బ్రహ్మకు వాయువు నమస్కరింపఁగా బ్రహ్మ యాయనను లేవనెత్తి బాలుని శరీరమును తన చేతులతో నిమురఁగా వాడినపైరుమీఁద నీళ్ళు చల్లిన మరలఁ గాంతితోఁ గూడినట్లు హనుమంతుఁడు ప్రాణయుక్తుఁడయ్యెను. వాయువు సంతోషించి మునుపటివలె మరల దేహములందు సంచరింప నారంభించెను. వాయువు నిరోధించిన బాధ తొలఁగి జనులు శీతవాయువు వలని బాధ తొలఁగి తామరల తోఁటి తూండ్లవలె సంతోషించిరి. అప్పుడు వాయువునకు మేలు చేయు మనస్సు గల బ్రహ్మదేవుఁడు.

చ. హరిహయ! యీశ! యప్పతి! ధనాధిప! దండధరా! మరుత్సుతుం
డరుదగు భావికార్యము సమర్థతఁ దీర్పఁగలాడు, మీకు నె
ల్లర కిది చక్కఁగా దెలియు నీ లావరి యానటు గాద్పుఁబట్టికిన్
వరము లొసంగుఁడీ, ముదము వర్ధిలఁ గావుత వాయుమూర్తికిన్. ౮౧౮

### తాత్పర్యము

ఇంద్రుఁడా! ఈశ్వరుఁడా! వరుణుఁడా! కుబేరుఁడా! యముఁడా! యీ వాయుపుత్రుఁడు రాఁగల కాలమున గొప్ప కార్యము నెఱవేర్చు వాఁడై యున్నాఁడు. ఇది మీ కందఱకుఁ దెలియును, కావున వీనికి బలము గలుగునట్లు మీరు మీరు వరములిండు. వాయువునకు సంతోష మతిశయించుము గాక.

చ. అనవుడు శక్రుఁ డంబుజసుయం బగు మాలిక నిచ్చి యీమరు
త్తనయునకున్ మదీయపవిధారఁ గదా హను విట్లు నొచ్చె దా
నన హనుమత్సమాఖ్య భువనంబు లెఱుంగఁగ గాంచుఁ గాక యిం
కను శతకోటిపాతమునఁ గాంచక యుండెడుఁ గాక మృత్యువున్. ౮౧౯

అర్థములు. శక్రుఁడు=ఇంద్రుఁడు, అంబుజమయంబు=కమలములతో నిండిన, మదీయ=నాయొక్క, పవిధారన్=వజ్రము వాదరచే, హనువు=చెంప, ఇంకను=ఇఁక మీఁద, శతకోటిపాతమునన్=వజ్రము పడుటచే.

తా త్ప ర్య ము

బ్రహ్మ యిట్లు చెప్పఁగా నింద్రుఁడు కమలములతో నిండిన మాలిక నిచ్చి నా వజ్రాయుధము దెబ్బచే నతనికి హనువు నొచ్చెను గావున నిఁకమీఁద నితఁడు లోకమున హనుమంతుఁడను పేరఁ బ్రసిద్ధుఁడగునుగాక. ఇఁకమీఁద నితనికి నావజ్రాయుధముచే మరణము లేకుండును గాక యని వరమిచ్చెను.

చ. అనవుడు భాస్కరుండు కరు•ణార్ద్రమనంబునఁ బల్కె నాదు తే
జనను శతాంశ మిచ్చితిని • శూరవరుం డగు గాడ్పుపట్టికిన్
సనయుఁడు శాస్త్రముల్ చదువ•శక్తి రహించిననాఁడు వీని వా
గ్మిని ఘటియించు శాస్త్రమును • గీర్తి రహింపఁగ నేర్పఁ బూనెదన్. ౧౨౦

అర్థములు. భాస్కరుఁడు=సూర్యుఁడు, కరుణార్ద్రమనంబునన్ = దయారసముచేఁ దడిసిన మనస్సుతో, శతాంశము=నూఱవ భాగము, వాగ్మిని=చక్కఁగా బలుకనేర్చిన వానిని.

తా త్ప ర్య ము

సూర్యుఁడు, నాతేజస్సులో నూఱవభాగము తేజస్వితనికి నిచ్చితిని. అదిగాక యితఁడు విద్యనేర్చు ప్రాయము వచ్చినప్పుడు చక్కఁగా మాటలాడఁ గల శాస్త్రమును నేర్పెదను.

తే. శాస్త్రదర్శనమున వీని•సముఁడు లేక యుండఁజేసెద నన వరు•ణుండు పల్కె
నీళ్ళనైనను మత్పాశ•నిహతినైన, మృతిని గాంచఁడు పదిలక్ష•లేండ్లకైన. ౧౨౧

తా త్ప ర్య ము

శాస్త్రజ్ఞానమునందు వీనికి సమానుఁడు లేకుండఁజేసెదను అని చెప్పఁగా వరుణుఁడు నీళ్ళచేనైనను నా పాశములచేనైనను పదిలక్ష లేండ్లకైనను చావు నొందఁ జాలఁడని వరమిచ్చెను.

తే. కాలదండాదులను జావు•గాన కునికి,రొల్లపుడు వ్యాధియనువని•రొంటుగకుంట
యుద్ధభూమి విషాదంబు•నొందకుంట వరములుగ నిత్తునని దండ•ధరుఁడుపలికె.

తా త్ప ర్య ము.

కాలదండము లోనగు వానిచేఁ జావకుండునట్లును నేనే కాలమందైనను వ్యాధియనునది లేక యుండునట్లును యుద్ధభూమియందు దుఃఖవిచారము లేకుండునట్లు యముఁడు వరము లిచ్చెను.

చ. తనగదచేత మృత్యువశ • తం గనకుండఁగ యక్షనాయకుం
డనుపమ మైన యాత్మ మహి • తాయుధసంతతి నీల్గమిం, ద్రిలో
చనుఁడు వరంబు లీయ జల • జప్రభవుండు చిరాయు విచ్చి యా
యనఘుఁడు బ్రహ్మదండముల • కన్నిటి కొత మవధ్యుఁ డంచనన్. ౭౨౩

తాత్పర్యము

కుబేరుఁడు తన గదచేతఁ జావకుండునట్లును శివుఁడు తన యే యాయుధము చేతను చావకుండునట్లును వరము లీయఁగా బ్రహ్మ చిరాయువు నిచ్చి యాపుణ్యాత్ముఁడు బ్రహ్మాస్త్రముల వేనిచేతను జావకుండ వరమిచ్చెను.

తే. బాలసూర్యోపమాను న • ర్భకునిఁ గాంచి, విశ్వకర్మ వచించె నీ • విశ్వనుతుఁడు
మద్వినిర్మితశస్త్రాళి • మడియ కుండుఁ; గాత దీర్ఘాయు వగుచును • గ్రాలుగాత.

తాత్పర్యము

బాలసూర్యునితో సమానుఁడైన బాలుని జూచి విశ్వకర్మ నేను నిర్మించిన యే యస్త్రశస్త్రము చేతను వీఁడు చావకుండెడుఁగాక, దీర్ఘాయువగునుగాక యని వర మిచ్చెను.

చ. అనవుడు సంతసించి నలి • నాసనుఁ డిట్లను గాడ్పుతోడ నీ
తనయుఁ డమిత్రభీప్రదుఁడు • తప్పక మిత్రముదావహుం డగున్
ఘనబలశాలి దుర్జయుఁడుఁ • గామచరుండును గామరూపి యెం
దును నెదు రేది గల్గని య • నుత్తమకీర్తియుఁ గామగుం డగున్. ౭౨౪

అర్థములు. నలినాసనుఁడు=బ్రహ్మ, అమిత్రభీప్రదుఁడు= శత్రువులకు భయంకరుఁడు, మిత్రముదావహుఁడు=స్నేహితులకు సంతోషము గలిగించువాఁడు కామచరుఁడు=కోరినట్లు ఏప్రదేశమునందైన చరింపఁ గలవాఁడు, కామరూపి=కోరినరూపము ధరింపగలఁవాఁడు, కామగుండు=కోరినంతవేగమునఁ బోఁగల వాఁడు, అనుత్తమకీర్తి=మిక్కిలి యుత్తమమైన కీర్తిగలవాఁడు.

తాత్పర్యము

ఇట్లిందఱు వరము లీయఁగా సంతోషించి బ్రహ్మ యిట్లనియె. వాయుదేవా! నీకొడుకు శత్రువులకు భయంకరుఁడు; మిత్రులకు సంతోషకరుఁడు నగును. అదిగాక మిగుల బలశాలియు జయింపరాని వాఁడును, ఇష్టము వచ్చిన ప్రదేశముల నిప్పులలో నీళ్ళలో నేలోక మందైన సంచరింపఁగలవాఁడును, కోరిన రూపము ధరింపఁ గలవాఁడును, కోరిన వేగమునఁ బోఁగలవాఁడును, ఎందు నెదురులేని వాఁడును, మిక్కిలి యుత్తమకీర్తిగలవాఁడు నగును.

క. రావణు నిధనంబున నీ, తావిభునకు బాసటగుచుఁ • దా నద్భుతకా
ర్యావళి ఘటియించును జ,న్యావని నని బిడ్డ నిచ్చి• యరిగెద ననుచున్. ౭ ౨౬

అర్థములు. జన్యావనిన్=యుద్ధభూమియందు, రావణునిధనంబునన్=రావణు వధించుట యందు.

(రావణునిఁ జంపుటయందు శ్రీరామచంద్రమూర్తి యుద్ధములోఁ దోడయి యద్భుతములగు కార్యములు చేయునని బిడ్డనిచ్చి, పోయి వచ్చెద ననుచు)

ఆ. సురలతో విరించి • యరుగఁగ గరువలి, బిడ్డతోడ వచ్చి• ప్రేమమీఱ
సకలవార్త దెలిపి • యంజనచే నిడి, యరిగెనంత నితఁడు• వరముబలిమి. ౭ ౨౭

అర్థములు. కరువలి=వాయువు.

తా త్ప ర్య ము

(దేవతలతో బ్రహ్మ పోఁగా, వాయువు బిడ్డనెత్తుకొని వచ్చి, ప్రేమతో సమాచారమంతయుఁ దెలిపి, యంజనాదేవి కాబిడ్డనిచ్చి వాయుదేవుఁడేగెను.అటు తరువాత నీతఁడు వరబలముచేత)

—• మునులు హనుమంతు శపించుట •—

చ. జలనిధియట్లు పొంగి ముని•సత్తమకోటులయాశ్రమస్థలుల్
దలరక చొచ్చి వల్కలవి•తానముఁ జించుచు నగ్నిహోత్రముల్
మలపుచు స్రుగ్ఘటంబులను • మాయఁగఁ దన్నుచు ఱంపు చేయుచున్
వలిముఖబాలుఁ డుండ ముని•వర్యులు బ్రహ్మవరం బెఱుంగుటన్. ౭ ౨౮

అర్థములు. జలనిధి యట్లు=సముద్రమువలె, వల్కల వితానము=నార చీరల సమూహము, మలపుచున్ = ఆర్పుచు, స్రుగ్ఘటంబులను=స్రుక్కులను ఘటంబులను, స్రుక్కు=కొయ్యమిళ్ళి, వలిముఖ బాలుఁడు=కోఁతి పిల్లవాఁడు.

తా త్ప ర్య ము

(సముద్రమువలె విజృంభించి, మునిశ్రేష్ఠుల యాశ్రమ ప్రదేశములందుఁ బ్రవేశించి, వారి నారచీరలను జించివేయుచు, నగ్నిహోత్రముల నార్పుచు, కొయ్యమిళ్లలను కుండలను బగులఁదన్నుచు, ఱంపుచేయుచుఁ గోఁతిపిల్లవాఁడుండగా, మునులు బ్రహ్మవరము దెలిసిన వారగుటచే.)

ఉ. శాంతముఁ దాల్చియుం గపి ద్యు•సంగెడి కష్టము సైఁపలేక య
త్యంతముకోప మూనక వ•నాటుఁడ! యే వరశక్తిబల్మిచే
నింతలు సేసె దట్టి బల•మెల్లను విస్మృతి నొందె దీవు, ని
న్నెంతయు నెవ్వరేఁ బొగడి•రేనియు నప్పుడు దోఁచుఁ గావుతన్. ౭ ౨౯

అర్థములు. శాంతము=శాంతి=కోపము లేనితనము, వనాటుఁడ=వానరుఁడా విస్మృతి=మఱపు, తోఁచున్=స్మృతికి వచ్చును.

తాత్పర్యము

(శాంతము పూనియు, క్రోతి పెట్టు కష్టము సైఁపలేక, మిగులఁగోపమును బూనక మునీశ్వరులు ఓ క్రోతీ! నీ వే వరము బలముచూచుకొని యింతింత పనులు చేయుచున్నావో, యట్టి బలమును నీవు మఱచిపోయెదవు గాక. ఎవరైనను నిన్నుఁ బొగడినప్పుడు నీకు మరల నది స్మృతికి వచ్చును.

క. అని ఋషులు శపింపఁగనీ యనఘుఁడు తనశక్తి మఱచి ♦ యది మొదలుగ నె
దును గడు మృదుభావంబున, జనవర! చరియించుచుండె ♦ సాధుచరితుఁడై. ౪౩౦

తాత్పర్యము

(అని ఋషులు శాపము పెట్టిరి. ఆ కారణమున నీ హనుమ తనశక్తి మఱచి యది మొదలు చాల నెమ్మదిగ సాధువర్తనుఁడై యుండెను.)

సీ. పడపడి కపికుల ♦ వర్గంబులకు వాలి, సుగ్రీవజనకుండు ♦ సూరవరుఁడు
ఋక్షరజుండు దాఁ ♦ నేలికయై యుండె, రవితేజుఁ డతఁడు చి ♦ రంబు గాఁగ
రాజ్యంబు నేలి స్వా ♦ రాష్ట్రంబుఁ జేరిన, సచివులు వాలిని ♦ జనకపదము
నందు, సుగ్రీవుని ♦ నగ్రజుపదమున, నిలిపి రీ హనుమయు ♦ నిర్మలంబు

ఆ. ఛిద్రవర్జితంబు ♦ స్నేహ మద్వైధంబు, బాల్య మాదిగాఁగ ♦ భాస్కరాత్మ
జాతుతోడఁ జలిపె ♦ జానకీవల్లభ! వింటె హనుమజనన ♦ వీర్యములను. ౪౩౧

అర్థములు. స్వారాష్ట్రంబు=స్వర్+రాష్ట్రంబు=స్వర్గలోకము, సచివులు= మంత్రులు, జనకపదమునందు=తండ్రిస్థానమునందు, రాజుగా-అగ్రజుపదమునన్= అన్నయగు వాలి యున్న పదవియందు యువరాజుగా, ఛిద్రవర్జితంబు=రంధ్రము లేనిది, లోపము లేనిది, అద్వైధంబు ♦ ఏకవిధమైనది.

తాత్పర్యము

(అటు పిమ్మట వాలి సుగ్రీవుల తండ్రియైన ఋక్షవరజుఁడు మహాశూరుఁడు కపుల మూఁకలకుఁ దాను రాజై చాలకాలము రాజ్యము చేసి స్వర్గమునకుఁ బోఁగా, మంత్రులు వాలిని తండ్రియొక్క పదవియందును, సుగ్రీవుని యన్న యధికార మందును నిలిపిరి ఈ హనుమంతుఁడు పసితనము నుండి సుగ్రీవునితో నెప్పుడు నెట్టి లోపము భేదము లేకుండ స్నేహము చేసెను. శ్రీరామచంద్రా! హనుమంతుని జన్మము-బలమును వింటివి కదా.)

క. మౌనుల శాపవశంబునఁ, దా నెఱుఁగక తనదుశక్తిఁ • దరుచరపతి యా
భానుజుఁ దఱుముఁగ వెంటనె, తానును బరువెత్తుచుండె • ద్రాబయుపోలెన్. ౪౩౨

అర్థములు. ద్రాబయుపోలెన్=అధమునివలె, బలహీనునివలె,

తాత్పర్యము

(మునుల శాపముచేతఁ దన శక్తి తనకుఁ దెలియక వాలి సుగ్రీవునిఁ దన్ని తఱిమివేయఁగా, వానివెంటఁ దానును ద్రాబవలెఁ బరుగెత్తుచుండెను.)

క. తెలియమి సుగ్రీవుండును, దలఁపింపఁడు దానఁ గాదె • దంతి గవసినన్
బలవంతము హరి పఱచెడి, చెలువున నతఁ డుండె యుద్ధ•సీమన్ వింటె ౪౩౩

అర్థములు. తెలియమి=ఈ శాపవిధము తెలియక పోవుటచే, తలపింపఁడు=జ్ఞప్తికిఁ దీసికొని వచ్చినవాఁడుకాఁడు, దంతి=ఏనుఁగు, పఱచెడి చెలువునన్=పరుగెత్తు విధముగా.

తాత్పర్యము

(సుగ్రీవునకు శాపవిధము తెలియకపోవుటచే నాతఁడును జ్ఞప్తికి దీసికొని వచ్చిన వాఁడు కాఁడు. ఏనుఁగు తఱుముకొని వచ్చిన సింహము పరుగెత్తు విధముగా నతఁడు యుద్ధభూమి యందుండెను.)

మత్తకోకిలము స్థైర్యధైర్యపరాక్రమక్రమ • సాహసంబుల శౌర్యగాం
భీర్యబుద్ధులఁ జాతురీనయ • వీర్యయుక్తుల సూక్తి మా
ధుర్యకార్యధురీణతాజన • తుష్టి కారణచర్యలన్
సూర్యశిష్యునకి ప్రభంజన • సూతికిన్ సము లుందురే. ౪౩౪

అర్థములు. నయ=నీతి, సూక్తిమాధుర్య=తియ్యని మాటలాడుట, కార్యధురీణతా=కార్యము సాధించుట, జనతుష్టి కారణచర్యలన్=జనులకు సంతోషము గలిగించు నడవడులందు, ప్రభంజనసూతికిన్=వాయుపుత్రునకు.

తాత్పర్యము

(స్థైర్యమునం, ధైర్యమునందు, పరాక్రమమున. సాహసమునందు శౌర్య గాంభీర్యము, బుద్ధి, చాతుర్యము, నీతి, బలము, యుక్తి, తియ్యనిమాటలాడుట, కార్యమును సాధించుట. జనులకు సంతోషము గలిగించు నడవడులందు సూర్యుని శిష్యుఁడగు వాయుపుత్రునకు సమానులున్నారా?)

క. పుట్టమునుండి గ్రుంకుడు, గట్టుదనుక సూర్యుతోడఁ • గదువసిఁ జనుచున్
బట్టుగ వ్యాకరణంబును, గట్టిగ వల్లించె నితఁడు • కంజదళాక్షా! ౪౩౫

అర్థములు. పుట్టుమల=ఉదయపర్వతము, క్రుంకుఁడుగట్టు=అస్తాద్రి, కడు వడిన్=మిగుల వేగముతో.

తా త్ప ర్య ము

వయస్సు వచ్చిన పిమ్మట హనుమంతుఁడు విద్యనేర్చుకొనఁగోరి సూర్యుని యొద్దకుఁ బోయి నీ విచ్చినవరము ప్రకారము నాకు విద్యనేర్పుమనెను. నేనొక చోట నిలుచువాఁడను గానే, నీవెట్లు చదివెద వనగా, నీవెంట నేను వచ్చెదనని యాయన వెంటఁబోవుచు నాయన చెప్పిన విద్య గ్రహించెను.

తే. సూత్రములతోడ వృత్తియు • సూత్రములకు
నర్థము పదంబు మరియు మ•హార్థ మన్య
శాస్త్రనిచయంబు ఛందస్సుఁ • జక్కఁ నేర్చెఁ
గీర్తితచరిత్రుఁ డీతండు • కేవలుండె. ౮౬

అర్థములు. వృత్తి=వివరణ గ్రంథము.

తా త్ప ర్య ము

(సూత్రములతో వివరణ గ్రంథమును, సూత్రముల కర్థమును మఱియుపద మును విశేషార్థమును యితరశాస్త్ర సముదయమును ఛందస్సును జక్కఁగానేర్చు కొనెను. ఇతఁడు సామాన్యుఁడా?)

తే. సకలవిద్యల దేవతా•చార్యుతోడ, నెనయఁ జాలెడి యీతండు•జనవరేణ్య!
యభ్యసించెను దొమ్మిది•వ్యాకరణము, లగును బ్రహ్మగఁ దావకీ•నానుకంప.

అర్థములు. దేవతాచార్యుతోడన్=బృహస్పతితోడ, ఎనయఁజాలెడిన్=సమానుఁడగును, తావకీన=నీయొక్క, అనుకంపన్=దయచే, అగును బ్రహ్మగ= బ్రహ్మ గాఁగలఁడు. ఇప్పు డుండు బ్రహ్మదేవుఁడు కల్పాంతమునఁ బోఁగానే యా స్థానమునకు హనుమంతుఁడు బ్రహ్మగా వచ్చును. ఈశరీరముతోఁగాదు. దేవ శరీరముతో

తే. జగములను ముంపఁ బూనిన • సాగరుండు
భువనములఁ గాల్పఁ బూనిన • భువనభవుఁడు
ప్రళయవేళను రేఁగు వై•వస్వతుండు
వాయుజుఁడు వాని యెదుట నె•వ్వాఁడు నిలుచు? ౮౭

అర్థములు. భువన భవుఁడు=నీటఁబుట్టినవాఁడు, అగ్ని.
నీటఁ బుట్టినవాఁడు కాఁ డోటు వహ్ని,
కాల్చుచున్నాఁడు జగమెల్లఁ గరుణలేక ॥మను॥
వైవస్వతుండు=యముఁడు, వాయుజుఁడు=హనుమంతుఁడు.

తా త్ప ర్య ము

(లోకములను ముంచివేయఁ బూనిన సముద్రుఁడు. లోకములను గాల్పఁ బూనిన యగ్ని దేవుఁడు ప్రళయకాలమున విజృంభించు యముఁడు సుమా హనుమంతుఁడు-వాని యెదుట ఎవఁడు నిలువఁ గలఁడు?)

ఉ. పావనివోలె నీకు నని ♦ బాసటగా విబుధాళిచేత సు
గ్రీవుఁడు మైందుఁడున్ ద్వివిద♦కేసుఁడు రంభుఁడు సైన్యనాథుఁడున్
దైవతనాథపౌత్రుఁడును ♦ దారుఁడు జన్మము గాంచిరిర్వి రా
మా! వినిపించితిన్ సకల ♦ మంజనసూనువిధంబు నావుడున్ ౨౩౯

అర్థములు. బాసటగా=సహాయపడఁగా, దైవతనాథపౌత్రుఁడు=అంగదుఁడు.

తా త్ప ర్య ము

(హనుమంతునివలె నీకు యుద్ధములో సహాయముగా, సుగ్రీవుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, రంభుఁడు, నీలుఁడు, అంగదుఁడు, తారుఁడు దేవతలచేత జన్మమును గాంచిరి-రామా! యాంజనేయుని విషయమంతయు వినిపించితిని-)

నాలుగవ పాదంబునఁ బుతయతి.

క. రాముఁడు సౌమిత్రియు శా,ఖామృగవరు లద్భుతంబు ♦ గాంచిరి మఱిలో
పాముద్రాహృదయేశుఁడు, ప్రేమంబునఁ బలికె రామ♦పృథ్వీశ్వరుతోన్. ౨౪౦

అర్థములు. లోపాముద్రా హృదయేశుఁడు=అగస్త్యుఁడు.

తా త్ప ర్య ము

(రాముఁడు, లక్ష్మణుఁడు, వానరవర్యు లందఱు వచ్చెరువుపడిరి. మఱియు నగస్త్యుఁడు రామచంద్ర భూపాలునితోఁ ప్రేమమీఱ నిట్లని చెప్పెను.)

—* అగస్త్యాదులు శ్రీరాముచే ననుజ్ఞగొని పోవుట *—

చ. వినిచితి నెల్లవృత్తములు ♦ వింటిమి నీ వఖిలంబు నింక మా
కనుమతి యిచ్చెదే చనఁగ ♦ నార్తజనావనదక్ష! యన్న న
మ్మునివరుఁ బల్కు- రాఘవుఁడు ♦ మోదమునం గరము ల్మొగిడ్చి యో
యనఘ! భవద్విలోకనమ♦హాసుకృతం బిటు నేఁడు గల్గుటన్. ౨౪౧

అర్థములు. ఆర్తజనావనదక్ష=దీనజనుల రక్షించు సామర్థ్యము గలవాఁడా, భవద్విలోకన=నిన్నుఁ జూచుట యనెడి, మహాసుకృతంబు=గొప్ప పుణ్యము.

తా త్ప ర్య ము

(ఆర్తులను రక్షించుటయందు సమర్థుఁడవగు రామచంద్రా! సమస్త విషయములు నీకు వినిపించితిని. నీ వన్నియు వింటివి-పోయెదము. ఇక మా కనుమతి

యిచ్చెదవా యనఁగా, రామచంద్రమూర్తి సంతోషముతోఁ జేతులు జోడించి, యా మునివర్యునితోఁ, యగస్త్యునిఁ జూచి యనఘా! నేఁడీ విధమున మీ దర్శన మహా పుణ్యము కలుగుటచేత.)

చ. తనిసిరి నాదు దేవతలు • తాతలుఁ • దండ్రియుఁ దుష్టి గూరిరో
మునివర! నాదు బాంధవులు • మోదముఁ గాంచిరి శాశ్వతంబుగా
వినుఁ డొక విన్నపంబు మిము • వేఁడితి నేనియు నిందు రాఁగ నా
మనవి గ్రహించి మీరు దయ • మాలక యిం దరుదేరఁగాఁ దగున్. ౭౮౨

అర్థములు. తనిసిరి=తృప్తిపడిరి, తుష్టి=సంతోషము, దయమాలక=దయ వదలక.

తాత్పర్యము

(నా పితృదేవతలు తృప్తిపడిరి-తాతలు మా తండ్రి దశరథుఁడు సంతోషించిరి- నా చుట్టాలు శాశ్వతమైన సంతోషమును బొందిరి, నా విన్నపమొకటి గలదు వినుఁడు-ఇచ్చటకు రావలసినదిగా నేను వేఁడినప్పుడు నా మనవి నంగీకరించి దయవదలక విచ్చేయఁ దగును-)

చ. అడవులనుండి క్రమ్మరితి • నందఱుఁ బౌరులు స్వీయకార్యముల్
తడఁబడకుండఁ జేయఁగ య • థావిధి నిల్పి సవం బొనర్పఁగాఁ
గడఁగెద, మీర లధ్వరము • కాలమునందు నజస్ర మిచ్చటన్
గడుకొని నిల్వఁగా వలయుఁ • గార్యము లన్నియుఁ దీర్పఁగా దయన్. ౭౮౩

అర్థములు. తడఁబడకుండ=వ్యత్యాసపడకుండ, యథావిధి=నియమ ప్రకారము, సవము=యజ్ఞము, కడఁగెదన్=ప్రారంభించెదను, అధ్వరము=యజ్ఞము, అజస్రము=ఎల్లప్పుడు, యజ్ఞము పూర్ణమగువఱకు మరలిపోక.

తాత్పర్యము

(అడవులనుండి తిరిగి వచ్చితిని. పౌరులందఱు తమ తమ పనులు తడబడక నియమ ప్రకారము చేయునట్లు నిల్పి యజ్ఞము ప్రారంభించెదను- మీరాయజ్ఞము పూర్ణమగు వఱకు మరలిపోక యిక్కడనే యెల్లప్పుడుండి, కార్యము లన్నియు దయతో నెఱవేర్పవలెను-మునులారా!

క. ధుతకల్మషజాలుర మిము, హితమతి నే నాశ్రయించి • యీడేరఁ గృతుల్
వితతులయనుగ్రహమునకు, స్తుతగతి నే బాత్ర మగుదుఁ • జిం దన మానుల్.

అర్థములు. ధుత కల్మష జాలుర=ఎగురఁగొట్టఁబడిన పాపసమూహములు గలవారు, ఈడేరన్=నెఱవేఱఁగా.

తా త్ప ర్య ము

(పాపరహితులరగు మిమ్ము నే నాశ్రయించి, కార్యములన్నియు నెఱ వేఱఁగా నా పితరుల యనుగ్రహమునకుఁ బాత్రుఁడ నయ్యెదను.)

క. అందఱు నగుఁ గాకని యరు, గం దశరథనందనుండు♦క్రతువిషయక చిం
తం దవిలి యుండె, సూర్యుఁడు మందకరుం డగుచుఁ బవిచి ♦ మర్కటవరులన్.

అర్థములు. క్రతువిషయక చింతన్=యజ్ఞవిషయమైన విచారము, ఏ యజ్ఞము చేయవలె, ఎచ్చటఁ జేయవలె నని యాలోచన, మందకరుండు=వేఁడి లేని కిరణములు గలవాఁడు.

తా త్ప ర్య ము

(అందఱును నట్లే, యని పోయిన పిమ్మట రామచంద్రమూర్తి యజ్ఞవిషయ మైన యాలోచనలో మునిఁగి యుండె, యెండ చల్లబడిన తరువాత, వానరనాయ కులను బంపె.)

ఆ. తాను సంధ్యవార్చి ♦ తమి ప్రవర్తిల్లగ, నంతిపురమునందు ♦ హాయినుండెఁ
బట్ట మందినట్టి♦ప్రథమరాత్రం బిట్టు లేగెఁ బౌరహర్ష♦వృద్ధి యొసఁగ. ౧౫౬

అర్థములు. తమి=రాత్రి, ప్రథమరాత్రంబు=మొదటిరాత్రి.

తా త్ప ర్య ము

(తాను సంధ్యవార్చి, రాత్రికాఁగానే, యంతఃపురమునకుఁ బోయిహాయిగా నుండెను. పట్టముగట్టుకొనిన మొదటిరాత్రి పౌరులందఱకు సంతోషమతిశయిల్ల నీ ప్రకారము జరగెను.)

సీ. ఆరాత్రి వేగుచో ♦ నతిమనోహరకంఠ, వందిజనంబులు ♦ సుందరముగఁ
గౌసల్యనందనా! ♦ కరుణాఢ్య మేల్కొమ్ము, నీవు నిద్రించిన ♦ నిఖిలజగము
నిద్రించు వీరాగ్ర♦ణీ! నీవు విక్రమం,బున విష్ణుఁడవు రూ♦పమునకు నశ్వి
లను బోలెదవు బుద్ధి ♦ నెనయుదు సురగురుఁ, బరమేష్ఠికిని సీడు♦వత్తు వీవు

ఆ. క్షమను గాశ్యపికిని ♦ సముఁడవు తేజాన, భాస్కరుండ వీవు ♦ పవను నద్ది
ఘనజవంబునందు ♦ గాంభీర్యగుణమున, సాగరంబుఁ బోలఁ♦జాలు దీవు. ౧౫౭

అర్థములు. వేగుచోన్=ఉదయము కాఁగా, అతి=మిగుల, మనోహర= ఇంపైన, కంఠ=కంఠస్వరముగల, వందిజనంబులు=స్తోత్రపాఠకులు, ఎనయుదు= సరిపోలెదవు, పరమేష్ఠి=బ్రహ్మ, క్షమను = ఓర్పునందు, కాశ్యపికిన్=భూమికి పవను=వాయుదేవునకు, ఘనజవంబునందున్=మిగుల వేగమునందు.

### తా త్ప ర్య ము

ఆరాత్రి తెల్లవాఱఁగానే మంచి యింపైన కంఠస్వరములుగల స్తోత్రపాఠకులు వచ్చి యిట్లు స్తుతియించిరి. కౌసల్యానందనా! దయాసంపన్నా! మేలుకొనుము నీవు నిద్రించితివేని లోకము లన్నియు నిద్రించును. వీరులందు శ్రేష్ఠుఁడా! నీవువిక్రమంబున విష్ణుఁడవు, సౌందర్యమున నశ్వినీదేవతలఁ బోలుదువు, బుద్ధియందు బృహస్పతి బ్రహ్మలకు సమానుఁడవు ఓర్పునందు భూమివి తేజమునందు భాస్కరుండవు వేగమునందు వాయువునకు సమానుఁడవు, గాంభీర్యమున సముద్రమువంటి వాఁడవు.

క. స్థాణుండ వప్రకంప్యత, నేణాంకుఁడె, సౌమ్యతను స॰దృక్షుఁడు నీకున్
క్షోణీపాలుర మున్న ప్రమాణంబుగ, లేరు నీదు॰మాదిరి రాజుల్. ౭౮౭

అర్థములు. అప్రకంప్యతన్=చలింపకుండుటయందు, స్థాణుఁడవు=శివుఁడవు, ఏణాంకుఁడె=చంద్రుఁడే, సౌమ్యతను=ప్రసన్నతయందు, సదృక్షుఁడు=సమానుఁడు

### తా త్ప ర్య ము

(స్థయిర్యమున నీవు స్థాణుఁడవే యనఁగా శివుఁడవు. ప్రసన్నతయందు చంద్రుఁడే నీకు సమానుఁడు పూర్వము రాజులలో నీ మాదిరి రాజులు లేరు.)

క. అతిదుర్ధర్షుఁడ వగుటను, క్షితిజనహితకరణవృత్తిఁ ॰ జెలఁగుట సతమున్
క్షితిపా! కీర్తియు లక్ష్మియు, సతతము ని న్నాశ్రయించుఁ॰జన కెచ్చటికిన్. ౭౮౯

అర్థములు. అతిదుర్ధర్షుఁడవు=మిక్కిలి తిరస్కరింపరాని వాఁడవు, క్షితిజన=భూప్రజలయొక్క, హిత=మేలును, కరణవృత్తి=చేయువ్యాపారమందు, క్షితిపా=రాజా.

### తా త్ప ర్య ము

(నీవు మిక్కిలి తిరస్కరింపరానివాఁడవు. భూప్రజలకు మేలుచేయు వ్యాపారమునందు నిల్లప్పుడుండుటచేత కీర్తియు సంపదయు నెచ్చటకుఁబోక నిన్నే యాశ్రయించును.)

క. సిరియును ధర్మము నృపతీ!, తిరముగ నీయంద కదుఁ బ్ర॰తిష్ఠితము లటం
చరుసంబున నిటు పల్కఁగఁ గరము మధురసూక్తి సూత॰కాండము పొగడన్.

అర్థములు. ప్రతిష్ఠితములు=స్థాపింపఁబడినవి, అరుసంబునన్=సంతోషముతో.

### తా త్ప ర్య ము

శ్రీయును ధర్మము నీయందు స్థిరముగ స్థాపింపఁబడి యున్నవని యిట్లు వందులు పొగడఁగా సూతసమూహము తియ్యని మాటలచేఁ బ్రశంసింపఁగా.

క. ఫణిరాజశయ్య నారా, యణుచందంబుగను పాండు•రాచ్ఛదిత మ
 మణిమయ మగు శయ్యను ధా, రణీతనయాధవుఁడు లేవఁ•బ్రాంజలులగుచున్.

అర్థములు. ఫణిరాజశయ్యన్ = ఆదిశేషతల్పమునందు, పాండురాచ్ఛాదితము=తెల్లని వస్త్రములచేఁ గప్పఁబడిన, మణిమయము=రత్నములతో నిండిన దగు, ధారిణీతనయాధవుఁడు=రామచంద్రమూర్తి, ప్రాంజలులు=నమస్కరించు వారు.

తాత్పర్యము

(ఆదిశేష తల్పమునందు నారాయణమూర్తివలెఁ దెల్లని వస్త్రములచేఁ గప్పఁబడిన మణిమయముగు శయ్యనుండి సీతాపతియగు శ్రీరామచంద్రమూర్తి లేవఁగా, నమస్కరించువారగుచు.)

ఉ. ప్రాకట శుభ్రపాత్రముల • వారి నొసంగఁగ శుద్ధిమంతుఁడై
 శ్రీకరు హవ్యవాహుని న•రీణగతిన్ యజియించి రాముఁ డి
 క్ష్వాకుసుసేవితంబును శు•భం బగు దేవగృహంబుఁ జొచ్చి శ్ర
 ద్ధాకలితుండు దేవపితృ•ధారిణినిర్జరపూజ లన్నిటిన్. ౧౫-౨

అర్థములు. శుభ్రపాత్రములన్=నిర్మలములైన తెల్లని గిన్నెల, శుద్ధిమంతుఁడై=స్నానాదు లొనర్చినవాఁడై, శ్రీకరున్=సంపత్కరుని, 'ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్, శ్రియ మిచ్ఛేత్ హుతాశనాత్', అని యుండుటచే అగ్ని శ్రీకరుఁ డనఁ బడెను. హవ్యవాహునిన్ = అగ్నిహోత్రుని, అరీణగతిన్=క్రమ ప్రకారము,యజియించి=పూజించి, దేవగృహంబున్=దేవుని నుంచిన యింటియందు శ్రద్ధాకలితుండు=శ్రద్ధగలవాఁడు, దేవ=దేవతలయొక్కయు, పితృ=పితృదేవతల యొక్కయు, ధారిణీ నిర్జర=బ్రాహ్మణులయొక్కయు పూజలను.

తాత్పర్యము

మిక్కిలి నిర్మలములైన పాత్రములందు జలము లీయఁగా స్నానాదులచే దేహము శుద్ధి చేసికొనిన వాఁడై సంపత్కరుఁడైన యగ్నిహోత్రుని బూజించి ఇక్ష్వాకువంశమువారు వంశపరంపరగాఁ బూజించు దేవమందిరము ప్రవేశించి శ్రద్ధ గలవాఁడై దేవపూజలు పితృపూజలు బ్రాహ్మణపూజలు గావించినవాఁడై —

పితృదేవతపూజలు చేసిన తరువాత దేవపూజలు చేయరాదు. కావున దేవ పితృపూజ లనఁబడెను.

క. ఓలి యథావిధిఁ దీరిచి, క్రాలు ముకంబునను బాహ్య•కక్ష్యకు రామం
 ద్రాళులు వశిష్ఠముఖులున్, గీలులవలె వెన్నడింపఁ • గీర్తింప జనుల్ ౧౫-౩

అర్థములు. ఓలిన్=క్రమముగా, యథావిధి=శాస్త్రప్రకారము, బాహ్యకక్ష్యకున్=వెలుపలి తొట్టికట్టునకు, రాన్=రాఁగా, మంత్రౌఘలు=మంత్రముల సమూహములు, కీలులవలెన్=అగ్నులవలె.

తా త్ప ర్య ము

(శాస్త్రప్రకారము క్రమముగా నెఱవేర్చి, సంతోషముతో వెలుపలితొట్టి కట్టునకు రాఁగాఁ మంత్రముల సమూహములు వసిష్ఠుఁడు మున్నగు వారును నగ్నులవలె వెంబడింపఁగా, జనులు పొగడఁగా.)

క. నానాభూషణులు సమా సీనుండగు రామవిభుని • చెంతల నుండన్
మానుగఁ త్రయినాఁగ సుమిత్రానందనయుగముకై క • తనయుఁడు తనరన్.

అర్థములు. సమాసీనుండు=ఆసనమందుఁ గూర్చుండినవాఁడు, త్రయి=ఋగ్యజుస్సామ వేదములు, సుమిత్రానందనయుగము=లక్ష్మణ శత్రుఘ్నులు.

తా త్ప ర్య ము

(సింహాసనమున నాసీనుఁడై శ్రీరామచంద్ర ప్రభువు వారి పార్శ్వముల రాజు లందఱు నుండ. ఋగ్యజుస్సామ వేదములవలె లక్ష్మణ భరత శత్రుఘ్నుల నిలువఁగా.)

క. సేవకులు పెక్కు రానం, దావిష్టులు క్రొమ్మొక్కి పార్శ్వ • మందు సముచితం
బౌ వివిధాసనతతిపై, వారిరిఁ గూర్చుండ ముఖ్య • వానరవర్యుల్. ౧౫౫

అర్థములు. ఆనందావిష్టులు=ఆవేశించిన సంతోషము గలవారు.

తా త్ప ర్య ము

(సేవకు లనేకులు సంతోషావేశమున క్రొమ్మొక్కి పార్శ్వభాగమున వారి వారికిఁ దగిన వివిధములగు నాసనముల మీఁదఁ గ్రమముగాఁ గూర్చుండఁగా, ముఖ్యులగు వానర నాయకులు.)

క. ఖరకరసుతముఖు లిరువదు,గురు సచివచతుష్కయుతుఁడు • గురుమతి దశకం
ధరసోదరుఁడును, గొల్వఁగ ధరణీశుఁడు గుహ్యకవృత • ధనదునిఁబోలెన్. ౧౫౬

అర్థములు. ఖరకర సుతముఖులు=సుగ్రీవుఁడు మొదలగువారు, సచివచతుష్కయుతుఁడు=నలువురు మంత్రులతోఁ గూడినవాఁడు, గురుమతి=గొప్ప మనస్సు గలవాఁడు, దశకంధర సోదరుఁడు=విభీషణుఁడు, గుహ్యకవృత=గుహ్యకులతోఁ జుట్టఁబడిన, ధనదుని=కుబేరుని, ఇరువదుగురు, చూ.౯౧౫౫-అంగదుడు.

తాత్పర్యము

(సుగ్రీవుఁడు మొదలగువారిరువదుగురు నలుగురు మంత్రులతో రావణుని తమ్ముఁడు విభీషణుఁడును సేవింప గుహ్యకులతోఁ గూడిన కుబేరునివలె శ్రీరామచంద్ర ప్రభువు.)

తరలము. నిగమవృద్ధులు సత్కులీనులు • నీరజాక్షుని హస్తముల్
మొగిచి మ్రొక్కి నిజోచితాసన•ముల్ గ్రహించి భజింపఁగన్
జిగి దొలంకఁగ మానివర్యులు • నిర్జరుల్ గొలువన్ దివిన్
నగవిరోధిని మించు శీవిఁ ద•నర్చె రాముఁడు గొల్వులోన. ౧౫౭

అర్థములు. నిగమవృద్ధులు=పౌరులయందు ముసలివారు, నిగమో నిశ్చయే పుర్యాం పథి వేదే వణిక్పథే నానా॥ర సత్కులీనులు=గొప్పవంశములఁ బుట్టినవారు, నీరజాక్షుని=రామచంద్రునీ, మొగిచి=ముకుళించి=మోడ్చి, నిజోచితాసనముల్=తమకుఁ దగిన యాసనములు, జిగి=కాంతి, నగవిరోధిని=ఇంద్రుని, కొల్వులోన్=సభయందు.

తాత్పర్యము

(పౌరులయందు ముసలివారు, గొప్పవంశములఁ బుట్టినవారు శ్రీరామచంద్రునికి, చేతులు మోడ్చి మ్రొక్కి, తమకుఁ దగిన యాసనములను గ్రహించి సేవింపఁగా, మునివర్యులు, దేవతలు గొలువఁగా స్వర్గమున నింద్రుని నతిశయించిన శీవితో రామచంద్రమూర్తి కొలువులోఁ గాంతి మిగుల నొప్పెను.)

క. కౌసల్యాతనయుం డిటు, భాసిల, పేరోలగమునఁ • బౌరాణికు ల
త్యాసక్తిఁ బురాణకథా, వ్యాసంగము జరపి రర్హ•మగు మార్గమునన్. ౧౫౮

అర్థములు. పేరోలగమునన్=పెద్ద సభయందు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యిట్లు పెద్ద సభలోఁ బ్రకాశింపఁగా, పౌరాణికులు మిగుల నాసక్తితోఁ దగిన విధమునఁ బురాణ కథలను జెప్పిరి.)

**—• శ్రీరాముఁడు జనకాదిరాజుల వారివారి పురంబుల కనుచుట •—**

చ. దినము దినంబు నిట్లు జగ•తీపరిపాలన మర్హపద్ధతిన్
జనపదరాష్ట్రదేశజన•సమ్మతిగా నొనరించు చొక్కనాఁ
డనఘుని మైథిలుం గని కృ•తాంజలి యై జననాథ! నీవె మా
కనయము దిక్కు, పంక్తిరథ•నాసుర నీ మహిమన్ జయించితిన్. ౧౫౯

అర్థములు. జనపదములు=గ్రామములు, రాష్ట్రము=కొన్ని గ్రామముల సమూహము, దేశము=రాష్ట్రసమూహము, మైథిలున్=జనకరాజును, కృతాంజలియై=చేతులు జోడించిన వాఁడై, పంక్తివదనాసురున్=రావణుని.

తాత్పర్యము

(ప్రతిదిన మీవిధముగా, గ్రామములు, రాష్ట్రములు దేశములందలి జనులను సమ్మోదముగా సర్వోత్తమగు పద్ధతితో భూమినిఁ బరిపాలన మొనరించుచు నొక నాఁడు పాపరహితుఁడగు జనకునిఁ జూచి, 'మహారాజా! నీవే మాకెల్లప్పుడు రక్షకుఁడవు-నీ మహిమచేతను రావణుని గెల్చితిని.')

ఉ. నీకృప రక్షణీయులము • నిర్మలశీల! విదేహభూమిపే
క్ష్వాకుల బాంధవంబు భృశ•సమ్మదహేతువు కీర్తిదంబు మీ
రీకడ కేగుదెంచి చని • రెం బలునాళ్ళు జనావనక్రియా
స్తోకరతాత్మ లీరు పురిఁ • జూడఁగఁ బోయెదరేని ప్రేముడిన్. ౧౬౦

అర్థములు. రక్షణీయులము=కాపాడఁ బడఁదగినవారము, విదేహభూమిప=విదేహరాజులయొక్కయు, ఇక్ష్వాకుల=ఇక్ష్వాకు వంశరాజులయు, బాంధవంబు=చుట్టఱికము, భృశసమ్మద హేతువు=మిక్కిలి సంతోషకారణమైనది, కీర్తిదంబు=కీర్తికరమైనది, జనావన క్రియా=జనరక్షణ కార్యమందు, అస్తోకరతాత్ములు=మిక్కిలీ ప్రీతిగలవారు, ప్రేముడిన్=ప్రేమచే.

తాత్పర్యము

పవిత్రచరిత్రా! మమ్ము రక్షించునది నీ దయయే. విదేహరాజులయు నిక్ష్వాకులయు సంబంధము మిక్కిలి సంతోషకరమైనది, కీర్తికరమైనది, మీరిచ్చటికి వచ్చి చాల దినము లయ్యెను మీరు ప్రజారక్షణమందు మిక్కిలి యాసక్తి గలవారు, మీరూరికి పోవదలఁచెదరేని నాయందుఁ బ్రేమ యుంచి.

క. ఈ రత్నంబులఁ గొనిచనుఁ, డీరలు భరతుండు వెంట • నేతెంచెదు నా
శ్రీరాముని వాక్కుల విని, గారామున జనకుఁ డనియెఁ • గాకుత్స్థవరా! ౧౬౧

తాత్పర్యము

(ఈరత్నములను మీరు తీసికొని చనుఁడు-భరతుఁడు మీవెంట వచ్చును. అనిన శ్రీరామచంద్రమూర్తి మాటలను విని ప్రేమతో జనకమహారాజు-కాకుత్స్థవంశమణీ!)

క. నీదర్శనమున రాజా!, నీసువిధేయతకు మనము • నెంతే మోదించెన్
నా దుహితలకీరత్నము, లాదృతి నొసఁగితి నటంచు • నరిగెం బురికిన్. ౧౬౨

అర్థములు. దుహితలకు=కూఁతురులకు.

తా త్ప ర్య ము

(నీ దర్శనము చేతను, నీ విధేయతను గనియు నా మనస్సు పూర్ణముగ సంత సించెను. ఈరత్నములను నాకూఁతుల కిచ్చితినని చెప్పి తన రాజధానికిఁబోవెను.)

తే. అవలఁ గేకయుతో రామునఁ డనఘశీల! భరతుఁడును
లక్ష్మణుండుమా సిరియు రాజ్య
మెల్ల మీరాయదిమీ రెమా కెపుడు దిక్కు.
నైన మీరిందుఁ జెక్కు నా ళ్ళయ్యెవచ్చి.

తా త్ప ర్య ము

(అటుపిమ్మటఁ గేకయరాజుతో రామచంద్రమూర్తి పుణ్యమూర్తీ! భర తుఁడు, లక్ష్మణుఁడు, మాయైశ్వర్యము- రాజ్యము మీదే-మీరే మాకెల్లపుడు రక్షకులు-అయినను మీరిక్కడకు వచ్చి చాలదినము లయినది.)

ఉ. అచ్చట వృద్ధుతండ్రి మది నారట మొందెదు మీరు లేమి మీ
రిచ్చ చెలంగ నేఁడ చన నెంచెద రేనియు లక్ష్మణుండు తో
వచ్చు మహార్ఘ రత్నధన వర్గముఁ గొంచు నటందు మ్రొక్కు నీ
కిచ్చును నిచ్చ రత్నము లహీనగుణా! యని మ్రొక్కెఁ గ్రమ్మఱన్. ౧౬౪

అర్థములు. మహార్ఘ=మిక్కిలి వెలగల.

తా త్ప ర్య ము

• (అచ్చట మీ తండ్రి పెద్దవాఁడు మీరు దగ్గఱ లేకుండుటచేఁ జాలదిగులు పడును. మీరీనాఁడే పోవఁదలచితిరేని లక్ష్మణుఁడు మిగుల వెలగలరత్నములు ధన మును దీసికొని మీతో రాఁగలఁడు. అని నమస్కరింపఁగా, రామచంద్రా! నీకు నిరంతరము రత్నములు వృద్ధియగుఁ గాత మని మరల మ్రొక్కెను.)

క. వృత్రవధానంతరమున. జైత్రుఁడు వాసవుఁ డుపేంద్ర సహితునివలె సౌ
మిత్రిసహాయుఁడు గేకయ,ధాత్రీపతి చనియెఁ బిదప దశరథసుతుఁడున్. ౧౬౫

అర్థములు. వృత్రవధానంతరమునన్=వృత్రునిఁజంపిన పిమ్మట, జైత్రుఁడు= జయించిన వాఁడు.

తా త్ప ర్య ము

(వృత్రునిఁ జంపిన తరువాత జయమును బొందిన యింద్రుఁ డుపేంద్రునితో వలె, లక్ష్మణసహితుఁడయి కేకయరాజు చనెను. తర్వాత రామచంద్రమూర్తి;)

## రావణయుద్ధమునఁ దనకుఁ దోడ్పడమూఁగిన రాజుల శ్రీరాముఁడు సత్కరించి పంపుట.

చ. తనదు సుహృజ్జనాగ్రణిఁ బ్రతర్దనుఁ గాశిపతిన్ దయారతిన్
జనవునఁ గౌఁగిటం బొదివి శ్లాఘ్యవర! ప్రీతియు నిండు నెయ్యమున్
గనఁబడఁగా మహోద్యమము కైకతనూభవుతోడఁ జేసి తే
మని నిను మెచ్చువాఁడ సుగుణాభరణా! పురి కేఁగి వచ్చె దే. ౧౬౬

అర్థములు. సుహృజ్జనాగ్రగణిన్=స్నేహితులయందు శ్రేష్ఠుని, మహోద్యమము=గొప్ప ప్రయత్నము.

ఈ ప్రతర్దనుఁ డను కాశీరాజు రామచంద్రమూర్తి మిత్రుఁడు. సీతాహరణ వార్త విని భరతుని యొద్దకు వచ్చి లంకపై దండెత్తుటకు రాజుల నెల్లఁ బిలిపింపుమని పెద్ద ప్రయత్నము చేసినవాఁడు.

తాత్పర్యము

(తనకు ముఖ్య మిత్రుఁడును కాశీరాజు నగు ప్రతర్దనునిఁ బ్రేమమీఱఁ గౌఁగిలించుకొని నెచ్చెలీ! ప్రేమయు స్నేహము ప్రకటమగునట్లు భరతునితోఁ జేరి గొప్ప ప్రయత్నము చేసితివి. నిన్నెమని మెచ్చుకొనఁ గలను; పురమునకుఁ బోయి వచ్చెదవా?)

క. తోరణయుతమై సుప్రా, కారావృత మగుచు మిగులఁ•గ్రమంబగుచున్
ధీర! భవత్పరిపాలిత, వారాణసి వఱలుచుండు•బరమగుణాఢ్యా! ౧౭

అర్థములు. తోరణయుతమై=తోరణములతోఁ గూడినదై, సుప్రాకార+ఆవృతము=కోటగోడలచేఁ జుట్టఁబడినది, వారాణసి=వారాణాసి, కాశి.

తాత్పర్యము

(తోరణములతో నలంకరింపఁబడి, మంచి కోటగోడలతో నావరింపఁబడి మీరు పరిపాలించు కాశీపత్తనము మిగుల నందమై యొప్పుచుండును.)

క. అని సింహాసనమును రఘుతనయుఁడు డిగి డాయ వచ్చి • ధరణీపువక్షం
బునఁ గ్రుచ్చి గౌరవోక్తుల,ననుమతి యిడ నాతఁడరిగె•నావల విభుఁడున్. ౧౮

తాత్పర్యము

(అని సింహాసనము నుండి దిగి దగ్గఱకు వచ్చి గట్టిగా ఱొమ్మునఁ గ్రుచ్చి గౌరవముగ మంచి మాటలాడి యనుమతి సేయ నాతఁడు తన పురమున కరిగెను. ఆవల రామచంద్రప్రభువు.)

తే. మూఁడువందలనృపస త్తములను జూచి, మందహాసంబు మోమున•నందగింప
స్వీయ తేజంబునను సుర•క్షితులు మీర, లతులసంప్రీతి నుంచితి•రనఘులార!

తాత్పర్యము

(మూఁడువందలమంది రాజశ్రేష్ఠులను జూచి, చిఱునవ్వు మోమున నొప్పుచుండ పాపరహితులారా! మీ ప్రభావము చేతనే మీరు సురక్షితులు. మా యందసమానమయిన ప్రేమ నుంచితిరి.)

చ. నిరతము ధర్మనిష్ఠులరు • నిత్యము సత్యము నకుఁ బట్టులున్
వరబలశాలులుం ద్వదను•భావము తేజముచేతఁ; బంక్తికం
ధరుఁ డఘశీలి దుష్టమతి • దండధరుం గన నేగె బాంధవో
త్కరములతోడఁ, దత్క్రియను • గారణమాత్రమ నేను జూడుఁడీ. ౮౨౦

అర్థములు. నిరతము=ఎల్లవేళ, ధర్మనిష్ఠులరు=ధర్మము నిర్వర్తించుటే నిష్ఠగాఁ గలవారు, త్వదనుభావము=మీ మహిమ, అఘశీలి = పాపపు నడవడి గలవాఁడు, దండధరున్=యముని, బాంధవోత్కరములతోడన్ = చుట్టములతో, తత్క్రియను=ఆ కార్యమందు.

తాత్పర్యము

రాజులారా! సర్వదా మీరు ధర్మమునందు నిలుచుటే వ్రతముగాఁగల వారు, సర్వదా సత్యమునకు స్థానములయినవారు. మిగుల బలవంతులరు. ఇట్టి మీ మహిమ చేతను తేజస్సుచేతను రావణుఁడు బంధువులతోడఁ జచ్చెను. ఆ కార్యము నందు నేను గారణమాత్రమే.

క. జనకావనీశునందిని, వనముల హృతయైనవార్త • భరతుఁడు విని మి
మ్మనఘాత్ములారా! పిలిపించిన వచ్చితి రెల్లరీరు • స్నేహము పేర్మిన్. ౮౨౧

అర్థములు జనకావనీశునందిని=సీత, హృత=అపహరింపఁబడినది, దీనివలన రామచంద్రమూర్తి యరణ్యములో నుండఁగా నప్పుడప్పుడు మనుష్యులఁ బంపి వారి క్షేమవార్త తెలిసికొనుచుండెనని యేర్పడుచున్నది. సీతారామలక్ష్మణులు పంచవటిలో నుండువఱకిట్లే జరిగెను.

తాత్పర్యము

(అడవులలో సీత, హరింపఁబడిన సమాచారము విని భరతుఁడు మిమ్ముఁ బిలిపింపఁగా మా యందుఁడు స్నేహముచే వచ్చితిరి.)

క. ఎత్తిచనన్ రావణుపై నెత్తుకొనిన మీకు నిచట • నేఁగెను బలునా
ళ్ళుత్తమమతులారా! మీ,రిత్తఱిఁ బురి కేగు టొప్పు • నిష్టం బేనిన్. ౮౨౨

అర్థములు. ఎత్తిచనన్=దండెత్తిపోవ, ఎత్తికొనిన=ప్రయత్నించిన.

తాత్పర్యము

(రావణుని మీఁద దండెత్తిపోవఁ బ్రయత్నించిన మీకిచ్చటనే చాల దినములు జరిగిపోయినవి. మీ కిష్టమేని నిప్పుడు మీమీ పత్తనములకుఁ బోవచ్చును.

క. అనవుడు నృపాలు రందఱు, జనకసుతా ప్రాణనాథు•న్యాదూత్తలకున్
మనమున నలరి వచించిరి, వినయము నీ సహజగుణము • విశ్వస్తుత్యా! ౮౨౩

అర్థములు. స్వాదు+ఉక్తులకున్=తియ్యని మాటలకు, అలరి=సంతోషించి.

తాత్పర్యము

(అని చెప్పఁగా రాజు లందఱు శ్రీరామచంద్రమూర్తి తీయని మాటలకు మనములందు సంతసించి, ఎల్లరచేఁ బొగడఁదగిన రామనృపాలా! వినయము నీ సహజ గుణమని చెప్పిరి.)

—• రాజులు శ్రీరాముఁ గొండాడి సెలవుగొని పోవుట •—

సీ. మా యదృష్టంబున • మహిపతీ! సుఖముగా, వనములయం దుండి•వచ్చితయ్య
మా యదృష్టంబున • మహిమ పెంపారఁగఁ, బట్టమందితి వీవు • భద్రచరిత!
మా యదృష్టంబున • మార్తుర నెల్లర, రణసీమఁ ద్రుంచితి • రామచంద్ర!
మా యదృష్టంబున•మగల భూమిసుత, గ్రహింపఁ గంటివి • కౌసలేయ!

ఆ. శాత్రవులను జంపి జయశాలి వగు నిన్నుఁ, గన్నులారఁ గనఁగఁ•గలిగెఁబుణ్య
మిదియే మా యభీష్ట•మిదియె మా ప్రీతియు, రమ్యసుగుణసాంద్ర•రామచంద్ర

అర్థములు. మార్తురన్=పగవారిని.

తాత్పర్యము

రమ్యగుణసాంద్రా! రామచంద్రా! మా యదృష్టమువలన నడవుల నుండి సుఖముగా వచ్చి మహావైభవముగాఁ బట్టము గట్టుకొంటివి. యుద్ధములో శత్రువుల నందఱ జయించి సీతాదేవిని మరలఁబడయఁగంటివి. పనివారినిఁ దెగటార్చి గెలుపుగొన్న నిన్నుఁగన్నులారఁ గాంచఁగలిగితిమి. మా కిదియె పుణ్యము, మా యభీష్టము నిదియె. మా ప్రీతికిదియె కారణము.)

ఉ. ఎంత ప్రశంసకేన్ దశర • థేశ్వరనందన! నీవ యర్హ్వుఁ డి
ట్లింతగ మమ్ము మెచ్చి వచి•యించెద వేమన? నిట్టి చర్య నీ
కెంతయు యోగ్య మీ కరణి•నేని వచింపఁగ మేము నేర, మో
చింతిత సత్ఫలప్రద వి•శిష్ట చరిత్రక! పోయి వత్తుమే? ౮౭౫

అర్థములు. ప్రశంసకున్=పొగడ్తకు, చింతిత=కోరిన, సత్ఫల=మంచి ఫలమును, ప్రద=ఇచ్చువాఁడా.

తాత్పర్యము

(దశరథ రాజనందనా! రామచంద్రా! యెంతటి పొగడ్తకయినను నీవే తగిన వాఁడవు. మమ్మింతగా మెచ్చి పలికితివి, ఏమనగలము? ఇట్టిచర్య నీకే యోగ్య మైనది. ఈ విధముగానైన మేము మాటలాడఁగలమా? కోరిన మంచి ఫలమిచ్చు వాఁడా! పోయి వత్తుమా!)

క. ఒక్కొటి మాకోరిక మే, మెక్కరణిని నిన్ను నిరత • మెద నుంచెదమో
యక్కరణిని నీవును మము, నక్కఱ మది నిలుపవయ్య • యవనిసుతేశా! ౮౭౬

తా త్ప ర్య ము

భగవంతుని మన మెంత ధ్యానించినను నది యాయన మనస్సున కెక్కదేని వ్యర్థము. కావున మేము నిన్నుఁదలఁచునట్లు నీవు మమ్ములను వీరు మనవారని స్మరింపుమని భావము. మేము నీవార మనినట్టు మీరు నావారని యనవలయునని ప్రార్థన.

క. అవ నట్టుల కానిండని, జనవరుఁడు వచింపవారు • నమ్మదము నా
తనిచే సత్కృతు లగుచుం, జని రాత్మపురంబులకును • సైన్యంబులతోన్. ౮౭౭

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా 'నట్టులేకానిం'డని రామచంద్ర ప్రభువు పలుకఁగా, వారా తనిచే సత్కరింపఁబడి సేనలతోఁ దమ తమ పట్టనములకుఁ బోయిరి.)

—* సకలరాజులు వారి వారి రాజ్యంబులకుఁ బోవుట. *—

క. భరతుని యానతిచొప్పున, ధరణీశులు దెచ్చియున్న ధ్వ • జినీచయముల్
కరితురగము లక్షోహిణు, లరు దారఁగ నడఁచెఁ బుడమి • యాకంపింపన్. ౮౭౮

అర్థములు. ధ్వజినీచయముల్ = సేనాసమూహములు ఆకంపిపన్ = వణఁకఁగా.

తా త్ప ర్య ము

(భరతుని యాజ్ఞననుసరించి రాజులు కొనివచ్చిన సేనాసమూహము లేనుఁగులు, గుఱ్ఱము లక్షోహిణుల కొలఁది భూమి వణఁకునట్లు నడచెను)

సీ. అప్పుడు దర్పబ • లాన్వితుల్ భూపతుల్, పలికి రొండొరులతో • భరతుఁ డకట
రణమునకై మమ్ము • రప్పించు టదియెల్ల, వ్యర్థమై పోయె న • శాస్యుపోరుఁ
గనమైతి మనుగల • క్ష్మావరు లేశీఘ్రు, మునఁజంపి వైచిరే • మనఁగ వచ్చు
రామసౌమిత్రుల • ప్రాపునఁ జింత లే, కంబుధి దాఁటి ప్ర • త్యర్థి వితతిఁ

తే, మనుమఁజాలమె యని కొంద • ఱనుకొనంగఁ
గొంద ఱవనీశ చరిత లా • నందయుక్తిఁ
బలికికొంచును ధనధాన్య • పటలపూర్ణ
రాష్ట్రములకేగి రామహ • ర్షంబు పొంచె. ౮౭౯

అర్థములు. దర్పబలాన్వితుల్ = బలగర్వముతోఁ గూడినవారు, ప్రత్యర్థి వితతిన్ = శత్రుసమూహమును, ధనధాన్యపటల = ధనముయొక్కయు ధాన్యము యొక్కయు సమూహముచే, పూర్ణ = నిండిన, రాష్ట్రములకు = రాజ్యములకు, రామహర్షంబు పొంచెన్ = రామునికి సంతోషము కలిగించుకొఱకు.

తాత్పర్యము

(అప్పుడు బలగర్వముతోఁగూడిన రాజులొండొరులతోఁ భరతుఁ‘డయోధ్య మనలను యుద్ధమునకై రప్పించెను. కాని వ్యర్థమై పోయినది కాదా. రావణుని యుద్ధము చూడమైతిమి. అసురులను రాజాశీఘ్రముగఁ జంపివేసిరి. ఏమన వచ్చును? రామలక్ష్మణు లండగా నుండిన మనమెట్టి చింతలేక సముద్రము దాటి, శత్రువులఁ జంపలేమైతిమా?’ యని కొందఱనిరి, కొందఱు రామ ప్రభువు చరిత్రము లానందముతోఁ జెప్పికొనుచు, ధనధాన్యరాసులతో సమృద్ధమైయున్న తమ రాజ్యములకు రామునికి సంతోషము కలిగించుకొఱకుఁబోయి.)

ఉ. స్యందన వాజివారణ మ॰హా రమణీచయ యానసంతతుల్
చందనలేపనంబులును ॰ సర్వవిభూషణ మౌక్తికంబులున్
సుందరులైన దాసులును ॰ చొక్కపుఁ గంబళిము ప్రవాళముల్
వందలుగా సభక్తిక ము॰పాయనరాజుల నిచ్చి రందఱున్. ౧౦౦

అర్థములు. స్యందన=రథములయు. వాజి=గుఱ్ఱములయు, వారణ=ఏనుగులయు, మహార్హ=మిగుల వెలగల, మణీచయ=రత్నసమూహములయు, యాన=వాహనములయు, సంతతుల్ = సమూహములు, చందన లేపనంబులును=పూసికొనుట కుపయోగపడు గంధము లోనైనవియు, సర్వవిభూషణ = బంగారు సొమ్ములు, మౌక్తికంబులున్=ముత్తెములును, ప్రవాళముల్ = పగడములును, సభక్తికము=భక్తితో, ఉపాయన రాజులన్=కానుకల సమూహమును.

తాత్పర్యము

రథములను గుఱ్ఱములను ఏనుఁగులను వెలగల రత్నములను వాహనములను శ్రీగంధాదులు మైపూఁత వస్తువులను బంగారు సొమ్ములను ముత్తెములను అందగత్తెలగు దాసీజనులను మంచి కంబళ్ళను పగడములను నూర్లకొలఁదిగాభక్తితోఁ గానుక లిచ్చిరి.

తే. భరతలక్ష్మణశత్రుఘ్ను ॰ లరుసముసను, వానిగైకొని పురిఁజేర॰వచ్చి రామ
విభున కిచ్చిరి వేర్వేఱ॰విశదపఱిచి, రాముఁ డవియెల్ల గ్రహియించి॰రాగమునను.

తాత్పర్యము

(భరత లక్ష్మణ శత్రుఘ్నులు సంతోషముతోఁ దీసికొని పత్తనమునకు వచ్చి వేఱువేఱ వానినెల్ల విశదపఱిచి రామ ప్రభువునకు సమర్పించిరి. రామచంద్రమూర్తి యవి యన్నియు ననురాగమున గ్రహించి.)

—• శ్రీరాముఁడు సుగ్రీవాంగదహనుమదాదుల బహూకరించుట •—

చ. ఒసఁగెను భాస్కరాత్మజున • కుత్తమ మన్యము భూషణాళి రా
క్షసపతి కిచ్చె వెండియును • జారువిభూషణముల్ వనాటరా
క్షసతతికీయ నందఱును • సంతసమార శిరఃకరంబులం
దసదృశభక్తిఁ దాల్చ వసు•ధాధిపుఁడుం బరిహృష్టచిత్తుఁడై. ౨౨౨

అర్థములు. భాస్కరాత్మజునకున్=సుగ్రీవునకు, చారు=మనోహరములైన; భూషణముల్=ఆభరణములు, శిరఃకరంబులన్ = శిరస్సులందుంచుకొనఁ దగినవి శిరస్సులందును, చేతులం దుంచుకొనఁ దగినవి, చేతులందు=కడియములు ఉంగరములు బాహుపురులు లోనైనవి, పరిహృష్ట=మిగుల సంతోషించిన, చిత్తుఁడై= మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

ఇదివఱ కిచ్చినవిగాక యిప్పుడు మరల సుగ్రీవునకు నాభరణము లిచ్చెను అట్టులే విభీషణునకును వానరులకు రాక్షసులకు నాభరణము లీయఁగా వారు తలలందుఁ జేతులందు వాని నసమాన భక్తితో ధరింపఁగా రామచంద్రమూర్తి మిగుల సంతోషించెను.

క. అంగదహనుమంతుల నుత్సంగంబునఁ జేర్చి సూర్య•తనయునితో నీ
యంగదుఁడు నీసుతుం డఁట,సంగాతియు మంత్రి పవన•జాతుఁడు నీకున్. ౨౨౩

అర్థములు. ఉత్సంగంబునన్=తొడలయందు, సంగాతి=సహాయుఁడు.

తాత్పర్యము

అంగదుని హనుమంతుని దొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని సుగ్రీవునితో నిట్లనెను. ఈయంగదుఁడు నీకొడుకఁట! ఈహనుమంతుఁడు నీకు మంత్రి సహాయుఁడునఁట. వీరిరువురు నీకు.

ఉ. మేలగుయోజన ల్దెలిపి • మేలు దలంచుచు నుంద్రు, నాకు న
చ్చీలురు వీర లిర్వురు వి•శేషము పూజ్యతత్వన్నిమిత్తమై
పోలఁగఁ గాంచ నర్హులని • భూషణముల్ తనమేనివెల్ల భూ
పాలుఁడు వారికిం దొడిగె • వానరులెల్లరు మేలు మే లనన్. ౨౨౪

తాత్పర్యము

మంచియాలోచనలు దెలిపి నీకు మేలుగలుగు నాలోచనలే చేయుచుందురు. నాకో వీర లిరువురు నీనిమిత్తముగ విశేషముగ గౌరవింపఁబడఁదగినవారు అనితాను ధరించి యుండిన యాభరణము లన్నియుఁ దీసి వారి దేహముల నలంకరించెను. చూచిన వానరు లందఱు మేలు మేలని రామచంద్రమూర్తిని బొగడిరి.

సీ. పదపడి నలనీల • పనస కేసరిగంధ, మాదనకుముదుల • మైందు ద్వివిదు
జాంబవంతుని నింద్ర • జాను దరీముఖు దధిముఖు సన్నాద • తరుచరేంద్రు
వినతు సుషేణు ధూ • మ్రుని దధిముఖునిఁ బ్ర • జంఘు గవాక్షుని • సారబలుని
వినుతవీర్యుల మహా • విక్రమశీలురఁ, బతికార్యసాధన • రతులఁ గీశ

తే. యూధపులఁగాంచి తియ్యని • సూక్తులొప్ప, నాకు నెయ్యురు మీరెల్ల • నాదు తనువు
సోదరులయట్టివారలు • శూరులార!, యేమి ప్రతికృతి సేయనే • నేమి నేర్తు? ౨౧

అర్థములు. పతి కార్యసాధన రతులన్=తమ రాజుపని నెఱవేర్చుటయందుఁ బ్రీతిగలవారిని, యూధపులన్=యూధములకు నాయకు లగువారిని, నెయ్యురు= మిత్రులరు, నాదు తనువు సోదరులు=నాకు నా దేహము తమ్ము లెట్లో మీరు నట్టివారు, ప్రతికృతి=ప్రత్యుపకారము.

తాత్పర్యము

(తరువాత నలుని, నీలుని, పనసునిఁ, గేసరిని, గంధమాదనుని, కుముదుని, మైందద్వివిదులను, జాంబవంతుని అంగదుని, దరీముఖుని, దధిముఖుని, సన్నాదుని. వినతుని, సుషేణు, ధూమ్రుని, దధిముఖుని, ప్రజంఘుని, గవాక్షుని, పొగడఁ దగి వీర్యముగలిగి, మహా పరాక్రమము గలవారినిఁ దమ రాజుపని నెఱవేర్చుట యందుఁ బ్రీతిగల వారిని యూధనాయకులను జూచి తియ్యని మాటలతో శూరులారా! నాకు మీరు స్నేహితులరు. నాకు నా దేహము, నా తమ్ము లెట్టివారో మీరు నట్టివారు—మీకుఁ బ్రత్యుపకారము చేయ నాచేత నేమగును?)

ఉ. అంత మెఱుంగరాని వ్యస • నాబ్ధిని మున్గి తపించు నన్ను వి
క్రాంతి సముద్ధరించితిరి • కాఁగల దెయ్యది దానిసాటి? మీ
యంతలు నెయ్యురైన తప • నాత్మజు భాగ్యమె భాగ్య మౌర! స
త్స్వాంతముచేత నాయిడెడి • స్వల్పము మీరు పరిగ్రహింపరే ౨౨

అర్థములు. విక్రాంతిని=మీ విక్రమముచేత, సముద్ధరించితిరి=మునుఁగకుండ రక్షించితిరి, సత్స్వాంతముచేతన్=మంచి మనస్సుతో, పరిగ్రహింపరే = తీసి కొనుఁడు.

తాత్పర్యము

దరికానరాని శోక సముద్రము నందు మునిఁగియుండిన నన్ను మునుగకుండ మీ పరాక్రమముచేత లేవఁదీసితిరి. నే నేమిచేసిన దానితో సమానము కాఁగలదు? మీయంతటివారు మిత్రులయిన సుగ్రీవుని భాగ్యమే భాగ్యము? మీ యోగ్యతకుఁ దగినంత నే నీయఁజాలను, నే నిచ్చు నల్పమును, మీరు మంచి మనస్సుతో గ్రహింపవలయు నని కోరెదను.

చ. అనుచు యథార్హ్వరీతి మణు ♦ లాభరణంబు లొసంగి కౌఁగిటం
జనవరుఁ డందఱం బొదివి ♦ సమ్మదవారిధిఁ దేల్చె నీగతిన్
దనివి సనంగఁ దేనియలు ♦ ద్రావుచు మాంసఫలాళి మెక్కఁగన్
జనియెను సాగ్రమాసము క్షణం బన; రాక్షసకీశ పాళితోన్. ౮౮౭

అర్థములు. యథార్హ్వరీతిన్ = వారి వారి యోగ్యతకుఁ దగినట్లు, సాగ్ర మాసము=నెలపైనవారము, నెలమీఁద ౫, ౬ దినా లని గోవిందరాజీయము.

తాత్పర్యము

(అని చెప్పుచు వారి వారి యోగ్యతకుఁ దగినట్లు మణులు ఆభరణములు నిచ్చి వారి నందఱ రామచంద్ర ప్రభువు కౌఁగిలించుకొని, సంతోష సముద్రమునఁ దేలియాడఁ జేసెను. ఈ ప్రకారము తృప్తికలుఁ దేనెలు త్రాగుచు, మాంసములు ఫలములు మెక్కుచుండ నొక నెలపైన వారము వారికి క్షణమువలెఁ గడచి పోయెను.)

క. అవనీవిభుఁడు వినోదం, బవురీతిని గడుపుచుండ ♦ నట్టులె చనె రెం
డవశిశిరమాస మీఁగతి నవిరళసుఖపరత వార ♦ లలరుచు నుండన్. ౮౮౮

అర్థములు. రెండవ శిశిర మాసము=శిశిర ఋతువునందలి రెండవ నెల యన్నఁగా ఫాల్గునమాసము, అవిరళ=దట్టమైన, సుఖపరతన్=సుఖాసక్తిచే, అలరుచున్=సంతోషించుచు.

చైత్రమునఁ బట్టాభిషేకము ఫాల్గునము వరకు వానరాదు లుండుటచే నొక సంవత్సర ముండిరని యేర్పడుచున్నది.

ఈ ప్రకారము రామచంద్రమూర్తి వినోదముగా వానరులతోడఁ గడపు చుండ శిశిరఋతు వగు నెలలలో రెండవనెల యగు ఫాల్గునము గడచెను.

—♦ శ్రీరాముఁడు సుగ్రీవాదులం గిష్కింధ కనుచుట ♦—

సీ. సుగ్రీవుతోడ ద♦శగ్రీవపరిపంథి, యనియెఁ గీశేంద్ర ! సు♦రాసురులకుఁ
జేరంగ రాని కి♦ష్కింధకుఁ జను మీవు, సపరివారుండవై ♦ జాగు లేక
మంత్రియుక్తుండవై ♦మహిఁ జక్కఁ బాలింపు, శాత్రవచయముల♦సంహరింపు
మీయంగదుని నిశాం♦తాయతప్రీతితోఁ, జూడుమీ పవమాన♦సూనునట్ల

ఆ. మహితబలుని నలుని ♦ మామ సుషేణుని, మైందు ద్వివిదు గంధ♦మాదనునిని
దారుఁ గుముదు నీలు ♦ వీరుని శతవలి, గజు గవాక్షు శరభు♦గవయుఋషభు.

అర్థములు. దశగ్రీవ పరిపంథి=రావణుశత్రువు, రామచంద్రమూర్తి, సపరివారుండవై=సేనలతోఁ గూడినవాఁడవై, నిశాంతాయత ప్రీతితోన్= మిక్కిలి హెచ్చైన ప్రేమతో.

తాత్పర్యము

సుగ్రీవునితో రామచంద్రమూర్తి యిట్లనియె. సుగ్రీవా! నీవు సేనలతో కిష్కింధకుఁ బొమ్ము. మంత్రులతోఁ గలసి యాలోచించుచు భూమిని జక్కఁగాఁ బాలింపుము. విరోధుల సంహరింపుము. ఈ యంగదుని మిక్కిలి యధికప్రేమతో నాదరింపుము. ఆంజనేయు నట్లే చేయుము. విస్తార బలముగల నలుని, నీ మామ సుషేణుని, మైందుని, ద్వివిదుని, గంధమాదనుని, తారుని, కుముదుని, నీలుని, శతవలిని, గజగవయగవాక్షులను, ఋషభుని.

క. కమలాసనతనయునిఁ, బ్రాకట మగుప్రేమతోడఁ ♦ బాలింపవయా
నాకై ప్రాణము లిచ్చిరి, యీకీశుల ఋణ మదెట్టు ♦ లేఁ దీర్పఁగలన్. ౪౯౦

అర్థములు. కమలాసన తనయుని=జాంబవంతుని.

తాత్పర్యము

(ఈ జాంబవంతుని మిగులఁ బ్రేమతోఁ బాలింపుము. వీరు నాకై ప్రాణము లిచ్చిరి. వీరి ఋణము నే నెట్లు తీర్పఁగలను?)

—♦ శ్రీరాముఁడు విభీషణు లంక కనుచుట ♦—

ఉ. వీరల కెప్పుడేమియును ♦ విప్రియమున్ ఘటియింపఁబోకు మం
దారగఁ బల్కి రాక్షసకు♦లాధిపతిం గని యువ్విభీషణున్
ధీరచరిత్ర! విత్తపతి♦దివ్యపురంబును లంక నేలుమీ
సారసుధర్మమార్గమునఁ ♦ జారుగుణా! యవినీతిఁ బాయుచున్. ౪౯౧

*అర్థములు: విప్రియమున్=ప్రియమునకు విరుద్ధమైనది, ప్రియముకానిది, విత్తపతి దివ్యపురంబును=కుబేరుని దివ్యనగరము – లంక – ఈమాట విభీషణుని ప్రశ్నమున కుత్తరము. కుబేరుని విమానము కుబేరుని కిచ్చినట్లు లంకకూడ నియ్య వలయునా? అట్లైన నే నెందుండవలయును? ఆయన నాలంక నాకిమ్మని చెప్పి పంపిన నేనేమి చెప్పుదును అని యడుగఁగానీవు లంకవిడిచి పోవలదు, లంకయందే యుండుమని చెప్పెనని గ్రాహ్యము, అవినీతి=అన్యాయ మార్గము.

తాత్పర్యము

(వీరి కెప్పుడు గాని ప్రియము కాని మాటలాడకుము. అని గట్టిగాఁ జెప్పి, రాక్షసరాజగు విభీషణునిఁ జూచి, కుబేరుని దివ్యమగు లంకాపత్తనమును శ్రేష్ఠ మగు ధర్మమార్గమునఁ బాలింపుము, అన్యాయమార్గమును విడువుము.)

ఆ. ధర్మకీర్తి విడక ♦ ధరణీతలేంద్రుఁడు, బుద్ధిమంతుఁ డగుచు♦ బుడమి నేల
నవని బ్రాభవంబు ♦ నఖిలసంపదలును, నిత్య మతనియొద్ద♦నిలిచియుండు. ౪౯౨

తాత్పర్యము

(రాజు బుద్ధిమంతుఁడయి, ధర్మమార్గమున విడువక భూమినిఁ బాలించిన దొరతనము, సమస్తసంపదలు నిత్యమతని యొద్ద స్థిరముగా నిలిచియుండును.)

క. నన్నును సుగ్రీవుని, నీ వెన్నండును మఱవ కుండుమీ నెమ్మదిఁ, బొ
మ్మన్నను గపిరాక్షసతతు, లన్నన్నా మేలటంచు నధిపుం బొగడెన్. ౮౯౩

తాత్పర్యము

నన్నును సుగ్రీవుని నీ మనస్సులో నెప్పుడు మఱచిపోకు మని రామప్రభువు పలుకఁగా, రాక్షసుల సమూహము అన్నన్నా! మేలు మేలు అని రామభూపాలునిఁ బొగడెను )

క. నీమతి విధియందుంబలె, నేమంబున నెలసియుండు నిర్వక్రంబై
నీ మాధుర్యము నీ యతులామితవీర్యంబు శక్యమా పొగడంగన్. ౮౯౪

అర్థములు. నీ మతి=నీ మనస్సు, విధియందుంబలెన్=బ్రహ్మయందున్నట్లు, నిర్వక్రంబై=ఋజుత్వము గలదై.

తాత్పర్యము

(నీ మనస్సు బ్రహ్మయందున్నట్లు ఋజుత్వము గలిగి నియమముతో నుండును. నీ మాధుర్యము నీ సాటిలేని యమితమైన నీ వీర్యమును బొగడ శక్యమా?)

**— శ్రీరాముఁడు హనుమంతునకు వరంబు లిచ్చుట —**

చ. అను నెడ వాయుసూతి వినయంబున నిట్లను రామచంద్ర! నా
మన మెదివేళ నీయెడల మానని నెయ్యముఁ బూనుఁ గాక, నా
కనయము నీదుభక్తి చెలువారెడుఁ గాక, మనం బిఁ కెందునున్
జనకయ యుండుఁ గాక మహీజాధవ! నన్ను ననుగ్రహింపుమీ. ౮౯౫

తాత్పర్యము

ఈ ప్రకార మందఱుఁ జెప్పఁగా హనుమంతుఁ డిట్లనియె. శ్రీరామచంద్రమూర్తీ! నామనస్సు సర్వకాల సర్వావస్థలయందు నీ యందు స్నేహభావము గలది యగునుగాక! నాకు సర్వకాల సర్వావస్థల నీభక్తి తొలఁగక యుండును గాక! నిన్ను విడిచి నా మనస్సు మఱి యెందును బోకుండునుగాక! ఇట్లగునట్లు నాయందను గ్రహింపుము.

ప్రియునందుఁ బ్రియురాలికివలె నిరంతరస్మృతి స్నేహము. ఇది యైహిక విచారము. భక్తియనఁగా పరలోకగతి యని యుపాసించు బుద్ధివిశేషము. నితర

మనుటచే నీళ్ళకుఁ జేఁపకు నున్న సంబంధము వంటిది. నీళ్ళను విడిచిన చేఁపఁ బ్రతుకదుగదా. దీనికే పరమభక్తియని పేరు. ఏకాంతభక్తునకు నిష్కామభక్తునకు భగవత్కార్య తత్కీర్తన వర్ణనాదులు తప్ప మఱియొకటి తెలఁపునకురాదు.

'యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్, తత్ర తత్రకృతమస్తకాంజలిమ్' అని నేఁటికిని రామకథ ప్రస్తావింపఁబడు చోటుల నాంజనేయుం డుండును. ఆ కారణముచేతనే రామకథ చదువునపుడు చెప్పునప్పుడు చెప్పెడివానికెదుట నెవరు నుండరాదు. అది యాంజనేయుని స్థానమని గ్రంథములు చెప్పుచున్నవి.

క. నీదివ్యచరిత్రం బీ, మేదిని నెందాఁక నిలుచు ♦ మిహిరకులేంద్రా!
నా దేహంబునఁ బ్రాణము, లాదరమున నిలువ నిమ్ము ♦ యందాఁక బలీ! ౧౭

తపస్వులు భక్తులు దేహము నిలుపఁ గోరుట దేహాభిమానము చేతఁగాదు. దేహము సాధనము, వాహనమనియు దానిని విడిచినచో నేకార్యము చేయసాధ్య పడదనియు మఱియొక జన్మమనిన నెంతోకాలము వ్యర్థమగుననియుఁ గావున సాధింపవలసినది సమగ్రముగ నొక జన్మమందే సాధించుట యుక్తమనియు అల్పాయువైనచో నది సాధ్యపడ దనియుఁ గావున దీర్ఘాయువు కావలయుననియుఁ గోరుదురు. ఇట్టిదే సంధ్యయందును మంత్రము గలదు. నీనామామృత పానమున జీవింతు నని భావము.

## తాత్పర్యము

(ప్రభో! రామచంద్రా! మీదివ్య చరిత్ర మీ భూమి మీఁదఁ నెందాఁక నిలుచునో యందాఁక నా దేహమునఁ బ్రాణములు నిలుచునట్లు లాదరమున వరమిమ్ము)

క. అచ్చెరలు నీ చరిత్రము, సచ్చరితా! వినుచువారు ♦ సత మది వినఁటన్
హెచ్చగు నుత్కంఠను నే, వ్రచ్చెద ననిలుండు మేఘ♦పటలంబు వలెన్. ౧౮

అర్థములు. ఉత్కంఠను=రామచంద్రుని నెప్పుడు చూతునా యను తహతహపాటు, నిన్ను విడిచియుండు సంకటము నీపాటలు మాటలు చెప్పఁగా విని తొలఁగించెదను.

ఇట్లు చెప్పుటచే భక్తులకు మోక్షసుఖముకంటె నెక్కువసుఖము భగవన్నామామృత రసాస్వాదనంబునఁ గలదని తెలియనగు. 'సత్యం శపే వారణశైలనాథ! వైకుంఠవాసేపి న మేఽభిలాష'అని కదా భక్తుఁడు చెప్పును.భగవత్కథా శ్రవణముండెనేని దర్శనముతోఁ బనిలేదు. అది లేదని విచారముపడఁ బనిలేదు. దర్శనమున కంటె శ్రవణమే శ్రేష్ఠము.

చ. అనవుడు రామభద్రుఁడు వ♦రాసనమున్ విడి లేచి యాంజనే
యునిఁ దనకౌగిటం బొదివి ♦ యుత్తమరక్తి వచించె నీమనం
బునఁ గలయట్లు కాఁగలదు ♦ మోదము దాల్పుము నాచరిత్ర భూ
మిని గలదాఁకఁ గీర్తియును ♦ మేనను బ్రాణము నీకు నుండెడిన్. ౯౮

తా త్ప ర్య ము.

(అని చెప్పఁగా, రామచంద్రమూర్తి సింహాసనము నుండి దిగి వచ్చి యాంజనేయునిఁ దన కౌఁగిటఁ జేర్చి పరమానురాగమున నీ మనసులో నున్నట్లే కాఁగలదు సంతోషింపుము. భూమియందు నా చరిత్ర యుండుదాఁకఁ గీర్తియును నీ దేహమునఁ బ్రాణమును నుండుఁగాతె యని వచించెను.)

ఇది రామచంద్రమూర్తియమానుషత్వమును దెలిపెడిని. ఇట్టి వరమిచ్చుటకుఁ దక్కిన వారి కెవ్వరి కధికారము గలదు?

క. లోకంబు లుండుదాఁకను, నాకీర్తియు నిలిచియుండు♦నా ప్రాణములన్
నీకొక్కొకయుపకృతికే, యోకేసరితనయ! యీయ♦నో పనివడినన్. ౯౯

తా త్ప ర్య ము

(ఓ యాంజనేయా! లోకములుండు నంతవఱకు నా కీర్తియు నిలిచి యుండును. నీవు చేసిన యొక్కొక్క యుపకారమునకే పని పడినచో నా ప్రాణముల నీయకుందునా?)

క. ఉపకృతి చేసినవానికి, నుపకారముఁ జేయఁదలఁచు ♦ చుండుట కానా
యుపకారి యాపదం గనఁ, గపివర! ధ్యానించుచుంట♦గాదే యరయన్. ౧౦౦

తా త్ప ర్య ము

ఉపకారము చేసిన వానికి మరల నే నెప్పు డుపకారము చేయుదునా యని తలఁచుచుండరాదు. ఏలన వాని కీడు కోరిన వాఁ డగును కావున, వానికి నేదైన కీడువచ్చినఁగదా తన యుపకారముతోఁ బనిపడును. వాని కెప్పుడు కీడువచ్చునా, ఎప్పుడు నే నుపకారము చేయుదునా యనుకొనుట సరిగాదు. పరోపకారము కోరఁదగిన దశ రాకుండ వలయునని కోరవలెను.

క. అని చంద్రాభము హారం, బనుపమ వైదూర్యతరళ ♦మాత్మగ్రీవం
బునుండి తీసి కంఠం,బున వయిచెన్ గంధవహుని♦పుత్రున కర్థిన్. ౧౦౧

అర్థములు. చంద్రాభము=కాంతియందు చంద్రునితో సమానమైనది, అనుపమ=అసమానమైన, వైదూర్యతరళము=వైదూర్యములుగల పతకముగలది ఆత్మగ్రీవంబుననుండి=తనకంఠమునుండి, గంధవహుని పుత్రునకున్=వాయుపుత్రునకు, అర్థిన్=ప్రేమతో.

తా త్ప ర్య ము

వైడూర్యముల పతకము చంద్రకాంతిగల హారమును తన మెడలో నుండి తీసి రామచంద్రమూర్తి హనుమంతుని కంఠంబున నిండు ప్రేమతో వైచెను.

క. ప్రాలేయకిరణబింబము, మౌళిని ధరియించు కనక•మహీధర మనఁగా
మాలాదీపితతనుఁడై, వాలాయము పవనసుతుఁడు • ప్రభ రాణించెన్. ౯౦౨

అర్థములు. ప్రాలేయ కిరణబింబము=మంచుకిరణములు గల చంద్రబింబ మును, మౌళిని=శిరస్సున, కనక మహీధరము = బంగారుకొండ, మాలాదీపిత తనుఁడై=హారముచేఁ బ్రకాశించు దేహము గలవాఁడై, వాలాయము=విశేషముగ

తా త్ప ర్య ము

ఆ మాలికను గంఠమందు ధరించిన హనుమంతుఁడు మంచుకిరణములుగల చంద్రబింబముచే మేరుపర్వతమువలె రాణించెను.

క. రామునివాక్యములఁ గీశ, స్తోమము విని లేచిలేచి•తోరపుభక్తిన్
రాముని పదకంజములకు, వేమఱు నతులన్ ఘటించి • వెడలెను బోవన్. ౯౦౩

అర్థములు. కీశస్తోమము=వానర సమూహము.

తా త్ప ర్య ము

• (రాముని మాటలను విని వానరులగుంపు లేచి లేచి యధికమగు భక్తితో శ్రీరామచంద్రమూర్తి శ్రీపాదపద్మములకు ననేక పర్యాయములు దండము సమ ర్పించి పోవుటకు బయలు దేఱెను.

ఉ. భానుజుఁడున్ విభీషణుఁడుఁ • బార్థివవర్యుఁడుఁ దమ్ముఁ గౌఁగిటన్
మానవిరక్తిఁ జేర్చి బహు•మానపురస్సరసాంత్వవాక్యము లెం
తే నయమారఁ బల్కఁ గను•నీళ్ళను గార్చుచు మూఢులై ధరా
జానిని బాసిపోవుటకు • సమ్మతి లేక తపించుచుండగన్. ౯౦౪

అర్థములు. బహుమాన పురస్సర=గౌరవ పూర్వకములైన, సాంత్వన వాక్యములు=సమాధాన వాక్యములు, మూఢులై=ఏమియుఁ దెలియనివారై, ధరాజానిని=రాజును, రామచంద్రుని.

తా త్ప ర్య ము

(రామచంద్రమూర్తి తమ్ముఁగౌఁగిలించుకొని యపరిమితాను రాగముతో గౌరవ పూర్వకముగ సమాధానవాక్యములు స్నేహముమీఱఁ బలుకుచుండఁగాఁ సుగ్రీవుఁడును విభీషణుఁడును గన్నీరు కార్చుచు నేమియుఁదెలియనివారై రామ ప్రభువును వదలిపెట్టి పోనిష్టములేక పరితపించుచుండగా.)

తే. అశ్రుపూర్ణాక్షులగుచు ప్లవం♦గాటవరులు, బొమ్మలట్లయి స్మృతిలేక♦పోయిరెట్లొ
దేహి దేహంబుఁ బాసిన♦తెరువుదోఁప, ముదము లేకాత్మలందాత్మ♦సదనములకు

అర్థములు. అశ్రుపూర్ణాక్షులు=నీళ్ళచే నిండిన కన్నులుగలవారు. ప్లవగాటవరులు=వానరశ్రేష్ఠులు, దేహి=జీవుఁడు, దేహంబున్ = శరీరమును, దేహాభిమానము గల జీవికి దేహము విడుచుట యెంత కష్టమో యంత కష్టము వానరు లనుభవించి రని భావము, ఆత్మసదనములకు=వారి వారి యిండ్లకు.

తా త్ప ర్య ము.

(వానర శ్రేష్ఠులు కన్నులనిండ నీరు గ్రమ్మ, బొమ్మలవలె స్మృతిలేనివారై దేహమును జీవుఁడు విడిచిపోవునట్లు సంతోషము లేక తమ తమ యిండ్లకు బోయిరి.)

—♦ కుబేరునొద్దనుండి పుష్పకము శ్రీరాముఁ గొల్వవచ్చుట ♦—

సీ. అంతటఁ జిగతి ♦ ననిచి శ్రీరాముండు, హాయి నుండఁగ నప♦రాహ్ణమునను
గగనంబునుండి వా♦క్యం బొండు వీతెంచె, నావంకఁ గనుము భూ♦నాథచంద్ర!
నేను బుష్పకమను ♦ నికడ కనిచెఁ గు, బేరుండు మరల సం♦ప్రీతుఁ డగుచు
నీయాజ్ఞ గొని పోవ ♦ నాయక్షనాథుండు, నాతోడ నిట్లనె♦ నయము పొలఁక

ఆ. రామచంద్రవిభుఁడు♦రావణు వధియించి, యోడిచె నిన్ను! బంధు♦యుక్తుఁ డగుచుఁ
గలన రావణుండు♦ పొలియుట నాకును, బూర్ణహర్షకరమ♦ పుష్పకంబ! ౧౦౬

అర్థములు. అంచజ=ఇందలి దకారము గాయత్ర్యక్షరము, ఒడిచెన్=హరించెనే, పూర్ణహర్షకరము=నిండు సంతోషము కలిగించునది. అపరాహ్ణమునను=మధ్యాహ్నము మీఁదటి కాలమునందు, పుష్పకాభిమాన దేవత పలికె నని గ్రహింపవలయును.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రమూర్తి యీ విధముగా వంకలను బంపివేసి, హాయిగా నుండఁగా, నపరాహ్ణమున నాకసమునుండి యొకశబ్దము వినవచ్చెను. ఓ రాజేంద్రా నావంకఁ జూడుము. నేను బుష్పకమను-కుబేరుఁడు సంతసించి మరల నన్ను నీ యొద్దకుఁ బంపెను. నేను నీవలన నాజ్ఞ పొంది, పోఁగా, నా కుబేరుఁడు నాతో నయము మీఱ నిట్లనెను. రామచంద్రమూర్తి రావణుని వధించి నిన్ను నోడిచెను. రావణుఁడు చుట్టములతోఁ గూడ యుద్ధమునఁ జచ్చుట నాకును నిండుసంతసమును గలిగించు నదియే- ఓ పుష్పకవిమానమా!)

క. రామునిదానవు నీ వట, కే మరలం జనుము ముదల ♦ నిడితిని జగమం
దా మహనీయుఁడు నీపై, నామోదముతోడఁ దిరుగ♦ వర్షమటన్నన్. ౧౦౭

అర్థములు. ముదల=ఆజ్ఞ, ఆమోదముతోడన్=సంతోషముతో, నన్ను జయించి రావణుఁడు నిన్ను హరించెను. గావున రావణుదాన వైతివి. రావణుని రామచంద్రమూర్తి జయించెను కావున రామచంద్రమూర్తి దానవు గావున నాయన నీపై నెక్కి తిరుగఁదగినవాఁడు.

తా త్ప ర్య ము

(నీవు రామచంద్రుని దానవు- మరల నీవక్కడికే పొమ్ము-నేనాజ్ఞ యిచ్చితిని. ఆ మహనీయుఁడు సంతోషముతో నీ మీఁద నెక్కి తిరుగఁ దగినవాఁడు అని చెప్పఁగా,)

ఉ. వచ్చితి నిందు రాఘవ! ప్ర•భావమునం గనరాక యెరికిన్
నిచ్చఁ జరించుచుందు నవ•నీతనయేశ! త్వదాజ్ఞచేత నీ
యిచ్చకు వచ్చునట్లన మ•హీపతి యట్లగు నేని నీకు నే
నిచ్చెద స్వాగతంబు కొను•మీ యనుచున్ సుమధూపలాజలన్. ౯౦౮

అర్థములు. సుమధూపలాజలన్=పూలు, ధూపము, పేలాలు.

తా త్ప ర్య ము

(రామచంద్రా! యిచ్చటకు వచ్చితిని. నీ యాజ్ఞచేత నా ప్రభావమున నెవరికిని గానరాకుండ నీ యిష్టము వచ్చిన రీతి సంచరించెదను. అని చెప్పఁగా, శ్రీరామభూపాలుఁ డట్టులయినచో, నేను నీకు స్వాగతమిచ్చెదను. గ్రహింపుము- అని చెప్పుచుఁ బూలు, ధూపము, పేలాలు- మొదలగువానితో)

ఆ. పూజచేసి యనియెఁ •బుష్పకంబ! నిన్నుఁ, గెలస మున్న వేళఁ•దలఁచువాఁడ
నపుడు రమ్ము యంత • కరుసంబుతో నీవు తిరుగు మడ్డులేక • సురపథమున.

అర్థములు. కెలసము=కార్యము, అంతకున్=నేను దలఁచువఱకు, సురపథమునన్=ఆకాశమందు.

తా త్ప ర్య ము

(పూజచేసి ఓ పుష్పకమా! పనిపడినప్పుడు నిన్నుఁ దలఁచెదను. అప్పుడు రమ్ము, అంతవఱకు నీ వాకాశమందు సంతోషముతో నడ్డులేక తిరుగుచుండుము. అని చెప్పెను.

—• భరతుఁడు శ్రీరామునకుఁ బ్రజల సుఖస్థితిఁ దెలుపుట •—

చ. అనవుడు నట్లకాక యని • యయ్యది యేగినయంతఁ గైకయీ
తనయుఁడు లేచి కేల్మొగిచి • దాశరథీ, నెలమొక్కి డింతలోఁ
గనుఁగొన నీవు దేవుఁడవు•గాఁ గనిపించెదు, వీతశోకులై
మనుగడ గూడి రెల్లరు న•మానుషసత్త్వము లారఁ బల్కెడిన్. ౯౧౦

అర్థములు. మనుగడ=బ్రతుకు, తెరువులమానుష సత్త్వము=దేవతలకు సంబంధించిన జీవములు, పుష్పకము లోనైనవి. నీవు దేవుఁడవు కాకుండిన పట్టాభిషేకమైన నెలలోనే యిట్టి యాశ్చర్యకార్యములు జరుగునా?

### తాత్పర్యము

(అని యానతీయఁగా, నది 'మహాప్రసాద' మని పోవఁగా, సంతట భరతుఁడు లేచి, నమస్కరించి, దాశరథీ! నీవు దేవుఁడవుగాఁ గనుపించుచున్నావు. పట్టాభిషేకమైన నెలలోనే యందఱు, రోగములు లేక జీవనము కలవారయి యున్నారు. దేవతలకు సంబంధించిన పుష్పకము మున్నగు జీవనములు మాటలాడుచున్నవి. నీవు దేవుఁడవే కానిచో నిట్టియాశ్చర్యము కలుగునా?)

ఆ. పూర్ణ వార్ధకమున • జీర్ణ మయ్యును మేను మరణభయము లేదు • మానవతులు
నెగులు దిగులు లేక • నీళ్ళాడు చున్నారు, ప్రజలు బలిసి యున్న • వారలెందు,

అర్థములు. పూర్ణ వార్ధకమునన్=నిండు ముసలితనముచే, జీర్ణము=శిథిలము మేను=దేహము, మానవతులు=స్త్రీలు, నెగులు=బాధ.

### తాత్పర్యము

నిండు వయస్సుచేఁ బండ్లు వలెనైనను మనుష్యులు మరణించుటలేదు. స్త్రీలు ప్రసవవేదనగాని, గర్భము పోవునో, శిశువు పోవునో గర్భవతియే పోవునో యను భయములేక ప్రసవించుచున్నారు. మనుష్యులు దేహపుష్టి మనస్సంతుష్టిగలవారై యున్నారు.

ఉ. మానవకోటు లెందు నస • మానముదంబునఁ గ్రాలుచుండెడున్
వానలు కాడునం దొనరె • వాయువు లెల్లెడ వీచె హాయిగా
నీనృపుఁడే స్థిరంబుగ మ • హీపతి యై యలరారుఁ గాక యం
చీ నెఱి నెల్లవారు వచి • యించెద రన్న ముదంబుఁ గాంచుచున్. ౯౧-౨

అర్థములు. అసమానముదంబునన్=ఎందు నెవ్వరికిలేని సంతోషముచే, కాడునన్=ఏ యే సమయములఁ గురియవలయునో యా యా యదనులందు, ఈ నెఱిన్=ఈ విధముగా.

### తాత్పర్యము

(మనుష్యు లెందును సాటిలేని సంతోషమున నలరారుచున్నారు. వాన లేయే సమయములందుఁ గురియ వలయునో యాయాయదనులందుఁ గురియుచున్నవి. వాయువన్నిస్థలములందు హాయిగా వీచుచున్నది. ఈ నరపాలుఁడే స్థిరముగాభూమి పాలన మొనర్చుచు రాజై యానందపూర్ణుఁడై యుండుఁ గాక యని జనులీవిధముగాఁ జెప్పుకొనుచున్నారు. అని చెప్పఁగా సంతోషమును గాంచుచు,)

—• శ్రీరాముఁ డశోకవనంబున సీతాదేవితోఁ గ్రీడించుట •—

సీ. చందనాగరుచూత•మందారపున్నాగ, పనసకాలేయక • పారిజాత
చంపకదాడిమ•జంబూ ప్రియంగు నీ, పార్జున సప్తప•ర్ణాతిముక్త
తుంగకకదళిమ•ధూకనాగకదంబ, భూజముల్ సర్వదా•పుష్పగుచ్ఛ
ఫలసమానతము ల•బ్బంగిని దివ్యముల్, శిల్పి కల్పితములు•చెన్నుమీర

తే. మత్తహిందోళఝుంకార•మానితంబు, భృంగరాజవనప్రియ•హృద్యవివిధ
వర్ణపక్షిమనోజ్ఞంబు • స్వర్ణహేతి, మేచకాంజననిభనగ•మేదురంబు. ౯౧౩

అర్థములు. చందన=శ్రీగంధము, చూత=మామిడి, కాలేయక=గంధకాష్ఠ విశేషము పరిమళించు నొక విధమైన చెక్క, ప్రియంగు=ప్రేంకణము, నీప=మంకెన, అర్జున=మద్ది, సప్తపర్ణి=ఏడాకుల యరఁటి, అతిముక్త = పువ్వుల కురువింద, తుంగక=జమ్మి, కదళి=అరఁటి, మధూక=ఇప్ప, నాగ=పొన్న, కదంబ=కడప, భూజముల్=చెట్లు, పుష్పగుచ్ఛఫలసమానతములు=పూల గుత్తులతోను ఫలముల తోను గూడినవి, మత్త=మదించిన, హిందోళి-తుమ్మెదల, ఝుంకారమానితంబులు=ఝుమ్మను ధ్వనులచే నొప్పినవి, భృంగరాజ=గండు తుమ్మెదలయు, వనప్రియ=కోకిలలయు, హృద్య=మనోహరములైన, వివిధ=పలు తెగలుగల, వర్ణ=వన్నెలు గల, పక్షి=పక్షులచే, మనోజ్ఞంబు=ఇంపైనది, స్వర్ణహేతి = బంగారు కాంతులుగల, మేచక=నల్లని, అంజననిభ=కాటుకతో సమానమైన, నగ=పర్వతములచే, మేదురంబు=దట్టమైనది.

తాత్పర్యము

శ్రీగంధము, అగరు, మామిడి, మందారము, పున్నాగము, పనస, కాలేయకము, పారిజాతము, సంపెంగ, దానిమ్మ, నేరేడు ప్రేంకణము, మంకెన, మద్ది, ఏడాకుల యరఁటి, పువ్వుల కురువింద, జమ్మి, అరఁటి, ఇప్ప, పొన్న, కడప చెట్లును, ఎల్లప్పుడు పూలగుత్తులతో పండ్లతోఁ గూడినవియు, అటువంటి దేవతా వృక్షములు శిల్పులు కల్పించినవి యందము మీఱఁగా మదించిన తుమ్మెదల ఝుంకారముతో నొప్పినది గండుతుమ్మెదలచేతను కోకిలల చేతను ఇంపైన నానా విధములగు పక్షులచేతను మనోజ్ఞమైనది బంగారు జ్వాలలు, నల్లని కాటుక, వీనితో సమానమైన పర్వతములతో దట్టమైనది.

ఆ. సురభిపుష్పములను•సురుచిరమాల్యముల్, నిగ్గుదేఱు పెక్కు•డిగ్గియలును
మంజులంబులైన•మాణిక్యసోపాన, కోటి స్ఫటికకలిత•కుట్టిమములు. ౯౧౪

అర్థములు. సురభీపుష్పములను=మంచివాసనగల పూవులును, సురుచిరమాల్యముల్=అందమైన పూలదండలు, డిగ్గియలు = దిగుడుబావులు, మంజు

లంబులైన=అందములైన, మాణిక్య సోపానకోటి = మాణిక్యములతోఁ జెక్కఁబడిన మెట్ల సమూహములు, స్ఫటికకలిత=స్ఫటికములతోఁగూడిన, కుట్టిమములు=ఊరి=కట్టడపు నేలలు,

తాత్పర్యము

పరిమళించు పూవులు, అందములైన పూలదండలు మెఱయుచున్న దిగుడు బావులు, వానిలో నందముగఁ గట్టబడిన మాణిక్యముల మెట్లు స్ఫటికములు పఱచిన నేలకట్లు.

క. ఫుల్లోత్పలపద్మంబులు, సల్లలితరథాంగమిథున•సంచయములు ను
త్ఫుల్లప్రసూనవత్తరు, లుల్లాసము గొలుపఁదీర • మొప్పారంగన్. ౯౧౫

అర్థములు. ఫుల్లోత్పల పద్మంబులు=వికసించిన కలువలు, తామరలు, సల్లలిత=మిగుల మనోహరములైన, చక్రవాక దంపతుల గుంపులు, ఉత్ఫుల్ల=మిక్కిలి వికసించిన, ప్రసూనవత్తరులు=పూలుగల చెట్లు ఉల్లాసము=సంతోషము.

తాత్పర్యము

వికసించిన కలువలు తామరలు మనోహరము లయిన చక్రవాక దంపతులు పూచినచెట్లు సంతోషింపఁజేయు నొడ్డులు గలిగి.

క. సారసదాత్యూహశుకీ, వారములు మరాళములు ర•వంబులు నింపన్
జారుతరం బగుచును న, య్యారామము మీఱె హృదయ•హారమై శివిన్ ౯౧౬

అర్థములు. సారస=బెగ్గురులు, దాత్యూహ=వానకోయిలలు, శుకీవారములు=ఆఁడు చిలుకల గుంపులు, మరాళములు=హంసలు, రవంబులు=ధ్వనులు, హృదయహారమై=హృదయమును నాకర్షించునదియై, శివిన్=అందపు నిక్కచే.

తాత్పర్యము

బెగ్గురులు వానకోయిలలు ఆఁడు చిలుకలు హంసములు గుంపులై ధ్వనులచే దిక్కులు నించుచుండఁగా మిగుల మనోహరమై యందమై యా యుద్యాన మతిశయించెను.

సీ. బహుశిరూపంబు లౌ • ప్రాకారములను వి, శాలంబులౌ నను•జాపరాలు
వైదూర్యమణిసన్ని•భములు పచ్చికపట్లు, క్రమముల్ పుష్పిత•కాననములు
వినువీథి జొక్కఁల•విధమున రాలపై, రాలినపూవులు • రమణ మీఱ
నందనంబో బ్రహ్మ•మందిరంబో చైత్ర, రథమొ నా మిక్కిలి•రమ్య మగుచు

ఆ. మిసిమి మెరయుపట్ల•కుసుమాసనంబులు, పూవుఁబొదరుటిండ్లు•పొలుపుఁగనిన
తన యశోకవనము • దశరథతనయుండు, చొచ్చి మెచ్చుగొలుపు•శుభతలమున

తాత్పర్యము

అనేకము లయిన యాకారములుగల ప్రాకారములును వెడలుపాటి చాఁప బావులును వైడూర్యమువంటి పచ్చని పచ్చికనేలలును ఇంపుగాఁబూచిన వనములును ఆకాశమున జుక్కలవలె నేలమీఁద రాలిన పూవులు కలిగి యింద్రుని నందన వనమో బ్రహ్మ మందిరమో కుబేరుని చైత్రరథమో యనునట్లుమిగుల రమ్యమైన మిన మిన మెఱయు పూల పీఁటలు పూవుల పొదరుటిండ్లు గల తన యశోకవనమును రామచంద్రమూర్తి ప్రవేశించెను.

క. జనకసుతాహస్తంబును, దనకేల గ్రహించి వజ్రి ♦ తనసతివలెఁ దా
వనమధుమైరేయముఁ, దనివారఁగ ద్రావఁజేసె♦దత్ప్రియురాలిన్. ౧౮

అర్థములు. వజ్రి=ఇంద్రుఁడు, తన సతివలెన్=తనభార్యయగు శచీదేవిని వలె, మధు=తియ్యని, మైరేయము=ఆసవము, 'మైరేయ మాసవేధాత్రీధాతకీ గుడవారిభిః'=వైజయంతి, ఆరెపూలు, ఉసరిక, బెల్లపునీళ్ళుకలిపి భూపుటము వేసినది.

తాత్పర్యము

(తన ప్రియురాలగు సీతాదేవిచేయి పట్టుకొని, యింద్రుఁడు శచీదేవినివలెఁ దనివితీఱ నాసవమును ద్రావించెను.)

క. తేరఁ బనివాండ్రు ఫలములఁ జారుసుపక్వామిషంబుఁ♦జవిగొనఁ బిదపన్
ధారిణీధవునం బ్రీతికి, నారఁగ నృత్యంబు గీత ♦ మటవర్తిల్లెన్. ౧౯

అర్థములు. చారు=మనోహరమైన, సుపక్వామిషంబు = చక్కఁగాఁ బక్వమైన మాంసము, చవిగొనన్=రుచిచూడఁగా.

తాత్పర్యము

సేవకులు ఫలములను, సుపక్వములైన మాంసములను దీసికొనిరాఁగా వానిని రుచి చూచిన పిదప రాజును సంతోషపెట్టవలయునని యాట పాట జరిగెను.

క. రాములు మనోభిరాములు, రాముని రంజింపఁజేయ ♦ రమణుల కెల్లన్
శ్రీమహితుం డాభరణ, స్తోమాంచితుఁ డార, గూర్చెఁ♦దోరపుఁదృప్తిన్. ౨౦

అర్థములు. రమణులకు=ఆటలాడి పాటలుపాడిన స్త్రీలకు, ఆభరణస్తోమ=భూషణసమూహముచే, అంచితుఁడు=ఒప్పుచున్నవాఁడు.

తాత్పర్యము

మనస్సునకు సంతోషము గలిగించు స్త్రీలాటలచే పాటలచే సంతోషము గలిగింపఁగా ఆ స్త్రీల కందఱకు రామచంద్రమూర్తి యాభరణము లిచ్చి సంతోషింపఁజేసెను.

క. సీతాసహితుఁడు కౌసల్యాతనయుఁ డరుంధతీస•హాసీనుండౌ
భాతిం దనరు వసిష్ఠుని,రీతిం జెన్నారె నిట్లు•శ్రీరాముండున్. ౯౨౧

తాత్పర్యము

(సీతతోఁ గూడినవాఁడై శ్రీరాముఁ డరుంధతితోఁ గూడియుండిన వసిష్ఠుని రీతి నొప్పియుండెను. శ్రీరాముఁడును.)

ఆ. సురతనూజఁ బోలు • ధరణీకుమారితో, నమరునట్లు సుఖము • లహరహంబు
ననుభవింప నిరత•మతిభోగదం బైన, శిశిరకాల మెల్లఁ•జెల్లె నెల్ల. ౯౨౨

అర్థములు. అహరహంబు=దినదినము, అతిభోగదంబు=మిగుల సుఖకరము, శిశిరకాలము=చలికాలము.

తాత్పర్యము

(దేవకన్యవంటి సీతతో దిన దినము నొప్పిదమగునట్లు సుఖము లనుభవింపఁగా మిగుల సుఖకరమైన చలికాలమంతయు నెమ్మదిగాఁ గడచిపోయెను.)

క. వివిధభోగములను • వేడుక మీఱఁగ ననుభవించు చుండ • నమ్మహాను
భావులకును గడచెఁ• బదివేలవర్షముల్, శిశిరకాల మిట్లు•చెల్లుటయును. ౯౨౩

దీనికి మూలశ్లోకమునకు గోవిందరాజు వ్యాఖ్య లేదు. తిలక కారుఁడు దీనిని ప్రక్షిప్తమని గ్రహింపవలెను లేదా యిట్లు సమాధానము కుదుర్చుకొనవలయునని వ్రాసెను. పదివేల సంవత్సరములు పదివేల దినములుగా లెక్కింపవలెను. ఇది వివాహము మొదలుకొని గణింపవలెను. అట్లయినచో అయోధ్యయందు పండ్రెండు సంవత్సరములు, అరణ్యమందు పదునాలుగు సంవత్సరములు, పట్టాభిషేకానంతరము రెండు సంవత్సరములు కలిసి యిరువది యెనిమిది సంవత్సరములగుచున్నవి. అనఁగా ౨౭ × ౩౬౫=౯౮౫౫ దినములగుచున్నవి. ఇరువదిదినములు తక్కువగా పదివేలు సరిపోవుచున్నవి. రామచంద్రమూర్తి రాజ్యము పాలించినది పదునొకండు వేల సంవత్సరములు కావున నీ పదివేల సంవత్సరములకు దానికి సంబంధము లేదు. తిలకమునఁ జెప్పఁబడిన ప్రకారము సంవత్సరములను దినములుగా గణించిన పదునొకండు వేల సంవత్సరము లనఁగా ముప్పది సంవత్సరములు ఏఁబది దినములగుచున్నవి. ఇందు సీతాదేవి వాల్మీకాశ్రమమున నుండునది పండ్రెండు సంవత్సరములు నూఱు యజ్ఞములనుటకు అనేక యజ్ఞములని యర్థము గ్రహింపనగు. అప్పుడు రామచంద్రమూర్తి జీవితకాలము ౧౨+౧౨+౧౪+3౦=౬౮,౬౯ సంవత్సరము లగుచున్నవి. రామనిర్యాణకాలమునకు కుశలవులకు పదునెనిమిది సంవత్సరముల ప్రాయమగుచున్నది.

తా త్ప ర్య ము

(అనేక విధములైన భోగము లనుభవించుచుండఁగా సీతారాములకుఁ బది వేల యేండ్లు కడచిపోయెను. ఇట్లు చలికాలము దాఁటిపోవుటయు;)

ఆ. దినము పూర్వభాగ•మున ధర్మకార్యముల్ ధర్మవిదుఁడు నడపి•ధర్మవిధిని
దక్కునగముదినము • మక్కువతో నంతి,పురమునందుఁ జేరి • ప్రొద్దుపుచ్చు.

అర్థములు. దినము పూర్వభాగమునన్=మధ్యాహ్నము గడచువఱకు, సాయంకాలమున సాయాహ్నకృత్యము లుండును గనుక నీనడిమికాలము అంతః పురమున తల్లులతోఁ గొంతకాలము సీతాదేవితోఁ గొంతకాలము గడుపుచుండెను

క. ఉర్వీతనయామణియును, పౌర్వాహ్ణిక కార్యములు సు•పర్వార్చనలున్
సర్వంబుఁ దీర్చి యత్తల, గుర్విగఁ బూజించి తనదు•కూటంబునకున్. ౨౫

అర్థములు. పౌర్వాహ్ణిక కార్యములు=పగటి పూర్వభాగమునఁ జేయఁదగిన పనులు, సుపర్వార్చనలున్=దేవతారాధనలు, గుర్విగన్=అధికముగ, కూటంబునకున్=ఇంటికి.

తా త్ప ర్య ము

సీతాదేవి యుదయముననే లేచి దినము పూర్వభాగమునఁ జేయవలసిన కార్యములు చేసి దేవతలఁ బూజించి అత్తలను మిక్కిలి పూజించి తన యింటి నుండి రాముని యింటికి.

క. చిత్రాభరణాంబర యై, వృత్రహరుం జేరవచ్చు • నింద్రాణివలెన్
గోత్రాసుత వచ్చిన వై, చిత్రిం గని మెచ్చ భూప•శేఖరుఁ డెలమిన్. ౨౬

అర్థములు. చిత్రాభరణాంబరయై=అందములైన యాభరణములు చీర ధరించినదియై, వృత్రహరున్=ఇంద్రుని, ఇంద్రాణి=శచీదేవి, గోత్రాసుత= భూపుత్రి=సీత, వైచిత్రిన్=అందమును.

తా త్ప ర్య ము

అందములైన యాభరణంబులు వస్త్రములు ధరించి యింద్రునిఁ జేరవచ్చు శచీదేవివలెఁ దా నున్నయింటికి సీతాదేవి రాఁగా నామె యందమును జూచి రామచంద్రమూర్తి మెచ్చుకొనెను.

**—* సీతాదేవి ఋష్యాశ్రమంబులకుఁ బోవఁ గోరుట *—**

క. సుతఁగనీఁ గల్యాణమ, వ్రతపత్నిం గాంచి యూని•నీ! సీయొడలన్
సుతలాభచిహ్న దోఁచెడి, నతివా!నీకోర్కె దెలుపు•మది ఘటియింతున్. ౨౮

అర్థములు సుతగతిన్=శ్లాఘ్యమగురీతి, కల్యాణసమన్విత=శుభచిహ్నములు గల, పత్నిన్=భార్యను, నీయెడలన్=నీయందు, సుతలాభచిహ్న=కొడుకు గలుగు గుర్తు, గర్భము.

తా త్ప ర్య ము

అంతట శ్లాఘ్యమైన విధముగ శుభగుణచిహ్నములు గల భార్యను జూచి రామచంద్రమూర్తి దేవీ! నీయందుఁ గుమారుఁడు గలుగఁబోవు లక్షణములుగాన వచ్చుచున్నవి. నీకోర్కె యేమో చెప్పుము, సంతోషముతో నెఱవేర్చెదను.

గర్భిణిగా నున్న భార్యకోరిక నెఱవేర్పఁబడదేని గర్భిణికి శిశువునకు హానికరమని శాస్త్రము చెప్పుచున్నది. శీలహానికరములు ప్రాణహానికరములు లోనగు చెడుకోరికల నెఱవేర్పరాదుగాని సౌమ్యములగు వానిని నెఱవేర్పవలెను.

చ. అన స్మితచంద్రికావికసి • తాననపద్మ తపోవనంబులం
  గనుఁగొన వల్లభా! మదిని • గల్గెను గోరిక గాంగతీరమం
  దొనరిన యాశ్రమస్థలుల • నున్న తపస్విలఁ జూచి పూజలం
  దనిపెద నొక్కరేయి యయి • నన్ మన సర్వోడి నందు నిల్వఁగన్. ౯౨౦

అర్థములు. స్మితచంద్రికా=చిఱునవ్వనెడు వెన్నెల చేత, వికసిత = వికసించిన, ఆననపద్మ=ముఖకమలము గలది, గాంగతీరమందు=గంగకు సంబంధించిన యొడ్డులందు.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా వెన్నెలవంటి చిఱునవ్వుచే పద్మమువంటి ముఖమువికాసము నొందఁగా సంతోషించి నాథా! గంగానదీ తీరము లందున్న తపోవనంబులం జూచి యం దొక్క రాత్రియైన నుండఁగోరెదను.

గొంతెమ్మ కోరికలని కుంతీదేవి కోరికలు వ్యర్థములు. సీతాదేవి కోరిక లనర్థకములు. కోరక కోరక యామె జన్మమునందు రెండు కోరికలు కోరెను. రెండును దనమెడకు గండకత్తెర లయ్యెను.

ఇదివఱకు పదునాలుగు సంవత్సరములు ఋషులను జూడలేదా, ఋష్యాశ్రమములు చూడలేదా. ఈ విపరీతపు కోరికకుఁ గారణ మేమి? 'బలీయసి కేవల మీశ్వరాజ్ఞా', భగవత్సంకల్పము బలిష్ఠమైనది.

క. నావుడు నీరజనయనా!, నీవలచినయట్ల రేప • నే బంతు మదిన్
  నీవనుమానము విడుమని, తావచ్చెన్ నడిమికక్ష్యఁ • దనమంత్రులతోన్. ౯౨౧

అర్థములు. నీవలచినయట్ల=నీవు కోరిన ప్రకారమే, రేప=ఉదయము కాఁగానే, నడిమికక్ష్యన్=నడిమికట్టునకు.

తాత్పర్యము

(అని చెప్పఁగా సీతా! నీవు కోరినట్లు చేసి నిన్నుఁ బంపెదను. నీ వనుమాన పడకుము, అని మంత్రులతో నడిమికట్టునకు శ్రీరామప్రభువు వచ్చెను.)

—• శ్రీరాముఁడు భద్రుని లోకవార్త అడుగుట •—

సీ. ఇటు లుపవిష్టులై•హితులు విచక్షణుల్ భజియింపఁ గౌతుక•హాసము లుగలుగు
హాస్యకారులు విజ•య కుట కాశ్యపమధు, మత్తకాళియులు సు•మాగధుండు
భద్రుండు మఱి దంత•వక్త్రి సురాజులు, పింగళుల్ తమ నేర్పు•పెంపు మెఱసి
పరిహాసవార్తలు•పలుకుచు శ్రీరాము, నలరించుచుండఁ గ•థాంతమందు
తే. భద్రుఁడనువానిఁ గని రామ•భద్రుఁడనియె, వార్తలేమిర పల్లెలఁ•బట్టణముల
భరతలక్ష్మణశత్రుఘ్న•ధరణిసుతులఁ, గైకయిఁ గూర్చి నేమంద్రు•లోకులెల్ల.

అర్థములు. ఉపవిష్టులై=కూర్చుండినవారై, విచక్షణుల్=పండితులు హాస్యకారులు=నవ్వునట్టి మాటలు చెప్పువారు.

తాత్పర్యము

(ఈవిధముగాఁ గూర్చుండినవారై స్నేహితులు, పండితులు, సేవించుచుండ ననేకవిధముల హాస్యములు చెప్పువారు, విజయ కుట కాశ్యపమధు మత్త కాళియులు, సుమాగధుఁడు భద్రుఁడు దంతవక్త్రుఁడు సురాజుఁడు పింగళులు ననువారు.)

చ. జనులకు మేలు గూరఁగఁ బ్ర•జాపరిపాలన సేయురాజు దా
వినఁదగుఁ దన్నుఁగూర్చి తన•వీటను రాష్ట్రమునందు లోకు లే
మనుకొనువారొ సర్వవిష•యంబుల రాజటు సేయఁ డేనియున్
వనములఁ బల్లెలం బురము•నన్ జననిందితుఁడౌ నిజంబుగన్. ౯౩౧

ఏల యిటు లడిగెద వందువా! ప్రజలకు మేలుచేయఁగోరి రాజ్యము చేయు రాజు తన్నుఁగూర్చి తన కార్యములఁగూర్చి ప్రజలు పల్లెలందుఁ బట్టణములందు సర్వవిషయంబులందు మేలుఁగాఁ జెప్పుచున్నారా? కీడాడుచున్నారా యని విచారించి సవరించుకొనవలసినవి సవరించుకొనవలయును. అట్లు చేయఁడేని యారాజు పల్లెలందు పట్టణములందు లోకులచే నిందింపఁబడును.

చ. అనవుడు భద్రుఁ డిట్లనియెఁ • బ్రాంజలియై ధరణీశ! పట్టనం
బున మఱి పల్లెలందు జన•ముల్ భవదద్భుత వార్తలే సదా
యనుకొనువారు మేలుగ ద•శాననుఁ జంపుట తజ్జయంబు వా
కొనియెడివార లెల్లయెడఁ•గూరిమితోడ ననన్ నరేంద్రుఁడున్. ౯౩౨

అర్థములు. భవదద్భుతవార్తలే=నీవు చేసిన యాశ్చర్యకరములైన కార్యములను గుఱించిన ముచ్చటలే, మేలుగన్=మంచిగ.

తాత్పర్యము

(అని యడుగఁగా, భద్రుఁడు చేతులు జోడించి యిట్లని విన్నవించెను. రాజా! పట్టనములోను పల్లెలందును జనులు నీవు చేసిన యాశ్చర్యకరములైన ముచ్చటలే మంచిగ చెప్పుకొనుచున్నారు. రావణునిఁ జంపుట, ఆ జయము నెల్ల తావులఁ ప్రేమతోఁ జెప్పుచుందురు. అని చెప్పఁగా రామచంద్రమూర్తి.)

చ. కలదికలట్టు చెప్పుము జ•గజ్జన మే మని పేలు పల్కెడున్
బలికెడి నేమికీడులను • వార్తల నన్నిటిఁ జెప్పు, మన్నియుం
దెలిసినఁ గాదె కీడులను • దీర్చి శుభంబులు గూర్పవచ్చు, లోఁ
గలఁగకు పాప మే మనెడి • క్ష్మాజనము ల్వినవాంఛ చేసెదన్. ౯౩

తాత్పర్యము

అనిన రామచంద్రమూర్తి యిట్లనెను ఓరి యున్నదున్నట్లు చెప్పుము. లోకులు మే లేమని చెప్పుచున్నారు. ఏవి చెడ్డలని చెప్పుచున్నారు. లోకమునందు నన్నియు సుగుణములే, అన్నియు దుర్గుణములే కలవాఁ డుండఁడు గదా. కావున లోపములు దెలిసినఁ గదా సవరించుకొనవచ్చును. నీవు భయపడకుము. ప్రజలు నాయం దేమి దోషములు చెప్పుచున్నారు? వానిని వినఁగోరెదను.

**—• భద్రుఁడు శ్రీరామునకు సీతావిషయకాపవాదంబుఁ దెలుపుట •—**

సీ. ధృతి గూరఁ బలికిన • పతికి వాఁ డిట్లనుఁ దోటలఁ బాటలఁ దోఁపులందు
సంగళ్ళ శాలల • నఖిలతలంబులఁ రామభద్రుం డర•రే! మహాత్ముఁ
డమరదానవనిర్జ•రాళి కసాధ్య మా, సేతువుఁ గట్టించె • సింధువునను
సేనలతోడ ని•ర్జించెను రావణు వానరులను వశ•పడఁగఁ జేసె
ఆ. ఋక్షపతుల నేలె • రాక్షస కోటులఁ జెలి కయ్యెనైన • నేమికాని
దనుజుఁ డపహరింపఁ దనభార్య నయ్యది, మఱచినాఁడు మరల • మరగినాఁడు.

అర్థములు. ధృతి గూరన్=ధైర్యము వచ్చునట్లు, అసుర=దానవ నిర్జరాళికిన్=అసురులకు దానవులకు దేవతలకు, సింధువునను=సముద్రమందు, దనుజుఁడు=రాక్షసుఁడు.

తాత్పర్యము

(అని ధైర్యము వచ్చునట్లు చెప్పఁగా, రామ ప్రభువునకు భద్రుఁడిట్లని చెప్పెను. తోటలందు బాటలలోఁ దోఁపులందు, అంగడులందు, గృహములందు సకల ప్రదేశములందు 'అరరే! రామభద్రుఁడు మహాత్ముడు-దేవతలకు రాక్షసులకు నసాధ్యమైన పని సముద్రమందు సేతువు గట్టించెను. రావణుని ససైన్యముగా జయించెను. వానరులను లోఁబఱచుకొనెను. ఎలుగులు నేలెను. రాక్షసులకుఁ

(ప్రభువర్యుండను అయిన నేను కాని రాక్షసుఁడు తనభార్య నపహరింపఁగా నా విష యమున మఱచి, మరలఁ దెచ్చుకొని యేలుకొనుచున్నాఁడు.)

మ. బలవంతంబుగఁ జేర్చి స్వాంకమున దే◆వ ద్వేషి కొంచేగ, నా
ఖలుఁడే లంక నశోకవాటి నునిచెం ◆ గాపుంచె స్వస్త్రీల, న
చ్చెలువం గ్రమ్మఱఁ దెచ్చి యింట నునిచెన్ ◆ నీ! యాత్మ గర్హింపఁడా
పొలఁతిం గూడి నృపుండు మోహమున సం◆భోగింప నే సౌఖ్యమో. ౩౫

అర్థములు. స్వాంకమునన్=తనతొడయందు, దేవద్వేషి=రాక్షసుఁడు ఖలుఁడే=ఆదుష్టుఁడే.

తాత్పర్యము

రాక్షసుఁడు బలాత్కారముగ తన తొడమీఁద నుంచుకొని తీసికొనిపోయెను ఆ దుష్టుఁడే లంకలో నశోకవనములో నుంచెను. తన స్త్రీలనే కాపుగా నుంచెను. అట్టి దానిని మరలఁ దెచ్చి యింటిలో నుంచుకొన్నాఁడు. ఛీ - మనస్సులోనైన రోఁతపడఁడు. అటువంటి యాఁడుదానిని గూడి మోహమున సంభోగింపఁగానేమి సౌఖ్యము గలదో.

క. తామసుఁడగు రాక్షసుగృహ, సీమను జిరకాలమట్లు◆చెఱఁబడిన సతిన్
రాముఁడు రోయక కూడెడిఁ, గాముకు లగువారి కెందుఁ ◆ గన్నులు గలవే?

తాత్పర్యము

తామసుఁడు=తమోగుణము ప్రధానముగాఁ గలవాఁడు, కావుననే పాప మునకైన భయపడనివాఁడు=అందు రాక్షసుఁడు, అందు వాని గృహసీమను వాని యింటియందే, చిరకాలము, ఒకగడియకాదు, ఒకనాఁడు కాదు, ఒక నెలకాదు. దీర్ఘకాలము పదినెలలు. కాముకులగువారికి నిది తప్పు, ఇది యొప్పని తెలిసికొనఁ గన్నులుఁ గలవా? 'కామాంధోపి న పశ్యతి' 'Cupid is blind' మన్మథుఁ డంధుఁడు అని సామెతలు కలవుగదా.

క. రాజానుమతము ధర్మము, రాజువిధం బనుసరింపఁ ◆ బ్రజ కర్హంబౌ
రాజువలె మనకు నాత్మస, తీజనచర్యలు సహింపఁ ◆ దీరగు నింకన్. ౩౬

అర్థములు. రాజానుమతము ధర్మము=రాజంగీకరించినదే ధర్మము, ఆత్మ సతీజన చర్యలు=మన భార్యలుచేయు చేష్టలు.

తాత్పర్యము

ఏది ధర్మమో యేది యధర్మమో మనకేమి తెలియును? రాజేదిసమ్మతించి యాచరించునో యదియే మనకు ధర్మము. ఆరాజు మార్గమున మనము నడచుట తగును. పూర్వరాజులు పరుఁ డెత్తుకొనిపోయిన యాఁడు దానిని మరల గ్రహింప

కుండిరి. కావున మనము గ్రహింప కుంటిమి. ఇప్పుడీ రాజు మరల గ్రహించెను. గావున మన పెండ్లాలే చేష్టలు చేసినను రాజువలె మనము సహించి గ్రహింప వచ్చును.

క. అని వారు వారు దోఁచిన, యనువునఁ బురి జనపదముల ♦ ననుకొను వారల్
జను లెల్లనని రాముఁడు, మనమునఁ బరమార్తి కతన ♦ మల్లడిగొనుచున్. ౯౦౮

అర్థములు. అనువునన్=విధమున, పురిన్=పట్టనమందు, జనపదముల్=గ్రామములందు, మల్లడిగొనుచున్=పరితపించుచు.

తాత్పర్యము

(అని వారు వారు తమకుఁదోఁచిన విధమునఁ బట్టనమందుఁ బల్లెలందు జనులందఱు ననుకొనుచున్నారు. అని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి మిక్కిలి దుఃఖముచేఁ బరితపించుచు)

క. అని సంకట సుహృతులఁ గని, వినినారలె విూర లిట్టి ♦ విధము లటన్నన్
వినతశిరంబుల వారలు, వినతు లొనర్చుచును, ధరణి ♦ విభునిన్ దీనున్. ౯౦౯

అర్థములు. వినతశిరంబులన్=తలలు వంచుకొని, వినతులు=నమస్కారములు, దీనున్=చింతాక్రాంతుని.

తాత్పర్యము

(స్నేహితులందఱను జూచి విూరలీవిధములయిన వార్తలను విన్నారుకదా యని యనఁగానే యందఱు తలలు వంచుకొని నమస్కారము లొనరించుచు, చింతాక్రాంతుఁడైన రామప్రభువుతో.)

క. అందఱుఁ బలికిరి దీనన్, సందియ మేమియును లేదు ♦ జనవర ! యనఁగా
డెందము విచారభరడో, లాందోళిత మగుచు వారి ♦ నందఱఁ బనిచెన్. ౯౧౦

అర్థములు. విచారభర=అధిక చింతచే, డోలాందోళితము = ఉయ్యెలవలె నూఁగుచున్నది.

తాత్పర్యము

(రాజా! దీనిలో సందేహమేమియు లేదని యందఱుఁ బలికిరి. అని చెప్పఁగా నధికమగు చింతచే మనసు యుయ్యెలవలె నూఁగగా వారి నందఱను బంపివేసెను.)

**— శ్రీరాముఁడు సోదరులఁ బిలిపించుట •—**

ఉ. అందఱఁ బోనఁ బంచి తద ♦ నంతర కార్యము నిశ్చయించి సం
క్రందనతేజుఁ డం దఱుతి ♦ కావలివానిని బిల్చి కైకయీ
నందనుఁ బుణ్యశీలు శుభ ♦ నవ్యసులక్ష్మణు లక్ష్మణుం బరా
స్పందితుఁ దత్సహోదరునిఁ ♦ జయ్యనఁ దోడ్కొని రమ్ము సావ్రుదున్. ౯౧౧

అర్థములు. తదనంతర కార్యము=ఆవలఁ జేయవలసిన కార్యము, సంక్రందన తేజుఁడు=ఇంద్రుని తేజస్సువంటి తేజస్సుగలవాడు, అభిత=సమీపమందున్న పర=శత్రువులచే, అస్పందితున్=చలింపఁ బడని వానిని.

తా త్ప ర్య ము

(అందఱను బంపివేసి, యావల జేయవలసిన కార్యమును నిశ్చయించి, యింద్రుని తేజస్సువంటి తేజస్సుగల, రామచంద్రమూర్తి సమీపమున నున్న కావలి వానిని బిలిచి, భరతుని లక్ష్మణుని శత్రుఘ్నుని, శీఘ్రముగఁ బిలుచుకొని రమ్మని అని చెప్పగా)

చ. జవమున వాఁడు లక్ష్మణుని ♦ శాలకు నేగి నమస్కరించి రా
ఘవ! మిము రాజు రాఁబనిచె ♦ గ్రక్కున నంచు వచింప వెంటనే
భవనము వీడి తేరిపయి ♦ భ్రాతృగృహంబున కేగె లక్ష్మణుం
డవనిపువీటి కేగఁ గని ♦ యావల ద్వార్థ్స్థుఁడు కైకయీసుతున్. ౯౮-౨

అర్థములు. జవమునన్ = వేగముగ, శాలకు=ఇంటికి, భవనము=ఇల్లు, ద్వార్థ్స్థుఁడు=ద్వారపాలకుఁడు.

తా త్ప ర్య ము

(వాఁడు లక్ష్మణుని యింటికిఁబోయి 'రాఘవా! మిమ్ముఁ ద్వరగా తీసికొని రమ్మని రాజుగారు పంపినా'రని చెప్పఁగా, వెంటనే బయలుదేఱి రథమెక్కి యన్న గారి యింటికిఁబోయెను. లక్ష్మణుఁడు రామచంద్రప్రభువు వారి యింటికిఁ బోవుట చూచి ద్వారపాలుఁడు భరతుని)

క. చేరఁ జని మ్రొక్కి నృపసుడి, తీరు వచించుచు నతండుఁ ♦ దెప్పునఁ బదసం
చారంబునఁ జనె నది గని, ద్వారాధ్యక్షుండు చూచి ♦ త్వర శత్రుఘ్నున్.

అర్థములు. పదసంచారంబునన్=కాలినడకతో.

తా త్ప ర్య ము

సన్నిధికిఁ బోయి, నమస్కరించి, రాజుగారు సెలవిచ్చిన విషయమును విన్నవింపఁగా, నతఁడు తత్క్షణము కాలినడకతోఁబోయెను. అది చూచి ద్వారపాలుఁడు, తొందరగా శత్రుఘ్నుని)

క. డాసికై మోడ్పుతోఁబలికె, శాసన మెఱిఁగింపఁ జక్కఁ ♦ జని నాతండున్
గౌసల్యానందనునకుఁ, దా సరగన్ గొల్ల వినిచెఁ ♦ దమ్ములరాకల్. ౯౮౮

అర్థములు. గొల్ల=ద్వారపాలుఁడు.

### తాత్పర్యము

(ఒద్దకుఁ బోయి కేలుమోడ్పుతో రాజుగారి శాసనమును దెలుపఁగా, రామచంద్రమూర్తి సన్నిధికిఁ దాను నాక్షణమునందె పోయెను. ద్వారపాలుఁడు, రామచంద్రమూర్తితోఁ దమ్ములు వచ్చిరని విన్నవించెను.)

చ. అనుజులు వచ్చి రంట విని ♦ వ్యాకులచిత్తుఁ డవాఙ్ముఖంబుతో
నవియెను ద్వారపాలకుని ♦ నందఱ లో విడు, వారె నాప్రియుల్
తనువునఁ బ్రాణవాయు లనఁ ♦ దద్విధ మాతఁడు దెల్ప మువ్వురున్
వినయ నతోత్తమాంగు లయి ♦ వే ముకుళీకృతహస్తపద్ములై. ౯౪౫

అర్థములు. అనుజులు=తమ్ములు, వ్యాకులచిత్తుఁడు=కలఁతఁజెందిన మనస్సు గలవాఁడు, సీతాదేవికి మరలఁ గష్టము వచ్చెఁగదా యని కలఁత, అవాఙ్ముఖంబుతో=వంచిన తలతో, వినయనత+ఉత్తమాంగులయి=అణఁకువచేత వంపఁబడిన శిరస్సులు గలవారై, ముకుళీకృత హస్తపద్ములై=ముకుళించిన పద్మములవంటి చేతులుగలవారు.

### తాత్పర్యము

(తమ్ములు వచ్చిరని విని కలఁత చెందిన మనస్సుగలవాఁడై తలవంచుకొని ద్వారపాలకునితో వారే నాకుఁ బ్రియులు. శరీరమునఁ బ్రాణవాయువులు, వారిని లోనికి రానిమ్ము అని చెప్పఁగా, నతఁడావిధమంతయుఁ దెల్ప ముగ్గురును, నణఁకువచేఁ దలలు వంచుకొని, చేతులు కట్టుకొని.)

చ. చని యుపరాగసంకలిత♦చంద్రుఁడో? సంజను సూర్యుఁడో? యనన్
ఘనతరకాంతి మాసి నయ♦నంబుల నీరు తొలంక నున్నయ
న్ననఁ హతశోభ మైన నళి♦నంబును బోలు తదాస్యబింబమున్
గని చరణంబులం దొఱఁగఁ ♦గన్నులనీరము లోన గ్రుంగుచున్. ౯౪౬

అర్థములు. ఉపరాగ సంకలిత చంద్రుఁడో=గ్రహణము పట్టిన చంద్రుఁడో సంజను=సంధ్యాకాలమందలి, హతశోభము=నశించిన కాంతిగలది, నళినంబును=కమలమును, తత్+ఆస్యబింబమును=ఆయన ముఖబింబమును.

### తాత్పర్యము

లోపలికిఁబోయి గ్రహణము పట్టిన చంద్రుఁడో, గ్రుంకఁబోవు సంధ్యాకాల సూర్యుఁడోయనునట్లు గొప్పదగు కాంతిఁబాసి కన్నులనీరుకాఱఁగానున్నయన్నను కాంతిచెడిన కమలములవలె నున్న యాయన ముఖమండలమును జూచి పాదముల వ్రాలఁగా రామచంద్రమూర్తియు కంటినీరు వెలికిరాకుండ లోపలనే గ్రుంగుచు

ఉ. తమ్ములఁ గౌఁగిలించి యుచి•తమ్మగు పీఠుల నుండఁ బంచి నె
యయ్యమ్మునఁ బల్కెనో యనఘు•లారా! సహోదరు లన్న మీరె ప్రా
ణమ్మన మీరె సర్వము ధ•నం బన మీరె త్వదార్జితమ్మగు రా
జ్యమ్మును నేను బాలనము • సల్పెద భూపతులార! వింటి రే? ౯౪౭

అర్థములు. త్వదార్జితము=మీరు సంపాదించినది.

తా త్ప ర్య ము

(తమ్ములను కౌఁగిలించుకొని పాపరహితులారా! సోదరులనిన మీరే.ప్రాణ మనిన మీరే–సర్వధనము మీరే, మీరార్జించిన రాజ్యమును శ్రీయము మీరు నేను బాలించుచున్నాను. విన్నారు కదా! యని చెప్పెను.)

క. మీరలు కృతశాస్త్రార్థులు, ధీరులు మతినిష్ఠితులును • దెలిపెద నొండున్
గారియము నాకుఁగా నది, గారా దని యనక మీరు•గావింపఁ దగున్. ౯౪౮

అర్థములు. కృతశాస్త్ర+అర్థులు=చక్కఁగా సాధించిన శాస్త్రార్థము గల వారు, ధీరులు=భయము లేనివారు, మతినిష్ఠితులును=నిష్ఠగల మనస్సు గలవారు. కారియము=పని

తా త్ప ర్య ము

మీరందఱు శాస్త్రార్థములు చక్కఁగాఁ దెలిసినవారు. భయము లేనివారు. నిష్ఠతోఁ గూడిన మనస్సుగలవారు. నాకుఁగా నేనొక పని చెప్పెదను. అది మేము చేయుము అనక మీరు చేయవలయును.

క. అనవుడు నేమి వచించునో, యని యుద్వేగంపుమతుల • నవధానముతో
ననుజాతు లుండ దీనా,ననముల నవ్వారి కుర్వి•నాథుం డనియెన్. ౯౪౯

తా త్ప ర్య ము

(అని పలుక, నేమి చెప్పునో యని దిగులొందిన మనస్సుగలిగి వెలవెల బోవు మొగములతోఁ దమ్ములుండఁగా వారినిఁ జూచి రామచంద్రమూర్తి చెప్పెను.)

—• శ్రీరాముఁడు భరతాదులకు లోకాపవాద విధంబుఁ దెలుపుట •—

మ. వినుఁ డేకాగ్రతఁ జక్క నాయదులఁ బౌ•ర్వాకవ్యకం గూర్చి భూ
జనము ల్పల్కెడిచందముల్ పురములన్ • సర్వప్రదేశంబులన్
వినరానట్టివి కుత్సితంబు, లవి, నే • విన్నాదిగా మర్మభే
దన మయ్యెం దలపోయ నెట్టు లల నిం•దావాక్యము ల్పల్కెడన్? ౯౫౦

అర్థములు. ఏకాగ్రతన్=చలింపని మనస్సుతో, కుత్సితంబులు=నీచములు, విన్నాదిగా=విన్నది మొదలు, మర్మభేదనములు = ఆయువు పట్టులు పగులఁ దీయునవి.

### తాత్పర్యము

తమ్ములారా! నేను జెప్పుమాటలు మనస్సు చలింపనీక వినుఁడు సీతను గూర్చి లోకులు పల్లెలందుఁ బురములందు సర్వప్రదేశములందు మిక్కిలి నీచములైన వినరానివి యనుచున్నారు. అవి నేను విన్నది మొదలు నా ప్రాణములు పోవునట్లున్నవి. వినుటకే యిట్లుండ నా నిందావాక్యములను నేను నానోరార నేమని చెప్పుదును.

సీ. లోకసత్ప్రథితు లి• క్ష్వాకు లవ్వారల, పుణ్యవంశంబునఁ • బుట్టినాఁడ
సీత మహాత్మాళి • శ్రేష్ఠుఁడౌ జనకుని, సద్వంశమందుఁ దా• సంభవించె
దండకాటవియందుఁ • దశకంఠుఁ డుర్విజ నపహరించుటయు నే • నతనిఁ జంపు
టీ వెలుంగవె యప్పు•డే నాకు మదిలోనఁ, బరు నింట నుండిన• పడఁతి సీత
తే. నెట్లుఁ గొనిపోదు బురికని• యేఁ జడుంగఁ బ్రత్యయార్థంబు పతివహ్నిఁ•బడఁగ లేదె
యగ్ని సీత పతివ్రత యనఁగ లేదె?, నీవు సౌమిత్రి? యచ్చట• లేవె యపుడు?

అర్థములు. లోకసత్ప్రథితులు=ప్రపంచమున మిక్కిలి కీర్తి గలవారు మహాత్మాళి=మహాత్ముల సమూహములో, జడుంగన్=వెనుదీయఁగా, ప్రత్యయార్థంబు=నమ్మకము కొఱకు.

### తాత్పర్యము

తమ్ములారా? నేనా ప్రపంచమం దన్ని విధముల మంచి కీర్తి సంపాదించిన యిక్ష్వాకు మహారాజుల పుణ్యవంశమునఁ బుట్టినాఁడను. ఇట్టి నేను జేయరాని పని చేసి పూర్వుల కపకీర్తి తెత్తునా? ఇఁక సీతయో మహాత్ములని పేరు వడ్డవారిలో శ్రేష్ఠుఁడైన జనకుని వంశమందు జనించెను. ఆమె చేయరాని పనిచేసి తండ్రికి నాయన వంశము వారికి నపకీర్తి తెచ్చునా? దండకారణ్యమందు రావణుఁడామె నపహరించుటయు నేనాతని జంపుటయు లక్ష్మణా! నీకుఁ దెలియదా! ఇట్లుండియు అప్పుడే నాకుఁ బరునింట నున్న దాని నెట్లు పురమునకుఁ బిలుచుకొని పోదునని సందేహించి వెనుదీసితిని. అప్పుడు తాను నిర్దోషురాలని నమ్మించు కొఱకు సీత యగ్నిలోఁ బడలేదా? అగ్నిహోత్రుఁడు సీతాదేవి పతివ్రత యని చెప్పలేదా? లక్ష్మణా! నీ వప్పు డచ్చట లేవా?

ఉ. సీత యపాప యంచు సర•సీరుహబాంధవచంద్రమారుతుల్
ఖ్యాతిగఁ బల్కలేదె? సుర•కాండము మ్రోల ఋషీశులెల్ల భూ
జాత యపాప యం చనరె? • సాధ్వి సతీమణి యంచు దేవతా
నేత మదీయహస్తమున • నిర్మలశీల నిడండె లంకలోన్.

అర్థములు. అపాప=దోషము లేనిది, సరసీరుహబాంధవ=సూర్యుఁడు, మారుతుల్=వాయువు, దేవతానేత=బ్రహ్మ, నిర్మలశీల=దోషము లేని నడవడిగలదానిని

తాత్పర్యము

సూర్యుఁడు చంద్రుఁడు వాయుదేవుఁడు సీత పాపాత్మురాలు గాదని యందఱకుఁ దెలియునట్లు పలుకలేదా? ఋషీశ్వరు లందఱు దేవతల యెదుట సీతయందు దోషము లేదని చెప్పలేదా? బ్రహ్మదేవుఁడు సీతను లంకలో నాచేతిలోఁ బెట్ట లేదా?

తే. అంతె కాదయ్య నాయంత • రాత్మ కూడఁ బూత యంచు నెఱుంగును • భూమిజాత
గావునఁ గదా యయోధ్యకుఁ • గ్రమ్మఱంగఁ, దోడి తెచ్చితి లక్ష్మణా! • తోయజాక్షి!

తాత్పర్యము

ఇతరులు చెప్పినా రనుటయే కాదు. ఎందఱు చెప్పినను నామనస్సున సందేహ మున్న నే నెట్లు లంగీకరించి యుందును. నా యంతరాత్మ కూడ సీతయందు దోషము లేదని యెఱుంగును. నా యంతఃకరణము శుద్ధముగా నామె విషయమున నుండుటచేఁ గదా నే నయోధ్య కామెను దోడి తెచ్చితిని.

క. అపవాదము దుస్సహమై, తపియింపఁగఁ జేసె నన్నుఁ • దద్దయుఁ జిత్తం
బిపుడు పురంబులఁ బల్లెల, విపరీతపువార్తలెల్ల • వినఁబడెడిఁ జుఁడీ! ౯౪౪

అర్థములు. అపవాదము=నింద, దుస్సహమై=సహింపరానిదై.

తాత్పర్యము

నేనింత హెచ్చరికగాఁ బ్రవర్తించినను సహింపరాని నింద నన్ను దహించు చున్నది. ఇప్పుడు పల్లెలందు నూళ్ళయందు పురములందు విపరీతవార్తలు పుట్టినవి.

చ. ఎవని యకీర్తిలోకమున • నెందనుకన్ వినఁ గల్గునో, యధో
భువనములందు నందనుకఁ • బూరుషుఁ డుండెడుఁ బాపభోజియై
దివిజు లకీర్తినిం దెగడి • తెల్పుచు నుంద్రు సుకీర్తిఁ గాన మా
నవుఁడు సుకీర్తిఁ గోరి యె య • నారతముం బను లొప్పఁ జేయఁగన్. ౯౪౫

అర్థములు. అకీర్తి=అపకీర్తి, అధోభువనములందు=క్రిందిలోకములందు, పాపభోజియై=పాపఫల మనుభవించువాఁడై, తెగడి=తిరస్కరించి, తెల్పుచు=పొగడుచు, అనారతముల్=ఎల్లవేళ.

తాత్పర్యము

అజ్ఞానలోక మేమో వదరినంతనే నీవు దాని లక్ష్య పెట్టవలయునా? వారేమి తెలిసి యనుచున్నా రందురేమో! వారు తెలిసి యననీ, తెలియక యననీ ఎవని యపకీర్తి లోకములో నెంతదాఁక వ్యాపించియుండునో యెంతకాలము వ్యాపించి యుండునో యంతకాల మాపురుషుఁడు పాపఫల మనుభవించుచు నధోలోకము

లందుండవలయును. దేవత లపకీర్తిని నిందింతురు. సత్కీర్తిని శ్లాఘింతురు. కాబట్టి యూర్ధ్వలోకములకుఁ బోవఁగోరువాఁడు సత్కీర్తినే సంపాదింపవలెను.

క. విడిచెద మిమ్మెల్లర నే, విడిచెద నా ప్రాణమేని ♦ విమలయశముకై
పొడమిన యపకీర్తి భీతిని, విడుచుట చిత్రంబె నేను ♦ బృథివీతనయన్. ౧౯

తాత్పర్యము.

ఇట్లుండుటచే సత్కీర్తి సంపాదించుటకై మిమ్ము వదలవలసి వచ్చెనేని వదలుదను. మీవలన నాకపకీర్తి వచ్చుట సహింపను. అట్లులే నా ప్రాణములనైన నిచ్చి సత్కీర్తి దక్కించుకొందును. కావున నపకీర్తి భయమున సీతను విడుచుట చెప్పవలెనా?

క. ఎట్టి యపవాదమునకుం, బట్టైతినొ మీరె కనుఁడు ♦ పార్థివులారా!
యిట్టి మహాదుఃఖము నే, నెట్టి దశలఁ గాంచి యెఱుఁగ ♦ నేమందు నికన్.

అర్థములు. అపవాదమునకున్=నిందకు, పట్టు=నెలవు, స్థానము.

తాత్పర్యము

నేను నిష్కారణముగ నెటువంటి నిందలకుఁ బాలయితినో చూడుఁడు. నే నెన్ని దుఃఖములో యనుభవించితిని, గాని యిట్టి దుఃఖ మనుభవింపలేదు.

## శ్రీరాముఁడు సీతాదేవిని వాల్మీకియాశ్రమంబు పొంత విడువ లక్ష్మణు నాజ్ఞాపించుట

సీ. ఎల్లియ వఱువాతఁ ♦ బృథ్వీజఁ దోడ్కొని, తేరు సుమంత్రుండు ♦ తేర నీవు
సౌమిత్రి! చని సర్వ♦జనపదాంతంబున, గంగ కావొడ్డునఁ ♦ గ్రాలుచున్న
వాల్మీకి యాశ్రమ♦వనములఁ దమసాఖ్యనీ తీర వసుమతి ♦ నిర్జనంపుఁ
దలమున విడిచి గ్ర♦ద్దన రమ్మనేఁ జెప్పి, నట్టులు చేయు మా♦టాడవలదు
తే. దీన యోజింపఁ దగిన దే♦దియును లేదు, కూడదం చన నీపయిఁ ♦ గోపగింతు
మచ్చరణ జీవితములపై ♦ మాన్యచరిత, శపథ మిడితిని బదులాడఁ ♦ జనదు నీకు.

అర్థములు. ఎల్లియ=రేపు, వఱువాతన్ = ఉదయమున, తేరన్=తీసికొని రాఁగా, సర్వజనపదాంతంబునన్ = అన్నియూళ్ళ కావల, ఆవొడ్డునన్=ఆవలి యొడ్డున, తమసాఖ్యనీ తీరవసుమతి=తమసానది యొడ్డునగల భూమియందు, నిర్జనంపుఁదలమునన్=జనులు లేని ప్రదేశమున, గ్రద్దనన్=శీఘ్రముగ.

తాత్పర్యము

లక్ష్మణా! రేపటి యుదయము నీవు సీతను దీసికొని సుమంత్రుడు తెచ్చిన తేరిమీఁద పోయి గ్రామములన్నిటి కావల గంగ కావొడ్డున, తమసానదీ తీరప్రదేశమున వాల్మీకి యాశ్రమమున జనులులేని చోటవిడిచి వెంటనే రమ్ము. నేను జెప్పి

నటులు చేయవలసినది. బదులు చెప్పవలదు. దీనిలో నాలోచింపవలసినది లేదు. ఇది రాజాజ్ఞ గా నెంచుము. వలదంటివా నీమీాద గోపింతును. పూజ్యమైన నడవడి గలవాఁడా! నా పాదముల మీాదఁ బ్రాణములమీాఁద నొట్టు పెట్టితిని. బదులు చెప్పవలదు.

క. అడ్డం బెవరేఁ బలుకుచు, నొడ్డారించినను వారి ♦ నూహించెద నా
దొడ్డపగవారికై నడి, నడ్డము గలిగించుటన్ మ♦దిష్టమునందున్. ౮౯

అర్థములు. ఒడ్డారించినను=మాటొడ్డినను.

తాత్పర్యము

దీని కెవరైన నడ్డము చెప్పుచు లెదురొడ్డి ప్రవర్తించిరా వారు నాయిష్టము నకు నడ్డము వచ్చిన వారగుటచే నా పగవారని తలంచెదను.

క. నాయాజ్ఞ నుందు రేనియు, నా యెడ గౌరవము మీామ♦నంబుల నున్నన్
నాయాడినట్ల చేయుం, డాయీ నడు లాడకుండ ♦ నానతి యిడితిన్. ౯౦

అర్థములు. అయీానుడులు=ఆ మాట లీమాటలు, సమాధానములు=అడ్డమాటలు.

తాత్పర్యము

• మీారు నాయాజ్ఞ ప్రకారము వర్తింపదరేని నాయందు మీాకు మనస్సు లందు గౌరవబుద్ధి యున్నను నేను జెప్పినట్లు మీారు చేయవలసినది. ఆమాట యీామాట అడ్డమాట యాడకుండ నాజ్ఞ చేసితిని.

క. గంగాతీరంబున కేగంగా వాంఛిత మటంచుఁ ♦ గామిని పలికెన్
సంగతిగా నవ్వాక్యం, బంగనఁ దోడ్కొంచు లక్ష్మ♦ణా! చను నరగన్. ౯౧

తాత్పర్యము

ఏమి నెపము పెట్టి పిలుచుకొని పొమ్మనెదవా? గంగాతీరమునకుఁ బోవఁ గోరిక గలదని యామె చెప్పెను. ఆ మాటప్రకారము లక్ష్మణా! నీవు తోడ్కొని పొమ్మ.

క. అనివారిఁ బొమ్మటంచును, వసుమతి యిడి బాష్పపూరి♦తాననుఁడగుచున్
జని తనమందిరమున క, య్యనఘుఁడు నిట్టూర్చుచుండె♦నాగంబనఁగన్. ౯౨

అర్థములు. భాష్పపూరితాననుఁడు=కన్నీట నిండిన ముఖముగలవాఁడు, నాగంబు=ఏనుఁగు, పాము.

తాత్పర్యము

(వారినిఁ బొమ్మని యాజ్ఞ యిచ్చి తాను తనమందిరమునకుఁ బోయి, దుఃఖ మునఁ గన్నీరు కార్చుచు పామువలె నిట్టూర్పు పుచ్చుచుండెను.)

**—• లక్ష్మణుఁడు సీతాదేవిని ఋష్యాశ్రమంబుల కని పిలుచుకొని పోవుట •—**

సీ. వరువాత నతిదీన•వదనుఁడై సౌమిత్రి, సారథిని సుమంత్రు •సరగఁ బిలిచి
వాడినమోముతోఁ•బలికెనోయి సుమంత్ర!, యరదంబుఁబన్నుమీ•యతిజవమున
స్వామి శ్రేష్ఠ మఖపుగృ•హంబునఁ గొనితెచ్చి, వరువుము నృపునాజ్ఞ•వలన సీత
ఋష్యాశ్రమములకు • నేన తోడ్కొనిపోదు, ననవుడు నతఁడట్ల•యన్ని దీర్చి

తే. తేరు సిద్ధమయ్యె•దేవ! నా నాతండు, క్షితిపుగృహముఁ జొచ్చి•సీతఁ గాంచి
వదినె! నీహృదీప•వరముఁ గోరితివఁట, యాయనయును నట్లె•యనియె నంట.

అర్థములు. వఱువాతన్=ఉదయమున, అతిదీనవదనుఁడై = మిగుల శోకముచే గాంతిమాసిన ముఖముగలవాఁడై, స్వామి శ్రేష్ఠము=రామచంద్రుని పఱుపు.

తాత్పర్యము

ఉదయముననే లేచి శోకముచే వాడుపాఱిన ముఖము గలవాఁడై లక్ష్మణుఁడు సుమంత్రుని త్వరగాఁ బిలిపించి సుమంత్రా! రథము త్వరగా సిద్ధము చేయుము. రాజుగారి యింటినుండి వారి సొంతపఱుపు తెచ్చి పఱుపుము. రాజాజ్ఞ ప్రకారము సీతాదేవిని ఋష్యాశ్రమములకు నేనే తోడుకొని పోవుదను. అని చెప్పఁగా నతఁడన్నియు నట్లే చేసి తేరు సిద్ధమైనదని చెప్పఁగా లక్ష్మణుఁడు రాజగృహముఁ జొచ్చి సీతాదేవిని జూచి వదినే! నీవు నీపతిని వరము గోరితివఁట. ఆయనయు నంగీకరించెనఁట!

తే. జాహ్నవీతీరమునమునిసత్తమాశ్ర•మములకు నిన్నుఁదోడ్కొని•పొమ్మటంచు
నాజ్ఞయిడెనాకుభూవిభుఁ•డరుగుదెమ్ము, దేవి!శీఘ్రంబయనఁగనై•దేహియెలమి.

అర్థములు. జాహ్నవీతీరమునన్=గంగయొడ్డున, ఎలమిన్=సంతోషముతో

తాత్పర్యము

(దేవీ! రామచంద్రమూర్తి గంగయొడ్డున నున్న మునీశ్వరుల యాశ్రమములకు నిన్నుఁ దీసికొని పొమ్మని నా కానతిచ్చెను. వెంటనే పయనము గమ్ము. అని చెప్పఁగా సీతాదేవి సంతోషముతో.)

క. నిన్నను చుమి లక్ష్మణ! మీ, యన్నను నేనడుగ నట్టు • లేఁగా కనియెన్
నిన్నింతలోనఁ బుచ్చెనె? వెన్నగదే నాదు ప్రాణ•విభుహృదయంబున్. ౯-౧౦

తాత్పర్యము.

(లక్ష్మణా! నిన్ననే నుమా మీ యన్నగారిని నేనడిగితిని, సరే యనెను. నిన్నింతలోనే పంపెను. నా ప్రాణేశ్వరుని హృదయము వెన్నవంటిదికదా.)

ఉ. ఏమని రిత్తచేతుల ము • నీంద్రులపత్నులఁ జూడఁ బోదు నే
భూమిపుపత్నినై, వసన • ముల్ రుచిరంబులు భూషణంబులున్
ప్రేముడిఁ గొంచుబోయి ముని • భీతిమృగాక్షుల కే నొసంగెదన్
దామస మేదిలే దనుచుఁ • దన్విసమస్తము నేఱె లక్ష్మణా! ౯౮౮

తాత్పర్యము

నేను రాజభార్యనై యేమియుఁ దీసికొనక రిత్తచేతుల నేమని మునిపత్నులను జూడఁబోదును, వారికిచ్చుటకుఁ గావలసిన వస్త్రములు, సొమ్ములు తీసికొని పోయి ప్రేమతో నిచ్చెదనని, ఇదిగోఁ త్వరగా వచ్చెదనని కావలసినవన్ని తీసికొని లక్ష్మణా!

క. ఇవి వారికిఁ గొన యోగ్యమె, యివి మన కీయంగఁ దగునె•యివి మంచివెకా!
యవుఁ గా దనవేలన సతిఁ,డవు నవు నని సణఁచికొనుచు•నలమట తనలోన్.

తాత్పర్యము

(ఇవి వారు తీసికొనఁ దగినవే? ఇవి మనమీయవచ్చునా? ఇదిగో నివి మంచివేగదా, ఔను కాదని చెప్పవేమి యని సీత యడుగ దుఃఖము మనస్సులో నణఁచుకొనుచు, అవును ఔను అనెను.

క. ఎంతెంత ముదము సతిగొను, నంతంత సుమిత్రతనయుఁ•డడలెన్ మదిలోన్
సుంతయు వెలిఁదోఁపద, ధృతి, మంతుఁడు గావునను జెలి స•మస్తముఁగొనుచున్.

* అర్థములు. అడలెన్ = దుఃఖించెను, సుమంతయున్ = కొంచమైనను, వెలిన్ = వెలుపలికి.

తాత్పర్యము

సీతాదేవి యెంతెంత సంతోషపడెనో లక్ష్మణుఁ డంతంత తనలో దుఃఖపడెను గాని ధైర్యవంతుఁడు కావున తన దుఃఖము వెలుపలికిఁ దెలియ నిచ్చినవాఁడు కాఁడు.

క. పయనింపఁగ నరదముపై, నయమున నెక్కించి సతిని • సాధునదాజ్ఞన్
హయములఁ దోలుము సూతా! రయమున నన నాతఁడల్లె•రథముం గడపన్.

తాత్పర్యము

(సీత ప్రయాణము కాఁగానే లక్ష్మణుఁడు రామునాజ్ఞ చొప్పున నామెను రథముపై నెక్కించి, సూతా! రథమును త్వరఁగాఁ దోలుమని చెప్పఁగా నతఁడల్లె రథమును దోలెను.)

—• సీతాదేవి యపశకునంబులఁ గని పరితపించుట •

క. అనుఁగుమఱందిం గని యి, ట్లను జానకి లక్ష్మణా! మ•హాపశకునముల్
గన నయ్యెడి నిదియేమొ, మన నేటికొ తెం కపుడు• మల్లడి గొనియెన్. ౯౨౦

అర్థములు. అవశకునముల్=చెడ్డశకునముల్, మల్లడిగొనియెన్=పరితపించుచున్నది.

తాత్పర్యము.

(సీత ముద్దుమఱది యగు లక్ష్మణునిఁ జూచి లక్ష్మణా! దారుణమగు పవ శకునములు గనవచ్చుచున్నవి. అదియేమో నిర్హేతుకముగా మనస్సు పరితపించుచున్నది.)

క. కుడికన్నదరెడి నేటికో! మొడలు వణంకెడిని చిత్త • ముదిల గొనెన్ నా
యెడఁదయుఁ దలతల లాడెడిఁ గడఁకయు జెడె నేమి కీడు•కలుగంగలదో. ౯౭౧

అర్థములు. ఎడఁద=హృదయము, గుండె, కడఁక=ప్రయత్నము, ఉదిల గొనెన్=పరితపించెను.

తాత్పర్యము

(ఏలనో కుడికన్నదరుచున్నది. దేహము వణఁకుచున్నది. చిత్తము పరితపించుచున్నది- నా గుండె తట తట గొట్టుకొనుచున్నది- ప్రయత్నము చెడిపోయినది ఏమి కీడు మూడనున్నదో.)

సీ. ఆశ్రమంబులఁ జూడ • నాశ మెంతయ్యెను, ధృతియేమియును లేదు•ధీరచరిత!
పాడుగాఁ దోఁ చెఁ బ్ర • పంచమంతయు నారు, నిబ్బరమెల్లను•నీటఁ గలసె
నయ్య లక్ష్మణ! పలుకు•మా భ్రాతృవత్సల, మీయన్నకును సేమ•మే కదయ్య!
యత్తలందఱకు సౌ•ఖ్యంబెకా? చెప్పుమా,యని కేలు మోడ్చితన్మ•తనయ పలుకు
ఆ. పౌరులకును జాన•పదులకు సుఖ మిడ, వేల్పులారా! మిమ్ము • వేఁడుదాన
ననుచు మ్రొక్కు-నామె•కభివాదనముసల్పి, యెల్లరకు సుఖంబ•యెల్ల కడల.

అర్థములు. ధృతి=ధైర్యము, భ్రాతృవత్సల=అన్నయందుఁ బ్రేమగలవాఁడా.

తాత్పర్యము

(లక్ష్మణా! ఆశ్రమములను జూడవలెననెడికోరిక యతిశయించుచున్నది. ధైర్యము రవ్వంతయు లేకున్నది. నాకుఁ బ్రపంచమంతయుఁ బాడుపడుపట్లు కానవచ్చుచున్నది. నిబ్బరము నీటఁ గలిసినది. 'భ్రాతృవత్సలా! చెప్పుము- మీయన్న క్షేమముగా నున్నాడుఁకదా! అత్తలందఱకు సౌఖ్యమేకదా! యని చేతులు మోడ్చి దేవతలారా! పురవాసులకును, గ్రామములందున్న జనులకును సుఖమును బ్రసాదింప మిముఁ బ్రార్థించుదాన' ననుచు మ్రొక్కు- సీతాదేవికి లక్ష్మణుఁడు నమస్కరించి 'యందఱకు నన్ని తావుల సుఖమే')

క. అని పలికి మతిని వెత గొదకొను లక్ష్మణుఁ డరిగి కనియె•గోమతి నట కే
యుని నాశ్రమమునఁ గడుపుచు, నినుఁ డుదయింపఁగనె సూతు•నిల్లునరథమున్.

అర్థములు. గొదకొను=అతిశయించు.

తా త్ప ర్య ము

(అని చెప్పి మనస్సునందు దుఃఖ మతిశయింప లక్ష్మణుఁడు పోయి గోమతి యను నదిని జూచెను. ఆరాత్రి యాశ్రమమునఁ గడపిఁ ప్రొద్దు పొడువఁగానే సూతునితో నిట్లు చెప్పెను. రథమును.)

క. తెమ్మా! భాగీరథి నీ, రమ్మును ధరియింతు నే శి•రమ్మున భూమీ
ధ్రమ్మున హరుగతి నన శీ•ఘ్రమ్మున నతఁడట్లచేసి•త్వ్మసుతతోడన్. ౬౭౪

అర్థములు. భూమీధ్రమ్మునన్=త్ర్యంబకపర్వతమునందు, హరుగతిన్=శివునివలె స్నానార్థమై శివుఁడు గంగను ధరించునట్లు నేను ధరించెద నని భావము.

తా త్ప ర్య ము

(దీసికొని రమ్ము 'త్రంబకపర్వతమందు స్నానార్థము శివుఁడు గంగను ధరించినట్లు నేను ధరించెదను' అనఁగానే త్వరఁగా సారథి రథమును దెచ్చి సీతాదేవితో.)

క. దేవీ! రథమెక్కు మనన్, త్వ్మవిభుసతి యెక్కె నెక్కె • సౌమిత్రిఁయు నెం
తోవేగ మరిగె నరదము, పావనగంగాతటంబుఁ • బ్రాపింపంగన్. ౬౭౫

తా త్ప ర్య ము

దేవీ! రథమెక్కుమనెను- అంత సీతాదేవి రథముమీఁద నెక్కెను. లక్ష్మణుఁడును నెక్కెను- ఎంతో వేగముగా రథము పవిత్రమగు గంగయొద్దను జేరఁబోయెను.)

క. అరదినమున భాగీరథిఁ, బరికించి సుమిత్రపట్టి • వ్యసనము పట్టం
దిరుఁ డెట్లుఁ గాక హా! యని, గురురవమున నేడ్వఁ దొడఁగె•గుర్వగునార్తిన్.

అర్థములు. అరదినమునన్=సగము దినము ప్రయాణముచేసి, తిరుఁడు=స్థిరచిత్తము గలవాఁడు, గురురవమునన్=పెద్ద ధ్వనితో, గుర్వగు=గొప్పదగు, ఆర్తి=వ్యసనముచే.

తా త్ప ర్య ము

(సగము దినము ప్రయాణముచేసి గంగను జూచి, లక్ష్మణుఁడు దుఃఖమును బట్ట స్థైర్యము చాలక, అధికమగు నార్తిచే హా! యని పెద్ద ధ్వనితో నేడువ నారంభించెను.)

—• సీతాదేవి లక్ష్మణుఁడు దుఃఖింప నూరార్చుట •—

ఉ. ఆతనిరీతిఁ గాంచి జన•కాత్మజ యిట్లను నేల యేడ్చెదో?
పూతచరిత్ర! యిత్తెఱఁగు • పోలునె? యెన్ని దినాలనుండియో
చేతమునందుఁ గల్గినది • సిద్ధిలె నేఁటికి నాకుఁ, బుణ్యగం
గాతటసీతటంబుఁ గనఁ•గల్గియు నేడ్చెద వేల? లక్ష్మణా! ౬౭౬

అర్థములు. చేతము నందున్=మనస్సునందు.

తా త్ప ర్య ము

(సీతాదేవి లక్ష్మణుని వైఖరి చూచి, పవిత్ర చరిత్రముగల లక్ష్మణా! యెందుల కేడ్చెదవు? ఇది తగునా? ఎన్ని దినాల నుండియో మనస్సులో నున్న కోరిక నేటికి నాకుఁ జేకూఱినది. పావన గంగానదీ తీరము చూడఁ గలిగియు నేడ్చుట యేల? యని యడిగెను.)

క. సంతోషకాలమున నిటు, లింతగ నేడ్చుచును నాకు • నెంతో మదికిన్
వంతఁ గలిగింపఁ దగునే?, యిం తాయెను జూడ నీదు • విధము మఱందీ! ౯౭౮

తా త్ప ర్య ము

(మఱఁదీ! లక్ష్మణా! సంతోష పడవలసిన కాలమున నీ వింతగా నేడ్చుచు నాకు విచారము కలిగింపఁ దగునా? నీవైఖరి చూడఁగా నాశ్చర్యముగానున్నది.)

ఉ. ఎప్పుడు రాముఁ గొల్వఁ బ్రముఖ • యేనియుఁ బాయవు నే నెఱుంగుదున్
దప్పె ద్వి రాత్రముల్ నిజము • దానికి నింతగ నేడ్చె దన్న? నా
కప్పురుషో త్తముండు విను • ప్రాణముకంటెఁ బ్రియుండ యయ్యు నే
నిప్పగిదిన్ వెతం గొనితి • నే? విడు లక్ష్మణ బాలిశత్వమున్. ౯౭౯

• అర్థములు. ద్విరాత్రముల్ = రెండు రాత్రులు, బాలిశత్వము = మూఢత్వము.

తా త్ప ర్య ము

(అన్నా! లక్ష్మణా! రామచంద్రమూర్తి సేవ క్షణమైన విడిచి యుండవని నే నెఱుఁగుదును. రెండు రాత్రులు విడచి యుండవలసి వచ్చిన దానికై యింతగా నేడ్చెదవు, నిజము. ఆ పురుషోత్తముఁడు నాకుఁ బ్రాణములకంటెఁ బ్రియమైన వాఁడు-అయినను నేను నీవలె దుఃఖపడు చుంటినా? దుఃఖింపవలదు, మూఢత్వము వదలుము.)

క. గంగానది దాఁటింపు మ, భంగురగతి నేగి ఋషుల • పత్నుల కెల్లన్
బంగారు నగలు చేలలొ, సంగుచు నభివాదనంబు • సలిపి సభక్తిన్. ౯౮౦

తా త్ప ర్య ము

(గంగానదిని దాఁటింపుము- వేగముగాఁ బోయి మునుల భార్యల కంద ఱకు బంగారునగలు, చీరెలు సమర్పించి భక్తితో నమస్కరించి,)

క. ఒక్కనిశయె మన మక్కడ, మక్కువ పై నుండి పురికి • మరలుదము వెసన్
జక్కని నాపతిఁ గన నా, కెక్కువ తహతహ జనించె • నద త్వరపడెడిన్. ౯౮౧

తాత్పర్యము

(ఒకరాత్రి మాత్రమే యక్కడ నుండి, వెంటనే యయోధ్యకు మరలి పోదము- సుందరుఁడగు నా పెనిమిటిని జూచుటకై నాకెంతో తహతహ కలిగినది హృదయము తొందర పెట్టుచున్నది.)

—• లక్ష్మణుఁడు శ్రీరామాజ్ఞ చెప్పలేక యేడ్చుట •—

చ. అనవుడు లక్ష్మణుండు నయ • నాశ్రులు పాయఁగఁ ద్రోచి నావికా
జనముల నామతించుఁడును • జయ్యన వారలు నావఁ గూర్చి చె
ప్పినఁ జని దాని నెక్కి పృథి • వీసుతతో రథయుక్తుఁ డౌ సుమం
త్రుని నిలువంగ నాన యిడి • తూర్ణమ జాహ్నవి దాఁటి తత్తటిన్. ౪౭-౨

అర్థములు. నయనాశ్రులు=కన్నీళ్ళు, ఆమతించుఁడును=పిలువఁగా, తత్తటిన్=ఆతీరమందు.

తాత్పర్యము

(అని సీత చెప్పఁగా లక్ష్మణుఁడు కన్నీళ్ళు తుడుచుకొని, నావ నడపు బెస్తలను బిలువఁగా, వారు తత్క్షణమే నావను గొనివచ్చి 'స్వామీ' నావ సిద్ధముగా నున్నదని చెప్పఁగానే సీతాదేవితో నావ నెక్కి లక్ష్మణుఁడు, సుమంత్రుని రథముతో నక్కడ నిలువ నాజ్ఞాపించి, శీఘ్రముగా గంగను దాఁటి యావలి యొడ్డున.)

క. అన్నులమిన్నను మైథిలిఁ, గన్నొం గని దేహమెల్లఁ • గంపం బెత్తన్
గన్నులనీటం దడియుచు, విన్నప మొనరించె నిట్లు • విహ్వలమతియై. ౪౭-౩

అర్థములు. అన్నులమిన్నను=స్త్రీరత్నమును, విహ్వలమతియై = విరవిరఁబోవు మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

స్త్రీరత్నమగు జానకిని జూచి దేహమంతయుఁ గంపమెత్తఁగా, గన్నీరు కార్చుచు విరవిరబోవు మనస్సుగలవాఁడై యిట్లు విన్నపము చేసెను.)

చ. కటకట నన్ను నిట్టి కడు • కష్టపుఁ గార్యముఁ జేయఁ బంచి ప్ర
స్ఫుటముగ లోకనిందలను • బ్రుంగఁగఁ జేసెఁ గదమ్మ యన్న యే
పటుతరశల్యమై యదియ • బాధలు పెట్టుడి నన్ను, శ్రేయమౌఁ
దటుకున మృత్యువేన్ దొడర • దారుణశీలున కిట్టివానికిన్. ౪౭-౪

అర్థములు. బ్రుంగఁగన్=మునుఁగఁగ, పటుతరశల్యమై=మిగుల వ్యథమైన మేకై, దారుణశీలునకున్=క్రూరపు నడవడి కలవానికి.

తా త్ప ర్య ము.

అయ్యో! నన్నింత కష్టకార్యముచేయ నాజ్ఞాపించి యన్న దే నన్ను లోక నిందల మునుఁగగాఁ జేసెఁగదా! అదియే నన్ను గట్టి మేకు హృదయమున నాటి నట్లు బాధించుచున్నది. నావంటి క్రూరమైన నడవడి గలవానికిఁ దటాలున చావు వచ్చినను మేలే.

క. ఘోర మగు నిట్టికృత్యము దీరుపఁగా నేను దొరకి•తిన్ భూపతికిన్
ధీరమతీ యిది తగునే? చారుగుణుం డైన రామ•చంద్రునకయ్యో! ౯౦౫

తా త్ప ర్య ము

ధైర్యపు మనస్సు గలదానా! యిటువంటి ఘోరకార్యము చేయుటకు రాజునకు నేను దొరకితిని గదా. ఎంతో మంచి గుణములుగల రామచంద్రున కిట్టి కార్యము తగునా?

క. పాపపు బని యిదియైనను, బాపాత్ముఁడ నంచుఁ దలఁప•వలవదు తల్లీ!
నాపాపము క్షమియింపుము. భూపుత్రీ యనుచు నతఁడు•పుడమిం ద్రెళ్ళెన్. ౯౦౬

తా త్ప ర్య ము

(అమ్మా! యిది పాపపుఁబనియే. అయినను నేను బాపాత్ము డనని యను కొనకుము. నీవు భూదేవి కూఁతురవు కావున నాపాపమును క్షమింపుము. అని చెప్పుచు లక్ష్మణుఁడు నేలమీఁదఁ బడిపోయెను.)

క. రాదే మృత్యు వటంచును, రోదనముం జలుపువాని •రోహిత నయనున్
మేదుర దుఃఖాన్వితుఁ బ్రసాదింపఁగఁ గేలుమోడ్చు • సౌమిత్రి వరున్. ౯౦౭

అర్థములు. రోహితనయనున్=ఏడ్చుటచే నెఱ్ఱనైనఁ గన్నులు గలవానిని, మేదుర=దట్టమైన, దుఃఖాన్వితున్=దుఃఖముతోఁగూడిన వానిని, ప్రసాదింపఁగన్=అనుగ్రహింపఁగ, సౌమిత్రివరున్=లక్ష్మణుని.

తా త్ప ర్య ము

ఇట్టి ఘోరకృత్యముచేయ సాహసించిన నాకుఁ జావురాదే, యని రోదనము చేయుటచేఁ గన్ను లెఱ్ఱనైనవాని దట్టమగు దుఃఖముతోఁ గూడిన వానిని, అనుగ్రహింపమని, నమస్కరించు లక్ష్మణుని.)

క. కని దిక్కులి వెఱపుం గొని, జనకజ యిదియేమి యొలుకఁగ•జాల నొకండున్
వనరెద వేటికి లక్ష్మణ!, యనుమా కతమెల్ల నేమ•మా? రాజునకున్. ౯౦౮

అర్థములు. కతము=కారణము, వనరెదవు=దుఃఖించెదవు.

తాత్పర్యము

(చూచి, మిగుల భీతిచెంది, సీత 'లక్ష్మణా! నాకొకటియును దెలియదు నీవేల యేడ్చెదవు, కారణము తెలుపుము రాజుగారికి క్షేమమే కదా')

క. ఆన యిడితి భూపతిపై మానక వచియింపు నాన•మక్షమునం దే
లా నీవు వగచె దీగతి? నావతి నీ కిడినదాన • వని యెసకొలుపన్. ౯౮౯

అర్థములు. ఆన=ఆజ్ఞ, ఒట్టు ఆనతి=ఆజ్ఞ, ఎసకొలుపన్=ప్రేరింపఁగా.

తాత్పర్యము

(రాజుమీఁద నొట్టు పెట్టితిని. తప్పక చెప్పుము. నాయెదుట నీవిధముగా నేల యేడ్చెదవు! నీ కాజ్ఞ చేసెదనని ప్రేరింపఁగా.)

— లక్ష్మణుఁడు సీతాదేవికి శ్రీరామాజ్ఞ నెఱింగించుట —

క. తల వ్రేలవైచి బాష్పం, బుల గద్గదపాటు దనరఁ • బొక్కుచు మదిలోఁ
గలది గలయట్లు సర్వం, బలివేణికి విన్నవించె • నాతం డిట్టుల్. ౯౯౦

తాత్పర్యము

(తలవ్రేలవైచి, కన్నీరు కార్చుచు గద్గద స్వరముతో, మనస్సులోఁ బరితపించుచు, సీతతో నున్న దున్నట్లు లంతయు లక్ష్మణుం డీవిధముగాఁ జెప్పెను.)

ఉ. తల్లి వచింతు నే మనుచు? దారుణ వార్తలు పట్టణంబులం
బల్లెల నిన్నుఁ గూర్చి జన•వర్గము పల్కుట తాను గొల్వులో
నెల్లరుఁ జెప్పఁగా విని మ•హీంద్రుఁడు దుఃఖము చేర్మి హృద్గతం
బెల్ల వచించి నాకుఁ దన•యింటికి నేగెఁ బతివ్రతామణీ! ౯౯౧

అర్థములు. హృద్గతంబు=హృదయమున గలది, పతివ్రతామణీ=ఇది నీయందు దోషము లేదని తెలుపఁ బ్రయోగింపబడెను.

తాత్పర్యము

(తల్లీ! యేమని చెప్పుదును? పట్టనములందుఁ బల్లెలందుఁ నిన్నుఁగూర్చి జనులాడుకొను దారుణపు మాటలు గొల్వులో నెల్లరు చెప్పఁగా విని, రాజు మిగుల దుఃఖమును జెంది మనస్సులోనున్న విషయము నాకుఁ జెప్పి, పతివ్రతా శిరోమణీ! తన గృహమునకుఁ బోయెను.)

క. ఆ మాటలన్నియును నే, నీముంగలఁ జెప్పరాదు • నేఁ గన్నారన్
నీ మహిమ గంటి; నిన్నున్, భూమిజనుల నడికి వెఱచి•భూపతి విడిచెన్. ౯౯౨

### తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి చెప్పిన మాటలన్నియు నీతో నేను జెప్పరాదు. నీ మహిమ నేను గన్నారఁజూచి యున్నాను నీ శీలవిషయమున సందేహము లేదు. జననింద సహింపఁ జాలక నిన్ను రాజు వదలిపెట్టెను.

ఉ. అంతియ కాని వేఱొకటి • నాత్మఁదలంపకు, మాశ్రమంబుల
  న్వింతల నిన్ను నే విడిచి•పోఁగలవాఁడను రాజునాజ్ఞ, భూ
  కాంతుఁడు నీకు వేఁకటిని • గల్గిన కోర్కుల సాకు పెట్టి యి
  ట్లింతలు చేయు మం చనియె • నియ్యవి గాంగతటీతపోవనుల్. ౯౯౩

### తా త్ప ర్య ము

వాస్తవ మియ్యదియే నీశీలమును సందేహించి నిన్ను విడిచెనని తలఁప వలదు రాజాజ్ఞ ప్రకారము నిన్ను ఋష్యాశ్రమసమీపంబున వదలి నేనుబోదును. నీకు వేఁకటి వలనఁ గలిగిన కోరిక నెపము పెట్టి రాజింత కార్యము చేయుమని చెప్పెను. నీవు చూడఁగోరిన గంగాతీర తపోవనము లియ్యవియే.

క. రమణీయంబులు కఁడుబు, ణ్యములున్ వెతపడకు మమ్మ•యట దశరథభూ
  రమణుసఖుం డగు విప్రుఁడు, విమలమనస్కుఁడు తపస్వి•వితతయశుండున్. ౯౯౪

### తా త్ప ర్య ము

ఈ వనములు మిక్కిలి మనోహరములు, పుణ్యవంతములు, కావున వ్యసన పడకుము. ఇచ్చటనే దశరథమహారాజు మిత్రుఁడును, బ్రాహ్మణుఁడును, నిర్మలమైె మనస్సుగలవాఁడును, మహాతపశ్శాలియు, విస్తార కీర్తిపరుఁడును.

క. ముని వాల్మీకి వసించును, జనకసుతా! యతనిపాద•నంసేవను నీ
  దినములు గడుపుము రాముని, మనమున నిలుపుచు సతీత్వ•మానితనియతిన్. ౯౯౫

అర్థములు. సతీత్వ=పాతివ్రత్యముచే, మానిత=గౌరవింపఁబడిన, నియతిన్= నియమముచే.

### తా త్ప ర్య ము

(జానకీదేవి! వాల్మీకి మునీశ్వరుఁడు నివసించును, ఆ వాల్మీకి పాదసేవ చేయుచు మనస్సులో శ్రీరామచంద్రుని నిలిపి, పాతివ్రత్యనియమముచే దినములు గడుపుము.)

ఏనాఁడు సీతాదేవి కోరనో యానాఁడే యామె చర్యను గుఱించి విచారించుటయు, వాల్మీకి యాశ్రమమందని పేరుచెప్పి యందు విడిచి రమ్మనుటయు నాలోచింపఁగా రామచంద్రమూర్తి భూతభవిష్యత్తులు తెలిసియే యిట్లు చేసె నని యెఱుఁగవగు.

సీతాదేవిని వదలుటకు చాకలివాని మాట కారణమని వాల్మీకి చెప్పలేదు. ఒకని నిమిత్తమై యింత పని చేయలేదు.

## —• శ్రీరామాజ్ఞ విని సీతాదేవి విలపించుట •—

ఉ. నీకు శుభంబు గూడు నన • నిష్ఠురవాక్యము లాలకించి సు
శ్లోక మహావిషాదమున • సోలి ముహూర్తము లబ్ధసంజ్ఞయై
శోకము హూరఁగా గమల•సూతి సృజించె మదీయ దేహమున్
జేకుఱె సర్వదుఃఖతతి • చెప్పుకొనన్ ఫల మేమి లక్ష్మణా! ౯౯౬

అర్థములు. సుశ్లోక=మంచికీర్తి గలది, మహావిషాదమునన్=మిక్కిలి శోకముతో, సోలి=మూర్ఛపోయి, లబ్ధసంజ్ఞయై=స్మృతి పొందినదై, కమలసూతి=బ్రహ్మ.

### తాత్పర్యము

నీకు మేలు కలుగు నని చెప్పఁగా నాకఠినవాక్యములు విని సత్కీర్తిశాలిని యయిన సీతాదేవి తీవ్రదుఃఖముచే మూర్ఛపోయి పడి తెప్పరిల్లి కొంచెము సేపునకు లేచి యిట్లనియె. లక్ష్మణా! బ్రహ్మదేవుఁడు నన్ను దుఃఖమే యనుభవింపుమని నాదేహమును సృజించెను. ఎన్ని దుఃఖములు లెం లెంత రావలయునో యన్నియు వచ్చినవి. ఏమి చెప్పుకొని యేమి ఫలము.

ఉ. ఎట్టి యఘోరపాపముల • నే నొనరించితి నొక్కొ, పూర్వమం
దెట్టిమహాత్మురాలిఁ బతి • నే నెడఁబాపితి నొక్కొ, కాదయే
నిట్టుల నిర్నిమిత్తముగ • నేయఘమై నెఱుంగనట్టి న
న్నట్టడవిన్ విడంగ నర•నాథుఁడు పంచునె? దోస మెంచునే? ౯౯౭

అర్థములు. అఘోర=దేనికంటె ఘోరమైనది లేదో యది యఘోరము-మిక్కిలి భయంకరములైనవి- ఏ యఘము=ఏపాపము.

### తాత్పర్యము

లక్ష్మణా! నే నింతకు ముం దెట్టి మహాభయంకరములైన క్రూరపాపములు చేసితినో, ఏపుణ్యాత్మురాలిని బతితోడ నుండనీయక యెడఁబాపితినో కదా. అట్లు కాదేని యేనిమిత్తము లేక యేదోషము నెఱుంగనినన్ను నట్టడవిలో విడువ నాజ్ఞాపించునా? నాయందు దోషము తెలఁచునా?

'అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫలమశ్నుతే' యని ప్రమాణము. మిగుల నధికమైన పుణ్యఫలముగాని పాపఫలముగాని యీజన్మయందే యనుభవించును. మానసం మనసైవాయ ముపభుంక్తే శుభాశుభమ్, వాచా వాచాకృతం కర్మ

కాయేనైవచ కాయికమ్' మను,మనస్సుతోఁ జేసిన పుణ్యపాపములు మనస్సుతో ననుభవింపవలయును. వాక్కుతో జేసినవి వాక్కుతో ననుభవింపవలయును. దేహముతోఁ జేసినవి దేహముతో ననుభవింపవలెను.

ఉ. స్వామిరఘూత్తమాంఘ్రిపరి♦చర్యయొనర్చి ముదాన బూర్వము
గ్రామితదుఃఖసంతతుల ♦ నమ్మయి నోర్చితి నాశ్రమంబులం
దేమని నిర్జనాటవుల ♦ నిప్పుడు నే వసియింతు నొంటిగా
నే మని నాదు దుఃఖముల ♦ నేరికి నే వచియింతు లక్ష్మణా! ౯౯౭

అర్థములు. స్వామి=సొమ్ముకలవాఁడు, యజమానుఁడు, అంఘ్రిపరిచర్య=పాదసేవ, ముదానన్=సంతోషముతో, పూర్వము=పదునాలుగు సంవత్సరము లరణ్యమందున్నప్పుడు, ఆశ్రమంబులందు=ఋషీశ్వరులుండు స్థలములందు, నిర్జనాటవులన్=మనుష్యులులేని యడవులందు.

తాత్పర్యము

లక్ష్మణా! నేను రామచంద్రుని సొమ్మని, ఆయన యీ సొమ్ముగలవాఁడని తలఁచి యాయన పాదసేవసేయు సంతోషముతో పూర్వము ఋషులుండు నాశ్రమములందు భయంకరములై మితిమీరాతిన దుఃఖముల వహించితిని. ఇప్పుడో యేమి కార్యము చేయుటకై జనులు లేని యడవులందు నొంటిగా జీవింతును. నాదుఃఖము లెవరికి నే నేమని చెప్పుదును.

ఉ. ఏటికిఁ బుణ్యశీలుఁడు న♦రేంద్రుఁడు రామవిభుండు నిన్నని
వాటికిఁ బంచె నిందు? నటు♦నంటి యసత్కృతి యేమి చేసితో
బోట్టి! యటంచు నన్ను ముని♦పుంగవు లాడఁగ నేమి పల్కుదున్
జాటిదొలంగి నా విభుని♦పై నెటు చెప్పుదు నిర్దయత్వమున్ ౯౯౯

తాత్పర్యము

రామచంద్రమహారా జెంతో పుణ్యాత్ముఁడే, నిష్కారణముగ నెవరినిదండింపఁడు. అట్టివాఁడు నిన్నేల యీ యడవులందు విడిపించెనని, అటువంటి ఘోర పాపము నీవేమి చేసితి వని ఋషీశ్వరులు నన్నడిగిన నేనేమని చెప్పుదును. నామగఁడు దయలేనివాఁడై యిట్లు చేసెనని యాయనయందు నే నెట్లు దోషము చెప్పుదును, అది వాస్తవమేయైనను నేను జెప్పుట క్రమముగాదే

క. నా మగనిరాజవంశము, భూమిపయిన్ ఛిన్నమగుచుఁ♦బోవదయేనిన్
సౌమిత్రీ? జాహ్నవిలో, నా మేను త్యజింపకుందు♦నా యిత్రుటిలోన్? ౧౦౦౦

తాత్పర్యము

నా మగని రాజవంశము భూమిమీఁద నిలిచిపోకుండునేని లక్ష్మణా? యీ గంగలో నీ నిమిషముననా దేహమును వదలకుందునా.

శ్రీరామచంద్రమూర్తికి వేఱొక భార్య యుండినను మఱియొక స్త్రీతో రామచంద్రమూర్తి సంభోగించునని తోఁచియుండినను సీతాదేవి యీమాట చెప్పఁగారణము లేదు. ఇది యాయన యేకపత్నీవ్రతత్వమును స్థాపించెడిని.

క. అదిగాక దుఃఖపాటున, మది రోసి శరీర మేను • మానినచో ని
ష్ఠదయుఁ డని రఘుకులంబున, వలదని యపకీర్తి నాదు•పతికిం గలుగున్. ౧౦౦౧

తాత్పర్యము

ఆ కారణము గాక మఱియొక కారణము గలదు. ఈ దుఃఖముచే నీ దేహము నందు రోఁతపుట్టి యీ దేహముతో నే నింకఁ జేయవలసిన కార్యము లేదు. కావున, వదలి పెట్టితినా నామగఁడు దయలేని వాఁడని రఘువంశమున శాశ్వతమైన యపకీర్తి తప్పక కలుగును. ఆ నాఁడు లంకలో జరిగిన వారు దేవతలు, వానరులు, రాక్షసులు లోనగువారు- కలరుగదా- వారు లోకమున నేను నిర్దోషురాలని చెప్పుదురు. కాని చెప్పకపోరు. ఇంత పాపము లోకము సహింపదు. నే నిప్పుడు మరణించితినా రామచంద్రమూర్తి కేవలము నిర్దయుఁడు, నిష్కారణముగా భార్యను జంపెనని చెప్పుదురు. కాని చెప్పకపోరు. నా మగఁ డట్టి నింద పొందుటకు నేను గారణము కారాను. అది నాకుఁ దగదు.

తెలిసి తెలిసి యింతటిఘోరకార్యము చేసి భర్తయందిట్టి భావముగల భార్య సీతాదేవి యొకతెయే. ఇట్టిభావ మితరస్త్రీలయందు దుర్లభము.

—• సీత శ్రీరామాదులకుఁ గడవాక్యంబులు చెప్పి పంపుట •—

ఉ. కావున రాజు నానతి ప్ర•కారముఁ జేయఁగదయ్య లక్ష్మణా!
యీవనవాటి నన్ను దుర•దృష్టను వీడుము దుఃఖభాగినిన్
భూవరునాజ్ఞలో నిలుము • పుణ్యము నీ కగు నాదుపల్కులన్
వావిరి విన్ము మ్రొక్కితిని • ప్రాంజలినై యను మత్తగార్లతోన్. ౧౦౦౨

తాత్పర్యము

ఈ కారణముచే నీవు రాజాజ్ఞ ప్రకారము వర్తింపుము. నీకు నేనేమియు నష్టము చెప్పను. ఈ నిర్భాగ్యురాలిని నీ యడవిలో విడిచిపొమ్ము. రాజాజ్ఞ యందు నిలుము. నీకుఁ బుణ్యము గలదు. నేను నమస్కరించితి నని మా యత్త గార్లకుఁ జెప్పుము.

క. నాయనుఁగ భూపతికిన్, సౌమిత్రీ! మ్రొక్కుమ్రాలి • చరణంబుల మీ
నేమంబు నడిగి నను మీ,రా మాడ్కిని చెప్పవన్న • యత్తలకెల్లన్. ౧౦౦౩

తాత్పర్యము

(నాకు మాఱుగా రాజునకు మ్రొక్కి లక్ష్మణా! యా ప్రభుని శ్రీపాదముల మీఁదఁ బడి సేమమడిగితి ననీ విన్నవింపుము. అన్నా! నా యత్తలకందఱ కదే విధముగఁ దెలుపుము.)

సీ. ధరణీశ్వరునితోడ • ధర్మమార్గంబున, దృష్టి పాయక ప్రవ•ర్తిల్ల మనుము
జానకి నిర్మల•స్వాంత యంచును దత్త్వ మంత నీ వెఱిఁగిన•యదియ యనుము
నీ హితకాంక్షిణి • నీ భక్తురాలనే, సత మంచు నీమది • స్పష్ట మనుము
అపవాదమునకు భ • యంపడు నీచేత ననద యట్టులు త్యక్త • నైతి ననుము
ఆ. నీవు పరమ గతివి • కావున నాకు నీ, యపయశంబుఁ బాప • నర్హ మనుము
నాదువాక్యములుగ•నాయనా! మీ యన్న,తోడ నిన్ని కరుణ•తోడ ననుము.

అర్థములు. అనద=దిక్కులేనిది, త్యక్త=విడువఁబడినది.

తాత్పర్యము

లక్ష్మణా! రాజుగారితో ధర్మమందే దృష్టియుంచి కామాదులచే నధర్మమార్గమునఁ బోవలదనుము. లోకులు నన్ను నిందలాడిరని వారిపైఁ గోపింపవలదని చెప్పుము. జానకి నిర్మలమైన మనస్సు గలది యనునది నీ మనస్సునకుఁ దెలిసిన విషయమే యనుము. నేను నీ మేలు కోరుదానను. నీ భక్తురాల ననునది నీ మనస్సున స్పష్టమని చెప్పుము. ఇట్లుండియు లోకనిందకు భయపడి దిక్కులేని దానివలె వదలి పెట్టఁబడితిని గాని దోషురాలను కాదని నే నెఱుఁగుదు ననుము. కావున నీవే నాకు నుత్తమ గతి వగుటచే నీకు వచ్చిన యపకీర్తి తొలగించుట నాకును దగిన కార్యమే యనుము. నాయనా! యివి యన్నియు నా మాటలుగా నాయందు దయ యుంచి మీ యన్నతోడ ననుము.

ఉ. పౌరుల నెల్ల వారిఁ దన•భ్రాతలరీతిని జక్కఁ బ్రోచుచున్
సారపుధర్మమార్గమున • సంతత ముర్వి భరించు ఱేఁడు ధా
త్రీరమణ! యనుత్తమగ•తిన్ భజియించును ధర్మమున్ సదా
భూరిసుకీర్తియుం బడయఁ •బోలు నటంచును విన్నవింపుమీ. ౧౦౫

తాత్పర్యము

(పౌరులను తన సోదరులట్లు రక్షింపు మనుము. నిరంతర ధర్మమార్గమున భూమి నేలుమనుము. శాశ్వతకీర్తి వహింపుమని విన్నవింపుము.)

క. స్వశరీరము దుఃఖంబునఁ, గృశియించెడి ననుచు నేను • ఖేదముపడ బా
లిశు లగు పౌరులభృశక,ర్కశవాక్కులఁ దలఁచి తలఁచి•కడుదుఃఖింతున్. ౧౦౬

అర్థములు. స్వశరీరము=నా దేహము, కృశియించెడిన్=చిక్కిపోవునని, బాలిశులు=మూఢులు, భృశ=మిక్కిలి, కర్కశ=కఠినములైన, వాక్యలన్=మాటలను.

తా త్ప ర్య ము

నాదేహము దుఃఖముచే నేడ్చుటవలనఁ జిక్కిపోవునే యని నేను దుఃఖింపను. వాస్తవము తెలియని మూఢులు పౌరులు పన్నాడిన మిక్కిలి కఠినములైన మాటలు తలఁచి తలఁచి మిక్కుటముగ దుఃఖించెదను.

ఉ. పౌరుల రిత్తనిందలకుఁ • బాల్పడ కుండెడునట్లు ధారిణీ
భారముఁ బూను మంచనుము • భార్యకుఁ బ్రాణవిభుండె దైవతం
బారఁగఁ జుట్టమున్ గురువు • నాటను బ్రాణముకంటె మిన్నగా
సారసనేత్ర భర్తకెల•సంబులు దీర్చుటె యుక్త మెప్పుడున్. ౧౦౦౭

అర్థములు. కెలసంబులు=కార్యములు.

తా త్ప ర్య ము

(పురజనులాడు నిందలకుఁ బాలుగాకుండునట్లు రాజ్యభారమును బూనుమని చెప్పుము. భార్యకుఁ బ్రాణవిభుఁడే దైవము చుట్టము గురువు కావునఁ బ్రాణముకంటె నాఁడుది తనపెనిమిటికార్యములు నెఱవేర్చుటయె యెప్పుడును యుక్తము.)

క. అని నా సంగ్రహవాక్యం,బును జెప్పుము పతికి నింకఁ • బరికిం పౌమ్మా
కనుమిదా నను గర్భము చిహ్నను దాల్చినదాన నట్టి•యలజడి గలిగెను. ౧౦౦౮

తా త్ప ర్య ము

ఇట్లు సంగ్రహముగా నేను జెప్పిన మాటలు నాభర్తకుఁ జెప్పుము. ఊరికిఁ బొమ్ము లక్ష్మణా! నేను గర్భచిహ్నము ధరించినదానను చూడుము. ఇట్టి దశయందు నాకెట్టి బాధ కలిగెనో చూడుము.

**—• లక్ష్మణుఁడు సీతాదేవిచే ననుజ్ఞ గొని మరలి గంగ దాఁటుట •—**

చ. అనవుడు దీనచిత్తుఁ డబ•లాంఘ్రుల మ్రోల ధరిత్రి సోఁకఁగాఁ
దనదుశిరంబు వ్రాల్చి పసు•ధాతనయాముఖశోడ నొక్కప
ల్కును వచియింప లేకవల•గొంచు మహారవ మార నేడ్చుచున్
దనమది నొక్కమూరుతము • ధ్యాన మొనర్చుచుఁ బల్కె సీతతోన్. ౧౦౦౯

అర్థములు. దీనచిత్తుఁడు=శోకముతోఁ జిన్నవోయిన మనస్సుగలవాఁడు, ధరిత్రి సోఁకఁగా నటఁచే పాదము లంటక, వలగొంచున్ = ప్రదక్షిణము చేసి, మహారవము=పెద్దధ్వని.

తాత్పర్యము

(అని చెప్పఁగా, లక్ష్మణుఁడు శోకముతో, చిన్నవోయిన మనస్సుగలవాఁడై యామె పాదముల సన్నిధిలో నేల నంటునట్లు తలవాఁచి సీతతో నొక్క మాట యైనఁ బలుకలేక, ప్రదక్షిణము చేసి, బిగ్గరగా నేడ్చుచుఁ దన మనస్సులో నొక ముహూర్త కాలము ధ్యానము చేయుచు సీతతోఁ జెప్పెను.)

చ. అనఘచరిత్ర! యే మనుచు • నాడితి నేను భవత్స్వరూపమున్
గనినది లేద యింతదనుకన్ • భవదంఘ్రియుగంబుఁ దక్కఁగా,
జనములు లేని యీయడవి • సాధ్విరొ రాముఁడు లేని వేళ నేఁ
గనుటయుఁ గల్గునే? యనుచు • గ్రక్కున ద్రొక్కె కలంబు చేరఁగన్. ౧౦౧౦

తాత్పర్యము

పుణ్యాత్మురాలా! యేమని యంటివి, నీ గర్భము చూడుమంటివా? నేనింత వఱకు నీ రూపమును జూచినవాఁడఁగాను నీపాదములను మాత్రమే నేను దర్శించితిని. ఇట్లుండ నిప్పుడడవిలో జనులులేనిచోట నీభర్తయు నెదుటలేని యప్పుడు నేను నిన్నుఁ జూతునా? చూడను, అని వెంటనే ద్రొక్కె పడవచేరఁబోయెను. గర్భవిషయమైన యపనింద మరల నేమి వచ్చునో యని సాక్షికై లక్ష్మణుని జూడమనెను. ఇదివఱకుఁ జూచిన విషయమున నేమి చేయఁ గలిగెను? ఇఁక నేమి చేయఁగలఁడు. ఆర్యచరిత్ర రత్నావళి యందలి సీతాదేవి చరిత్రమందును సీతోపదేశమందును సీతామాహాత్మ్య మెఱుఁగనగు.

క. చని నావ యెక్కి నడుపుము, యని నావికుఁ దీవరించి • యావలియొడ్డుం
గని డిగ్గి దుఃఖభరమునఁ దనరుచు మూర్ఛాత్మునట్లు•పడెరథమందున్. ౧౦౧౧

తాత్పర్యము

(పోయి, పడవమీఁద నెక్కి 'నావ పోనిమ్మని' నావికునిఁ దొందరించి యావలి యొడ్డునకుఁబోయి, యచటఁ దిగి దుఃఖాతిశయమున నేడ్చుచు మూర్ఛుని వలె రథములోఁ బోయి పడెను.)

క. మాటికి మాటికి నృపుసీమాటిం గనుఁగొనుచు ననద•మాడ్కిని హృదయ
స్ఫోటముగా ధరఁ బొరలుచు, గాటంబుగ నేడ్చు కాంతఁ•గనుచుం జనియెన్.

అర్థములు. నృపుసీమాటిన్=రాజుయొక్క యుత్తమస్త్రీని, అనదమాడ్కిని=దిక్కులేనిదానివలె, హృదయస్ఫోటముగాన్=చూచువారి గుండెలు పగులునట్లు.

తాత్పర్యము

(మాటి మాటికి సీతను జూచుచు, దిక్కులేనిదానివలె నేలఁబడి పొరలుచు గుండెలు వ్రక్కలగునట్లు గట్టిగా నేడ్చుచున్న సీతను జూచుచుఁ బోయెను.)

క. అరదంబును దవ్వవ్వఁగ, నురవడిఁ జనఁ జూచి చూచి • యుదరఁగ గుండెల్
తరుణీమణి యేకాంతము, దురపిల్లుచు నుండె నేల • నొరలుచు నుండెన్. ౧౦౧౩

అర్థములు. ఏకాంతము=ఒంటరితనము, దురపిల్లుచున్=సంతాపపడుచు.

తాత్పర్యము

(రథము దూరము దూరముగాఁ బోవుట చూచి చూచి, గుండెలు చెదర మిక్కిలి దుఃఖపడుచు సీత నేలఁమీద దొర్లుచు నుండెను.)

క. దిక్కుచెడి దుఃఖభరమున, స్రుక్కుచు కేకానినాద•సుభగాటవిలో
వక్కమలాక్షి యశస్విని, మిక్కిలి యెలుఁగొప్ప నేడ్చి•మిడుకుచు నుండెన్.

అర్థములు. కేకానినాద=నెమలికూఁతలచే, సుభగాటవిలోన్=అందమైన యడవిలో.

తాత్పర్యము

(దిక్కుమాలి యతిదుఃఖముతో స్రుక్కిపోవుచు, నెమలికూఁతలచే నందమైన యడవిలోఁ దామర రేకులవంటి కన్నులుగల యా సీత మిక్కిలి బిగ్గరగ నేడ్చి పరితపించుచుండఁగా.)

**—• మునికుమారులు వాల్మీకికి సీతావృత్తాంతముఁ దెలుపుట •—**

క. మునిబాలు రా యశోధనఁ గని పరువున వాల్మీకి మునిఁ • గనఁ జని నతులం
బొనరించి యామె తెఱఁగును, వినిపించిరి తాము గనిన•వృత్తాంతంబున్. ౧౦౧౫

అర్థములు. యశోధనన్=యశస్సే ధనముగాఁ గలది, మఱి యే ధనము లేదని భావము, నతులన్=నమస్కారములను.

తాత్పర్యము

(మునిబాలకు లా యశస్సేధనముగాఁ గల సీతను జూచి పరుగెత్తిపోయి వాల్మీకి మహర్షినిఁ జూచి నమస్కరించి తా మామెను జూచిన విధమంతయును వినిపించిరి.)

సీ. ఏ మహాత్మునిఇల్లాలొ మునినాథ, శ్రీమహాసతి యని • చెప్పవచ్చు
నింతకు మున్నామె • నెన్నఁడు గనలేదు, దివి నుండి వ్రేల్చిన• దేవకాంత
యన నొప్పుచున్నది•యనఘ యాలోచింపు, మేటిమొద్దున నామె•యేడ్చుచున్న
దేము కంటిమి యది•యేటికో యెఱుఁగరా, దొక్కతె యున్నది•దిక్కులేని

ఆ. దానియట్లు మనుజ•తరుణిగాఁ దోఁచదు, దుఃఖముల కనర్హ•దుఃఖపడెడి
నాశ్రమంబుపొంతె•నవలిపూరంబున, నుంట నీవె శరణ•ముదిద కింక ౧౦౧౬

అర్థములు. శ్రీమహాసతి=శ్రీమహాలక్ష్మీదేవి, అనర్హ=తగినదిగాదు, అసతి దూరంబునన్=సమీపమందు, శరణము=రక్షకుఁడవు, ఉవిదకున్=స్త్రీకి.

తాత్పర్యము

(మునిశ్రేష్ఠా! ఆమె యే మహాసీయుని యిల్లాలో కాని శ్రీ మహాలక్ష్మీదేవి యని చెప్పవచ్చును. ఇంతకు మును వెన్నఁడట్టి యామెను జూచునది లేదు-స్వర్గమునుండి జారిపడిన దేవతాస్త్రీవలె నున్నది-మీరాలోచింపుడు ఆమె యేటియొడ్డున నేడ్చుచున్నది-మేము చూచితిమి - ఎందు కేడ్చుచున్నదో మాకుఁ దెలియలేదు. దిక్కులేని దానివలె నొక్కతె యున్నది మనుష్యస్త్రీగాఁ దోఁపదు. దుఃఖములొందఁ దగినది కాదు కాని దుఃఖపడుచున్నది. - ఆశ్రమము పొంత సమీపములో నుండుటచే నామెకిఁక నీవె రక్షకుఁడవు.)

క. కాపాడువాఁడు లేమిని, దాపంబునఁ బడెడిఁ మిగుల • దాతవు నీవై
కాపాడుమా యశోవతి, నీపట్ల వటన్న మౌని యెద యోజించెన్. ౧౦౧౭

అర్థములు. త్రాతవు=రక్షకుఁడవు.

తాత్పర్యము

• రక్షకుఁడు లేని కారణమున మిక్కిలి పరితాపపడుచున్నది. నీవే రక్షకుఁడవై యా యశోవతిని గాపాడుము, అని చెప్పఁగా నాయన యలోచించెను.

ఆ. జ్ఞానదృష్టిచేత • సర్వంబుఁ బరికించి, పాదములనఁ బరువు • పారి తోడ
శిష్యులెల్ల రాఁగ • శీఘ్రంబ యర్ఘ్యంబుఁ, గొంచు గంగఁ జేరి • కాంచెనకిని

తాత్పర్యము

జరిగిన వృత్తాంతమంతయు జ్ఞానదృష్టిచే చూచి తెలిసికొని తనవెంట శిష్యులర్ఘ్యంబు తీసికొని త్వరగా రాఁగా పాదుకలయినఁ బొడుగుకొనక పరువెత్తుచు గంగయొద్దకు వచ్చి యచ్చట సీతాదేవిని జూచెను.

—• వాల్మీకి సీతాదేవి నూరార్చి యాశ్రమంబునకుఁ దోడ్కొని చనుట •—

క. రాముని ప్రియురాలిని దుఃఖామిత పరితప్త ననద • యటు లుండెడి నీ
తామహిళామణిఁ గని ముని, యామోదము దనర నిట్టు • లను నాసతికిన్. ౧౦౧౮

అర్థములు. దుఃఖామిత పరితప్తన్ = దుఃఖముచే మిక్కిలి పరితపించుదాని,అనద యటుల=దిక్కులేని దానివలెఁ, ఆమోదము=సంతోషము, ఆమె శ్రీ మహాలక్ష్మి యని వాల్మీకి యెఱుఁగును. అటువంటి జగన్మాత తనయాశ్రమమునకు వచ్చెఁగదా యని సంతోషము.

సీ. దశరథధారిణీధవుకోడలవు నీవు, మహిషివి శ్రీరామ మహిపునకును
జనకనృపాలుని తనుజాతవును బతి, వ్రతల మేల్బంతి! స్వాగతము నీకు
నీరాక హేతువు నిఖిలంబు నే యోగ, దృష్టిని జూచితి శిష్టవినుత
సర్వలోకంబుల జరగెడు నవి యెల్ల, విదితముల్ నాకు నో వెలఁదిమిన్న
తే. మత్తపోలబ్ధచక్షుల మహిమఁ జేసి, కంటి నీయందుఁ బాపమొకండునైనఁ
గలుగ నేరదు, భీతిల వలదు తల్లి యుండుమీ యిందు నీమది నుదిలగొనకు

అర్థములు. మహిషివి=పట్టపు దేవివి, తనూజాతవు=కూఁతురవు, శిష్టవినుత=సాధువులచే స్తోత్రము=చేయఁబడినదానా, విదితముల్=తెలిసినవి, మత్తపోలబ్ధ చక్షుల మహిమ=నా తపస్సుచే లభించిన కన్నుల గొప్పతనముచే, ఉదిల గొనకు=పరితాపపడకుము.

తా త్ప ర్య ము

(అమ్మా! నీవు దశరథమహారాజు కోడలవు-శ్రీరామచంద్రప్రభుని పట్టపుదేవివి-జనకమహారాజు కుమార్తెవు-పతివ్రతాశిరోమణివి- సాధువులచే స్తోత్రము చేయఁబడినదానా! నీ విచ్చటకు వచ్చిన కారణము నేను యోగదృష్టితోఁ జూచితిని. నా తపో మహిమచే నాకెల్ల లోకముల జరగునవి యన్నియుఁ దెలియును-చూచితిని-నీయందు పాపమొక్కటియును లేదు - భయపడవలదు- నీ విచట నుండుము-పరితాపపడకుము.)

శా. అమ్మా నమ్ముము నన్ను నార్తి విడుమీ యర్ఘ్యంబుఁ గైకొమ్ము సొం
తమ్మౌ గేహమునందు నున్నయటు లానందింపుమీ తల్లి! ని
త్యమ్మున్ నిన్నరయున్ మదాశ్రమము ప్రాంతంబందు నున్నారు నే
మమ్మున్ గల్గు తపస్విను‌ల్ సుతవలెన్ మన్నించి రక్షింపఁగన్. ౧౦ ౧౧

తా త్ప ర్య ము

తల్లీ! నన్ను నమ్ముము దుఃఖము వదలుము, అర్ఘ్యంబు గ్రహింపుము, నీ సొంత యింటి యందున్నట్టు లిందు వసింపుము. సర్వకాలముల నీసుఖము విచారించుటకు జాలిన నియమవతు లగు స్త్రీలు నాయాశ్రమము సమీపమందే యున్నారు. వారు నిన్నుఁ దమ కుమారితవలెఁ గాపాడుదురు.

క. అనవుడుఁ బరమాద్భుత మగు, మునిపల్కుల నాలకించి ముగ్ధ శిరమునన్
బ్రణతి ఘటియించి కరముల, వినయమ్మున మోడ్చి యొప్పి సొంబడి నరిగెన్.

అర్థములు. ఒప్పి=వాల్మీకి చెప్పిన మాటల నంగీకరించి, ఇది మొదలు సీతాదేవి మౌనవ్రతము ధరించెను. కడపటి ప్రయాణసమయమందుఁ దప్ప సీతోపల

నెవరితోను భాషించినదికాదు. వచ్చినవారందఱు నేలమ్మ నీమగఁడు నిన్ను విడిచె నని యడుగుచుందురు. ఎవరి కేమి చెప్పను. కావున మౌనమే శ్రేష్ఠ మని దాని నంగీకరించెను.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, మిగుల నాశ్చర్యకరములగు వాల్మీకి మహర్షి మాటలు విని సీతాదేవి తలవంచి నమస్కరించి వినయముతోఁ జేతులు మోడ్చి యాయన వెంబడించెను.)

**—• వాల్మీకి సీతాదేవిని మునిసతుల కప్పగించుట •—**

ఉ. జానకితోడ వచ్చు ముని • సత్తముఁ గాంచి తపస్వినుల్ ముదా
ధీనమనంబులన్ మునివరేశ్వర! స్వాగత మెన్నినాళ్ళ కీ
నెల వేగుదెంచి, దయ • నిందఱ మ్రొక్కులు గొంచుఁ గార్య మే
మానతి యిందు నా వనిరొ • సమ్మునిపత్నులకున్ మునీంద్రుఁడున్. ౧౦_౧౩

అర్థములు. తపస్వినుల్=తపము చేయు స్త్రీలు, ముదాధీనమనంబులన్= సంతోషమునకు స్వాధీన మడిన మనస్సులతో, ఈనెలవు=ఈప్రదేశమునకు.

తా త్ప ర్య ము.

జానకీదేవితో వచ్చు వాల్మీకి మహామునిని జూచి యా మునిభార్యలు మిక్కిలి సంతోషించి మునీంద్రా! స్వాగతము! మీరీ ప్రదేశమునకు వచ్చి యెన్ని దినాలో కదా యైనది, మాయందఱ నమస్కారములు గ్రహించి మేము చేయ వలసిన కార్యమేమో చెప్పుఁడు అనిన వాల్మీకి యా ఋషి భార్యల కిట్లనియె.

సీ. ఈమె సీతాదేవి • రాముని ప్రియపత్ని, దశరథుకోడలు • తనయ జనక
నరపాలునకు సాధు•చరిత పతివ్రత, పాపహీనయ యయ్యు • భర్తచేత
సంత్యక్త,సతము మ•త్సంపరిపాల్య యీ,యమను వచ్చంపునె•య్యమునమీరు
కాపాడవలయును • గౌరవంబుగ మఱి, నాదువాక్యమున నో • నారులార

ఆ. యనుచు మీఁద మీఁద • నాదరంబున నొక్కి, చెప్పి సతిని వారి•కప్పగించి
శిష్యయుక్తుఁ డగుచుఁ • జేరె స్వాశ్రమమును, సీత యాశ్రమంబుఁ•జేరుచుల్ల.

అర్థములు. పాపహీనయ = పాపము లేనిదే, సంత్యక్త=విడువఁబడినది, సతము=ఎల్లవేళ, మత్సంపరిపాల్య=నాచేఁ బరిపాలింపఁబడఁదగినది.

తా త్ప ర్య ము

(ఈమె సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తి భార్య-దశరథమహారాజుకోడలు; జనకరాజు కూఁతురు - సాధువర్తనము కలది - పతివ్రత - పాపము లేనిది యయ్యును భర్తచే వదలిపెట్టఁబడినది - ఎల్లవేళ నేను పరిపాలింపఁదగియున్నది

నా మాటమీఁద మీరు నిష్కపటమగు ప్రేమతో-గౌరవముగా నీమెను గాపాడవలెను - అనుచు మునిపత్నులకు మీఁద మీఁద నొక్కి చెప్పి సీతను వారికొప్పగించి తాను శిష్యులతోఁ గూడి తన యాశ్రమమునకుఁ బోయెను. సీత వాల్మీకాశ్రమమునకుఁ బోవుటంతయు.)

## —♦ లక్ష్మణుఁడు శ్రీరాముని గుఱించి సుమంత్రునితోఁ జెప్పి యేడ్చుట ♦—

చ. కనుఁగొని లక్ష్మణుండు వెతఁ ♦ గాతరభావమునన్ సుమంత్రుతోఁ
గనితివె జానకీవిరహ ♦ కారణమా రఘురామ దుఃఖమున్
జనకతనూజ లోకనుత ♦ సాధ్విని దా విడనాడె, నింతకం
టెను వెత యొండు రాఁ గలుగు♦నే నుతకీర్తికి రామమూర్తికిన్. ౧౦౩౫

అర్థములు. కాతరభావమునన్=ధైర్యము చెడిన మనస్సుతో, జానకీ విరహ కారణము=సీతాదేవిని నెడఁబాయుట యనునది నిమిత్తముగాఁ గలది, లోకనుత సాధ్విని=ప్రపంచముచే స్తోత్రము చేయఁబడు పతివ్రతను, వెత=దుఃఖము

తా త్ప ర్య ము

(లక్ష్మణుఁడు చూచి, దుఃఖముచే దీనుఁడై సుమంత్రునితోఁ సీతనువిడుచుటచే రామునికిఁ గలిగిన దుఃఖమును జూచితివిక దా! ప్రపంచముచే స్తోత్రముచేయఁబడు పతివ్రతయగు సీతను దాను విడనాడెను. లోకమునఁ బ్రఖ్యాతిగల రామమూర్తి కింతకు మించిన దుఃఖ మింకొకటి గలదా?)

క. శ్రీనై దేహిరహితుం,డై వనరుల రామభద్రుఁ ♦ డరయఁగ నూతా
దైవంబుచేష్టయే చుమీ, దైవంబు నతిక్రమింప ♦ ధర నరు వశమే. ౧౦౩౬

తా త్ప ర్య ము

రామభద్రుని వంటివాఁడు లక్ష్మీదేవి వంటి సీతను వదలి దుఃఖపడుట చూడఁగా నిది దైవము చేసిన కార్యమే. ఇది నివ్వులేని పొగగదా. దైవమును మించి పోవుటకు నెవరికి శక్యము, ఈ నీతి రామాయణంబునఁ బలుమా ఉపదేశింపఁబడినది.

సీతా దేవియందు దోషము లేదు. రామునందు ద్వేషము లేదు. పరస్పరానురాగమునకు లోపము లేదు. వియోగమునకుఁ గారణము లేకుండియు నేదో కారణము గోడమీఁది పిల్లివలె నడుమ దూఁకి నేలుపఱుచుట దైవతంత్రముగాక మఱియేది కాఁగలదు కారణము లేక యేదియు జరుగదు. కారణము మనకుఁ దెలియకుండిన నిష్కారణ మందుము.

క. దేవతలన్ గంధర్వుల, దేవారుల రాక్షసులను ♦ దెగనడిచిన సీ
తావిభుఁడు నేఁడు దీనత, దైవమునకు లొంగ దాని♦దాటఁగ లేమిన్. ౧౦౩౭

### తాత్పర్యము

(దేవతలను గంధర్వులను, రాక్షసులను సంహరించిన రామమూర్తి నేడు దీనుఁడై విధినిదాఁటఁజాలక దానికి లొంగిపోయెను.)

పూర్వము దైవముకంటె పౌరుషము బలీయమనియు దైవమును పౌరుషముచే నివర్తింప వచ్చుననియు వాదించిన లక్ష్మణుఁ డిప్పుడు దైవము బలిష్ఠమని యంగీకరించు చున్నాఁడు ఇట్టి సందర్భమందు పౌరుషమేమి చేయఁగలదు. ఈవిధముఁగ పౌరుషము వ్యర్థమగు సందర్భము గలవు గాని దైవము వ్యర్థమగు సందర్భములు లేవు. కావున రెంటిలో దైవమే బలీయము. పదునాలుగు లోకములఁజయించినవాఁడైనను దైవమును జయింపలేఁడు.

చ. జనకునిమాటఁ బట్టి వన ♦ సంతతి నిర్జనదండకాటవిన్
వనటలఁ గుందెఁ దాఁ బదియు ♦ నాలుగు వర్షము, లంతకంటె నీ
జనకసుతావియోగమును ♦ సైఁచుట కష్టము పౌరవాక్యముల్
విని ప్రియురాలి సచ్చరిత ♦ వీడఁగ నెంత దయావిహీనుఁడో. ౧౦-౨౮

### తాత్పర్యము

తండ్రిమాటను బురస్కరించుకొని యడవులలో మనుష్యులు లేని దండకారణ్యములలోఁ బదునాలుగు సంవత్సరములు బాధపడెను. ఇప్పుడీ సీతను విడిచియుంకుట యంతకంటె దుఃఖకరము. ఊరివారి మాటలు విని తనకుఁ బ్రాణసమానురాలయిన దానిని పతివ్రతను వదలిపెట్టుటకు నెంత కఠినచిత్తుఁడో! దయయనునది కొంచమైన నుండిన నిట్లు చేయునా?

చ. ఎఱుఁగును సీత సాధ్వి యని ♦ హీనవచస్కులు పౌరు లంచుఁ దా
నెఱిఁగియుఁ గానలో విడిచె ♦ నింతిని, నింతట నింద దప్పెనే?
కఱకరి యంచుఁ బల్కరొకో ♦ కాఁగల దేమిక? నేమి ధర్మమె
త్తెఱఁగున నేకరించు? మతి♦ద్రిప్ప దయా యెటువంటి ధీరుఁడో? ౧౦-౨౯

### తాత్పర్యము

సీతాదేవియం దేదోషము లేదని యెఱుఁగును లోకులు కాకులన్నట్లువారు నీచపు మాటలాడు వారనియుఁ దెలియును. ఇంత తెలిసియు సీతను నడవుల పాలు చేసెను. గాని యీ మాత్రముతోనే నింద తప్పెనా? ఇప్పుడా లోకులే రాముఁడు కఠినచిత్తుఁడు, దయాహీనుఁడు భార్యను, నడవుల పాలుచేసెనని యనరా? దానికేమి చేయఁగలఁడు? ఇఁక నేధర్మమునైనను నెట్లు నేయఁగలఁడు? భార్యయుండియుఁ జచ్చినట్లాయెఁ గదా. ఎంత చెప్పినను మనస్సు త్రిప్పఁడు, ఆహా! యెంతగుండె నిబ్బరము గలవాఁడో!

—• సుమంత్రుఁడు లక్ష్మణునకు మనస్తాపోపశమనంబు సేయుట •—

క. అని పలుతెఱఁగుల దుఃఖం,బునఁ బలుకు సుమిత్రతనయు•మోముం గని ధీ
ధనుఁడు సుమంత్రుం డిట్లని, యనునయసూక్తులఁ దదార్తి•నణఁగఁగఁ, జేసెన్.

అర్థములు. ధీధనుఁడు=బుద్ధిసంపద గలవాఁడు, అనునయ సూక్తులన్= ఊరడింపు మాటల, తదార్తి=ఆయన వ్యసనము.

తాత్పర్యము

(అని యనేకవిధముల దుఃఖించుచుఁ బలుకుచున్న లక్ష్మణుని మొగము చూచి, బుద్ధిసంపన్నుఁడగు సుమంత్రుఁ డీక్రిందఁ జెప్పిన విధమున నూరడింపు మాటలతో నతని వ్యసనమును బోఁగొట్టెను.)

సీ. సంతాప మేటికి • సౌమిత్రి! జానకీ, విషయంబునను మున్నె•విదిత మద్ది
సౌఖ్యార్హుఁడగు రామ•చంద్రుండు ప్రేయసీ,విరహంబునను దుఃఖ•విషయమగును
గొంతకాలం బేగ • గురుమతీ! నిన్నును, భరతశత్రుఘ్నుల•ధరణితనయ
నెడఁబాయు; దీని నీ•వెవ్వరితోడను, భరతుతో శ్రీరామ•భద్రుతోడ

ఆ. నైనఁ జెప్పకుండు • వేని దుర్వాసుండు, క్షితివిభుండు నే వ•సిష్ఠమౌని
వినఁగఁ జెప్పినట్టి • వృత్తాంత మెల్లను, నీకుఁ జెప్పువాఁడ•నిర్మలాత్మ. ౧౦౩౧

తాత్పర్యము

లక్ష్మణా! నీ వేల దీనికి వ్యసనపడెదవు? జానకీవిషయమిట్లు జరుగునని ముందే తెలియును. ఎంతో సౌఖ్యమనుభవింపఁదగిన వాఁడయ్యును రామచంద్రమూర్తి ప్రియురాలినిబాసి దుఃఖించును. ఇఁక గొంతకాలమునకు నిన్నును, భరతశత్రుఘ్నులను సీతను దేహములతోనే వదలును. ఒక రహస్యమును దుర్వాసుఁడు నేను వసిష్ఠముని వినుచుండ దశరథమహారాజునకుఁ జెప్పెను. నీవు దాని నెవ్వరికి భరతునకైనను రామచంద్రునకైనను జెప్పకుండువేని నేను నీకుఁ జెప్పెదను.

చ. మనుజవిభుండు దీనిని·సు•మంత్ర! రహస్యము చెప్పఁబోకు మె
వ్వని కని యాజ్ఞ చేసె, నృప•వర్యుని యానతి నేను భక్తితో
వినయముతోడ నెప్డు నెఱ•వేర్చుచు నుందుదు, నీకు నైన నే
ననఁ దగ, దట్టులయ్యు వెత • మానొకొ దాఁటఁగ దైవతంత్రమున్. ౧౦౩౨

తాత్పర్యము

దశరథ మహారాజు, సుమంత్రా! యీ రహస్యమును ఎవరితోడను జెప్ప వలదని యాజ్ఞాపించెను. ఆయాజ్ఞను దేనినైనను నేను భయముతోను భక్తితోను నెఱవేర్చువాఁడను గావున నీకును దీనిని జెప్పరాదు. దైవతంత్రమునఁ దటాలున నోరు జాఱి చెప్పితిని.

ఉ. ఈదృశ మైన దుఃఖమున • నీవు శ్రమంపడు చుంటఁ జూడఁగా
నీ దురవస్థ నాఁపుటయె • నేఁడు శుభం బని తోఁచెఁ గావునన్
భూదయితా! వచింప నిటు•పూనితి నీకు వినంగ నిష్ట మే
నేదశయందు నైన వచి•యింపకు తమ్మున కన్నగార్లకున్. ౧౦౩౩

అర్థములు. ఈదృశము=ఇటువంటి.

తా త్ప ర్య ము

ఇటువంటి తీవ్రదుఃఖముచే నీవు బాధపడుచుండఁగాఁ జూచి సహింప లేక నీ దుఃఖము పోఁగొట్టుట బాగని తోఁచి నేను నీకు దీనిఁ జెప్పఁ బూనితినిఁ నీకు విన నిష్టమేని చెప్పెదను. నీవు మాత్రము దీనిని నీ తమ్మునికిఁ గాని యన్నలకుఁ గాని చెప్పకుము.

క. నాపుకు సుమిత్రపట్టియు, నీవచనముభంగి నడతు • నేను సుమంత్రా!
యావార్తల నెఱిఁగింపు యథావృత్తము టన్న నతఁడు•దడయక పలికెన్.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా,లక్ష్మణుఁడు సుమంత్రా! నీవు చెప్పినట్లు నడుచుకొందును. ఆ వార్తలున్న వున్నట్లు తెలుపుము. అనఁగానే యతఁడు వెంటనే చెప్పెను.)

**దశరథ దుర్వాసుల సంభాషణము సుమంత్రుఁడు లక్ష్మణునకుఁ దెలుపుట**

తే. అత్రితనయుండు దుర్వాసుఁ•డనుమహర్షి,
వాననెలలఁ జాతుర్మాస్య•పరమ నియతి
జరుపఁగ వసిష్ఠు నాశ్రమ•స్థలమునందు, నుండ నచటికి మీా జన•కుండు గురుని.

తా త్ప ర్య ము

అత్రికుమారుఁడైన దుర్వాసుఁడు వసిష్ఠునాశ్రమమున నాలుగునెలల వర్షాకాలము జరుపుచుండెను. అచటికి మీాతండ్రి గురుని.

క. సందర్శింపఁగ కని మ,ధ్యందినమార్తండునట్టు • లతికాంతి వెలుం
గొందెడు వసిష్ఠు సవ్యం బందుండు యతీంద్రుఁ గాంచి•యతులితభక్తిన్. ౧౦౩౬

తా త్ప ర్య ము

చూడఁబోయి మట్టమధ్యాహ్నమందలి సూర్యునివలెఁ బ్రకాశించు చుండు వసిష్ఠుని యెడమప్రక్క నుండు యతిశ్రేష్ఠునిఁ గాంచి యసమానభక్తితో.

క. మునియుగ్మమునకు మ్రొక్కిన, ననఘులు పాద్యంబు ఫలము•లాదిగ నిడి య
మ్మనుజేంద్రు సత్కరించిరి, వినిచిరి మధురోక్తి నర్థ•విధ మగుగాథల్. ౧౦౩౭

తాత్పర్యము

(మును లిద్దఱకు నమస్కరింపఁగా పాపరహితులగు వారు రాజున కర్ఘ్య పాద్యాదు లిచ్చి ఫలములు మున్నగునవి నొసఁగి సత్కరించిరి. తీయని మాటలతోఁ జెప్పఁ దగిన విషయములను జెప్పిరి.)

ఉ. అంబరమధ్యసీమ వన•జాప్తుఁడు వెల్గుచు నుండఁగా గథాం
తంబునఁ గేలు మోడ్చి వసు•ధావరుఁ డిట్లను నత్రిసూనుతో
నంబుజసంభవోపమ! మ•హాత్మ వచింపవె భూమి నాదువం
శంబు ప్రమాణ మెంత? ముని•సత్తమ! రామునియాయు వెంతయో? ౧౦౮౩

అర్థములు. అంబర మధ్యసీమ=ఆకాశము నడిమి భాగమున, వనజాప్తుఁడు= సూర్యుఁడు, అంబుజసంభవోపమ=బ్రహ్మతో సమానుఁడైన వాఁడా.

తాత్పర్యము

(మట్టమధ్యాహ్నమైనది-కథ ముగింపులో దశరథ మహారాజు నమస్కరించి దుర్వాసునితో! బ్రహ్మతో సమానుఁడవైన మహాత్మా? నా వంశము భూమిమీఁద నెంతకాల ముండును. రాముని యాయు వెంత? చెప్పుమనియడిగెను.)

తే. తక్కసుతు లెన్నినాళ్ళు లీ•ధరణినుండు వారొ?
కొడుకులు శ్రీరామ•భద్రునకును
గలుగుదు రే? వారియాయుః ప్ర•కార మెంత?, వేఁడుకొనియెద నావంశ•విధము జెపుమ.

తాత్పర్యము

(తక్కిన కొడుకు లెంత కాలము జీవించెదరు? శ్రీరామభద్రునకుఁ గొడుకులు గలిగెదరా? వా రెంతకాలము జీవింతురు - నా వంశము యొక్క విధ మంతయుఁ జెప్పుము-నిన్ను ప్రార్థించెదను.)

—• భృగుమహర్షి విష్ణువును శపించుట •—

క. ఉర్వీవిభుఁ డిటు లడిగిన, దుర్వాసుం డనియె వినుము•తొల్లిసురారుల్
గర్వింప వారి నెల్లసు,పర్వులు దఱుమంగ వారు•పఱచి భయమునన్. ౧౦౮౪

అర్థములు. సురారుల్=రాక్షసులు, సుపర్వులు=దేవతలు.

తాత్పర్యము

(దశరథ మహారాజీ ప్రకార మడుగఁగా, దుర్వాసుఁడు రాజా! వినుము. పూర్వము రాక్షసులు గర్వింప వారి నందఱను దేవతలు తఱిమివేసిరి. భయపడి వారు పాఱిపోయి.)

క. భృగుపత్ని శరణుఁ జొచ్చిన, మగువయు నభయం బొసంగె•మనుజాదులకున్
దిగు లేమి లేక వారలు, దగుగతి సోఖయింపఁ జక్రి•తద్భృగుపత్నిన్! ౧౦౮౫

అర్థములు. మనుజాదులకున్=రాక్షసులకును, తత్+భృగుపత్నిన్=ఆ భృగు మహర్షి భార్యను.

తా త్ప ర్య ము

ఆ భృగు భార్యను శరణము చొచ్చిరి. ఆమెయు వారికి భయపడవలదని చెప్పి దేవతల వలన రక్షించెను. ఆకారణముచే వారు దేవతల భయము లేక సుఖముగా నుండి వారు చేయు దుష్ట కార్యములు చేయుచుండిరి. అప్పుడు విష్ణు మూర్తి లోకుల కపకారకులైన రాక్షసుల రక్షించిన యా భృగుభార్యను.

క. శితచక్రధారఁ ద్రుంచిన, సతిపాటున కలిగి భృగువు • శాపం బిడె నా
సతిని నవధ్యను జంపుట, క్షితిపై జన్మించి నీవు • శ్రీవత్సాంకా! ౧౦౪౩

అర్థములు. శితచక్రధారన్=వాఁడియైన చక్రము వాదరచే, సతిపాటునకు= భార్యచచ్చుటకు, అవధ్యను=స్త్రీ యగుటచేఁ జంపరాని దానిని, శ్రీవత్సాంకా= శ్రీవత్సము చిహ్నముగాఁ గలవాఁడా.

తా త్ప ర్య ము

(వాఁడియైన చక్రధారచేఁ దునిమెను. భార్య చచ్చుటకుఁగోపించి భృగువు శాప మిచ్చెను. శ్రీవత్సము చిహ్నముగాఁ గలవాఁడా! స్త్రీనిఁజంపరాదు. నీవు చంపఁదగని యాఁడుదానిఁజంపితివి. కావున నీవు భూమిమీఁదఁబుట్టి)

క. దారవియోగవ్యథచే, శౌరీ తపియింపు మెక్కు•సమ లని తనవ్యా
హారములకుఁ దపియించుచు, వారని దృఢభక్తిఁ గొలిచి • భజియించెహరిన్.

అర్థములు. దారవియోగ వ్యథచేన్=భార్యను వదలిన దుఃఖముచే, సమలు=సంవత్సరములు, వ్యాహారములకున్=మాటలకు.

తా త్ప ర్య ము

భార్యను విడిచిన దుఃఖముచేఁ దపింపుమని శపించి కోపము చల్లారఁగానే తన మాటలకుఁ దానే సంతాపపడి క్షమింపుమని హరిని దృఢభక్తిచే భజించెను.

ఉ. పాపుల కా పొసంగిన స్వ•భార్య కువృత్తము లోకనాథుఁ డా
గోపముతో శపించుటయుఁ • గుంజరరక్షకుఁడున్ స్వదత్తమా
శాపము నిగ్రహించిన భృ • శం బగు నారకబాధ యున్నియుం
దాపముఁ గూర్ప శాంతుఁ డయి•తన్ను మునీంద్రుఁడు పూజసేయఁగన్. ౧౦౪౪

తా త్ప ర్య ము

శపించి తాను జేసినది యవివేక కార్యమని యోజించుచున్నాఁడు. ఎలన, పాపాత్మునకు సహాయుపడిన తనభార్య చెడ్డనడవడి తలాలోచించి,యట్టిదానినాఁడు

దానినైనను జంపుట దోషము గాదనియు, అట్టి దానిని జంపిన జగత్ప్రభువును తాను గోపముతో నిష్కారణముగ శపించుటయు, గజరాజరక్షకుఁ డగు భగవంతుఁడు తానిచ్చిన శాపము నంగీకరింపక నిగ్రహించెనా దానివలనఁ దనకు రాఁగల నరక బాధయు నిన్నిటిని నాలోచించి సంతాపపడి కోపము వదలిన వాఁడై విష్ణువును బూజించెను. తనశక్తికంటె నెక్కువశక్తి గలవానిని శపింపరాదు. ఏలన వాఁడు దానికిఁ బ్రతిక్రియ చేసినా యాశక్తి మరలివచ్చి తన్నుఁ బ్రయోగించిన వానినే వధించును. ప్రయుక్తమైన శక్తి యెదుటివానినో ప్రయోగించిన వానినో బాధింపక వ్యర్థమైపోదు. కావున విష్ణువు తన శాప మంగీకరింపక పోయెనా తనకుఁ గీడు తప్పదు. కావున సంతాపపడెను.

ఆ. భక్తవత్సలుండు ♦ పరమదయాళుండు, భువన సంప్రియార్థ♦మునకు మౌని శాపమును గ్రహించె♦జన్మాంతరంబునఁ, బూర్వవృత్తమిదియు♦భూపవర్య. ౧౦౪౫

తాత్పర్యము

విష్ణువు భక్తులయందుఁ బ్రేమగలవాఁడగుటను మిక్కిలి దయయే స్వభావముగఁ గలవాఁడగుటచే లోకము ప్రియఁబడుటకై తాను నిరాకరించిన నీ మునీశ్వరుఁడు చెడునే యని కనికరము గలవాఁడై జన్మాంతరమందు నీ శాప మనుభవించెద నని చెప్పెను. ఇది పూర్వము జరిగిన చర్య.

• ఇది శ్రీరామచంద్రమూర్తి యేకపత్నీవ్రతుఁ డనియు నవతరించిన విష్ణుమూర్తి యనియు స్థాపించుచున్నది.

—♦ శ్రీరామువృత్తంబు దుర్వాసుఁడు దశరథున కెఱింగించుట ♦—

ఉ. నీ తనయుం డటం చిటకు ♦ నెమ్మినెయిం జనుదెంచి రాముఁ డన్
ఖ్యాతి నెసంగ లోకముల ♦ నమ్ముని శాపఫలంబు నొందెడిన్
క్ష్మాతలనాథ! రాజగుచుఁ ♦ జాలఁగఁ గాల మయోధ్య నేలు, సు
శ్రీతత సౌఖ్యవృద్ధులను ♦ జెంది తదాశ్రితు లుంద రెప్పుడున్. ౧౦౪౬

తాత్పర్యము

ఆ విష్ణుమూర్తియే యిప్పుడు నీ కొడుకయి యిచ్చటికి వచ్చెను. రాముఁడను పేర లోకమునఁ బ్రసిద్ధిఁగాంచెను. ఆముని శాపము ననుభవింపఁ గలఁడు. అయోధ్యకురాజై చాలఁగాలము భూమి పాలింపఁగలఁడు. ఆయన నాశ్రయించిన వారు మిగుల సంపత్తు సౌఖ్యము గలవారగుదురు.

క. పదివేలవత్సరంబులు, పదినూర్లేఁడులును భూమిఁ ♦ బాలించి జనుల్
ముకమునఁ దేలఁగ రాముఁడు, పదపడి చను బ్రహ్మలోక♦పదముం జేరన్. ౧౦౪౭

అర్థములు. బ్రహ్మలోకపదము=పరబ్రహ్మలోకపదము, వైకుంఠము.

తా త్ప ర్య ము

(శ్రీరాముఁడు పదునొకండు వేలేండ్లు జనులానంద పడునట్లు భూమినిఁ బాలించి తరువాత వైకుంఠమునకుఁ బోవును.)

గీ. అశ్వమేధంబు లెన్నియో ♦ యాచరించు, దండిగాఁగ నొసంగును♦దక్షిణాలను
రాజవంశంబులను బెక్కు ♦ రామవిభుఁడు, ధరణి స్థాపించు ధర్మాత♦త్పరతరాజ.

తా త్ప ర్య ము

(అశ్వమేధముల నెన్నిటినో చేయును. దండిగా దక్షిణాల నిచ్చును. ధర్మమందాస_క్తి గలిగి రామచంద్రప్రభువు పెక్కు రాజవంశములను భూమిమీఁద స్థాపించును.)

క. రామునకు సీతయందున్, భూమీశా! కవలు సుతులు ♦ పుట్టెదు వారల్
భూమిపతులై యయోధ్యను, సామంబున నేలు చంద్రు♦జనవల్లభులై. ౧౦౪౯

అర్థములు. కవలు=అమడలు.

తా త్ప ర్య ము

(రాజా! శ్రీరామునకు సీతయందు నమడలు కొడుకులు పుట్టి యయోధ్యకు రాజులయి ప్రజారంజనముగాఁ బరిపాలనము చేయుదురు.)

క. రాముఁడె యభిషేకించును, ధీమహితా సుతుల ననుచుఁ♦దెలియఁగ సకలం
బౌ మాని చెప్ప నాఋషి, భూమీశుఁడు గౌరవించి♦పురి కరుదెంచెన్. ౧౦౫౦

తా త్ప ర్య ము

(శ్రీరాముఁడే తనకుమారులకుఁ బట్టము కట్టును. అని యంతయు దుర్వాసుఁడు చెప్పగా విని దశరథమహారాజా ఋషిని గౌరవించి తనపట్టణమునకుఁ జనుదెంచెను.)

చ. ఇది ముని చెప్పఁగా వినితి ♦ నిన్నిదినాలుగ నుంచినాఁడ నా
యెద నిది తప్పఁబోవ దిటు ♦ లేటికి రి_త్తకు సంతసింప నా
సుదతికి రామచంద్రునకు ♦ శుద్ధమనంబున నిబ్బరించు కొ
మ్మదవద మాను మన్నఁ బర♦మాద్భుత సూ_క్తికి నిచ్చ మెచ్చుచున్. ౧౦౫౧

అర్థములు అదవద=కలఁత.

తా త్ప ర్య ము

(ఇది ముని చెప్పఁగా వింటిని ఇన్నిదినాలుగా నా మనస్సులోనే యుంచుకొంటిని. ఇది తప్పిపోదు. ఏల? సీత కొఱకు రాముని కొఱకు వృథాసంతాపమును జెందెదవు. పరిశుద్ధమగు మనస్సుతో నిబ్బరించుకొనుము. కలఁతమానుము అని తెలుప మిగుల వింతయగు నాతని సూ_క్తికి నెంతయు మెచ్చుకొనుచు.)

క. మేలని దుఃఖము విడిచె నృ, పాలుఁడు వారిరువు రిట్లు ♦ భాషించుచుఁ బో
నాళీకాప్తుఁడు పడమటి, శైలముఁ జేరంగఁ జనియె♦సంధ్యయు మిగిలెన్. ౧౦౫౩

అర్థములు. నృపాలుఁడు=లక్ష్మణుఁడు, నాళీకాప్తుఁడు=సూర్యుఁడు.

తాత్పర్యము

(మంచిదని లక్ష్మణుఁడు దుఃఖమును వదిలెను. వారిరువు రీవిధముగామాట లాడుచుఁ బోవుచుండ సూర్యుడు పడమటి గొండను జేరబోయెను. సంధ్యాకాల మాయెను.)

—♦ లక్ష్మణుఁడు శ్రీరాము దర్శింపఁ బోవుట ♦—

క. అంతట వారల కేశిని, పొంతన రేయెల్లఁ గడపి ♦ ప్రొద్దు పొడవ న
త్యంతరయంబునఁ జని దిన, కాంతుఁడు నడిమింట నిలువఁ♦గాఁ బురిఁదఱియన్

అర్థములు. కేశిని=కేశినియను నది, దినకాంతుఁడు=సూర్యుడు.

తాత్పర్యము

(అంతట వారు కేశినియను నది సమీపమున నా రాత్రి యంతయుఁగడపి, ప్రొద్దుపొడువఁగా మిగులఁద్వరగాఁబోయి, సూర్యుఁడు నెత్తిమీఁదకు రాన యోధ్యదాపునకు.)

చ. చను నెడ లక్ష్మణుండు తన♦స్వాంతమునం దలపోయు నిట్టు లే
మని వచియింతు రామునకు ♦ నాయన మోమది యెట్లు గందు? సీ
తను విడి తన్నకుం దగిన ♦ తమ్ముఁడ వీ వని పలుకు తల్లులం
గని బదు లేమి చెప్పుదును ♦ గట్టిఁడి యందురు నన్ను నెల్లరున్. ౧౦౫౪

అర్థములు. స్వాంతమునన్=మనస్సునందు, మోము=ముఖము, కట్టిఁడి=మర్యాదహీనుఁడు. దుష్టుఁడు – విడిచి=వదలిపెట్టివచ్చితివి.

తాత్పర్యము

పోవునప్పుడు లక్ష్మణుఁడు తన మనస్సులో నిట్లని తలపోసెను. రామున కేమని చెప్పెదను ఆయన మొగమెట్లు చూచెదను? సీతను వదలిపెట్టి వచ్చితివి. ఆ యన్నకుఁ దగిన తమ్ముఁడవే నీవు అని పలుకు తల్లులకేమి బదులు చెప్పఁగలను. మట్టుమర్యాద లేని వాఁడని నన్నందఱాడి పోసికొందురు.)

ఉ. ఔర! యటంచు నార్చుచును ♦ నారట మందుచు రాజమందిర
ద్వారము గాంచి యందు డిగి ♦ వ్రాల్చిన మోమున నేగి తన్మహా
గారమునందు దీనమతిఁ ♦ గాంచనపీఠి వసించువానిఁ గ
న్నీరు దొలంకు నేత్రముల ♦ నివ్వెఱ గూరిన వాని రామునిన్. ౧౦౫౫

అర్థములు. మహాగారమునందున్=గొప్పయింట, నివ్వెఱ=నిశ్చేష్టతచే.

తాత్పర్యము

(ఓరా! యనుచు నిట్టూర్పు విడుచుచు, నారాటపడుచు రాజమందిర ద్వారము చూచి యచటఁ దేరు దిగి, తలవంచుకొని పోయి యా గొప్పయింటిలో దీనుఁడయి బంగారుపీట మీఁదఁ గన్నీరు గార్చుచుఁ జేష్టలుడిగి యున్న రాముని)

—• లక్ష్మణుఁడు సీతావృత్తాంతంబుఁ దెలిపి శ్రీరాము నూరడించుట •—

క. కని లక్ష్మణుఁ డతిదీనత, వినయంబున విన్నవించె•విహితాంజలి యై
జనవర! యానతి మేరకు, జనకజ నే విడిచినాఁడ • జాహ్నవి పొంతన్. ౧౦౫౬

తాత్పర్యము

(చూచి లక్ష్మణుఁ డతిదీనుఁడై వినయముగాఁ జేతులు జోడించి రాజా! దేవర యానతి మేరకు జానకిని గంగపొంతను విడిచి వచ్చితి; నని విన్నవించెను.)

క. విమలంబగు వాల్మీకా,శ్రమమున శుభశీల సద్య•శస్విని విడి వే
గమునం దావకచరణా,బ్జములన్ సేవింప మరలి • వచ్చితి నిటకున్. ౧౦౫౭

తాత్పర్యము.

(ప్రభూ! నిర్మలమగు వాల్మీకి యాశ్రమమందు - దేవరయాజ్ఞ మేరకు, గంగాతీరమున - సీతాసతీ లలామను డించి, తమ పాదములు సేవింప మరలి యిటకు వచ్చితిని.)

క. పురుషోత్తమ దుఃఖింపకు, దరిసింపఁగఁ గాలగతి వి•ధం బిట్టిది కా
నరవర దుఃఖింతు రె, ధృతినిరతులు సర్వజ్ఞులైన•నినుఁబో ల్సుమతుల్? ౧౦౫౮

అర్థములు. దరిసింపఁగన్=ఆలోచింపఁగా, ఇట్టిదాకా=ఇట్టిదేకదా, ధృతి నిరతులు=ధైర్యమునందుఁ బ్రీతిగలవారు.

తాత్పర్యము

(పురుషశ్రేష్ఠా! దుఃఖింపకుము. ఇది కాలగతియొక్క ధర్మము. సర్వజ్ఞులు, తమవంటి వారిటుల ధైర్యము వోనాడి చింతింతురా )

క. ధనములు నిధనాంతంబులు, విను వృద్ధిమదర్థములును•విలయాంతంబుల్
జననము మరణాంతం బగు, నొనరెడి సంయోగములు వి•యోగాంతంబుల్.

అర్థములు, నిధనాంతంబులు=నాశమే యంతముగాఁ గలవి, ధనము స్థిరముగా నుండునది కాదు, నశించునదే, వృద్ధిమదర్థములు = వృద్ధినొందు చున్న వస్తువులు, పెరుగునవి, విలయాంతంబుల్, నశించునవే, పెరుఁగుట విఱుగుట కొఱకే, సంయోగములు=కూడుటలు, వియోగాంతంబుల్ = వీడుటయే యంతముగాఁ గలవి.

తాత్పర్యము చూ- అయోధ్య- ౭౩౦ పద్యము.

రామచంద్రమూర్తి భరతునకుఁ జెప్పిన మాటలే యాతనికి మరల స్మృతికిఁ దెచ్చుటకై చెప్పఁబడెను.

క. కావునఁ బుత్రులయెడ భా,ర్యావిత్తములందు మిత్రు♦లం దతిర క్తిం
గావింపరాదు సుమతికి, నే వేళనొ విప్రయోగ ♦ మేర్పడి యునికిన్. ౧౬౦

తాత్పర్యము

కూడుట యనునది యున్నచోట వీడుట యనునది యుండును గావునను నది యేనాఁడో యొకనాఁడు వచ్చుట తప్పదు కావున బుద్ధిమంతుఁ డగువాఁడు కొడుకులందు భార్యయందును ధనమందును మిత్రులందును నెక్కువ యనురాగ ముంచరాదు వ్యవహారము జరుగుట కెంత కావలయునో యంత మాత్ర ముంచిన నది పోయినను వ్యసన ముండదు.

క. నిను నీవు మనసుచే మది, జనముల నెల్లరను దిద్దఁ జాలెద వనఘా
వనరెద వేలా ప్రాకృతు, ననువున? నీ కిట్టిచేఁత ♦ యగునె? మహాత్మా! ౧౬౧

తాత్పర్యము

మహాత్మా! నీవు నిన్నును నితరులను దిద్దఁగలవాఁడవు. ప్రాకృతుని విధమున దుఃఖపడెదవేల? నీకిట్లు చేయుట తగునా?

ఉ. నీ వపవాదభీతి నవ♦నీసుత వీడిత కాదె? వెండియున్
నీ విటు లేడ్చుచున్నఁ జన♦నేరదు నింద, మఱింత యెక్కుడై
భూవలయంబున న్నిలుచుఁ ♦ బోలదు నీ కిది మాను తాపమున్
భూవరచంద్ర! దుర్బలపు ♦ బుద్ధిని నెట్టుము గొమ్ము ధీరతన్. ౧౬౨

అర్థములు. అపవాదభీతి=నిందవలన భయముచే.

తాత్పర్యము

రామచంద్రా! నీవు లోకనిందకు భయపడి కదా సీతాదేవిని వదలిపెట్టితివి. వదలి పెట్టిన తరువాత నీవిట్టు లింటఁగూర్చుండి యేడ్చుచుండిన నిందపోవునా? మఱింత యెక్కుడగును. లోకమున శాశ్వతముగ నిలుచును. కాఁబట్టి నీ కిది సరి గాదు. సంతాపము వదలిపెట్టుము. సంతసించి నీ వేమి చేయఁగలవు? మరల సీతా దేవిని రప్పించెదవా? అది లేదు కదా! అది లేనప్పు డూరక యేడిచి యేమి లాభము? కావున బుద్ధిదౌర్బల్యమును వదలి ధైర్యము తెచ్చుకొమ్ము.

చ. అనవుడు రామచంద్రుఁ డను♦జా! నిజ మాడితి నీవు హర్ష ముం
గనితి మదాజ్ఞఁ దీర్చుటను♦గ్రమ్మఱ ధైర్యముఁ గొంటి, శోకమున్
బనిచితి దూరమున్, మధుర♦వాక్కులు త్వద్గదితంబులన్ వినన్
మనమునఁ దృప్తి గూరె నవి♦మాటికి మెచ్చుచు నెండి యిట్లనున్. ౧౬౩

అర్థములు. త్వత్+గదితంబులు=నీచే జెప్పఁబడినవి.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా రామచంద్రమూర్తి తమ్ముఁడా! నీవు నిజము చెప్పితివి-నేను జెప్పినట్లు నీవు చేయుటచే సంతోషించితిని, మరల ధైర్యము వచ్చినది-దుఃఖమును మానితిని, నీవు తీయనిమాటలు వినఁగా మనస్సునకుఁ దుష్టికలిగెను. అని మాటి మాటికి మెచ్చుచు మరల నిట్లనెను.)

## —• శ్రీరాముఁడు లక్ష్మణునకు నృగుచరిత్ర దెలుపుట •—

క. అక్కఱవేళల నీవలె, మక్కువఁగలచుట్ట మున్నె • మన్మతమునకున్
జక్కఁగఁ జెప్పితి వన్నా, నిక్కం బొకఁ డున్నె యిట్టి•నీతిజ్ఞుండున్. ౧౦౬౪

అర్థములు. మన్మతమునకున్=నా యభిప్రాయమునకు.

తా త్ప ర్య ము

(అక్కఱగల వేళలందు నీవలె సాయపడు ప్రేమగల చుట్టము గలఁడా? నా యభిప్రాయమునకుఁ జక్కఁగాఁ జెప్పితివి-నీవంటినీతి తెలిసిన వాఁడు నిక్కముగ నింకొకఁడు గలఁడా)

సీ. నామనంబున నొండు • నాటి యున్నది చింత, చెప్పెద నీ వట్లు •చేయవయ్య
నాలుగునాళ్ళాయె•నాయనా? పౌరుల, కార్యంబు లారసి • క్రమము గాను
గావునఁ బ్రకృతులఁ • గార్యార్థి జనములఁ, బురుషుల స్త్రీలను•సరగఁబిలువఁ
బంపు పురోధకుఁ•బంపుము వార్తను, గొలువుకూటమునందుఁ•గూడుఁడనుచు

తే. ననుదినంబును పౌరకా•ర్యములఁ దీర్ప, బ్రాలుమాలెడి నృపతి ని•ర్వాతనరక
మునను దుఃఖించు నిక్కంబు•మున్ను నృగుని, చరిత వినలేదె నీవు స•త్సాధుశీల.

అర్థములు. ప్రకృతులన్=మంత్రులు మొదలగువారిని, కార్యార్థి జనములన్=కార్యము గోరివచ్చిన వారిని, పురోధకున్=పురోహితునకు,అనుదినంబును=ప్రతిదినము, నిర్వాత నరకము=గాలిలేని నరకమందు.

తా త్ప ర్య ము

నా మనస్సున మఱియొక చింత నాటి యున్నది. దానిని జెప్పెదను. నీవట్లు చేయుము. నేను గొలువుకూటమునకుఁ బోయి నేటికి నాలుగు దినము లయ్యెను. కావున పౌరులపనులు విచారించిన వాఁడఁగాను. కావున మంత్రులు లోనగువారిని కార్యము కలిగిన స్త్రీలను బురుషులను త్వరగా రమ్మనుము. పురోహితునకుఁ జెప్పి పంపుము.అందఱును గొలువు కూటమునందుఁ గూడుఁడని చెప్పుము. ఏరాజు ప్రతి

దినము పౌరకార్యముల విచారింపఁడో యారాజు నిర్వ్యాతనరకమునఁ బడును. ఈ విషయమున నీవు నృగునిచరిత్రము వినలేదా? చెప్పెద వినుము.

సీ. మున్ను బ్రహ్మణ్యుండు • సన్నుతాచారుండు, సత్యసంధుఁడు నృగు • జనవిభుండు
పుష్కరంబున స్వర్ణ • భూషితధేనుల, దూడలతోఁ గోటి • బాడబులకు
దానంబుగా నిచ్చె • వానిలో నిఱుపేద, యాహితాగ్నియు నగు • నవనిసురుని
యా వొండు కలసిన • నాకస్మికంబుగ, నిచ్చె దానిని మది • నెఱుఁగ లేమి

ఆ. నుంఛవృత్తిఁ బ్రదుకు • నుర్వీసురుండు క్షుధార్తి నిందు నందు • వరసి దానిఁ
బెక్కు వత్సరంబు • లెక్కడఁ గానక, కడకుఁ గనఖలంబు • గ్రామమునను.

అర్థములు. బ్రహ్మణ్యుఁడు=బ్రాహ్మణప్రియుఁడు, సన్నుతాచారుఁడు=సజ్జనులచేఁ బొగడఁబడిన యాచారము గలవాఁడు, పుష్కరంబునన్ = పుష్కరతీర్థమందు, స్వర్ణభూషిత=బంగారు నగలచే నలంకరింపఁబడిన, ధేనులన్=ఆవులను బాడబులకున్=బ్రాహ్మణులకు = ఆహితాగ్ని=అగ్నిహోత్రములు గలవాఁడు, ఉంఛవృత్తిన్=కళ్ళములో, పొలములోఁబడిన ధాన్యములేఱి బ్రదుకుట జీవనోపాయము, ఒక్కొక్క గింజగా నేఱుట ఉంఛము - ఎన్నులను గోసి ధాన్యము సేకరించుట శిలము, పరులను యాచించి బ్రతుకుటకంటె దున్ని జీవించుటమేలు, దానికంటె శిలము మేలు, దానికంటె ఉంఛము మేలు, అసత్ప్రతిగ్రహము నిషిద్ధము.

'శిలోంఛమ ప్యాదదీత విప్రో జీవన్ యతస్తతః।
ప్రతిగ్రహా చ్ఛిల శ్శ్రేయాం స్తతో ప్యుంఛః ప్రశస్యతే॥'
మనువు ౧౦-౧౧౨ శ్లో॥

క్షుధార్తిన్=ఆఁకలిబాధచే.

### తాత్పర్యము.

పూర్వము బ్రాహ్మణప్రియుఁడు, సదాచార సంపన్నుఁడు, సత్యవ్రతనిష్ఠుఁడు నగు నృగుఁడను రాజు పుష్కరతీర్థమునందు బంగారు సొమ్ములచే నలంకరింపఁబడిన యావులను దూడలతోడ కోటి బ్రాహ్మణులకు దానముగా నిచ్చెను. వానిలో నొక నిఱుపేదయు నిత్యాగ్నిహోత్రియు నుంఛవృత్తిచే జీవించువాఁడు నగు బ్రాహ్మణుని యావు కలిసెను. అది యాయన యెఱుఁగఁడు. ఆవును బోఁగొట్టుకొన్న బ్రాహ్మణుఁడా పాలచే జీవించువాఁడు గనుక నాఁకలిగొని దాని నిచ్చట నచ్చట వెదకెను. అది గానరాలేదు. ఆ యావు నిమిత్తమై పెక్కు సంవత్సరములు దేశమంతయు వెదకెను. తుదకు కనఖల మను గ్రామము నందు.

క. తనయావు జీర్ణవత్సముఁ గనియొక బ్రాహ్మణునియింటఁ • గానం బడఁగాఁ
జనుదెమ్మా శబలాయనఁ, దనవిప్రునిస్వర మెఱంగి • తడయక యదియున్. ౧౦౮

అర్థములు. జీర్ణవత్సము=శిథిలమైన దూడను, శబలా=అవా.

తా త్ప ర్య ము

తన యావు మరణించిన దూడనుగని యొక బ్రాహ్మణుని యింటనుండఁగా జూచి శబలా! రా, యని పిలిచెను. అది తన్ను సాఁకుచుండిన బ్రాహ్మణుని కంఠస్వర మెఱిఁగి వెంటనే

క. అనలనిభుం డగు బ్రాహ్మణు, వెనుకంజనె సాఁకుచున్న • విప్రుడు తోడన్
జని నాయది యీ ధేనువు, చనునే తోడ్కొని చనంగ • బ్రాహ్మణ దీనిన్?

అర్థములు. అనలనిభుండు=అగ్నితో సమానుఁడు.

తా త్ప ర్య ము

(అగ్నితో సమానుఁడగు బ్రాహ్మణుని వెనుకగాఁ బోయి యావును సాఁకుచున్న బ్రాహ్మణుఁడు, ఈ యావు నాది? బ్రాహ్మణుఁడా! దీనిని నీవు తీసికొని పోఁదగునా?)

క. దానంబు గాఁగ భూమీ,జాని నృగుం డొసగె ననుడు • బ్రాహ్మణుఁ డిది నా
ధేనువు రాజెట్టు లొసఁగె, దానము నీకిచ్చె? ననుడుఁ • దరతర మిట్టుల్. ౧౦౯

అర్థములు. భూమీజాని=రాజు.

తా త్ప ర్య ము

(నృగమహారాజు దీనిని నాకు దానమిచ్చెను.అని చెప్పఁగా బ్రాహ్మణుఁడు ఇది నాయావు రాజేవిధముగా నీకు దానమిచ్చెను? అనఁగా, వారిలో వారు.)

క. వాకాటులకుం బోచ్చి మ,హీకాంతునిఁ దారు చేర • నేగఁగ నందున్
వాకిటికావలివారలు, భూకాంతునిఁ జూడ నరుగఁ • బోనీయమిచేన్. ౧౧౦

అర్థములు. వాకాటులకుల్=కలహమునకు.

తా త్ప ర్య ము

(జగడమాడుచు, రాజు నొద్దకుఁ బోవ, నచటఁ గావలివారు రాజు దర్శనమునకుఁ బోనీయకుండుటచేత)

క. పెక్కేఁడు లుండి విసువున, మిక్కిలి కోపించి వారు • మేదినికాంతున్
గ్రక్కసనుడుల శపించిరి, యిక్కరణిని జన్నె నృపతి • కెంతేఁ జేయన్? ౧౧౧

అర్థములు. క్రక్కసనుడులన్=కఠినవాక్కుల.

తా త్ప ర్య ము

(అనేక సంవత్సరములుండి, విసుగుపుట్టి, మిక్కిలి కోపించి, వారు రాజును కఠినవాక్కులఁ శపించిరి. రాజిట్లు చేయుట తగునా?)

ఉ. కార్యము గల్గి యర్థు లిటు • కావలి కావఁగ ద్వారమందు నై
శ్వర్యమదంబుచేఁ గొలువు• శాలను దర్శన మీయ కున్నవాఁ
డార్యుఁడె వీఁడు? భూతనిచ•యంబుల కెల్ల నదృశ్యుఁ డౌచు నీ
యర్యుఁడు పెక్కు లేండ్లు బిల•మం దొక యూసర వెల్లి గావుతన్. ౧౧౭౩

అర్థములు. అదృశ్యుఁడు=కానరానివాఁడు, అర్యుఁడు=స్వా దర్యస్స్వామి నైశ్యయో:॥నానా॥ర-ప్రభువు.

తా త్ప ర్య ము

(పని కలిగి, యర్థులు వాకిటఁ బడికాపుపడియుండ నైశ్వర్య మదమున దర్శన మీయనివాఁడు వీఁడు పూజ్యుఁడా! ప్రాణులకెవరికిఁ గానరాకుండ నీ రాజు బహుసంవత్సరములు కలుగులో నూసరవెల్లి యయి పడియుండుఁగాత)

తే. నరుఁడు నారాయణుండును•ధరణిభార,మణఁప జన్మింత్రు ద్వాపర•మందుఁ దుదను
యదుకులంబునఁ బురుషుఁడై •యవతరించు, వాసుదేవునిచే వీని•వనట పాయు.

తా త్ప ర్య ము

(ద్వాపరయుగము తుదను నరనారాయణులు భూభారమును హరింప యదువంశమున నవతరించెదరు. అట్లు లవతరించు వాసుదేవునిచే నీతని యీకష్టము తీరును.

చ. అని శపియించి భూమిసురు•లా మొదవున్ బలహీన వృద్ధ యా
టను మఱియొండు విప్రున క•టన్ విడి దానము గాఁగఁ బోయి రా
జనపతి వేఁగుచుండెడిని • శాపవశంబున నిప్పు డోరిమిన్
జనుల విమర్శ సేయమిని • రాజ్ఞపతి దుర్గతిఁ జెందు లక్ష్మణా. ౧౧౭౪

అర్థములు. బలహీన=బలము లేనిది, మరల, దమ వెంట నడచిరాశక్తి లేనిది, వృద్ధ=ముసలిది ఓరిమిన్=ఓపికతో.

తా త్ప ర్య ము

(అని శపించి యా బ్రాహ్మణు లాయావు ముసలిదై బక్కదై నందునవక్కడనే యింకొక బ్రాహ్మణునకు దానముచేసి పోయిరి. ఆ రాజిప్పటికిని కష్టమనుభవించుచున్నాఁడు. లక్ష్మణా ప్రజలను విమర్శ సేయని రాజు దుర్గతి పాలగును.)

క. కలహము కార్యార్థులలో, బలపడుటకుఁ గారణంబు • ప్రభుదోషంబే
కలహములు లేక ప్రజలన్, మెలపున రక్షించుపతికి•మేలొనగూడున్. ౧౦౭౫

తాత్పర్యము

ప్రభువు చక్కఁగాఁ బాలింపకుండుట చేతనే ప్రజలయందుఁ గలహములు పుట్టును గావునఁ ప్రజలలోఁ గలహము లేకుండఁ బాలించు రాజునకు క్షేమము గలదు.

క. కావునఁ గార్యముకొఱకై, యేవారేన్ గాచి యున్న • నెఱుఁగం జనుమీ
నీవన; లక్ష్మణుఁడనియెన్, భూవర! యమదండ సదృశ•మును శాపంబున్. ౧౦౭౬

అర్థములు. యమదండ సదృశము=యమదండముతో సమానమైనది.

తాత్పర్యము

(కావునఁ గార్యార్థులయి యెవరేని గాచుకొని యున్నారేమో తెలిసికొన నీవు పొమ్ము. అని శ్రీరామచంద్రప్రభువు చెప్పఁగా రాజా! యమదండముతో సాటియైన శాపమును.)

క. విని యేమి చేసె నృగుఁడన, జనపతి తద్వార్త యెఱిఁగి,•సచివుల హితులన్
దనకడకుఁ బిలిచి దుఃఖం,బునఁ బొగులుచు నిట్టు లనియె•భూదేవవరుల్. ౧౦౭౭

అర్థములు. భూదేవవరుల్=బ్రాహ్మణ శ్రేష్ఠులు.

తాత్పర్యము

(నృగుఁడేమి చేసెను? అని యడుగ, రాజా సమాచారము తెలిసి మంత్రులను స్నేహితులను దనయొద్దకుఁబిలిచి దుఃఖమునఁ గుములుచు నిట్లనెను బ్రాహ్మణ శ్రేష్ఠులు)

క. నారదుఁడును బర్వతుఁడును, ఘోరం బగుశాప మిచ్చి • గొబ్బున దివికిన్
మారుతులై చనిరే మన, మీరలు నాసుతుని వసువు•మేదిని నేలన్. ౧౦౭౮

అర్థములు. మారుతులై=వాయువులవలెనై

తాత్పర్యము

దీనిచే సోమరియై ప్రజల మనవులు విచారింపని నృగుని దండించుటకై పర్వత నారదులు ప్రకారము శపించిరని యేర్పడు చున్నది.

క. అభిషేకముఁ గావింపుడు, శుభముగఁ జెనుబిల యొకండు•సుఖకరముగ నా
కభినిర్మింపఁగ శిల్పి,ప్రభువుల నియమింపుఁడీ కృ•పారతు లగుచున్. ౧౦౭౯

అర్థములు, కృపారతులు=నాయందుఁ గృప ప్రీతి గలవారై

తా త్ప ర్య ము

(పట్టాభిషేకము చేయుఁడు- నాకు సుఖముగ నుండునట్లు లోక పెద్ద బిల మును నిర్మించుటకు శిల్పవరులను దయతోఁ బిలిపింపుఁడు)

సీ. అం దుండి శాపంబు♦ననుభవించెదను వ,ర్షఘ్నంబు గాఁగ హి♦మఘ్నముగను
నాతపఘ్నంబుగ ♦ ననువార బిలములు, మూఁడిటిఁ గావించి ♦ పోఁడిమిగను
వానిచుట్టును మేలి♦ఫలవృక్షములఁ బుష్ప,వంతంబు లగు లతా♦వళుల నాటి
దట్టంపునీడలు♦దవర గుల్మము లుంప, నందు నాశాపాంత♦మందు వర్ధ

తే. యోజనము దాఁక బుష్పంబు♦లొప్పుచుండఁ,జేయుఁడీయని వసువున♦జేరఁబిలిచి
ధర్మమార్గంబు విడువకు ( తనయ! నీవు, క్షత్ర ధర్మంబుమై నేలు♦ధాత్రినెల్ల.

అర్థములు. వర్షఘ్నము=వాన బాధలేనిది, హిమఘ్నము=మంచు బాధ లేనిది, ఆతపఘ్నము = ఎండబాధలేనిది, పుష్పవంతంబులు=పూలుగలవి, లతావళులన్=తీఁగలగుంపుల, గుల్మములు = పొదలు, ఆశాపాంతము = శాపము దీరువఱకు.

తా త్ప ర్య ము

మంత్రులారా! వానబాధ, మంచుబాధ, ఎండబాధ లేకుండునట్లు మూఁడు పెద్దబిలములు నిర్మింపఁజేయుఁడు. శాపము తీరు వఱకు వానియం దుండెదను. ఆ మూఁడు బిలముల చుట్టు ఫలవృక్షములను పూల తీఁగలను నాటింపుఁడు. దట్టముగ నీడలుండునట్లు పొదలేర్పాటు చేయింపుఁడు, బిలములచుట్టు యోజనముదాఁక పూల చెట్లుండునట్లు చేయుఁడు అని కొడుకగు వసువును జేరఁబిలిచి కుమారా! ధర్మము విడువకుము, క్షత్రియధర్మము ననుసరించి భూమి పాలింపుము.

క. అపరాధ లేశమునకున్. విపరీతపు శాపమిడిరి ♦ విప్రులుకంటే
తపియింపకు దైవంబే, నిపుణము పో నేలుకిల్లి ♦ నెటి సమకూర్పన్. ౧౦౭౧

అర్థములు. అపరాధలేశమునకున్=అల్పదోషమునకు తాను పథకు రాకుండుట యల్పదోషమని తోఁచెనే కాని దాని వలన నెంత యెంత కష్టపడిరో యతనికిఁ దోచినది కాదు, తపియింపకు=పరితాపపడకుము, నిపుణము=నేర్పుగలది.

తా త్ప ర్య ము

(చిన్న తప్పునకు బ్రాహ్మణులు విపరీతపు శాపమును బెట్టిరి చూచితివా? నీవు పరితాప పడకుము-మంచికిఁ జెడ్డకు దైవమే చాలియుండును.)

క. కలుగునవి యేవొ కలుగును,దొలఁగునవో తొలఁగుదాను♦దొరకొనుఁ బ్రాప్తం
బులు సుఖములు దుఃఖంబులు,తొలిమనుజుఁడ? నర్చుసుకృత♦దుష్కృతఫలముల్.

తాత్పర్యము

పూర్వజన్మమున మనుష్యుఁడు చేసిన పుణ్యములయొక్కఁ బాపములయొక్క ఫలము, మేలు కీడు ఏమి కలుగవలయునో యవి తమకుఁ దామె ప్రాప్తించును. తొలఁగి పోవలసినవి తామే తొలఁగి పోవును. వానిని గుఱించి ఫలకాలమున సంతోషము గాని దుఃఖము గాని పడరాదు.

క. అని చెప్పి నందనునకుం, జనియెన్ నృగుభూవరుండు ♦ సమ్యక్కృత మై
యొనరినబిలంబులోనికి, దినము లటం గడుపుచుండె ♦ దీనత్వమునన్. ౧౦౪౩

అర్థములు. సమ్యక్+కృతము=చక్కఁగాఁ జేయఁబడినది.

తాత్పర్యము

(అని కుమారునకుఁ జెప్పి, నృగమహారాజు చక్కఁగాఁ జేయఁబడిన బిలములోనికిఁ బోయి దీనత్వముతో దినములు గడుపుచుండెను.)

—♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు నిమికథఁ దెలుపుట ♦—

క. ఈవిషయంబున మఱియొం, డేవిని చెద నీకు విన న ♦ భీష్టం బేనిన్
బావనకథ నన లక్ష్మణుఁ, డే విస్మయకరకథాళి ♦ దృప్తింగానన్. ౧౦౪౪

అర్థములు. ఏన్=నేను, విస్మయకర=ఆశ్చర్యమును గలిగించు.

తాత్పర్యము

(ఈ విషయమున మఱొకపావనమైన కథ నీ కిష్టమయినచోఁ జెప్పెదను. అని చెప్పఁగా లక్ష్మణుఁ డాశ్చర్యకరమైన కథలను వినుటయందుఁ దనివితీఱకున్నది. ఈ కథలు రామచంద్రమూర్తి యెట్లు రాజ్యము పాలించుచుండునో తెలుపును)

సీ. అనవుడు శ్రీరాముఁ ♦ డనియె నిక్ష్వాకుని, పండ్రెండవసుతుండు ♦ పరమధర్మ
నిరతుండు నిమి యను ♦ ధరణీశ్వరుఁడు గౌత, మాశ్రమప్రాంతంబు ♦ నందు శక్ర
దేవపురోపమం ♦ బౌనై జయంత మన్నగరంబు నిర్మించి ♦ దగినరీతి
దీర్ఘసత్త్రి మొనర్పఁ ♦ దివిరి యిక్ష్వాకుని, నామతించి వసిష్ఠు ♦ యజ్ఞ కార్య
తే. నిర్వహణమునకును బిల్వ ♦ నేను మున్న, వాసవునిచే వరియింపఁ ♦ బడినవాఁడఁ
దాళుమీ నేనువచ్చునం ♦ దాఁకననుచు, నరుగ నిమియత్రిగౌతమాం ♦ గిరులఁబిలిచె.

అర్థములు. శక్రదేవ పురోపమంబు=ఇంద్రుని నగరముతో సమానము, దీర్ఘసత్త్రము=చాలఁగాలము జరుగు యాగము, ఆమతించి=పిలిచి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పెను. ఇక్ష్వాకుని పండ్రెండవ కుమారుఁడు నిమి యనురాజు-ఉత్తమధర్మమం దాసక్తి గలవాఁడు-గౌతమాశ్రమము సమీ

పమున అమరావతివంటి దగు వైజయంతమను పురముఁ గట్టించి యచట దీర్ఘ సత్రము చేయఁ బ్రయత్నించి యజ్ఞకార్యము నిర్వహింప వసిష్ఠునిఁ బిలిచెను. ఇంతకుఁ బూర్వమే యింద్రుఁడు నన్ను వరించి యున్నాఁడు. నే నచ్చటికిఁ బోవల యును. నేను వచ్చువఱకు నీవు యజ్ఞము నిలుపుమని వసిష్ఠుఁడు చెప్పిపోయెను. నిమియంతవరకు యజ్ఞము నిలుప నిష్టపడక యత్రిని గౌతముని అంగిరసునిఁ బిలిచెను.

ఉ. వారలు దోడ్పడంగ హిమ♦వంతముపొంతఁ బురంబుదాపునన్
తన్నరమణుండు జన్నమును ♦ సాగఁగఁ జేయుచు నైదువేల యేం
డ్లార రహింప వాసవుని♦యజ్ఞముఁ దీర్చి వసిష్ఠయాని త
ద్ధారిణిఁ జేరి జన్నము య♦థావిధి గౌతమమౌని దీర్పఁగన్. ౧౦౨౬

తాత్పర్యము

(వారలు సాయపడఁగా, మంచుఁగొండ పొంత పట్టనమున దాపున యజ్ఞమునురాజు సాగించుచు నైదువేలేండ్లు పూర్తిగాఁ జరపెను. అప్పుడింద్రుని యజ్ఞమును బూర్తి చేసి వసిష్ఠుఁ డచ్చటకు వచ్చి, గౌతముఁడు యజ్ఞమును యథావిధిగాఁ జేయించు చుండఁగా.)

క. కని యాగ్రహించి భూమీంద్రునకై ముహూర్తంబు వేచె♦దురదృష్టమునన్
జనవిభుఁడు నాఁడు నిద్రిం, చెను బగటం గాచికొని వ♦సిష్ఠుఁడు కినుకన్. ౧౦౨౭

తాత్పర్యము

(చూచి, యాగ్రహపడి, రాజుకొఱకొక ముహూర్తము వేచియుండెను. దురదృష్ట వశమున నా దినము పగలు రాజు నిద్దురఁ బోయెను. వసిష్ఠుఁడు కాచుకొని యుండి, కోపముతో.)

ఉ. నన్ను నిరాకరించి సవ♦నం బొనరింపఁగ నన్యుఁ దెచ్చి తీ
విన్నిటఁ జెప్పవచ్చినను ♦ నింటన యుండియు నీవు దర్శనం
బు న్నృప! నీ వచేతనతఁ ♦ బొందు మటం చని శాప మీయ భూ
భృన్నళినాహితుం డెటఁగి ♦ వేగమ వెల్పల వచ్చి క్రుద్ధుఁడై. ౧౦౨౮

అర్థములు. అచేతనతన్=చైతన్యము లేకపోవుటను, ప్రాణము లేకపోవుటను, భూభృన్నళినాహితుండు=రాజచంద్రుఁడు క్రుద్ధుఁడై=కోపించినవాఁడై.

తాత్పర్యము

(నన్ను నిరాకరించి యితరుని యజ్ఞము చేయించుటకుఁ దెచ్చికొంటివి- ఈ విషయము నీకుఁ జెప్పవచ్చిన నాకు,నీ వింటిలో నుండియు దర్శన మీయకుంటివి- కావున నీకు ప్రాణము లేకపోవునుగాక యని శాపమీయఁగా, రాజెఱిఁగి వేగమె వెలుపలికి వచ్చి కోపించినవాఁడై.)

క. ఒడ లెఱుఁగక నిద్రింపఁగఁ, గడు ఘోరముగా శపింపఁ • గార్యం బగునే
చెడు నీ వచేతనత నీ,యొడలున్ రుచిరత్వ మెడల • కుండెడిఁ గాతన్. ౧౦౮౯

అర్థములు. ఒడలు=దేహము, అచేతనత=చైతన్యము లేమిని, రుచిరత్వము=అందము.

తాత్పర్యము

నేను దేహము తెలియక నిద్రింపఁగా నిటువంటి ఘోరశాప మీయ వచ్చునా? ఇచ్చితివి కావున నావలెనే నీవు చైతన్య హీనుఁడవుకమ్ము. నీ దేహము చెడకుండునుగాక.

క. అని రోషవశంబున న, య్యనఘులు శపియించి రిట్టు•లన్యోన్యంబున్
గన లేమి చేయ లేదన, విని లక్ష్మణుఁ డనియె నెట్లు • విగతశరీరుల్. ౧౦౯౦

అర్థములు. కనలు=కోపము, విగతశరీరుల్=దేహములు లేనివారు.

తాత్పర్యము

అని కోపావేశముచే నిరువు రొకరి నొకరు శపించిరి. కోపము చేయలేని పని యే మున్నది అని చెప్పఁగా లక్ష్మణుఁడు దేహము లేనివారలు.

—* వసిష్ఠుఁడు దేహము ధరించుట *—

చ. తనువులు గ్రమ్మఱం గొనిరి • తత్కథఁ దెల్పు మటన్న రాముఁ డి
ట్లను దమ దేహముల్ విడిచి • యాధరణీశ్వరుఁడున్ మహాతపో
ధనుఁడును వాయుభూతు లయి • తారుచు నుండిరి మింటఁ, దండ్రిని
గనఁగ వసిష్ఠుఁ డేగెఁ బర•కాయము నొందఁగఁ గాంక్ష చేయుచున్. ౧౦౯౧

అర్థములు. తనువులు=దేహములు, వాయుభూతులయి=వాయువులవలెనై తారుచు=సంచరించుచు, తండ్రినిన్=బ్రహ్మదేవుని.

తాత్పర్యము

మరల శరీరములు గలవా రెట్లయిరో యాకథ తెలుపుమని కోరఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. తమ దేహములు వదలి యారాజు మునీశ్వరుఁ డిరువురు నాకాశంబున గాలులై తిరుగుచుండిరి. వీరు కాలము తీఱి చచ్చినవారు కారు కావున వీరి కే లోకములు లేవయ్యెను. అప్పుడు వసిష్ఠుఁడు తన తండ్రియగు బ్రహ్మ యొద్దకు మరల దేహము నొందఁ గోరి యుపాయ మడుగఁబోయెను.

క. అరిగి విధాతకు మ్రొక్కిఁడి, సరసిజభవ! యండజాత! • సర్వసుపర్వో
త్కరవల్లభ! నేనిమి భూవరు, శాపముచేతఁ దనువుఁ•బాయఁగఁగంటిన్. ౧౦౯౨

అర్థములు. విధాత = బ్రహ్మకు, మ్రొక్కు + ఇడి నమస్కరించి, శరీరము లేనప్పుడు నమస్కారాదులు లేకున్నను తపఃప్రభావముచేఁ గలిగిన లింగ

శరీరముచే నని గ్రహింపనగు, అండజాత=బ్రహ్మాండము శరీరముగాఁ గలవాఁడా. అండములోనుండి పుట్టినవాఁడా- "తదండ మభవద్ధైమం సహస్రాంశు సమప్రభమ్. తస్మిన్ జజ్ఞే స్వయం బ్రహ్మా సర్వలోక పితామహః" మనుస్మృతి-౧-౯. సర్వసురగోత్రకరవల్లభ=సమస్తదేవతాసమూహములకు నధిపతియగువాఁడా.

### తాత్పర్యము.

(పోయి బ్రహ్మకు నమస్కరించి, దేవాధీశ్వరా! నిమిరాజు శాపము చేత నేను శరీరమును విడువవలసిన వాఁడనైతిని.)

క. మేనులు లేకుండిన న, న్యూనవ్యసనములు దొడరు • నొదవును లోపం
బోవళినాసన! క్రియలకుఁ, గాన నొసంగుము మఱొండు • కాయంబనినన్. ౧౯౩

అర్థములు. మేనులు=దేహములు, అన్యూన=కొఱఁతలేని, వ్యసనములు= దుఃఖములు, తొడరున్=ప్రాప్తించును, క్రియలకున్=కర్మములకు, కాయంబు= దేహము.

### తాత్పర్యము

ప్రాకృత దేహముచేఁ గర్మములు చేసికదా జీవుఁడు తరింపవలెను. సమస్త ధర్మకర్మములు శరీరముతోనే కదా చేయవలెను. అది లేకున్న నే ధర్మ మే కర్మము సాగదు. దానివలన జీవుఁడు దుఃఖముల పాలవును కావున నాకు మఱి యొక దేహమిమ్ము.

సీ. ధాత యిట్లనియె మి • త్రావరుణుల తేజమునఁ జొచ్చి వసుధను • జనన మొందు
మీ యయోనిజుఁడవై • మేదినీ సురవర్య, మహితతపంబున • మద్వశుండ
వయ్యెద వనిన సం • యమి మ్రొక్కి చయ్యన, వరుణాలయమునకు • వచ్చునపుడు
మిత్రుండు వరుణ • సమ్మేళనంబున రాజ్య, పాలనంబొనరించె • వచ్చె నటకుఁ

తే. బద్మదళనేత్ర పూర్ణేందు • వదన చెలుల, తోడనుర్వశి వరుణుఁడా • చేడెఁగాంచి
వలపు దెలిపిన మిత్రుండు • వలచెఁ దొలుతఁ జనుసనీతోడఁ గూడంగ • ననివనతేఁడు

అర్థములు. మిత్రావరుణులు=సూర్యుఁడు వరుణుఁడు, దేవతాద్వంద్వేచ- యను పాణిని VI 3-26 సూత్రప్రకారము పూర్వపదాంత స్వరమునకు ఆదా దేశము. ఇట్టులే సూర్యాచంద్రమసులు. అగ్నామారుతులు, తేజమునన్=రేత స్సుచే, అయోనిజుఁడవై=యోనినుండి పుట్టినవాఁడవు గాక, మేదినీసురవర్య= బ్రాహ్మణోత్తమా, మద్వశుండవు=నాకు వశపడిన వాఁడవు, ప్రాజాపత్యాధి కారము కలవాఁడవు, సంయమి=ఋషి, వరుణాలయమునకున్ = వరుణునింటికి, వరుణసమ్మేళనంబునన్=వరుణునితోఁ గూడినవాఁడై, వలపు=కామము.

తాత్పర్యము

బ్రహ్మదేవుఁ డిట్లు చెప్పెను. మిత్రావరుణుల రేతస్సున బ్రవేశించి భూమి యందు నయోనిజుఁడవై జన్మించి, గొప్పతపస్సు చేసి నాస్వాధీనుఁడ వగుము. అనిన ఋషి మ్రొక్కి వరుణుఁ డున్నస్థలమునకు వచ్చెను. అప్పుడు మిత్రుఁడు వరుణుఁడు నిరువురు గలసి రాజ్యమును పాలించుచుండిరి. అచ్చటికి నూర్వసివచ్చెను. దానిని జూచి వరుణుఁడు తన కామమును దానికి దెలుపఁగా నది యింతకు ముందే మిత్రుఁడు నన్ను వలచియున్నాఁడు. కావున నీతోడఁ గూడరా దనెను.

ఉ. ఓరువఁ జాల దర్పకుని • యుద్ధతి నేను మృగాక్షి! దివ్యభృం
గారువునందుఁ దేజమును • గామిని వీడెద నన్ను నుర్వశీ
సారసనేత్ర యిట్టులను • సమ్మత మయ్యెది మిత్రుఁ డొందు శా
రీరసుఖంబు, నీయదియ • హృత్కమలం, బది గాదె మిన్నయా. ౧౮౫

అర్థములు. దర్పకుని యుద్ధతిన్=మన్మథుని పరాక్రమము, ఓరువఁజాలన్= సహింపలేను.

తాత్పర్యము

రేతస్సును నేను బిగఁబట్టజాలను. కావున గిండియందు దాని వదలెదను అని చెప్పఁగా నట్టులే చేయుము నాకది సమ్మతమే, శరీరసౌఖ్యము మిత్రునకుఁ గలుగును. మనస్సంగమసౌఖ్యము నీకుఁ గలుగును. అదియే కదా శ్రేష్ఠము.

తే. అనిన జ్వలదగ్ని శిఖకుఁదు • ల్యంబు తేజ, మతఁడు కుంభంబునం దుంచె • నతివ చనియె
మిత్రుఁ జేరంగ నాతఁడా • మెలఁతఁ గాంచి, క్రోధకలుషితచిత్తుఁడై • కొమ్మ కనియె.

అర్థములు. జ్వలదగ్నిశిఖకున్=మండుచున్న యగ్నిజ్వాలకు, తుల్యంబు= సమానము, క్రోధకలుషిత చిత్తుఁడై=కోపముచే కలుషమైన మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

(అని చెప్పఁగా నతఁడగ్నిజ్వాలకు సమమైన వీర్యమును గుంభమునందుం చెను. ఆకాంత మిత్రుని యొద్దకుఁ బోవ, నాతఁడు కోపించి యా వనితతో నిట్లని చెప్పెను.)

ఉ. ఓసి దురాత్మికా! కలుష • యుక్త చరిత్రకె! మున్ను మున్ను నా
కాస వచించి యీనడుమ • నన్యునిఁ గూడఁగ లంజ వైననున్
దోసము గాదె? యీయతుల • దోషమునన్ ధరపై వసింపుమీ
వాసి తఱుంగ మానవుని • భార్యవుగా నొక కొంతకాలమున్. ౧౮౬

అర్థములు. దురాత్మికా=పాపపు మనస్సు గలదానా, కలుషయుక్త చరిత్రకె=పాపముతోఁ గూడిన నడవడి గలదానా, అతులదోషమునన్ = అసమాన పాపముచే.

(ఓసి పాపాత్మురాల! పాపముతోఁ గూడిన నడవడి గలదానా! ముందుగా నాకాసపెట్టి యీవడుమ నింకొకనితోఁ గలియుట నీవు లంజవైనను దోషము గాదా? సాటిలేని యీ పాపముచే నీవు భూమిలో నొక మానవుని భార్యవై కొంతకాలము వసింపుము.)

క. సుతుఁ డయి బుధునకుఁ గాశీ పతియైన పురూరవుండు♦పతిగా మనుమీ
మతిహీన! యనఁ బురూరవు, నతి శేరఁగ నేగి యతని ♦ పతియై మెలఁగెన్.

తాత్పర్యము

(బుద్ధిలేనిదాన! నీవు బుధునికిఁ గొడుకు కాశీరాజువగు పురూరవుఁడు భర్తగా బ్రదుకుము. అని పలుక నా సతి పురూరవుని యొద్దకుఁ బోయి యతనికి భార్యయై యుండెను.)

క. అతని సుతుం డాయువు తత్క్షితిపతికిన్ నహుషుఁ డొదవెఁ♦గీర్తితగతి భూ
పతియై యింద్రుఁడు వృత్రుని, హతుఁ జేసి భ్రమింప నింద్రుఁ♦డై దివమేలెన్.

తాత్పర్యము

(అతని పుత్రుఁ డాయువు-అతనికి నహుషుఁడు పుట్టెను. ఇంద్రుఁడు వృత్రాసురునిఁ జంపి బ్రహ్మహత్యచే భ్రమించుచుండ నహుషుఁ డింద్రుఁడై లక్షసంవత్సరములు స్వర్గము నేలెను.)

తే. నూఱువేలేఁడు; లిచ్చట ♦ నూత్న చంద్ర,ఫాల కంజదళాక్షి యు♦ర్వశి ధరిత్రి
చాలసంవత్సరము లుండి ♦ శాప మంత, మొందఁగఁ గ్రమ్మఱ జేరె బి♦డౌజువీడు.

అర్థములు. బిడౌజువీడు=ఇంద్రపట్టనము.

నాలుగవ పాదంబున నుభయయతి.

తాత్పర్యము

(ఇచ్చట నుర్వశి భూమియందుఁ జాలసంవత్సరములుండి, శాపము తీఱి పోఁగా మరల నింద్రపట్టనమును జేరెను.)

—♦ వసిష్ఠుఁడు మైత్రావరుణుఁ డయి జన్మించుట ♦—

చ. అనవుడు లక్ష్మణుం డనియె ♦ నమ్మునిపార్థివు లెట్లు క్రమ్మఱన్
దనువులు గాంచి రవ్విధము ♦ దాశరథీ! వినిపింపు మన్న న
య్యనుజునిఁ బల్కె రాముఁడు మ♦హాత్ములు వారల తేజ నుండి సం
జననము గాంచి రా ఘటిని ♦ సంయమివర్యులు పూర్ణతేజులై. ౧౧౦౧

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా లక్ష్మణుఁడు మరల నడిగెను. ఆ వసిష్ఠమునియు నిమిభూప తియు మరల దేహము లెట్లు వడసిరి. దాశరథీ! వినిపింపు మని యడుగ, రామ చంద్రమూర్తి తన తమ్మునితో మహాత్ములగు వారి వీర్యమునందుండి కుంభమున నామునిశ్రేష్ఠులు పూర్ణమగు తేజస్సుగలవారై జన్మించిరి.

తే. ఊర్వశీకారణంబుగ•నుంచెఁ దొలుత, దివ్యఘటనమున మిత్రుండు•తేజు దాన వరుణుఁ డావల నుంచెఁ ద•ద్వ్యాజమున న,గస్త్యమున్నుగ జన్మించి•కాంచిమిత్రు.

అర్థములు. తద్వ్యాజమునన్=ఆ నెపమున.

తా త్ప ర్య ము

(మొదట దివ్యఘటమునందు మిత్రుఁడు తన వీర్యమును నూర్వశినెపమున నుంచెను. దానియందే తరువాత వరుణుఁడు తన తేజస్సునుంచెను. ఆ కారణమున ముందుగా నగస్త్యుఁడు పుట్టె మిత్రునిఁజూచి.)

తే. నేను నీకుఁదనూజుఁడ•గా నటంచుఁ, జనియె మఱికొంతకాలంబు•చన వసిష్ఠుఁ డందు జన్మించె నుభయశు•క్లాప్తిదాన,నతఁడు మైత్రావరుణుఁడన•ఖ్యాతిఁగాంచె

అర్థములు. ఉభయ శుక్లాప్తి=ఇరువుర రేతస్సు కలియుటచే.

తా త్ప ర్య ము

(నేను నీ కొడుకును గానని పోయెను. మఱికొంతకాలము కడచిపోఁగా, మిత్రావరుణు లిరువురి వీర్యమున వసిష్ఠుఁడందులోఁ బుట్టెను. ఆకారణమున వశిష్ఠుఁడు మైత్రావరుణుఁడని ఖ్యాతిగాంచెను.)

ప్రత్యగాత్మ దేహియై సుఖదుఃఖము లనుభవించుటకు సకామకర్మమే కారణము ఈ విధముగా జేసిన కర్మములఫలము లన్నియు ననుభవించువఱకు జన్మము లొకటి వెంట నొకటి వచ్చుచునే యుండును. ఇట్లు దుఃఖములు సుఖములు నందు ననుభవించిన తుదకు వానియందు రోఁతపుట్టి జన్మములు లేకుండఁ జేసి కొనఁగోరిజన్మములకుఁ గామము కారణము గావున జన్మరాహిత్యమునకై ఫలాభిసంధి రహితముగఁ గర్మము లాచరించి వాని ఫలము భగవంతునకు సమర్పించును. అట్లు చేయుటచే నూతనకర్మముల సృష్టి మానును. పాతవి నశింపనారంభించును, ఇట్టి జన్మము సామాన్యజీవులందు స్త్రీ పురుషసంయోగము లేక కలుగదు. ఇందు స్త్రీ క్షేత్రము, పురుషుఁడు బీజము నగుచున్నాఁడు. ఈ రెంటిలో నేది ప్రధానమని యొక వివాదము కలదు. ఈ విషయము మనుస్మృతి తొమ్మిదవ యధ్యాయంబునఁ జర్చింపఁబడినది.

తే. ఆమహాతేజు నిక్ష్వాకుఁ•డాశ్రయించి, తమ పురోహితుఁగాఁ గొనె•ధర్మవిదుని నింక వచియింతునినుము ని•మిరాజ్వరుండు,తనువుఁగాంచినవిధముఁ ద•త్త్వజ్ఞ వినుత.

### తాత్పర్యము

(మహా తేజశ్శాలియగు వసిష్ఠుని నిక్ష్వాకుఁ డాశ్రయించి తనకుఁ బురోహితునిఁగా గ్రహించెను. ఇఁక నిమిరాజు శరీరమును బొందిన విధము. తెలిపెద వినుము.

### —• దేవతలు ఋషులు నిమికోరినవర మిచ్చుట *—

చ. ఋషులు విదేహనాయకు శ•రీరముఁ బ్రోచుచు గంధమాల్యకి
ల్బిషరహితాంబరంబులను • వేలిమిఁ దీర్చుచుఁ బ్రత్యగాత్మతో
ఋషిభృగు విట్లు పల్కె- నిమి!•యేమివరంబును గోరెదీవు క
ల్మషరహితా! వచింపు మెట • మానుగ నిల్పుదు నీదు జీవమున్. ౧౧౦౫

అర్థములు. విదేహనాయకు=విదేహరాజు, గంధమాల్య కిల్బిషరహితాంబరంబులను=గంధముల చేతను పూలదండలచేతను నిర్మలవస్త్రములచేతను-రక్షించుచు, వేలిమి=యజ్ఞము, ప్రత్యగాత్మతో=దేహములేని యాత్మతో, కల్మషరహితా=దోషము లేనివాఁడా.

### తాత్పర్యము

నిమిచే యజ్ఞము చేయించు ఋషు లాతని శరీరమును గంధమాల్యాదుల చేతను, మంచి నిర్మలవస్త్రముల చేతను, నలంకరించి పోషించుచు యజ్ఞము నెఱవేర్చుచు నిమి ప్రత్యగాత్మతో ఋషులందు భృగుమహర్షి నిమీ! నీవేమి వరముఁ గోరెదవు? తెలుపుము. నీ జీవము నెందుండఁ జేయుదువు. తెలుపు మనెను.

చ. పలికిరి తుష్టులై సురలు • పార్థివసత్తమ! నీదుజీవమున్
నిలుపుదు మెందుఁ గోరు మన • నిర్జరులార! సమస్తభూతదృ
ష్టుల,నిలువంగ నామనసు•చొప్పన, వారలు వాయురూపమై
నిలువుము యట్లె నీకతన • నేత్రనిమీలన మొందు భూతముల్. ౧౧౦౬

### తాత్పర్యము

దేవతలును సంతోషించినవారై నిమితో నీజీవ మెందు నిలుపుదుము,చెప్పు మనిరి. అప్పు డాయన దేవతలారా! అన్ని భూతముల దృష్టులయం దుండఁగోరెద నన వారును నాగాదివాయురూపమై నీవు కోరినట్లే రెప్పలయం దుండుము. నీవలననే ప్రాణులు కన్నులు మూయఁ గలుగును.

క. అలఁతి దొలంగఁగ రెప్పలు, పలుమాఱును మూయు భూత•కటలియటంచున్
బలికి సుర లేగ మానులు, చిలికిరి నిమిమేన నరణిఁ • జేర్చి సవిధిగన్. ౧౧౦౭

### తాత్పర్యము

దృష్టులకు బడలిక తొలఁగుటకై రెప్పలు పలుమాఱు ప్రాణులుమూయుననిచెప్పి దేవతలు పోవగా మునులా నిమి దేహమున నరణి యథావిధిఁజేర్చిమథించిరి.

క. తనయార్థంబుగ దానన్, జనియించెను మిథి యనంగ ♦ క్ష్మాపతి మథనం
బునఁ బుట్టుట మిథి యయ్యెన్, జననం బందుట నతండు♦జనకుం డయ్యెన్.

తా త్ప ర్య ము

ఇట్లు పుత్రుని నిమిత్తమై చిలుకఁగా దానియందు మిథి యనువాఁడు జనించెను మథనమున జనించినవాఁడు కావున నారాజు మిథియయ్యెను. జనన మందుటచే జనకుఁ డయ్యెను.

క. అతఁడు విదేహమున సం,జాతుం డగు హేతువునను ♦ జని వైదేహ
ఖ్యాతిని మథి నిర్మించుట, భూతలమున మిథిలయనఁగఁ ♦ బురవర మొప్పెన్.

తా త్ప ర్య ము

అతఁడు విదేహమున దేహము లేనివానియందుఁ బుట్టినవాఁడు కావుఁన వైదేహుఁడను పేరు గాంచెను. ఆ మిథి నిర్మించిన నగరము మిథిల యయ్యెను.

**—♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు యయాతి చరిత్రముఁ దెలుపుట ♦—**

చ. అనవుడు లక్ష్మణుం డనియె ♦ నార! విచిత్ర చరిత్ర మెట్టు లా
జనపతి క్షత్రియుండు బల♦శౌర్యధురంధరుఁ డందు దీక్షితుం
డును గడ కోపమున్ నిలుప ♦ నూల్కొనకట్లు వసిష్ఠునిన్ శపిం
చినకత మేమొ శాంతిని భ♦జింపఁ డదేటికొ? భూవరోత్తమా! ౧౧౧౦

తా త్ప ర్య ము

అని చెప్పఁగా లక్ష్మణుఁ డిట్లనియె, ఓరా, ఆశ్చర్యము! ఆరాజు క్షత్రియుఁడు, బలశాలి, అందు యజ్ఞదీక్ష వహించినవాఁడు కదా! ఇట్టి సమయంబునఁ గోపింపరాదే కోపము నిలుపఁ బ్రయత్నింపక యేల వసిష్ఠుని శపించెను. ఏల శాంతిని బొందఁ డయ్యెను.

ఉ. నావుడు రాఘవుం డనియె ♦ నాయన! కోప మణంప దుస్సహం
బావిధి శక్య మౌనొకొ య♦యాతికిఁ దప్పఁగఁ దక్కువారికిన్
భూవిభులందు సత్త్వగుణ♦పూర్ణుఁ డతండు వచింతు విస్మిత
శ్లావహపూర్వవృత్త మని ♦ సమ్మతిఁ జెప్పఁదొడంగె నివ్విధిన్. ౧౧౧౧

తా త్ప ర్య ము

అని యడుగఁగా రామచంద్రుఁ డిట్లనియె, నాయనా! కోపమణఁచుట మిగులఁ గష్టకార్యము. అది యయాతికిఁ దప్పఁ దక్కిన వారికి సాధ్యముగాదు. రాజులలో సత్త్వగుణముచే నిండిన వాఁ డతఁడు. ఆ రాజుయొక్క పూర్వవృత్తాంతము చెప్పెద వినుము. అని యిట్లు చెప్ప నారంభించెను.

సీ.నహుషునకును బ్రియ♦నందనుండు యయాతి,యతని కిద్దఱురూప♦వతులుసతులు
వృషపర్వతనయ శ♦ర్మిష్ఠ యన్ దైతేయి శుక్రునికూఁతురు ♦ సుందరాంగి
దేవయాని యనంగ ♦ నా వరవర్ణినుల్, తనయులఁ గాంచిరి♦దర్పధనులఁ
బూరుండు శర్మిష్ఠ♦పుత్రకుండు, యదుండు దేవయానిసుతుండు ♦భూవిభుండు

తే. తల్లి శర్మిష్ఠ ప్రియ యాటఁ ♦దనయుఁ బూరు
మిగుల లాలింప యదువు లో ♦ వగవు చెంది
తల్లి డాయంగఁ జని శోక♦దైన్యములను
బలుకఁ దన హృద్గతం బెల్ల ♦ దెలియఁబడఁగ. ౧౧౧౨

అర్థములు. వరవర్ణినుల్=ఉత్తమస్త్రీలు, హృద్గతంబు=మనస్సునఁగలది.

తా త్ప ర్య ము

నహుషునకు యయాతి కొడుకు, అతని కిరువురు భార్యలు. అందు వృష పర్వుఁడను రాజుకూతురు శర్మిష్ఠ. శుక్రాచార్యుని కూఁతురు దేవయాని ఆయిరు వురకుఁ గొడుకులు గలరు. శర్మిష్ఠ కొడుకు పూరుఁడు. దేవయాని కొడుకుయదువు. ఆరాజునకు శర్మిష్ఠయందుఁ బ్రేమ మెక్కువ యగుటచే దాని కొడుకును విశేష ముగ లాలించును. అది చూచి యదువు తనమనస్సులో జాలఁ దుఃఖించి తల్లి యొద్దకుఁ బోయి తన మనస్సులోని దుఃఖమిట్లు చెప్పెను.

ఉ. పుట్టితి వీవు భార్గవుని♦పుణ్యకులంబున రాజు భార్యవై
యిట్టి మహావమానమును ♦ నీవు సహించెద వెట్లొ? యేల యీ
రట్టడిజీవనంబు? వెన ♦ రమ్ము హుతాశనుఁ జొత్త మిర్వుర
మట్టు లొనర్ప వేని యిపు ♦ డానతి నా కిడు మేను జొచ్చెదన్. ౧౧౧౩

తా త్ప ర్య ము

తల్లీ! నీవు పుణ్యాత్ముఁడగు శుక్రుని కడుపునఁ బుట్టితివి. ఈరాజునకుభార్య వైతివి. అట్టి దాన వీ మహావమానము నెట్లు సహింపఁగలిగియున్నావు ఏల యీ నింద్యమైన బ్రతుకు బ్రదికెదవు. ఈ యవమానపు బ్రదుకు బ్రదుకుటకంటెఁజచ్చిన మేలు గదా. రమ్ము మన మిరువురము అగ్నిలోఁ బడి ప్రాణము విడుతము. అట్లు చేయ నీ వంగీకరింప వేని నాకనుజ్ఞ నిమ్ము. నేను దూఁకి చచ్చెదను.

కం. మన మిర్వురుఁ బోయిన న మ్మనుజేశ్వరుపీడ తెగును ♦ మఱి దానవితో
మనసారఁగ సుఖయించెడు,నని యేడ్చెడు తనయుఁ జూచి♦యతివయు గినుకన్.

తా త్ప ర్య ము

(మన మిద్దఱము చచ్చిన నీ రాజుపీడ వదలును. మనసువచ్చినట్టులు దానవితోఁ గూడి సుఖపడును.అని యేడ్చుచున్న కొడుకునుజూచి దేవయానియుఁగోపముతో)

చం. తనజనకుం దలంచిన య◆థాత్వర మాతఁడు వచ్చి యేడ్చు న
త్తనయను గాంచి యేటి కిటు ◆ దైన్యము నొందితి కూఁతురా? యనం
దనువు విషాగ్ని నీరముల ◆ నాశముఁ జేసెద. నింక భూమిపై
మన మన పొప్పు, దేల యవ ◆ మానపుమన్గడ బ్రాహ్మణోత్తమా! ౧౧౧౫

అర్థములు. యథాత్వరము=శీఘ్రముగ, తనువున్=దేహమును, విష=విషము త్రాగుటచేఁగాని, అగ్ని=నిప్పులలో దుముకుటచేఁగాని, నీరములన్=నీళ్ళలోఁ బడుటచేఁగాని, మనన్=బ్రదుకుటకు, అవమానపు మన్గడ=అవమానపు బ్రదుకు.

తాత్పర్యము

(తన తండ్రినిఁ దలఁచెను. శీఘ్రముగా వచ్చి యేడ్చుచున్న కూఁతునుజూచి 'కూఁతురా! నీవేల యిట్లు ఏడ్చుచున్నా'వని యడుగ, విషము త్రాగిగాని, నిప్పులలో దుమికిగాని, నీళ్ళలోఁబడిగాని యీ దేహమును వదలెదను. ఇఁక భూమి మీఁద బ్రదుకు మనసొప్పకున్నది. అవమానపు బ్రదుకేల?)

కం. ఇచ్చితివి కాని యొకనికి, వచ్చితివో? కీడు మేలు ◆ ప్రశ్నించితివో?
చచ్చితినో యున్నానో, మచ్చరితము నీ వెఱుంగ◆మనసొల్లదుగా? ౧౧౧౬

తాత్పర్యము

(ఒకనికి నన్నిచ్చితివి కాని యొకనాఁడేని వచ్చితివా? మంచి చెడ్డలడిగితివా? చచ్చితినో బ్రదికినానో ఈ విషయము నీవు తెలిసికొన నీకుఁబట్టదయ్యెను.)

కం. నా కడుపు మంట యేమని నీకున్ వినిపింతు నెఱుఁగ ◆ నీ వొల్లనిచో
లోకమున వృక్షమెండిన, నాకులు పూ లిగురులుం ద◆మంతటఁ జెడెడిన్. ౧౧౧౭

తాత్పర్యము

(నా కడుపు మంట నీకేమని వినిపింపగలను? నీ కిష్టము లేదాయె. లోకములోఁ జెట్టు యెండిపోయిన నాకులు పూలు చిగుళ్ళు తమంతటనే చెడిపోవును గదా.)

కం. పెద్ద వని నీకె సత్కృతి, దుద్దిడె నట యేల నాగ◆తు ల్పలుకంగా
నద్దానవి వలలం బడి, కద్దుగ నీయల్లుఁ డెపుడుఁ◆బలుకఁడు నాతోన్. ౧౧౧౮

అర్థములు. సత్కృతిన్=గౌరవమునందు, దుద్దుఇడెను=సున్న చుట్టెను.

తాత్పర్యము

పెద్దవాఁడవని నిన్నే యతఁడు గౌరవింపకున్నాఁడఁట. ఇఁక నాగతి నేనేమి చెప్పుదును. ఆ దానవరాజు పుత్రిక వలలోఁబడి నీ యల్లుఁడు నాతోఁ బలుకనైన నిష్టపడఁడు.

ఉ. నా మొగ మేనియుం గనఁడు ♦ నాయిలుచాయనఁ ద్రొక్కనొల్లఁడే
మేమొ వినోదముల్సలుపు ♦ చెప్పుడు దానవియింట నుండెడిన్
భూమివిభుండు దా నగుట ♦ భూమిధవాత్మజఁ గోరుఁ గాక తా
నేమని కోరుఁ జుక్కగమి ♦ నెన్నెడి బాఁపనవాని కన్నియన్. ౧౧౧౯

అర్థములు. భూమిధవాత్మజన్=రాజుకూఁతును, చుక్కగమి నెన్నెడి=నక్షత్రము లెంచుకొనుచు నుండెడి, బాఁపనవాని కన్నియన్ = బ్రాహ్మణుని కుమారితను.

తాత్పర్యము

(నా మొగమైనఁ జూడఁడు. నా యింటి నీడనైనఁ ద్రొక్కనిష్టపడఁడు. ఏమేమొ వినోదములు సేయుచు నా దానవి యింటిలో నుండును. రాజు, రాజుకూఁతును, గోరునుగాని, పంచాంగము చెప్పికొను బాపనవాని కూతు నేమని యాశించును?)

—♦ యయాతి పూరునకు వార్ధక మిచ్చి యౌవనంబుఁ గొనుట ♦—

చం. అనవుడుఁ గోపరక్తనయ♦నాంతుఁడు కావ్యుఁడు భూమినాథుతో
ననె నిది యేమి భూపతి! మ♦దాత్మజ నొల్లక న న్నవజ్ఞ సే
సిన నయిరింతు నే? కుమతి ♦ చెచ్చెర యౌవన మూడి డొక్కవై
దినములు ద్రోయుమీ యనుచుఁ♦దిట్టె ప్రసన్నను జేసి యాత్మజన్. ౧౧౨౦

అర్థములు. కోపరక్తనయనాంతుఁడు=కోపముచే నెఱ్ఱనైన కనుగొనలు గలవాఁడు, కావ్యుఁడు=శుక్రాచార్యుఁడు, మదాత్మజన్=నాబిడ్డను, అవజ్ఞ సేసినన్=అవమానించిన, కుమతి=కుత్సితపు బుద్ధి గలవాఁడు, డొక్కవై=బడుగు ముసలివాఁడవై, ప్రసన్నను=సంతోషించినదానిని.

తాత్పర్యము

అని చెప్పఁగాఁ గోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి రాజును జూచి యేమిరాజా! నాకూఁతు నొల్లక నన్నవమానించితివి. నే నిచ్చిన దాసిని నీ వవమానించుట నన్నవమానించుటయే కదా! నీ విట్లు చేయుటకు యౌవనబలము కారణముగదా. కావున నీ యౌవనము నశించి బడుగు ముసలి వాడవై జీవింపుము. అని శపించి తనకూఁతు నమాధాన పఱిచెను.

కం. అరిగెఁ దనయింటి కానృప,వరుఁడు జరాక్రాంతుఁడగుచు♦వనరుచు యదువుం
బిలిపించి విషయసుఖములఁ, బరితృప్తుఁడఁ గాను, గలదు♦వాంఛ సుఖింపన్.

అర్థములు. జరాక్రాంతుఁడు=ముసలితనముచే నాక్రమింపఁబడినవాఁడు, వనరుచున్=శోకించుచు.

తా త్ప ర్య ము

(ఆ యయాతి ముసలి తనముచే నాక్రమింపఁబడిన వాఁడయి దుఃఖపడుచుఁ దన యింటికిఁ బోయెను. అందుఁ దన పెద్దకొడుకును జూచి నాయనా! నా కింకను విషయసుఖములందుఁ దృప్తి తీరలేదు. ఇంకను సుఖపడవలెనని యాశగలదు.)

కం. నీ జవ్వన మొసఁగుము నా, కీ జర గ్రహియింపు మనిన • నిట్లను నతఁడున్
రాజా! నిముద్దులసుతుఁ, నీ జర గ్రహియింప నిమ్ము • నే నిందునకా. ౧౧-౨౨

అర్థము:ఃఖ. జవ్వనము=యౌవనము ప్రాయము, జర=ముసలితనము.

తా త్ప ర్య ము

(నీ యౌవనము నాకిమ్ము నా ముసలితనము నీవు తీసికొనుము. అని చెప్పఁగా నతఁ డిట్లనెను, నీ ముద్దులకొడుకునకు నీ ముసలితనము నిమ్ము-ముద్దు ముచ్చటలకు వాఁడు, దీనికి నేనా?)

చం. జనకుఁడ వై బహిష్కృతునిఁ • జల్పితి నీవు సుఖాళిపట్ల, నన్
జనవునఁ జేర నిచ్చితివె • సమ్మతి నెయ్యెడ నేని? దీనికిన్
దనయుఁడ నైతి నోటు? నిర•తంబును లాలన చేసి పెంచు నీ
తనయుఁడు పూరుఁడే జరను • దాల్చెడుఁ, నే సహియింప దీనినిన్. ౧౧-౨౩

తా త్ప ర్య ము

నీవు నాకుఁ గన్నతండ్రివై యుండియు సుఖములందు నన్ను దూరముగ నుంచితివి. భోగములందు దేనియందైన నన్నుఁ జనవుగ దగ్గఱఁ దీసితివా! వీని యందు నేను నీకుఁ గొడుకను గాను గాని ముసలిబడుగునై పోవుటకు నీ కుమారుఁడ నైతిఁ గాఁబోలు. ఆ భోగము లనుభవించిన నీ కొడుకే యీ రోగము ననుభవింప నిమ్ము, నేను దీనిని సహింప లేను.

కం. ఆడఁగఁ బాడఁగ వేడుక, గూడఁగఁ బూరుండు జరను•గొన యదు వహహా
పాడి గదా యిటు ప్రజఁ గా, పాడెడి జేనికిని దాయ•భాగము పెట్టన్. ౧౧-౨౪

తా త్ప ర్య ము

(ఆటకుఁ బాటకు నద్దుకు ముద్దుకుఁ బూరుఁడు, ముదుసలి తనము గ్రహింప యదువు-అహహా మంచి న్యాయము ప్రజలఁ బాలించు రాజన్నదమ్ములకు దాయ భాగ పెట్టు న్యాయ మిదికదా.)

చం. అనుచు యయాతి పూరుని మ•దర్థము నీవె జరన్ గ్రహింపుమీ
యన నతఁ డేని ధన్యుఁడ మ•హాత్మక! కాదన నోరు వచ్చునే
జనకుని యాజ్ఞ నా నృపతి • సంతస మొందుచు వార్థకంబుఁ ద
త్తనయున కిచ్చి యౌవనముఁ • దాఁ గొని యేఁడులు పూఁడు లాదటన్.

అర్థములు. మదర్థము=నా నిమిత్తము, జరన్=ముసలితనమును, ఏడులు పూఁడులు=అనేక సంవత్సరములు.

### తాత్పర్యము

(అని పలుక, యయాతి పూరునిఁ జూచి, 'వత్సా, నా ముసలితనము నీవు గ్రహింపు మన, నాతఁడు నేనే ధన్యుఁడను తండ్రీ? మీయాజ్ఞ 'నిరాకరింపఁ దగునా?' అనఁగా నా రాజు సంతసించి, తన ముసలితనమును గొడుకున కిచ్చి యాతని పడుచుఁ దనమును దాను దీసికొని యనేక సంవత్సరములు.)

చం. అతులిత సౌఖ్యసంపదల ♦ నందుచు నుండి తదాశ దీఱుడున్
సుతుఁ గని వారకంబుగను ♦ సుందరయౌవన మే గ్రహించి త
త్ప్రతిగ జరాభరం బిడితిఁ ♦ దాల్పఁగ నీకడ, నింక నాజరన్
వెతలు దొలంగ నీకు గుణ ♦ విక్రమధుర్య యొసంగు క్రమ్మఱన్. ౧౧-౨౬

అర్థములు. తదాశ=ఆయాశ, కామసుఖములందలి యాస, తీఱుడున్=క్షయింపఁగా, వారకము=ఇల్లడ, తత్+ప్రతిగ=దానికి మాఱుగ, గుణవిక్రమధుర్య=గుణములందు విక్రమ మందు సమర్థుఁడా.

### తాత్పర్యము

అసమాన సౌఖ్యాతిశయము లనుభవించుచుండి వానియందలి యాశ నశింపఁగా కొడుకును జూచి నీ యౌవనమును నేను గ్రహించి దానికి మాఱుగ నిల్లడగా నా ముసలితనము నీ కిచ్చియుంటిని. ఇక నా జరబాధ నీకుఁ దొలఁగునట్లు నాజర నా కిచ్చి నీ యౌవనము నీవు గైకొమ్ము.

కం. నా యాజ్ఞం బాలించుట నీ యవనికి న్నానర్తు ♦ నేలికగా నం
చా యవనీశుఁడు కోపముతో యదువుం గాంచి పలికె♦దుష్టాత్మకుఁడా! ౧౧-౨౭

అర్థములు. ఏలిక=ప్రభువు, దుష్టాత్మకుఁడా=చెడు మనస్సుగలవాఁడా

### తాత్పర్యము

(నా యాజ్ఞను బాలించుటచేత నీ భూమికి నిన్ను రాజుగాఁ జేసెదను, అని చెప్పుచు నా రాజు కోపముతో యదువును జూచి యిట్లని చెప్పెను. చెడుమనస్సు గలవాఁడా?

కం. తనుజుఁడవు గావు నీ వొక. దనుజుండవు పుట్టి తింటఁ ♦ దనయాకృతిపై
నను ధిక్కరించి పలికితి చను నే? రాజ్యాధిపత్య♦సరణిం జెడుమీ. ౧౧-౨౮

అర్థములు. తనుజుఁడవు=పుత్రుఁడవు, దనుజుండవు=రాక్షసుఁడవు, రాజ్యాధిపత్యసరణిన్=రాజ్యమునకు నధిపతి యగు మార్గమునందు.

### తాత్పర్యము

పెద్ద కొడుక వగుటచే నా వెనుక నీవు రాజవు కావలసి యుండినను నన్ను ధిక్కరించి పలికితివి కావున నీకు రాజ్యాధిపత్యము లేకపోవునుగాక!

చం. జనకుఁడ నంచు గౌరవము సల్పక నోరికి వచ్చినట్లు న
  న్నని యెదె? యాతుధానుల మహాకఠినాత్ముల నీవు గాంచుమీ
  వినయవిదూర! సోమకులవిశ్రుతి యొందదు నీదు సంతతిన్
  గని యెదు దుర్వినీతులఁ బోకాలు మటంచు సుశీలుఁ బూరునిన్. ౧౧౩౯

అర్థములు. యాతుధానులన్=రాక్షసులను, మహాకఠినాత్ములన్=మిగులఁ గఠినమైన మనస్సు గలవారిని, వినయవిదూర=అణఁకువ లేనివాఁడా, దుర్వినీతులన్=వినయము లేనివారిని, చెడునీతి గలవారిని.

### తాత్పర్యము

తండ్రియను గౌరవము నెంచక నీ నోటికి వచ్చినట్లు నన్ను మాటలాడితి గదా. కావున రాక్షసులను కఠినమనస్సుగల వారిని నీవు కుమారులుగాఁ గనుము. వినయము లేనివాఁడా! సోమవంశపురాజులను కీర్తి నీ సంతతివారికి లేకుండును గాక ఛీ పో. యని చెప్పి మంచి నడవడి గల పూరునిఁ జూచి.

కం. ధర కధిపతిఁగా నొనరిచి, యరిగెన్ విదితాత్ముఁ డగుచు నాశ్రమమునకున్
  జరుగ నటు కొంతకాలము, సురపురి కతఁ డేగ నతని సుతుఁడు ప్రభుండై. ౧౧౪౦

అర్థములు. ఆశ్రమమునకున్=వానప్రస్థాశ్రమమునకు.

### తాత్పర్యము

(భూమికి రాజుగాఁ జేసి యయాతి వానప్రస్థాశ్రమమున కేగెను. కొంత కాలము జరిగినంత నతండు స్వర్గమునకుఁ బోయెను. ఆ పిమ్మట నాతని కొడుకు రాజై.)

కం. పూరుఁడు కాశీరాజ్యము, ధీరతఁ బాలించెఁ బురి ప్రతిష్ఠానముగాఁ
  గ్రూరులను యాతుధానుల, వారకె పెక్కురను యదువు వంశము నిలుపన్.

అర్థములు. పురిప్రతిష్ఠానముగా=ప్రతిష్ఠాన మను నగరము రాజధానిగా.

### తాత్పర్యము

(పూరుఁడు కాశీరాజ్యము ప్రతిష్ఠానము (ఝూసి) రాజధానిగా ధీరుఁడై పాలించెను. యదువు వంశము నిలుపుట కనేకులను క్రూరులగు రాక్షసులను గనెను.)

కం. కాంచెను బహిష్కృతుండై, క్రౌంచవనంబునను దుర్గ•రన వసియించెన్
మించిన కినుకను గని శపియించిన నాహుషుఁడు మరల • నే మనఁ డయ్యెన్=

అర్థములు. బహిష్కృతుండై=బహిష్కరింపఁబడినవాఁడై, దుర్గరసన్. దుర్గభూమియందు, కవి=శుక్రుఁడు, శపించినను=తిట్టినను, నాహుషుఁడు=నహుషుని కుమారుఁడు యయాతి, మరల నేమనఁడయ్యెన్=బదులు తిట్టినవాఁడు కాఁడు.

తాత్పర్యము

(తండ్రిచే బహిష్కరింపఁ బడి క్రౌంచవనములో దుర్గభూమి యందు వాసము చేసెను. శుక్రుఁడతి కోపముతోఁ దిట్టినను యయాతి బదులు తిట్టిన వాఁడు కాడు.)

తే. ఆలకించితె యనుజ య•యాతి శాంతి
మనల నృగుదోష మంటమి • కనఁగవలయు
ననుచు నుండఁ గుసుంభ వ•స్త్రావకుంఠి
తము గతిని మిన్ను సాంధ్య రా•గమునఁ బొలిచె. ౧౧౩౩

అర్థములు. కుసుంభవర్ణ=ఎఱ్ఱవర్ణముగల, వస్త్ర=గుడ్డచే, అవకుంఠిత గతిని=ముసుఁగు వేసికొనిన దానివలె, మిన్ను=ఆకాశము, సాంధ్యరాగమునన్=సంజకెంజాయలచే, పొలిచెను=ఒప్పెను.

తాత్పర్యము

(లక్ష్మణా! వింటివా? యయాతి శాంతి! మనలకు నృగునకుఁ గలిగిన దోషము రాకుండఁ జూచుకొనవలెను సుమా? అని చెప్పుచుండఁగా, నెఱ్ఱని వస్త్రము ముసుఁగు వేసికొనిన దానివలె నాకాశము సంజకెంజాయలచే నొప్పెను.)

## —• చ్యవనాదులు శ్రీరాము దర్శింప వచ్చుట *—

సీ. అన్నదమ్ములు ముచ్చ•టాడుచుండిరి యిట్టు లవని రక్షాక్రియా•నంతరమున
జరుగఁగొన్ని దినాలు•చలియు వేఁడియుఁగాక, సౌఖ్యంబుఁగూర్చు వా•సంతరాత్రు
లొదవఁగ నొకనాఁటి•యుదయంబునను నాహ్ని,కంబులఁ దీరిచి•కార్యమొనరి
పౌరులు వచ్చిరే•పరికింపు మనఁగ సు,మంత్రుండు రాజేంద్ర!•మౌనివరులు

తే. వచ్చియున్నార, లాఁగిన•ద్వారమంద,నిలిచియున్నారు, నినుఁజూడఁ•దలచినారు
వారు చ్యవనుండు మున్నుగా•వచ్చినారు, కార్యభర మేదియో వారు•కలిగినారు.

అర్థములు. అవని రక్షాక్రియానంతరమునన్=భూపరిపాలన కార్యము ముగిసిన తరువాత, వాసంతరాత్రులు = వసంతకాలసంబంధమైన రాత్రులు, ఆఁగినన్=అడ్డగింపఁగా, కార్యభరము=గొప్పకార్యము.

తా త్ప ర్య ము

రాజకీయ కార్యములు ముగిసిన తరువాత నన్నదమ్ములీప్రకారము ముచ్చట లాడుచుండిరి. ఇట్లు కొన్ని దినాలు జరుగఁగా వసంతకాలము ప్రాప్తించెను. దిన ములు మిగుల వేఁడిమిగాక చలిగాక సౌఖ్య కరములై యుండెను. అప్పుడొక నాఁటి యుదయమున నిత్యకృత్యములు తీర్చుకొని సుమంత్రా! యెవరైనఁ బనిగలిగి వచ్చిరేమో చూడుమని చెప్పఁగా నతఁడు రాజేంద్రా! చ్యవనుఁడు మొదలగు మునులేదియో గొప్ప కార్యము గలవారై వచ్చినారు. నిలుపఁగా వాకిట నిలిచి యున్నారు.

కం. యమునాతీరనివాసులు, మిముఁజూడఁగఁ దొందరపడి ♦ మీతో భూమీ
రమణా! చెప్పఁగఁ బంచిరి, విమలాత్మకు లనిన వారి ♦ వేతో డ్తెమ్మా. ౧౧౩౫

తా త్ప ర్య ము

(మహారాజా! యమునానది తీరమున వసించు మహామునులు మిమ్ముఁజూచు టకుఁ దొందరపడి మీతోఁ జెప్పఁగాఁ బంపినారని విన్నవింప వారిని వేగముగాఁ దీసికొనిరమ్ము)

ఉ. నావుడు రాజునాజ్ఞ ముని ♦ నాథులకున్ నతిచేసి లోనికిన్
గావలివాఁడు పో విడువ ♦ గాఢతపోజ్జ్వలితాంగు లందఱున్
క్ష్మావిభుమందిరాంతరము ♦ చయ్యనఁ జొచ్చిరి నార్వు రమ్మహా
భావులఁ బూజ చేసె గుణ ♦ భద్రుడు రాముఁడు యుక్తరీతిగన్. ౧౧౩౬

అర్థములు. నతిచేసి=నమస్కరించి, గాఢతపోజ్జ్వలితాంగులు=అధిక తప స్సుచే వగ్నివలెఁ బ్రకాశించు దేహములు గలవారు, మందిరాంతరము=ఇంటి లోపల, మహాభావులన్=గొప్ప మహిమగలవారిని, యుక్తరీతిగన్=యోగ్యమైన విధముగ.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగాఁ గావలివాఁడు రాజునాజ్ఞను బడసి మునీశ్వరులకు నమస్క రించి లోపలికిఁ బోవిడువఁగా నధికతపస్సుచే నగ్నివలె బ్రకాశించు దేహములు గల వారందఱును రాజమందిరములోనికి వెంటనే ప్రవేశించిరి. మహానుభావుల నానార్వురను యోగ్యమగు విధమున శ్రీరామప్రభువు వారినిఁ బూజించెను.)

చ. మునులు సమస్తతీర్థపరి ♦ పూర్ణసుసంస్కృతపూత పాత్రముల్
జనపతికిన్ మనోజ్ఞఫల ♦ సంచయ మీయఁగఁ బ్రీతియుక్తుఁడై
కొని మునులార! నాయెడలఁ ♦ గూరిమిఁ జేసి సమర్హపీఠులం
గొనఁ డన హేమపీఠములఁ ♦ గూరుమునంబునఁ గూరుచుండినన్. ౧౧౩౭

అర్థములు. సమస్తతీర్థ=అన్ని తీర్థములచే, పరిపూర్ణ=నిండిన, సుసం స్కృత=సంస్కరింపఁబడిన, పూత=పవిత్రములైన, పాత్రముల్ = పాత్రలను,

మనోజ్ఞ=ఇంపైన, ఫల సంచయము = ఫలసమూహము, హేమపీఠములన్= బంగారు పీఁటలయందు.

తాత్పర్యము

(మునీంద్రులు సమస్తతీర్థములతో నింపిన చక్కఁగ సంస్కరింపఁబడిన పవిత్రములగు పాత్రలను, యింపైన ఫలసమూహమును నీయఁగాఁ బ్రీతితో వానిని దీసికొని, మునులారా! నాయెడలఁ బ్రేమముంచి వేంచేయుఁడన వారు బంగారు పీఁటల మీఁద సంతోషముతోఁ గూర్చుండఁగా,)

కం. భూపతి కరములు మోడిచి, తాపసులం గాంచి యనిరొ♦దయ సెలవిడుఁడీ
యేపనికై యిట రా, నాజ్ఞాపింపుఁడు దేనిఁ జేయ ♦ సమ్మతి మీకున్. ౧౧౩౮

అర్థములు. సెలవిడుఁడీ=చెప్పుఁడీ.

తాత్పర్యము

(రామచంద్రప్రభువు చేతులు జోడించి మునులను జూచి, దయతో సెల విండు! ఏమిపనికై వేంచేసితిరి? ఆజ్ఞాపింపుఁడు, మీకు సమ్మతమగు నది యేది?)

కం. ఈరాజ్యం బీదేహం, బీ రమయును జీవితంబు ♦ నిన్నియు ద్విజసం
వారనిమిత్తము చూడుఁడు. సారతపశ్శీలులార! ♦ సత్యం బంటిన్. ౧౧౩౯

అర్థములు. ఈరమ=ఈసంపత్తు, జీవితంబు=ప్రాణము, ద్విజసంవార నిమిత్తము=బ్రాహ్మణ సమూహముల కార్యములు నెఱవేర్చుకొఱకే.

తాత్పర్యము

(ఈ రాజ్యము, యీ దేహము, యీ సంపద, వేయేల నా జీవితము బ్రాహ్మణుల కార్యముల నెఱవేర్చుటకొఱకే-మునిశ్రేష్ఠులార! నిజము చెప్పుచుంటిని.)

## —♦ చ్యవనుఁడు లవణవృత్తాంతము శ్రీరామునకుఁ దెలుపుట ♦—

చ. అనవుడు మేలు మేలని మ♦హర్షులు మెచ్చుచుఁ బల్కిరో జనా
వనకుశలా! మహాత్మ! యిటు♦పల్కఁగ నీ వొకరుండు గాక యే
జనపతి శక్తియుక్తుఁ డగు ♦ న్మాత్మపతు లెందఱో యాలకించి మా
పని మఱి కార్యగౌరవము ♦ భావనచేసి వచింప నేనుడిన్. ౧౧౪౦

అర్థములు. జనావనకుశలా=ప్రజల రక్షించు నేర్పుగలవాఁడా, ఏ జనపతి= ఏ రాజు, శక్తియుక్తుఁ డగున్=శక్తిగలవాఁడగును, కార్యగౌరవము = యందలి భారము, ఏ నుడిన్=ఏ మాటయును.

తాత్పర్యము

అని చెప్పఁగా మునులు మేలుమేలని శ్లాఘించుచు నిట్లు చెప్పిరి. ప్రజారక్షణ దక్షా! మహాత్మా! నీవు చెప్పినట్లు చెప్ప నీ వొకఁడవే సమర్థుఁడవు. మఱి యేరా

నిట్లు చెప్పలేదు. మాకార్యములను గుఱించి మొందఱ రాజులతోనో చెప్పితిమి. పనియందలికష్ట మాలోచించి యెవరును ప్రత్యుత్తర మిచ్చినవారు గారు.

క. నీ వన మాకార్యము తెలిఁ గావంతయు నెఱుఁగకయును • నాడితి బాసన్
గావింతు ననుచు విప్రజ నావళిపై గరుణఁ జేసి • యనఘగుణాఢ్యా! ౧౧౪౧

తాత్పర్యము

నీవో మాపని యెట్టిదో తెలియకున్నను బ్రాహ్మణుల యందలి ప్రీతిచే మా కార్యము చేసెద నని ప్రతిజ్ఞ చేసితివి.

క. కావున మా కార్యంబును, గావింపఁగ నీవ నేర్తు•కాకుత్స్థవరా!
మావాక్యము విని మఱి మా,కావహిలం జేసి సౌఖ్య•మణఁపుము భీతిన్. ౧౧౪౨

అర్థములు. ఆవహిలంజేసి=కలిగించి.

తాత్పర్యము

(కావున మాకార్యమును నిర్వహింప నీవే చాలిన వాఁడవు రామచంద్రా! మామాట విని మాకు సౌఖ్యము కలుగునట్లుచేసి మా భయమును బోఁగొట్టుము.)

చ. అనవుఁడు రాముఁ డిట్లను భ•యం బెది కల్గెను మీకు? దానినిన్
వినిచితి రేని దీర్తు నన • నిస్తుల నిష్ఠుఁడు మౌని భార్గవుం
డను జననాథ? యాదియుగ•మందు మహాబలశాలి లోలకున్
దనయుఁడు శ్రేష్ఠుఁ డుండె మధు•దైత్యుఁడు విప్రులకున్ శరణ్యుఁడై. ౧౧౪౩

అర్థములు. వినిచితి రేని=వినిపించిన పక్షమున, నిస్తులనిష్ఠుఁడు=అసమాన నిష్ఠగలవాఁడు, భార్గవుండు=చ్యవనుఁడు, ఆదియుగమందున్=కృతయుగమందు, లోలకున్=లోలయనెడి స్త్రీకి, శరణ్యుఁడై=రక్షకుఁడై.

తాత్పర్యము

అని వారు చెప్పఁగా బ్రాహ్మణులారా! మీకుఁ గలిగిన భయమేది? దానిని దెలిపితిరేని జక్కఁజేసెదను, అని చెప్పఁగాఁ జ్యవన మహర్షి యిట్లనియె. పూర్వము కృతయుగమందు లోల యను దాని కుమారుఁడు మహాబలవంతుఁడు మధు వను దైత్యుఁడు బ్రాహ్మణులకు రక్షకుఁడై యుండె.

క. మఱిఁ బరినిష్ఠితుఁడై సుర, తతులం బూజించి వారి•దయ కర్హుండై
యతులితతపంబు గౌరీ, పతి మెచ్చఁగఁజేసెఁ బెక్కు•వర్షములంతన్. ౧౧౪౪

అర్థములు. పరినిష్ఠితుఁడై=మిగుల నిష్ఠగలవాఁడై, సురతతులన్=దేవతా సమూహములను, గౌరీపతి=శివుఁడు.

తా త్ప ర్య ము

(మనస్సునందు మిగుల నిష్ఠగలవాఁడై దేవతాసమూహములను బూజించి వారి దయకుఁ బాత్రుఁడై, శివుఁడు మెచ్చునట్లు లనేక సంవత్సరములు సాటి లేని తపము చేసెను.)

క. వానికి మెచ్చి గిరీశుఁడు, మానిత మై మిగుల దీ ప్తి•మంతం బయి య
నన్యూనబలం బగు శూలముఁ దా నొసఁగెం బ్రీతి లాగి • తన శూలమునన్.

అర్థములు. గిరీశుఁడు=శివుఁడు, దీప్తిమంతము=కాంతిగలది, అన్యూన బలంబు=పూర్ణబలము గలది, లాగి=ఆకర్షించి, తన శూలమునుండి వేఱొక శూలము లాగి యతని కిచ్చెను.

తా త్ప ర్య ము

(వాని తపస్సునకు మెచ్చి శివుఁడు తనశూలములోనుండి వేఱొక శూల మును లాగి కాంతి గలిగి పూర్ణబలముగలదాని నొసఁగెను.)

ఉ. ఇచ్చుచు వాని కిట్లను ఋ•షీశ్వర నిర్జరులందు భ క్తి మై
సచ్చరితుండ వై తపముఁ • జల్పుట మెచ్చితి దీని నిచ్చితిన్
మచ్చర మూని నీవు సుర•మండలి విప్రులఁ నేఁచె దేని నీ
కిచ్చటులాయుధంబు పని•యేమియుఁ జేయద వ్యర్థమై చనున్. ౧౧౪౬

• అర్థములు. ఋషీశ్వర నిర్జరులందున్=ఋషీశ్వరులందు దేవతలందు, మచ్చ రము=మాత్సర్యము, విరోధము.

తా త్ప ర్య ము

(ఆ శూలము నిచ్చుచు వానితో నిట్లనెను. ఋషీశ్వరులందు దేవతలందు భక్తి గలిగి సద్వర్తనము గలిగి తపము చేయుటచేత దీని నిచ్చితిని. నీవు విరో ధించి దేవతలను బ్రాహ్మణులను బాధించినచో నీయాయుధమేమియుఁ బని చేయదు; వ్యర్థమగును.)

క. నీతో రణమున కెవఁడే, నేతెంచిన యేని వాని•నిలఁ గూల్చి యథా
రీతిఁ జనుదెంచుఁ జుమి నీ, చేతికి మఱి యనిన దనుజ•శేఖరుఁ డనియెన్. ౧౧౪౭

తా త్ప ర్య ము

(నీతో నెవఁడైన యుద్ధము చేయవచ్చిన యెడల వానినిఁ జంపి యెప్పటి యట్ల నీచేతిలోనికి మరల వచ్చును సుమా! అని చెప్పఁగా రాక్షసశ్రేష్ఠుఁ డిట్లని యడిగెను.)

తే. ఇమ్మహాసాధనం బమ•రేంద్రవంద్య!, నాదు వంశంబునంద సం•తతము నిల్వ
నిమ్ము నావుడుఁ గా దట్టు•లిచ్చువాఁడ,నీదుసుతునొద్ద మాత్రంబు•నిల్చునట్లు.

తా త్ప ర్య ము

(ఈ మహాసాధనము నావంశమునందే యెల్లప్పుడుండునట్లు వరమీయవలె నని యడుగ, నట్లే యగును నీ కొడుకునొద్ద మాత్రముండునట్టులిచ్చెదను.)

చ. అనవుడు నల్లె యంచు నతఁ•డాత్మగృహంబున కేగుదెంచి దా
నిని మహితార్చనాదివిధి • నిత్యముఁ బూజ యొనర్చు చుండె, నా
దనుజుఁడు భూరి మందిరము • దానికి నై రచియించె నమ్మధుం
డనలతనూజ విశ్రవసు•నన్వయమందు జనించినట్టిదై. ౧౧౪

అర్థములు. ఆత్మగృహంబునకున్=తన యింటికి, మహితార్చనాదివిధిన్=గొప్పపూజాది కార్యములచే, నిత్యము ప్రతిదినము, అనలతనూజ=అనల యను దాని కూఁతురు.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా 'సరే' యని యాతఁడు తన యింటికి వచ్చి దాని గొప్ప పూజాది కార్యములచేఁ బ్రతిదినము పూజించుచుండెను. ఆ రాక్షసుఁడా శూల మున కొక గొప్పమందిరము కట్టించెను. ఆ మధుఁడు విశ్రవసువంశములోఁ బుట్టిన యనలయను దాని కూఁతురు.)

క. కుంభీనసి యను పేరం, గుంభిని విశ్రుతిని గన్న•కోమలి నేలెన్
జంభారి భయంకరసం, రంభుఁడు లవణుండు సుతుఁడు•రామ! యతనికిన్. ౧౧౫

అర్థములు. కుంభినిన్=భూమియందు, విశ్రుతి=ప్రసిద్ధి, జంభారి భయంకర సంరంభుఁడు=ఇంద్రునకు భయము గలిగించు వేగిరపాటు గలవాఁడు, కుంభీనసిని మధువాత్తికొని వచ్చుట ముందే చెప్పఁబడెను.

తా త్ప ర్య ము

(కుంభీనస యను దానిని పెండ్లముగ నేలుకొనెను. అతని కొడుకు లవణుఁడు-ఇంద్రునకు భయము గలిగించునంతటి వేగిరపాటు కలవాఁడు. రామచంద్రా.)

ఉ. చిన్నటనాఁటి నుండియును • భీకరశీలుఁడు వాఁడు దుష్టుఁ డై
యెన్నియొ పాపకార్యముల • నెప్పుడు జేయుచునుండు. దుర్నీ
తి న్నిజనందనుం గని య•తివ్యథఁ జెందియుఁ గోపగించియున్
గన్నకుమారుఁ డౌట యెది•గాదన కూరక యుండెఁ దండ్రియున్. ౧౧౬

అర్థములు. భీకరశీలుఁడు=భయంకర స్వభావము గలవాఁడు, దుర్నీతిన్=చెడునీతి గలవానిని.

తా త్ప ర్య ము

(వాఁడు చిన్ననాఁటి నుండియు భయంకర స్వభావము కలిగి దుష్టుఁడై యెన్నియో పాపపుఁ బనుల నెల్లప్పుడు చేయుచుండును. దుర్నీతిపరుఁడయిన తన

కొడుకు చేయు పనులను జూచి మనసులోఁ జాల దుఃఖమును బొందియు వాని మీఁదఁ గోపపడియుఁ గన్న కడుపుగుట నేమి చేయఁజాలక యూరకుండెను.)

తే.జనకుఁ డీలోకమునువీడి•చనియెవరుణు,నాలయమునకు సుతునకు•శూలమహిమఁ
దెలిపి; యంతటనుండియుఁ•గలుషహృదయుఁ, డల్లసాధనశక్తి జ•నాళి నేఁచు.

అర్థములు. వరుణు నాలయమునకున్=వరుణ లోకమునకు, హృదయము నుండి నూఱు నాడులు వెలువడును. ఒక్కొక్కటి యొక్కొక్క లోకమార్గమును గలది, ఏనాడి వెంట జీవము పోవునో ఆలోకము ప్రాప్తించును. నాభికి క్రిందుగా పోయెనా యధోలోకములకుఁబోవును, ఏఁచున్=బాధించును.

తాత్పర్యము

(తండ్రి కొడుకునకు శూలముయొక్క మహిమను దెలిపి యీ లోకమును వదలి వరుణ లోకమునకుఁ బోయెను. అప్పటినుండి యా శూలముయొక్క శక్తితో జనులను బాధించు చుండెను.)

తే. అందుఁ దాపసులనిఁక బా•పాత్మునకుఁ,బేలఁబిండియు; శూలంబు•విధమువింటి
వానిశక్తి యెఱింగితే•వారిజాప్త,వంశ్య! మాకింక గతి నీవె•పరమపురుష.

తాత్పర్యము

(అందును తపము చేసికొను మునులనిఁకచోఁ బేలపిండిచేసె. అనఁగా నంత చులుకన-శ్రీరఘురామా! శూలము విధము వాని శక్తి తెలిసెనుగదా. పరమ పురుషా. ఇఁక మాకు నీవే దిక్కు.)

ఉ.కోరితిమయ్య! యెందఱినో • క్రూరచరిత్రభయార్తిఁ గుందుచున్
వీరవరేణ్యులన్ నృపుల • వీని వధింపుఁ డటంచు, నొక్కరేన్
ధీరత వాని మార్కొనఁగ • దెంపు వహింపరు, పంక్తికంఠసం
హారము నీదుచేత విని • హర్షముతో గతి నీవె యన్మతిన్. ౧౧౯౪

అర్థములు. క్రూరచరిత్ర భయార్తిన్=క్రూరపు నడవడి గల వానివలని భయము వలనఁ గలిగిన బాధచే.

తాత్పర్యము

(క్రూరపు నడవడిగల రాక్షసుని వలనఁ గలిగిన భయముచే బాధపడుచు నెందఱి రాజులనో వానిని జంపుఁడని ప్రార్థించితిమి, ఒక్క వీరుఁడైనను వాని నెదిరింప సాహసించిన వాఁడు కాఁడు, నీవు రావణుఁ జంపినవార్త విని నీవేగతి యని వచ్చితిమి.

క. అరుదెంచితి మిచ్చటికో, ధరణీవర! మాకు నెపుడు, దాతవు నీవే
కరుణింపుము మాపయి నా,శరవరునిన్ లవణుఁ ద్రుంప • సమకట్టి నృపా!

అర్థములు. త్రాతవు=రక్షకుఁడవు, ఆశరవరునిన్=రాక్షస శ్రేష్ఠుని, సమకట్టి=ప్రయత్నించి.

తా త్ప ర్య ము

(రాజా! యిచ్చటకు వచ్చినాము. మా కెప్పుడును నీవే రక్షకుఁడవు-మాపైఁ గరుణింపుము. రాక్షసశ్రేష్ఠునిఁ జంపఁ బ్రయత్నింపుము.)

క. మాకొదవినయాపద యిది, నీకంటె నెవండు లేఁడు • నిశిచరుఁ ద్రుంపన్
మాకోరికఁ దీర్పఁగ నవఁ, గాకుత్స్థుఁడు పలుకు మౌని•కాండబులకున్. ౧౧౫౬

తా త్ప ర్య ము

(మాకుఁ గలిగిన యాపద యిది. రాక్షసునిఁ జంపి మాకోరిక దీరుపఁ గలవాఁడు నీకంటె సమర్థుఁ డెవఁడును లేఁడు, అని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి మునులతో నిట్లనెను.)

—• శ్రీరాముఁడు మౌనులను లవణు నాహారాదుల నడుగుట •—

క. ఆచారాహారములు ని, శాచరునకు నెవ్వి? యెందుఁ•జరియించును స
త్యాచారులార! పలుకుఁడు, నీచుని వధియింతు మీకు•నెమ్మదిఁ గూర్తున్.

అర్థములు. నిశాచరునకున్=రాక్షసునకు, ఆచారాహారంబులు=ఆచారము, ఆహారము.

తా త్ప ర్య ము.

(మునీశ్వరులారా! యా రాక్షసుని యాచారమెట్టిది? వాని యాహారమేమి? వాఁడెక్కడ సంచరించును? తెలుపుఁడు. ఆ నీచునిఁ జంపెదను. మీకు నెమ్మది గలిగించెదను.)

మ. జననాథాగ్రణి జూచి మౌనులు తదా•చారంబు రౌద్రంబు, యా
తనియాహారము జంతులెల్లను బరా•ర్థ్యం బందు వాచంయముల్,
మనుజవ్యాఘ్రమృగద్విపాదులను రా•మా! చంపి భక్షించెడిన్
దినమున్ వేలుగ, వాస మా మధువనీ•దేశంబు భూమీశ్వరా! ౧౧౫౭.

అర్థములు. తదాచారంబు=వాని యాచారము, రౌద్రంబు=రుద్రసంబంధమైనది, తామసముగుటచే భయంకరమైనది, పరార్థ్యము=ముఖ్యము, ద్విపాదులను=ఏనుఁగులు లోనగు వానిని, వాసము=నివసించు ప్రదేశము, మధువనీదేశంబు=మధువన మను ప్రదేశము.

తా త్ప ర్య ము

రామచంద్రుని జూచి మునులిట్లనిరి. రామా! వాని యాచారము రుద్రసంబంధము, క్రూరము, జంతువులన్నియు వాని కాహారములే. అందు మునీశ్వరులు

ముఖ్యాహారము. మనుష్యులను పులులను మృగములను ఏనుఁగులను ఈ మొద లైన వాని జంపి వేలకొలఁది ప్రతిదినము దినుచుండును. వాఁడు మధువనమున వసించును.

చంపిన వన్నియు వాఁడొకఁడే తినునని భావము గాదు. వాని యాశ్రితులు పరిచారకు లెందఱో కలరుగదా.

తే. ప్రలయవేళను గాలుండు•ప్రజలనెల్ల మ్రింగుమాడ్కిని వావిచ్చి•మ్రింగుచుండు
నంతరాంతరములను స•త్త్వాళి ననిన రామచంద్రుండు తన్మౌని•రాజి కనియె.

అర్థములు. అంతరాంతరములను=నడుమనడుమ, సత్త్వాళిన్=జంతుసమూహములను.

## తాత్పర్యము

(ప్రళయకాలమునఁ గాలుఁడు జనులనెల్ల మ్రింగునట్లు నోరు తెఱచి జంతుసమూహముల నడుమ నడుమ మ్రింగుచుండు నని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి యా మునులతోఁ జెప్పెను.)

క. వదలుఁడు భీతిని రాక్షసుఁ, గదనంబునఁ ద్రుంతు ననుచుఁ•గని తమ్ముల నా
మదయుతు లవణుం జంపఁగ, గదలెదివం డెవ్వ రిపుడు•గైకొనువారో? ౧౧౬౦

అర్థములు. కదనంబునన్=యుద్ధమందు, మదయుతున్=గర్వించిన వానిని.

## తాత్పర్యము

(మునులారా? మీరిఁక భయపడవలదు. యుద్ధములో రాక్షసునిఁ జంపెద నని చెప్పుచుఁ దమ్ములవంకఁ జూచి గర్విష్ఠియగు లవణాసురునిఁ జంపఁబోవు నంతె వరు తీసికొనువారు?)

## —• శత్రుఘ్నుఁడు తాను లవణుఁ జంపఁ బోయెద ననుట •—

తే. భరతశత్రుఘ్నులందు నీ•పాలు గొనఁగ, నెవ్వరోకో కోరువా రన•నెలమి లేచి
భరతుఁ డిట్లను నేనుండ•బాలుఁడైన, లక్ష్మణానుజుఁ బంపఁ ద•లంప నగునె?

## తాత్పర్యము

(భరతశత్రుఘ్ను లిరువురిలో నేపని నెవరు చేయఁగోరెదరు? అని రామచంద్రమూర్తి చెప్పఁగా భరతుఁడు లేచి యన్నా! పెద్దవాఁడను నేనుండఁగాఁ బసివానిని శత్రుఘ్నునిఁ బంపఁదలఁచుట తగునా?

క. నావంతు గాఁగ నిడుఁడీ, యా పేరుని లవణుఁ జంపు•టన శత్రుఘ్నుం
డావాక్యము లాలించి మ,హావినయముతోడ నని యె•నవనీపతితోన్. ౧౧౬౨

### తాత్పర్యము

(ప్రఖ్యాతిగల పేరుగాంచిన యా లవణాసురునిఁ జంపుట నా వంతుగా నను గ్రహింపుఁడు అనఁగా, నా మాటలను శత్రుఘ్నుఁడు విని మహావినయముతో శ్రీరామప్రభువుతో నిట్లు చెప్పెను.)

సీ. భరతుండు శూన్యమా•పట్టనంబు నయోధ్యఁ, బాలించె మీరలు•వనుల నుండి
మీరు వచ్చునందాఁక • నేవిధసుఖమును, దా నెఱుఁగండు సం•తాపగరిమ
ననుభవించెను మహా•వ్యసనంబు లిన్నన్ని,యని చెప్ప నౌనె దుః•ఖావహంపుఁ
బడకను బన్నుండె•ఫలమూలములు మెక్కెఁ, జడలుధరించె వ•స్త్రములుమాని
తే. నారచీరలు దాల్చె నీ•కారణమున, ననట గూరెను సౌఖ్యంబు•పడఁగవలదె
యిప్పుడైనను నే నుండ•నెల్ల వేళ, బంటనై భరతుని దుఃఖ•పఱుప నగునె?

అర్థములు. శూన్యము=రాజు లేనిది.

### తాత్పర్యము

(మీరు రడవులందుండునప్పుడు భరతుఁడు రాజులేని పట్టనమగు నయోధ్యను మీరు తిరిగి వచ్చువఱకుఁ బాలించెను. ఏవిధమైన సుఖము నెఱుఁగఁడు. సంతాపాతిశయమున మహాదుఃఖము లనుభవించెను. అవి యిన్నన్ని యన తరమగునా? దుఃఖమును గలిగించు పడకమీఁదఁ బరుండెను. ఫలములు భుజించెను. జడలు దాల్చెను. వస్త్రములు మాని నారచీరలు కట్టుకొనెను. నీవడవుల నిడుములు పడుచుండుట కోరువక తాను నీకొఱకై కష్టపడెను. ఇప్పుడైనను సుఖపడవలదా? భృత్యుఁడనై నేనెల్ల వేళల సేవించుచుండ భరతుని దుఃఖపెట్టఁ దగునా?)

### శ్రీరాముఁడు లవణుఁ జంపి మధురాపురి నేల శత్రుఘ్ను నాజ్ఞాపించుట

చ. అనవుడు రాముఁ డిట్లను మ•హాభుజ! యట్టుల యౌత, నాదుశా
సనమునఁ బొమ్ము నీవు సుర•శాత్రవుఁ డౌ మధుపట్టనంబునన్
నిను నభిషిక్తుఁ జేసెదను • నీమతిచొప్పున నింద నైకనం
దనుఁడు నిలంగ నిమ్ము, రణ•దక్షుఁడ వీవు వధించి రాక్షసున్. ౧౧-౧౪

అర్థములు. శాసనము=ఆజ్ఞ చే.

### తాత్పర్యము

అని చెప్పఁగా రామచంద్రమూర్తి బలశాలీ! నీవు చెప్పినట్టులే యగును గాక. నా యాజ్ఞప్రకారము నీవు పొమ్ము. నిన్ను దేవవిరోధి యగు మధుని పురమునకు రాజుగా నభిషేకించెదను. నీ యభిప్రాయప్రకారము భరతుం డిందే యుండనిమ్ము. యుద్ధమున సమర్థుఁడ వగు నీవు రాక్షసుని జంపి.

తా త్ప ర్య ము

తే. మేలిపట్టణ మంను ని॰ర్మించి యంద, నీవు రాజ్యంబు చేయుచు ॰ నెమ్మినుండు
శత్రువధ సల్పి రాష్ట్రింబు॰సంగ్రహించి,నృపతినీయని యతఁడేగు॰లిరయమునకు.

తా త్ప ర్య ము

అచ్చటనే పట్టణ మొక్కటికట్టించి యచ్చట నీవు రాజ్యము చేయుచుండుము. విరోధిని జంపి వాని రాష్ట్రము నాక్రమించి ప్రజలను బరిపాలింప రాజు నేర్పాటు చేయనివాఁడు నరకమునకుఁ బోవును.

క. బదులాడకు మెదియేనియు, నెదురాడఁగ రాదు నిన్న ॰ జ్యేష్ఠున కతఁడె
య్యది చెప్పిన నొనరుపఁ దగు, నద నిదియే కొనుమునేఁడ ॰ యభిషేకంబున్.

అర్థములు. అదను=సమయము.

తా త్ప ర్య ము

పెద్దవాఁడు చెప్పిన దానికిఁ బిన్నవాఁడు బదులు చెప్పరాదు. పెద్దవాఁడు చెప్పినట్లు చేయవలెను. కావున నీవు బదులు చెప్పకుము, ఇదియే సమయము, పట్టాభిషేకము చేసికొనుము.

తె. అవనిబుధులు వసిష్ఠాదు ॰ లర్హభంగి, నీకు నొనరింతువా రభి॰షేక మనిన
సిగ్గుపెలుచశత్రుఘ్నుండు ॰ శిరమువంచి, యల్లనల్లన నిట్లను॰నగ్రజునకు. ౧౧౬౭

అర్థములు. పెలుచన్=అతిశయముచే, అల్లనల్లన=మెల్లగా,అగ్రజునకున్= అన్నకు.

తా త్ప ర్య ము

(వసిష్ఠుఁడు లోనగు బ్రాహ్మణు లుచితరీతి నీకుఁ బట్టాభిషేకము చేయఁగల రని చెప్పఁగా, శత్రుఘ్నుఁడు మిగుల సిగ్గుపడి, తలవంచుకొని మెల్ల మెల్లగా నన్నగారితో నిట్లనెను.)

—॰ పట్టాభిషేకం బొల్లక శత్రుఘ్నుడు పరితపించుట —

క. అన్నా! జ్యేష్ఠుం డుండం, బిన్నకు నభిషేక మర్హ॰మే? ధర్మంబె?
యున్నారి నీ నుడిఁ బోవుదు,బన్నుగ దాఁటంగ లేమిఁ॰ద్వచ్ఛాసనమున్. ౧౧౬౮

తా త్ప ర్య ము

అన్నా! పెద్దవాఁడుండగాఁ బిన్నవానికి రాజ్యాభిషేకము తగునా? అది ధర్మమా? అయినను నీ యాజ్ఞమీఱు శక్తిలేదు కావున నీవు చెప్పినట్లుచేసెదను.

సీ. జ్యేష్ఠునకును బిన్న ॰ యెదురాడ రాదని, నీచేత శ్రుతులందు॰నేను వింటి
వినియు నెఱింగియు ॰ విపరీతబుద్ధిచే, భరతునిఁ గాదని ॰ పలికినాఁడ
లవణు వధించెద ॰ బవరాన నేనని, యీమరు క్తంబె యో॰యనఘ చరిత!
యిట్టి దుర్గతిఁ గూర్ప॰హేతువ య్యెను నాకు, వెనుకఁ జింతించుట॰వెఱ్ఱితనము.

ఆ. చేసినట్టికృతికి • శిక్షయియ్యది చాలు, నీకు మాఱు పలుక•నిశ్చలాత్మ!
దండనంబు నాకు • రెండవయది కల్గకుండ గాక మన వ్రో•కంను వినుము.

తాత్పర్యము.

పెద్దవానికిఁ జిన్నవాఁడు బదులు చెప్పరాదని నీవు చెప్పఁగా వింటిని. శ్రుతులు చెప్పఁగా వింటిని. ఏమిప్రయోజనము? విని తెలిసి విపరీత బుద్ధిచే భరతుని నిరాకరించి పలికితిని. ఆయన లవణుని నేను వధించెదననిన, కాదు నేను వధించెద నంటిని ఆచెడు మాటయే యిట్టి దుర్గతి నాకుఁగలుగ కారణమయ్యెను. వెనుకఁజింతించుట వెఱ్ఱితనము. ఒకరికి నెదురాడిన దానికిఁ గలిగిన యీశిక్ష చాలును.నీకు బదులు పలికిన నింకేమి శిక్షగలుగునో?కావున రెండవదండమునాకుఁ గలుగకుండుటకై నీవు చెప్పినట్లు చేసెదను. అయిన నొక మనవి చేసెదవినుము.

ఉ. కోరను రాజ్యమేను రఘు•కుంజర! నీనుడిఁ దీర్ప బోయెదన్
దారితవైరిసంచయ! య•ధర్మము నన్ను స్పృశింపకుండగాఁ
గారుణికాగ్రణీ! కరుణఁ • గావు మటన్నను సంతసించి ధా
త్రీరమణుండు లక్ష్మణుని • దిక్కుఁ గనుంగొని పల్కెనిప్పుడే. ౧౧౭౦

తాత్పర్యము

లవణాసురుని నేను జంపగోరితిని గాని పట్టాభిషిక్తుఁడనై రాజ్యమేల నేను గోరలేదు. నీవు తండ్రియాజ్ఞ చొప్పున నరణ్యముల కేగ్లు పోయితివో నేను నీ మాట నెఱవేర్ప నట్లులే పోయెదను. శత్రుసంహారకా! పితృవాక్యము పరిపాలించి నీవు ధర్మము సంపాదించితివి. ఇప్పుడు నేను జేయఁబోవు కార్యము ధర్మవిరుద్ధమైనది కావున నా యధర్మము నన్నంటకుండ ననుగ్రహింపుము. దయావంతులలో శ్రేష్ఠుఁడా! యిట్లు చేసి నన్ను దయతో రక్షింపుము. అని కోరఁగా సంతోషించి రామచంద్రమూర్తి లక్ష్మణుతో నిట్లనియె.

**—• శ్రీరాముఁడు శత్రుఘ్నుని మధుర కభిషిక్తునిఁ జేయుట •—**

క. భరతుండును నీవును మన,పురజనముల మంత్రివరుల • భూమీసురులన్
వరగం బురోహితుల నిట,కరుదేరఁగఁ బిలువఁ బంపు•డనఁగా వారల్. ౧౧౭౧

తాత్పర్యము.

(భరతుడును నీవును మన పురజనులను, మంత్రులను, బ్రాహ్మణులను బురోహితులను వేగముగా నిచటకు వచ్చుటకుఁ బిలిపింపుఁడని చెప్పఁగా, వారు)

క. అటులే యంచఱుఁ బిలువఁగ, భటులం బంపంగ వారి•బడి నెల్లరు రాఁ
దటకున వినయయుక్తంబుగఁ బటుబలశాలికి సుమిత్ర•పట్టికిఁ బ్రీతిన్. ౧౧౭౨

అర్థములు. వారిబడి=వారి వెంబడి.

తాత్పర్యము

(ఆ ప్రకారమే యందఱను బిలుచుటకు భటులను బంపిరి. వారు పోయి పిలువఁగా వారివెంట నందఱు వచ్చిరి. తత్క్షణము మిగుల బలశాలియగు శత్రుఘ్నునకు బ్రీతితో యథావిధిగా.)

క. రాముఁ డభిషేక మొనరుప, శ్రీమహితుండై యతండు•చెన్నారెను సు
రేశామాదులచేఁ బూర్వము, సామి వెలింగిన విధాన•జనములు పొంగన్.౧౧౭౩

అర్థములు. సురేశామాదులచేన్=ఇంద్రుఁడు మొదలగువారిచే, సామి=కుమారస్వామి.

తాత్పర్యము

(రామచంద్రమూర్తి యభిషేకము చేయఁగాఁ బూర్వ మింద్రాదులచేఁ గుమారస్వామి ప్రకాశించిన విధమున జనులు సంతోషమున నుబ్బిపోవ, శత్రుఘ్నుఁడు శ్రీమహితుఁడై వెలిఁగెను.)

ఆ.పౌరు లలరుచుండ•బ్రాహ్మణుల్ మోదింప,ముగురుతల్లులాత్మ•ముదముఁగూర్చి
దీవనల నొసంగఁ దేజరిల్లెడి సుమి, త్రాత్మజాతుఁ గని ప్ర•హర్షమునను.౧౧౭౪

తాత్పర్యము

(పురజనులు సంతోషించుచుండఁగా, బ్రాహ్మణు లానందించుచుండఁగాఁ దల్లులు ముగ్గురు ముదమున దీవనలీయఁగాఁ దేజరిల్లుచున్న శత్రుఘ్నునిఁ జూచి, మిగుల హర్షముతో.)

క. యమునాతీరగులగు సం,యములును లవణాసురుండు•హతుఁడే యంచుం
దమమనములనమ్మఁగ నరి,దమనుఁడు శత్రుఘ్నుఁజేర్చి•తనయంకమునన్.౧౧౭౫

అర్థములు. యమునాతీరగులు = యమునా నది యొడ్డున నుండువారు, సంయములు=మునులు, అరిదమనుఁడు=శత్రువుల నణఁచువాఁడు, అంకమునన్=తొడయందు.

తాత్పర్యము

(యమునానదీ తీరవాసులయిన మునులు, తమ మనస్సులందిఁక లవణాసురుఁడు చచ్చినవాఁడేయని నమ్మిరి. అంతశత్రువుల నణఁచు శ్రీరామచంద్రుఁడు శత్రుఘ్నుని తన తొడయందుంచుకొని)

## శ్రీరాముఁడు శత్రుఘ్నునకు నారాయణాస్త్రం బొసంగి లవణుఁ జంపు నుపాయంబుఁ దెల్పుట.

సీ.అన్న! శత్రుఘ్న! ది•వ్యంబైన యీశరం,బును గొమ్ము లవణు దీ•నను వధింతు
మున్ను మహార్ణవ•మున స్వయంభువు దేవుఁ, డజితుండు సర్వసు•రాసురులకు
నెల్ల భూశాలి క•దృశ్యుఁడై శయనించి, యున్నవేళ సృజించె•నుగ్రరుషను
మధుకైటభాసుర•మథనంబునకు సర్వ, రాక్షసులను ద్రుంప • రణములోన

ఆ. మూఁడులోకములను•మునుకొని సృజియింపఁ, జంపి కైటభు మధు•జగముసృష్టి
జనులభోగమునకుఁ•జలిపె నీశరశక్తి, వింటి దీని మహిమ•వీరవర్య! ౧౧౭౬

అర్థములు. మున్ను=ప్రలయకాలమున, మహార్ణవమునన్=సముద్రమందు, స్వయంభువు=తనంతటఁదానే పుట్టువాఁడు, ఆయన పుట్టుటకు వే ఱుపాదాన నిమిత్తసహాకారి కారణములు లేవు ఆయన సంకల్పమే కారణము, అజితుండు=జయింపఁబడని వాఁడు, సర్వసురాసురులకున్=అందఱు దేవతలకు రాక్షసులకు, ఎల్ల భూతాళికిన్=ప్రాణుకోటుల కన్నిటికి, అదృశ్యుఁడై=కానరానివాఁడై, ఉగ్రరుషను=తీవ్రమైన కోపముతో, మథనంబునకున్=సంహారమునకు.

తాత్పర్యము

నాయనా! శత్రుఘ్నా! దివ్యమైన యీ బాణమును గ్రహింపుము. దీనితో లవణు వధింపఁగలవు. దీనిని పూర్వము ప్రలయ కాలమున సముద్రమునందు నారాయణుఁడు దేవతలకు రాక్షసులకు సర్వప్రాణులకు నెవరికిఁ గానరాకుండ నట్లు వుండుకొనియుండి మధుకైటభులను సర్వరాక్షసులను జంపుటకుఁగాను దీవ్ర కోపమున దీనిని సృజించెను దీనితో మధుకైటభులను జంపి ప్రజల భోగమునకుఁగాను మూఁడు లోకములను దీనిశక్తిచే సృష్టించెను. దీని మహిమ వింటివి కదా.

ఉ. వైవఁగ లేదు రావణుని•పై నిది యాతనిఁ జంపఁ గోరియున్
హావడిఁ గూర్చుభూతతతి • కంచును, శూలము నీశదత్తమున్
దా విడి యింటఁ బూజకయి • దానవుఁ డేగుఁ బురంబుఁ బాసి యి
చ్ఛావిధి గ్రాసకాంక్షఁ, దను•శత్రువు చీరిన యేని పోరికిన్. ౧౧౭౭

తాత్పర్యము

రావణునిఁ జంపఁగోరియు వాఁడు దీనికిఁ జాలినవాఁడుకాఁడు కావున దీనిని అల్పుఁడగు వానిపై వైచిన వానిని జంపుటే కాక లోకమున నుపద్రవము గలిగించు నని తలఁచి వాని మీఁద దీనిని వేయక సామాన్యములైన యస్త్రముల చేతనే వానిని వధించితిని, వానికంటె బలవంతుఁడు లవణుఁడు ఆహార కాంక్షచే శివుడిచ్చిన శూలమును పూజకై యింటియందే యుంచి పురము వదలి యడవుల లోకిఁ బోవును. ఎవరైన శత్రువులు తన్ను యుద్ధమునకుఁ బిలిచి రేని

క. శూలముఁ గొని వచ్చును నీ, వా లవణుఁడు పురముఁ బా•సి యాహారముకై
హాళి జరియించునదనున,నాలమునకుఁ బిలిచి యతని•నాఁగుము వీఁకన్. ౧౧౭౮

అర్థములు. అదనునన్ = సమయమునను, ఆలమునకున్=యుద్ధమునకు ఆఁగుము=పోరిలోకిఁ బోకుండ నడ్డగింపుము.

తే. పురముద్వారంబునను నిల్చి•సురవిరోధి; పట్టనముఁజొరకుండఁగ•బవరమునకుఁ
బిలిచితేనియుఁ జచ్చునీ•బలిమినాతఁ, డన్యవిధమునఁ జంప శ•క్యంబు గాదు.

అర్థములు. బవరమునకు = యుద్ధమునకు, అన్యవిధమునన్=మఱియొక విధముగ.

తాత్పర్యము

(నీవు పట్టనము వాకిట నిలిచి రాక్షసుఁడు పురములోపలికిఁ బోకుండ యుద్ధమునకుఁ బిలిచితివేని వాఁడు నీ బలముచేతఁజావఁగలఁడు. మఱియొక విధమునఁ జంపశక్యము గాదు.)

క. గిరిజానాథునిశూలము. దురతిక్రమ మాట దాని • దోషాటుఁడు దాఁ
గరమునఁ దాల్చని వేళను బరిమార్చు మటంచు వతనిఁ•బరిబోధించెన్. ౧౧౮౦

అర్థములు. దురతిక్రమము=అతిక్రమింపదగనిది, దోషాటుఁడు=రాక్షసుఁడు, పరిమార్చుము=చంపుము. దురతిక్రమ మనుట యుపచార మర్యాదను బట్టియని గ్రహింపవగు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును మన్నించినట్లు దీనిని మన్నింప వలయుఁగాని యవమానింపరాదు. లవణుఁడు దానిని ధరించి వచ్చిన నవమానింపవలసి వచ్చును గావున వాఁడు దానిని ధరింపకుండు నపుడు వధింపు మని యుపదేశించెను.

సీ. మఱి యిట్టు లను నీవు • మాతంగశతమును, నరదముల్ రెండువే•లశ్వములను
నాలుగువేలును నానాపదార్థంబు, లంగళ్ళ నటవర్తి • కావళులును
నియుతంబు హేమంబు•నీతోడ గొనిపొమ్ము, భటులకు జీతంబు•బత్తెమిచ్చి
సల్లాపములచేత • సంప్రదానంబుల, సంతోషపఱుపుము • సంగరమున

తే. నచటి వారికి భార్యలో • యాత్మభవులో
నైన వారలో స్వీయప•దార్థతతులో
యేవియును లేమి నొఱఁగి నీ•వే ముదంబుఁ
గూర్చు వారికి మాటల • గుణివతంస ! ౧౧౮౧

అర్థములు. మాతంగశతము=నూఱేనుఁగులు, నటవర్తకావళులు=నటులయు వర్తకులయు (ఆటలాడు వారు) గుంపులు, సల్లాపములచేత=మంచిమాటలచేత, సంప్రదానంబులన్=బహుమానము లిచ్చుటచేత.

తాత్పర్యము

మఱియు నిట్టులనియె సీతోడ నూఱేనుఁగులు రెండువేల రథములు నాలుగువేలు గుఱ్ఱములు పలువిధములైన పదార్థములు గల యంగళ్ళు నటులయు వర్తకు

లయు గుంపులను నియుతము బంగారునాణెములను దీసికొని పొమ్ము. భటులకు జీతము బత్తెమిచ్చుటయేకాక మంచిమాటలచేత బహుమానము లిచ్చుటచేత సంతోషపఱుపుము. అచ్చట భటులకు భార్యలు, కొడుకులు, బంధువులు తమ పదార్థములు నేవియు లేకుందురు గావున నీవే వారిని మంచి మాటలచే సంతోష పడఁ జేయుచుండుము. వారికి విసుగు గలిగింపరాదు.

ఉ. ముంగలగాఁగఁ బంపుము చ♦మూతతి గంగను దాఁటుగాక యుం
కం గొదవుండ గ్రీష్మము, సు♦ఖంబుగ నావలి యొడ్డుచేరి యం
దంగగుచోటులన్ విడిసి ♦ యాబల మొప్పఁగ, నెండి నీవు కే
లం గొని చాప మొక్కఁడవె లాఘవ మేర్పడ నేరి కేనియున్. ౧౧౪౨

అర్థములు. ముంగలగాఁగన్=ముందుగా, చమూతతిన్=సేనాసమూహమును.

తాత్పర్యము

సేననంతయు నీకంటె ముందుగాబంపుము. ఎండకాలము ముగియకమునుపే సేన, గంగ దాఁటవలయును. వానలు ప్రారంభించిన దాఁటుట కష్టము కావునసేన యంతయు గంగ కావలి యొడ్డున విడిసి యుండనిమ్ము. అటట్లుండ నీవొక్కఁడవే విల్లు బాణములు ధరించి లఘువుతో.

చ. తెలియఁగ రాక యుండుగతిఁ ♦ దెప్పునఁ బొమ్ము, రవంతయేని యా
ఖలుఁ డెద సందియంబు గొనఁ♦గాఁ దగ దీ మును లెల్ల మున్నుగా
బలఁగముతోడఁబోదురు ♦వాహిని యెల్లను జాహ్నవీతటిన్
నిల్చియ యుండ మున్నుగను ♦ నీవు చనం దగుఁ జాపపాణివై. ౧౧౪౩

తాత్పర్యము

ఎవరికిఁ దెలియకుండునట్లు శీఘ్రముగఁ బొమ్ము. నీ వెచ్చొటికిఁబోవుదది యెవరికిఁ దెలియరాదు. ఆదుష్టునకు మనస్సున సందేహము కలిగింపరాదు. ఈ మునులందఱు సేనతోడఁ బోయెదరు సేన యంతయు గంగ యొడ్డున నుండఁగా నీవు ముందుగాఁ జాపము ధరించి పొమ్ము.

సేనలతోడ శత్రుఘ్నుఁడు పోయిన శత్రుఘ్నుఁడు లవణు మీఁదికియుద్ధమునకుఁ బోవుచున్నాఁడని లోకవార్త ప్రబలును. అది వానికిని దెలియవచ్చునుగనుక నీవు సేనలతోడఁ బోవలయునని చెప్పెను.

చ. అరి చనుదెంచువార్త తెలి♦యంబడఁగా లవణుండు శూలమున్
గరమునఁ దాల్చి శాత్రవుల ♦ గం డడఁచుం జన నిమ్ము సేననిన్
దొరఁకొన వానకాలతినిఁ ♦ గ్రుంపుము శూలము లేక యొంటిఁ గ్రు
మ్మరు జిహివానలం దెవ డు ♦ మా ర్తుడు మారొఁనవచ్చు నన్మతిన్. ౧౧౪౪

అర్థములు. అరి=శత్రువు.

తాత్పర్యము

శత్రువు వచ్చుచున్నాఁడను వార్త తెలిసినా, లవణుఁడు శూలము ధరించి వచ్చి శత్రువులఁ జంపును. కావున నెండకాలము ముగియనిమ్ము వానకాలము రానిచ్చి యప్పుడు వానిఁజంపుము. జడివానలందు శత్రువెవ్వఁడు రాఁడను ధైర్యముతో శూలము లేకయే వాఁడు సంచరించుచుండును.

**—• శత్రుఘ్నుఁడు సేనల ముందుగ నంపి తానొంటిగ లవణుపైఁబోవుట •—**

క. అనవుడు నగ్రజుపలుకులు, విని సేనాపతుల వేగఁ • బిలిపించి యనీ
కిను లోలి నిలువ నెలవులు, మనమున మీ రెఱిఁగినవియ•మాట లిఁ కేలా

తాత్పర్యము

(అని చెప్పఁగా నన్నగారి మాటలు విని, సేనాపతులను బిలిపించి, సేనలు నిలుచు స్థలములు మీ రెఱిఁగినవె. ఇఁక మీకుఁ జెప్పవలసిన దేమిగలదు?)

ఉ. కావున మీరు సేనలను • గ్రచ్చఱఁ బోయి దిగంగ యోగ్యమౌ
తావులఁ బాళెమున్ డిగుచుఁ • దద్ధరణీప్రజ నేమి బాధలం
ద్రోవక పొం డటం చని మ•నోజ్ఞ చరిత్రుఁడు వారిఁ బంపి తా
నావల ముగ్గురమ్మలకు • సంప్రముల వ్రాలి కృతప్రణాముఁ డై. ౧౧౮

అర్థములు. కృతప్రణాముఁడై=నమస్కరించినవాఁడై.

తాత్పర్యము

(కావున మీరు సేనలను త్వరగాఁ బోయి దిగుటకుఁ దగిన స్థలములందు దండు విడియుఁడు. అందలి జనులను నేమియు బాధింపక పొండు. అని వారినిఁ బంపి, యటు పిమ్మట తల్లులు ముగ్గురికిఁ బాదముల వ్రాలి నమస్కరించి,)

తే. రామునిఁ బ్రదక్షిణించి శి•రంబు చేత, మ్రొక్కి లక్ష్మణుభరతుని•మ్రొక్కి కేలు
మోడిచి వసిష్ఠునకుభక్తి•మునుకొనంగ,వినతులొనరించి సెలవొంది•వెడలెచనియె.

తాత్పర్యము

(రామునికిఁ బ్రదక్షిణముచేసి. తలతో మ్రొక్కి, భరత లక్ష్మణులకు నమస్కరించి వసిష్ఠునకు భక్తితోఁ బ్రణామము గావించి వారి యాజ్ఞ పొంది బయలుదేఱి పోయెను.)

చ. తురగ రథాదిసంకులముఁ • దోరపుసైన్యము ముందు పంచి తాఁ
బురమున నిల్చి యొక్క నెల • పూర్వజ మాతృపురోధలన్ మహా
గురుమతి మ్రొక్కి యాజ్ఞగొని • గొబ్బున నొక్కఁడ యేగి రెండు రా
తురులను లక్ష్మణానుజుఁడు • త్రోవన త్రోసి నితాంతపుణ్యమౌ. ౧౧౯

అర్థములు. తురగ రథాది సంకులము=గుఱ్ఱములు తేరులు మొదలగు వానిచే నిండినది, తోరపుసైన్యము=పెద్దదండు, ఒక్కనెల=ఎండాకాలముముగియ వచ్చువఱకు, పూర్వజ = అన్నలను, మాతౄ=తల్లులను, పురోధలన్=పురోహితులను.

తాత్పర్యము

(గుఱ్ఱములు రథములు మున్నగు వానితో నిండిన పెద్దదండు ముందు పంపి, తానొకనెల యయోధ్యలో నుండి, యన్నలకుఁ దల్లులకుఁ బురోహితులకు మిగుల భక్తితో మ్రొక్కి వారి యనుమతి వడసి, శీఘ్రముగాఁ దానొక్కఁడే శత్రుఘ్నుఁడు పోయి రెండు రాత్రులు దారిలోఁ గడపి, మిక్కిలి పుణ్యము కలదైన.)

## —• శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబునఁ జేరుట • —

తే. వల్మికోద్భవు నాశ్రమ•వాటిఁ జేరి, మౌనివరునకు భక్తి న•మస్కరించి
యంజలి ఘటించి ఋషివర్య!•యగ్రజాతు, వాక్యమున నేనుబోవుచు•వచ్చినాఁడ.

అర్థములు. వల్మికోద్భవు = వాల్మీకియొక్క, ఆశ్రమవాటిన్ = ఆశ్రమ ప్రదేశము.

తాత్పర్యము

(వాల్మీకి ముని యాశ్రమమును జేరఁబోయి యా మునీశ్వరునికి భక్తిమీఱ నమస్కరించి, యంజలించి, మా యన్నగారి యాజ్ఞచే నేను బోవుచు వచ్చినాఁడను.)

క. ఈరే యిక్కడ నిల్వఁగ, గోరెద మీరాత్రియకు హాని • గూరద యేనిన్
దారుణపశ్చిమముగ నా,దారిం జనువాఁడ వేఁగ దత్త్వజ్ఞ యనన్. ౧౧౯౦

అర్థములు. దారుణ పశ్చిమముగన్=లవణాసురుఁ డుండుటచే భయంకరమైన పడమర దిశగా, వారుణ పశ్చిమ మని పాఠాంతరము.

తాత్పర్యము

(మీ పనులకు విఘ్నము రాదేని నీ రాత్రి యిచ్చట నిలువవలెనని యున్నది. వేకువన లేచి లవణాసురుఁ డుండుటచే భయంకరమైన పడమర దిశగా నా దారిని నేను బోయెద నని చెప్పఁగా.)

క. నరవరు నుసుఁ గని మునిపతి, దరహాసముతోడ స్వాగ•తము నీకు నృపా
యెరవుగఁ బలికెదవే? రఘు,వరులకు నిది సొంతసొమ్ము•భావింపు మెడన్.

అర్థములు. ఎరవుగన్=క్రొత్తవానివలె.